భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

ఫిబ్రవరి 1978

సంపుటము : 55 సంచిక : 2

విడిపత్రిక వెల రూపాయిన్నర

నవజీవన పథంలో

గత సంవత్సరం నవంబరులో శనివారం కాళరాత్రి మున్నెన్నడూ కనీవినీ ఎరుగని విధంగా తుఫాను బీభత్సానికి గురైన దక్షిణాది ధాన్యాగారం ఆ విధ్వంస కాండనుంచీ ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నది. తుఫాను బాధిత జిల్లాలలో సుమారు **36.04** లక్షల ఎకరాలలో పంటలు పాడయ్యాయి.

సహాయ కార్యక్రమాల అమలులో వ్యవసాయదారులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి దాదాపు **7.75** కోట్ల రూపాయలు కేటాయించారు. దెబ్బతిన్న ప్రతి హెక్టారుకు బ్యారెన్‌కు **500** రూపాయల వంతున సబ్సిడీ ఇస్తారు. తుఫాను బాధిత ప్రాంతాలలో సన్నకారు రైతుల అభివృద్ధిసంస్థ తరఫున కోళ్లు, పందులు ఇవ్వడంతోపాటు సేద్యానికి ఉపయోగపడే పశువులు పాడి పశువులుకూడా సరఫరా చేస్తారు.

ఉప్పెన దెబ్బతిన్న ప్రాంతాలలోని విద్యార్థులు ప్రత్యేక ఫీజు, పరీక్ష ఫీజులు చెల్లించనవసరం లేకుండా చేశారు. పాఠ్యపుస్తకాలను ఉచితంగా సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశారు.

తుఫానువల్ల మత్స్య పారిశ్రామికులు కోల్పోయిన పడవలకు బదులు కొత్తవాటి కొనుగోలు, దెబ్బతిన్నవాటి మరమ్మత్తుల నిమిత్తం కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, నెల్లూరు, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాల కలక్టర్ల అధీనంలో **1.28** కోట్ల రూపాయలు ఉంచారు.

చేనేత పనివారికి సహాయంలో భాగంగా **1.62** కోట్ల రూపాయలు మంజూరు చేశారు. తుఫానుకు గురైన చేనేత కార్మికులు ఒక్కొక్కరికి **100** రూపాయల ఖరీదు చేసే నూలుతోపాటు మగ్గాల మరమ్మతు నిమిత్తం **150** రూపాయల వంతున సహాయం అందజేస్తారు.

డైరెక్టరు, సమాచార పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

36/77-78

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1978

వీచికలు

కే ఎస్వీ

పుర్రెలు నవ్వుతున్నాయి
వెర్రిగా నీటి బుడగలు చిట్లుతున్నాయి

* *

ఎన్ని పిచ్చుకగూళ్ళను నాశనం చేశాయో
ఈ దూసుకొచ్చే కెరటాలు

* *

మూతబడే కనురెప్పకు తెలుసా ?
రాత్రికొచ్చేది మంచికలో ? దుస్స్వప్నమో !

* *

డాబా పిట్టగోడ వారన
పోగుపడిన ధూళిని నేను
ఎవరూ పట్టించుకోరు

* *

పన్నుపై పన్ను మెరిసిన
నవ్వొక్కటి నవ్వించా
అప్పటినుంచి విదూషకుణ్ణిగా
మిగిలిపోయా

* *

నీలికొండల వారగా
తెల్లగా వెన్నెల మెరిసింది
పేరు తెలియనిపిట్ట
పాడుతూ ఎగిరిపోయింది

* *

నిశ్చల కాసారంలో
ఈదే చేపలు
నిద్రలో చేతనా స్ఫురణలు

* *

చీలిన చూపుకి
నా కుడిచేతులు రెండు
ఒక్కసారిగా ఒక్క పంక్తి రాయటం
గమ్మత్తు

సినిమాలోంచి బైటకి వొచ్చినట్టు
ఎల్లప్పుడూ జీవితాన్ని
కొత్తగా చూడు

* *

ఒక్క నవ్వు నవ్వటానికి
రెండు పెదవులు

* *

వెల్లకిలా
డ్రీమి
లేవాల్సి వొచ్చిందే !
ఘోరం !!

* *

కురిసి వెలిసిన వాన
తిప్పుకొన్న కడగంటి చూపు
తడిసిన మట్టిని
గుచ్చిన గుండెను
ఏమని అడిగేను ?

* *

మూగరాగం
తీసే గువ్వా
నాకు
లోపలి చెవులున్నాయిలే

* *

ఇంకా చిక్కిపోతున్నావు పాపం
పరస్పరం అర్థమైపోయామని
మా మధ్యనున్న ఓ దూరం !

*

వీణలా వాన
చినుకుల నడుమ
వొయ్యారంగా నడిచి వొస్తున్నారెవరు ?
నా అనుభూతి.

వెలుగు వెనకగా!

శ్రీ మురళీధర్

మనసును కట్టేసి కోర్కెల్ని చంపెయ్యమని
  బతుకు శాసించింది !
ఆశ పెను వుప్పెనలా నన్ను కదిల్చి
కూకటి వేళ్ళతో నా ఆలోచనల్ని పెకల్చి
కోర్కెల తోడేళ్ళకు నన్ను బలిచేస్తున్నప్పుడు
అందీ అందనట్టు కవ్విస్తూ
అందలానికెక్కే కఠోర సత్యాలు
నన్ను ఆ తీరని కోర్కెలవేపే ఉసికొల్పుతున్నాయ్,
నేను పదిలంగా చుట్టూరా కట్టుకున్న గోడలు
పడిపోతున్నాయ్ —
ముందుకెడితే మరణం తప్పదని
ధీమాగావున్న సైనికుడు
వెనక్కి తిరగనట్టు,
ఎప్పుడూ ఎడతెగని దారిపైన
నా పయనం !
నిజానికి, అసమర్థతకి ఓ అందమైన
మాటల బురకాకప్పి
చలామణీఅయ్యే తత్వంగా మార్చటం
మహా సులభం !
పత్రికల్లో వారఫలాలు, రోడ్డుపక్కన
చిలక జోస్యం,
మెరుగు పరచని జనాభాలో నేనొక భాగం
కసిగా గంతేసి
దెబ్బ తగిలితే లోలోపలే కుమిలి
గుర్తుపట్టలేని గర్భశత్రువుని
మనస్సులోనే మర్డర్‌చేసిన హంతుకుణ్ణి
(సమాజ సౌభాగ్యాన్ని
హక్కు భుక్తం చేసుకున్న హంతకులంత
బజారున పడకుండా
కట్టుదిట్టాలు చేసుకున్నారు !)
కాలం గీస్తున్న గీతల్ని చెరపడానికి
తంటాలు పడటంకన్నా
ఆ గీతల్లో పొందికగా నడవటం
తెలివిగలపని అని నా కెప్పుడికీ తెలియదు !
అనుకున్నదానికీ, అయ్యేదానికీ మధ్యనున్నది అగాధం
నువ్వది దాటడానికి కట్టుకుంటూన్న బ్రిడ్జి
కట్టుతూన్నది కల్తీ సిమెంటుతో —
దాటేలోపల పుటుక్కున కూలిపోతుంది —
కులాసాగా బతకటానికి మూలసూత్రం నీకె శాస్త్రంలోనూ
  దొరకదు

గెలిచే పందెం వేద్దామని కనేకల
ఆనందపు సంద్రాన్ని పెరట్లోకి తెద్దామనే ఫగటికల —
నిజానికి నీ బతుకు నీ అందుబాటులోనే ఉంది !
చేతులు జాపి వెన్నెల్ని పడకటింట్లో కట్టెయ్యక్కర్లేదు—
(కాగితపు పువ్వుల సింథటిక్ వాసనలతో బతకడం నేర్చు
  కుంటున్నాం)

ఎప్పుడో ఓ అర్ధరాత్రి
విచ్చల విడిగా తిరిగే అమాయకపు అమ్మాయిలాగ
వెన్నెల విరగబడి నవ్వుతూంటే
పక్కన మల్లెపొదల్లోంచి
రెక్కలు విచ్చీ విచ్చని మల్లెకొకటి
నిన్ను పలకరిస్తే
నీకు తెలియకుండా నిన్ను
మునివేళ్ళతో
నీ ఊహల పేయసి అలా విలాసంగా తాకినట్టు
ఉలిక్కిపడతావో —
నిజానికి యీ సౌందర్యం నికార్సుగా నీ సొమ్ము
పున్నెమనాడు నిండుగా పొంగే సముద్రం నిన్ను పన్నడగదు—
పందిరంతాపాకి, నీ గది కిటికీలోకి దూసుకువచ్చేలా
కూనిరాగంతీసే సన్నజాజి నిన్ను
పలకరించడమేగాని ఏమీ అడగదు సుమీ !
ఉదయ సంధ్యలో ఎర్రగులాబిపై బడ్డ హిమబిందువు
నీ అసహాయతనుచూసి కార్చే అశ్రుకణం —
దాన్ని ఆప్యాయంగా హృదయానికి హత్తుకో—
మైదానంలో అలిపిపోయేలా పరుగెత్తి

నీళ్ళు విరుచుకుని
నిశ్చలమైన ఆకాశాన్ని చూడటం
దురాశకాదు —
అలా మాటి మాటికీ కొల్లగొట్టుకోనిది
మనం వాడుకోని ఖజానా —
చిక్కుల్నీ, చీకట్లనీ, యిక్కట్లనీ
కొన్ని క్షణాలు పక్కకునెట్టి
మనమెందుకసలు తాపత్రయ—పడుతున్నామో కసిగా మనల్ని
మనం అడుక్కుందాం,

బతకలేకపోతామేమోననే
ఆరాటంతో ఆక్రోసించి
చచ్చిపోతున్నాం —
బతుక్కి కావలసిన సమిధల్ని ఏరుకుని
ఆలోచనతో వాటిని రంగరించి
ఆక్రోశాన్ని హోమంచేద్దాం
జీవితమనే యజ్ఞగుండంనుంచి
ఆశ అనే జ్వాలతో
బతుకు దివ్వెను అహరహం వెలిగించుకుందాం !
వెలుగు వెనకగా ఒదిగి నిలబడటంమాని
దీపపు కళికలమై వెలుగుదాం !
చుట్టూరా అలుముకున్న చీకట్లని చీల్చుకుంటూ ముందుకు
పోదాం !

ఉయ్యాలలో నువ్వు - నేను

"సాంధ్యశ్రీ"

ప్రభాతం
ఎత్తి చూపిన సూర్యుడు
సమస్త ప్రపంచాన్ని
కరాల వరాలతో పునీతంచేసి
ఎంత నిస్వార్థంగా హసిస్తున్నాడో
పసిబాలుని బోసినవ్వు
ప్రాచీ సూర్యుడు ...
నెలబాలుని
పసినవ్వుల
మిసిమిని
తా నద్దుకున్న తూర్పుదిక్కే
దిక్కు ...
తమో గర్భాంకుర మైన
ఈ తెలివెలుగుల సంపదను
కౌలిగా ధరించిన దిక్కు
తూర్పు ఉషస్సంధ్య !
సాయంకాలం
నిలిపిన ఎర్రసూర్యుడు
కొండ కొసన ముద్ద మందారమై
జగతిని జిలుగుతో
ఎలా ముంచెత్తు తున్నాడో
ఆశకు విశ్వాసానికి వంతెనకట్టే
ఈ ప్రతీచీ సూర్యుడు ...
ఎదిగిన
మానవతా మహస్సుకు
పసిడి పట్టును
పక్క పరిచిన
పడమటి పక్కే
పక్క ...
కాంతి చ్ఛటల సర్వతమస్సును కడిగి
పగడాల దండలల్లుతూ
అడుగుభూమిని మేలుకొలిపే
మార్పు—సాయం సంధ్య ...
ఉభయ సంధ్యల తూగుటుయ్యాలలో
నువ్వు—నేను ...

విజ్ఞానదీపిక-I

ఈనాటి ప్రపంచము వైజ్ఞానిక జగత్తు. ఆధునిక విజ్ఞానాన్వేషణ యావత్ప్రపంచమున వాయునేగ మనోవేగములతో సాగుచున్నది. అట్టి విజ్ఞానము యువకలోకము అత్యావశ్యకముగా నార్జింపవలసి యున్నది.

ఇప్పటికి ముప్పదేండ్ల క్రిందట భారతవర్షము స్వాతంత్ర్యమును బడసినది. నేటి భారత యువకులే భావి భారతపౌరులు. వారిని స్వతంత్ర భారత పౌరులుగా దిద్ది తీర్చుటకు విజ్ఞానబోధ యొక్కటియే సరియైన మార్గము. దీనిని గుర్తించి భారత ప్రభుత్వమువారు నవీన భారత భాషాభివృద్ధి పథకము (Scheme for the Development of Modern Indian Languages) నేర్పాటు చేసినారు. ఆంధ్రప్రభుత్వము వారాపథకమును ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీ వారిని అమలు పఱచుట కుత్తరువు నిచ్చిరి. అకాడమీవారు, ఈ విజ్ఞాన సాహిత్యక్రమమును చేపట్టి 'విజ్ఞాన దీపిక' (Book of knowledge) అను గ్రంథమును ప్రకటింప నిశ్చయము చేసినారు. ఈ 'విజ్ఞానదీపిక' రెండు సంపుటము లలో నుండును.

1. మానవిక శాస్త్రము (Humanities)

2. విజ్ఞాన శాస్త్రము (Sciences)

ఈ రెండింటిలో ప్రస్తుతము ప్రకటితమైనది మొదటి సంపుటము. మానవిక శాస్త్రమునకు సంబంధించినది.

ఇందు ఆధునిక మానవిక విజ్ఞాన శాస్త్ర మునకు సంబంధించిన వివిధ విషయములు వర్గీకరింపబడి ఆయా విషయములపై, నిపుణులగువారి వ్యాసములుగలవు. 687 పుటలుగల ఈ గ్రంథమున 19 ప్రధానశీర్షికలు, 94 ఉపశీర్షికలున్నవి. 4 దేశపటములు, 14 చిత్రములును గలవు. గ్రంథము త్రివర్ణ భారత జాతీయ పతాకతో ప్రారంభమై, వందేమాతరం, తెలుగుతల్లి గీతముతో సమాప్తమై అత్యంతాకర్షణీయముగా నున్నది.

ప్రధానశీర్షికలు

1) పరిచయము 2) భారతదేశము పేరు 3) భారతదేశ చరిత్ర 4) భారతదేశ రక్షణ 5) అర్థశాస్త్రము 6) సమాజ శాస్త్రము 7) పౌరశాస్త్రము 8) రాజనీతి శాస్త్రము 9) ప్రభుత్వ పాలనా శాస్త్రము 10) మానవ శాస్త్రము 11) మనోవిజ్ఞాన శాస్త్రము 12) విద్య 13) భారతీయ భాషలు 14) ఆంధ్రులు—నృత్యకళా వికాసము 15) భారతీయ తత్త్వశాస్త్రము 16) ఆకాశవాణి 17) పత్రికలు — పత్రికా నిర్వహణ 18) బేబిలాగ్ బస్తీలు (వైభవముతో వర్ధిల్లిన వర నగరములు) 19) జీవితము

ఉపశీర్షికలు

మొదటిది—4. రెండవది—3. మూడవది—6. నాల్గవది—2. అయిదవది—26. ఆరవది—7. ఏడవది—3. ఎనిమిదవది—11. తొమ్మిదవది—1. పదవది—1. పదకొండవది—2. పన్నెండవది—1. పదమూడవది—16. పదునాల్గవది—4. పదిహేనవది—2. పదహారవది—1. పదిహేడవది—1. పదునెనిమిది[1] 21. పందొమ్మిది—1—63. మొత్తము 94 ఉపశీర్షికలు గలిగియున్నది. చివరి రెండింటిలో 84 ఆరోపములున్నవి.

వ్యాసరచయితలు

ఈ గ్రంథమున కరువది మంది వ్యాసరచయితలు గలరు. వారందరును ఆయా విషయముల యందారి తేరినవారు. అనుభవజ్ఞులు, ఆచార్య పట్టభద్రులు. వీరిలో గుండేరావు హర్కారే, (జ. 1887) ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్య (జ. 1889) వంటి జ్ఞానవయోవృద్ధులు కూడ నుండుట విశేషము. ఇందు నలుగురు రచయిత్రులు కూడ నుండుటవలన గ్రంథము శోభాయమానముగా నున్నది.

ఉపశీర్షికలు-విషయములు

ఈ గ్రంథమున ఉపశీర్షికలలో నున్న విషయము లన్నింటిని వివరించుట గ్రంథవిస్తరమగును. ఇందు — 1. అర్థశాస్త్రము 2. భారతీయ భాషలు అను రెండింటికి ప్రాధాన్య మీయబడి యున్నది. ఈ రెండింటిలో అర్థశాస్త్రమునకే అధిక ప్రాముఖ్యత గలదు. అందు 26 విషయములు గలవు. ఇన్ని విషయములు గలిగిన శీర్షిక మఱియొకటిలేదు. అర్థము సర్వార్థములకు మూలము కావున నీ గ్రంథమున అర్థశాస్త్రమునకు ఆధిక్యత నిచ్చుట సమంజసమై యున్నది.

భారతీయ భాషలు

స్వతంత్ర భారత భావిపౌరుడగు ప్రతి విద్యార్థియు భారతీయ సంస్కృతికి ఆలంబనమైన భారతీయ భాషలను గూర్చి తెలుసుకొనుట అత్యావశ్యకము. ఈ దృష్టిని పురస్కరించుకొని పై శీర్షికలో 16విషయములు, వివరములు గలవు. ఇది యెంతయు ప్రశంసనీయము. ఆ వివరముల నిచ్చుచున్నాను.

'విజ్ఞాన దీపిక', ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ, హైదరాబాదు. వెల 30—00.

అయితే ఈ సంపుటి యందు సూత్రము తెలుగు భాష ప్రత్యేక విశిష్ట లక్షణములను ప్రదర్శించు వ్యాసములేదు. వాస్తవముగా 'ఆంధ్ర వాఙ్మయచరిత్రము' అను వ్యాసమునకు ముందట్టిది యుండవలెను.

భారతీయ భాషలు - తెలుగు భాష

భారతీయ భాషలలో తెలుగు భాష ప్రత్యేక విశిష్టత గంది. "దేశ భాషలందు తెలుగు లెస్స" అని పేరు వడసినది. పాశ్చాత్యులీ భాషా మాధుర్యమును చవిచూసి, ఏ యితర భారతీయ భాషలు మాధుర్యమున దీనితో సరిపోలవని ముక్తకంఠముతో తెలిపి దీనికి "Italian of the East" అనినామకరణముగావించిరి. సంస్కృత కవులు, ఇతర దేశ భాషా కవులు, తెలుగు భాషను గూర్చి ప్రశంసించిరి. జగత్ప్రసిద్ధ వైజ్ఞానిక శాస్త్రవేత్తయైన జె.బి. హాల్డేను (J. B. Haldane) పండితుడు 'తెలుగు భాష రాష్ట్ర భాషగా నుండదగిన భాష'యని బాహాటముగా ప్రకటించినాడు. కావుననిందు 'భారతీయ భాషలు—తెలుగు భాషా ప్రత్యేక విశిష్టత' అను వ్యాసమును ద్వితీయ ముద్రణమున చేర్చెదరు గాక.

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర

ఇది యీ సంపుటమున తక్కిన శీర్షిక లన్నింటికన్న పెద్దది. ఇందు నూఱు పుటలున్నవి. ఇది రెండు భాగములుగా విభజింప వచ్చును.

1) ఆంధ్ర వాఙ్మయ చరిత్ర.

2) తెలుగు సాహిత్యముపై ఇతర భాషల ప్రభావము.

సంగ్రాహకులు మొదట వాఙ్మయ చరిత్ర వ్యాసములను ముద్రించి, ఆ వెనుక — "ఇతర భాషల ప్రభావము" అను వ్యాసములను ముద్రించిన అప్పుడు పాఠకలోకమునకు విషయము విశదముగా నుండును. కాని వారట్లు చేయలేదు. రెండింటిని కలిపి వేసిరి. ఇందువలన ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సక్రమముగా పాఠకలోకము గ్రహించుటకు నవకాశము లేకపోయినది. చూడుడు—

"ఆంధ్ర వాఙ్మయ చరిత్రము" (నన్నయ, శ్రీనాథుడు) ప్రబంధ యుగము నుండి 19 వ శతా.వరకున్న "తెలుగు సాహిత్య సంగ్రహ చరిత్ర"అను రెండు వ్యాసములకు తరువాత — తొమ్మిది వ్యాసములైన వెనుక తెలుగు సాహిత్యము (19–20 శతా) అను వ్యాసమున్నది. ఈమధ్యగల వ్యాసములు ఇతర భాషా ప్రభావములకు సంబంధించినవి. కేవలము వాఙ్మయ చరిత్రకు సంబంధించినవి కావు. తిరిగి చివరి వ్యాసము వాఙ్మయ చరిత్రకు సంబంధించినది.

వాఙ్మయ చరిత్ర యుగ విభజనము

ఆంధ్ర వాఙ్మయ చరిత్రనుగూర్చిన యీ మూడు వ్యాసముల యందు యుగ విభజన క్రమము సరిగా లేకపోవుట విచారణీయమై యున్నది. వాఙ్మయ చరిత్రకారులు ఈ క్రింది యుగ విభజనము చేసినారు.

నన్నయ పూర్వయుగము క్రీ. శ. 800–1000; నన్నయ యుగము–1000–1100; శివకవి యుగము–1100–1250; తిక్కనయుగము–1250- 1400; శ్రీనాథ యుగము–1400–1500; కృష్ణరాయ యుగము–1500–1600; దక్షిణాంధ్ర యుగము–1600–1800; ఆధునిక యుగము – 1800 – 1947.

పై యుగవిభజనము సాహిత్య చరిత్రలయందు నిర్దిష్టమై అనుసరింపబడుచున్నది. పై వ్యాసములలో అనుసరింపబడలేదు. 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' (నన్నయ – శ్రీనాథుడు) అను వ్యాసమున పై క్రమము పాటింపబడినను అందు "శివకవి యుగము" అను ప్రత్యేక యుగము లేదు. వారు తక్కిన కవులతో చేర్చబడిరి. ఇందువలన పాఠకలోకమునకు, శివకవులకు తెలుగున గల ప్రత్యేక స్థానము తెలియకుండపోయినది.

రెండవ వ్యాసము శీర్షికయే అసంబద్ధముగా నున్నది.

ప్రబంధయుగము నుండి 19వ శతా. వరకున్న "తెలుగు సాహిత్య సంగ్రహ చరిత్ర" ఏమి ?

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర — కృష్ణరాయ, దక్షిణాంధ్ర యుగములు అనియున్న అది మొదటి వ్యాసముతో నతుకుకొని వాఙ్మయ చరిత్ర క్రీ. శ. 19వ శతాబ్దివఱకు తెలుపును. మూడవ వ్యాసము 'తెలుగు సాహిత్యము' (19 – 20 శతా) అనునది తెలుగు సాహిత్యము ఆధునికయుగము అన్న అటు యుగవిభజనము తోను, ఇటు కాలక్రమము ననుసరించియు సరిగా నుండి వాఙ్మయ చరిత్ర ఆదినుండి నేటి వఱకు ప్రదర్శించును.

వ్యాసముల సమీక్ష

మొదటి వ్యాసము : 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' — (పూర్వ నన్నయ–శ్రీనాథుడు) ఇదు క్రీ.శ. 800 అనగా నన్నయ పూర్వయుగము నుండి క్రీ. శ. 1500, అనగా శ్రీనాథయుగము వరకుగల వాఙ్మయ చరిత్ర సంగ్రహమముగా, సుగమముగా ఎనిమిది పుటలలో నున్నది.

రెండవ వ్యాసము— ప్రబంధ యుగము నుండి 19వ శతా. వరకున్న 'తెలుగు సాహిత్య సంగ్రహచరిత్ర' శీర్షిక పెద్దది. వ్యాసము చిన్నది. నాలుగు పుటలు. యుగక్రమము ననుసరించి, యిందు

కృష్ణరాయయుగము దక్షిణాంధ్ర యుగముమగూర్చి యందుగలదు. ఈ నాలుగు పుటలలోనైన సంగ్రహముగా నా రెండింటికి సంబంధించిన విషయములున్నవా యున్న యవియు మృగ్యములు. అంతే కాదు. వ్రాసిన విషయములలో కవులనుగూర్చి, గ్రంథములనుగూర్చి విపర్యాసములు గలవు. ఎంతో జాగరూకతతో వ్రాయదగిన యీ వ్యాస రచనా విధాన మెట్లున్నదో చూడుడు. మొదటి పుటలోగాని, తరువాతి పుటలలోగాని 'కృష్ణరాయయుగము,దక్షిణాంధ్రయుగము' అను శీర్షికలు లేవు. అందుచే విషయము సుగమము కాలేదు.

మొదటిపుట — రాయల ఆముక్తమాల్యద, ముక్కుతిమ్మన పారిజాతాపహరణము, పెద్దన మనుచరిత్ర పేర్కొనబడినవి.

రెండవ పుట — కల్పన కావ్యము. పింగళి సూరనాథుడు. కావ్యము పేరు లేదు. కవి పేరు పింగళి సూరన కాని సూరనాథుడు కాడు. కావ్యము పేరు కళాపూర్ణోదయము. అయ్యలరాజు రామభద్రయ రామాభ్యుదయము, మాదయగారి మల్లన రాజశేఖరచరిత్ర మత ప్రబోధక గ్రంథములు కావు.

(1)

పుట 441. "ఆంగ్లపండితులలో కొందరు వ్యక్తిగతమైన అభిరుచులతో భాషా సాహిత్యముల నభ్యసించి ఆంధ్ర సాహిత్యమున కృషిచేసిరి. వారికి చేదోడు వాదోడుగా ఆంధ్రవిద్వాంసులు పనిచేసియుండిరి. మెకంజీ, బ్రౌను, కావలి వెంకట బొర్రయ్య శాస్త్రులు మొదలగువారిట్టి వారే".

మెకంజీ, బ్రౌను అప్పముగా ఆంగ్లేయులు. వారిని ఆంగ్ల పండితు లనుటలో వ్యాసకర్త యభిప్రాయము వ్యక్తముకాలేదు. బొర్రయ్యశాస్త్రి వ్యవహారమువలేదు.

తెలుగు సాహిత్యము (19–20 శతాబ్దములు)

ఇది యీ సంపుటమునగల వ్యాసములలో నెల్ల పెద్దది. ఇందు 30 పుటలు గలవు. 19–20 శతాబ్దుల తెలుగు సాహిత్య చరిత్ర నిర్దిష్టమై నిశ్చితమైనది. ఈ శతాబ్దులలో గల కవులు, గ్రంథకర్తల కాలములు నిర్ణీతములైనవి. గ్రంథములన్నియు ముద్రణము నందినవి. వాఙ్మయ చరిత్ర యంతయు కాలనిర్ణయాది విషయములనే చిక్కులు లేక సుస్పష్టమైయున్నది. కవుల, గ్రంథకర్తల వివరములు అందుబాటులోనున్నవి.

సాహిత్య చరిత్రయేగాక, ఈ శతాబ్దులవాటి దేశ, రాజకీయ, చరిత్రయు సంపూర్ణముగా లభ్యమగుచున్నది. ఇట్టి సాధన సంపత్తి గలిగియు ప్రస్తుత వ్యాసమునందు ఎట్టి చారిత్రక విపర్యాసములు దొరలినవో వానిని ప్రదర్శించుచున్నాను.

2

పుట 441. "పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్థ చరిత్ర కొంతవరకుచేరు. 1848వ సంవత్సరములో వీరేశలింగము భానూదయమైనది..........

వారి సాహిత్యసేవ ఈ శతాబ్ది చతుర్థ పాదమున సొనలు దీరినది. ఈ యుగమున ఉషఃకాంతులు ప్రసరించినవి. ఈ మహా మహుని సారస్వత వీచికలే 18వ శతాబ్ద్యంతమును వెలిగినది. వేమనయోగి కాగా శతాబ్ది చేలమున వన్నెచిన్నెలు చిలికించినది వీరేశలింగము పంతులు."

వీరేశలింగ యుగమున వేమన ప్రసక్తి యెట్లువచ్చినదో దురూహ్యముగా నున్నది. వేమన క్రీ. శ 1800 ప్రథమ పాదమున నున్నవాడని వ్యాసకర్త యభిప్రాయపడి పై వాక్యమును వ్రాసియున్నాడు. కాని అది యెంతమాత్రము సరికాదు. వేమన కాలమును గూర్చి భేదాభిప్రాయములున్నవి. ఆతడు క్రీ. శ. 1450 వాడని ప్రథమ వేమన చరిత్ర కారులు, క్రీ. శ. 1652 వాడని బ్రౌను, క్రీ. శ. 17వ శతాబ్ది వాడని యితర వాఙ్మయ చరిత్ర కారులు. ఎట్లయినను వేమన క్రీ. శ. 1800 ప్రథమ పాదమున లేడనునది నిశ్చితము. అంతకుపూర్వుడు. కావున వీరేశలింగమునకు వేమనకు సంబంధములేదు.

3

పుట 441. "విజమునకీ శతాబ్దిని రెండు భాగములుగా చేయవలెను. వానిని వీరేశలింగ పూర్వయుగమనియు, వీరేశలింగ యుగమనియు పిలువవలెను. ఇందు మొదటి యుగమున వెలసిన మహా కవులలో కంకంటి పాపరాజు, పిండిప్రోలు లక్ష్మణకవి, శిష్టు కృష్ణమూర్తి, మండపాక పార్వతీశ్వరకవి, గోపీనాథము వెంకటకవి పేర్కొనదగినవారు". కాని కంకంటి పాపరాజు 17వ శతాబ్దము పూర్వార్థమువారు.

వ్యాసకర్త కంకంటి పాపరాజును, పిండిప్రోలు లక్ష్మణకవిని వీరేశలింగ పూర్వయుగమున చేర్చుటయేగాక, వారిని గూర్చిన వివరముల నిచ్చియున్నాడు. వారిలో పిండిప్రోలు లక్ష్మణకవిని గూర్చి వ్రాసినది సరిగాలేదు.

"పిండిప్రోలు లక్ష్మణకవి రమాదమ్మయమును ద్వ్యర్థి కావ్యముగా రచించెను. దీనికి లంకావిజయమను నామాంతరముగలదు". ఇది సరికాదు. లంకావిజయము పేరు "రావణదమ్మీయము" కాని రమాదమ్మీయముకాదు.

4

పుట 442. "సీతారామాంజనేయ సంవాదకర్త పరశురామ పంతుల లింగమూర్తి కవియు, చంద్రికా పరిణయకర్త సురభి మాధవ రాయలును, మరింగంటి సింగరాచార్యులును, నరసింహాచార్యులును ఈ యుగమున స్మరింపదగిన కవులు."

ఈ యుగమున–అనగా వీరేశలింగ యుగమున–1850-1900 మధ్య అని వ్యాసకర్త నిర్దేశము. కాని పైవారెవ్వరును, ఈ యుగమున లేనేలేరు. వారంతకు పూర్వులు.

1. పరశురామపంతుల లింగమూర్తికవి ఈతనిపేరు పరశురామ పంతుల లింగమూర్తి గురుమూర్తి. ఈతడు క్రీ శ 17వ శతాబ్దిలో నున్నవాడు.
2. చంద్రిక పరిణయకర్త సురభి మాధవరాయలు—సురభి మాధవరాయని కృతిచంద్రికాపరిణయము గాని చంద్రిక పరిణయముకాదు. ఆతడు క్రీ. శ. 1656లో నున్నవాడు
3. మరింగంటి సింగరాచార్యులు—ఈతడు, క్రీ శ 1600 ప్రాంతముననున్నవాడు. ఈతని యన్న అప్పల గురువును క్రీ. శ 1580లో పొన్నికంటి తెలగన్న పేర్కొన్నాడు.
4. మరింగంటి నరసింహాచార్యులు—ఈతడు క్రీ.శ. 1700 ప్రాంతమువాడు.

పై వివరణమువలన ఈ నలుగురు కవులును వీరేశలింగ యుగమున నెంతమాత్రము చేరరు.

5

పుట 443. ''వీరేశలింగం పంతులుగారి సమకాలికులలో భాషాసేవ నొనర్చిన ఛార్లెసు ఫిలిపు బ్రౌను, చిన్నయసూరి గారలు ప్రత్యేకముగా పేర్కొనదగినవారు.''

చిన్నయసూరి వీరేశలింగము సమకాలికు లెంతమాత్రమును కారు. వీరేశలింగము కాలము 1848–1919 బ్రౌను క్రీ. శ. 1855లోనే నీ దేశము విడిచి స్వదేశమగు నింగ్లండుకు వెళ్ళిపోయినాడు. అప్పటికి వీరేశలింగము 7 ఏండ్లవాడు. వారిద్దరు సమకాలికు లెట్లగుదురు? చిన్నయసూరి కాలము 1806–1862. చిన్నయసూరి మరణము నాటికి వీరేశలింగము వయస్సు 14ఏండ్లు. ఇక వీరేశలింగము తన చిన్నతనమున చిన్నయసూరి నెఱిగి యుండకూడదా అను ప్రశ్న రావచ్చును. కాని అట్టి ప్రశ్న కాస్కార్యమేలేదు. చిన్నయసూరి మద్రాసు నివాసి. వీరేశలింగము బాల్యదశ రాజమహేంద్రవరమున గడచినది.

పై వాక్యముల తరువాత వ్యాసకర్త బ్రౌను సేవను, చిన్నయసూరి సేవను తెలిపినాడు. చిన్నయసూరి ప్రసిద్ధ వచనగ్రంథము ''నీతిచంద్రిక'' అను పేరిందులేదు. దీనిని గూర్చి వ్రాసినది చూడుడు. ''వీరి పంచతంత్రానువాదములోని మిత్రలాభ—మిత్రభేదములు నవ్యగ్రాంథిక శైలికి నాణెమైన యుదాహరణములు.''

'నీతిచంద్రిక'– పంచతంత్రానువాదము కాదు. పంచతంత్రము, హితోపదేశము అను రెండు నీతి కథా గ్రంథములనుండి కథలు సేకరింపబడి 'నీతిచంద్రిక' అను పేర వెలసిన ప్రత్యేక గ్రంథము. చిన్నయసూరి— వీనిని 'మిత్రలాభము, మిత్రభేదము, సంధి, విగ్రహము' అను నాలుగు భాగములుగా రచింపనెంచి—అందు తొలి రెండు భాగములగు 'మిత్రలాభ, మిత్ర భేదము'లను నొక సంపుటముగా రచించి, 'నీతిచంద్రిక' యను పేర ప్రకటించెను. రెండవ భాగము పూర్తి చేయుటకాతనికి మరణమాసన్నమైనది. అందుచే అది వెలువడలేదు. చిన్నయసూరి తరువాత ఆతని శైలి ననుసరించుచు, కొక్కొండ వేంకటరత్నము పంతులుగారు 'విగ్రహము' రచించిరి. వీరేశలింగముగారు 'సంధి, విగ్రహములను' రెండింటిని పూర్తి చేసిరి. చిన్నయసూరి గ్రంథముతోపాటు, వీరేశలింగముగారి గ్రంథము నేటివఱకు పాఠశాలలలో పఠనీయ గ్రంథముగా నున్నది. ఆధునికయుగమున గ్రాంథిక వచనమునకు నాందీ ప్రస్తావన గావించిన చిన్నయసూరి 'నీతిచంద్రిక' పేరైన నిందులేకపోవుట శోచనీయము నీతిచంద్రికయేగాదు, చిన్నయసూరి ''హిందూ ధర్మశాస్త్ర సంగ్రహము'' ఇందు పేర్కొనబడలేదు. అది చిన్నయసూరి రెండవ వచన గ్రంథము. అది ఆంగ్ల భాషలో వ్రాయబడిన గ్రంథమున కాంధ్రానువాదము. 1962లో ప్రకటితమైనది. వీరేశలింగముకన్నముందు ఆంగ్ల భాషనుండి తెనుగునకు అనువాదము చేసినవారిలో చిన్నయసూరి యొకరు.

సాహిత్య విపర్యాసములు

పుట 444. ''కావ్యరంగమున పురాణానువాద ప్రక్రియ పునరుద్భవించి విజృంభించినది......వడ్డాది సుబ్బారాయడు, బిల్వేశ్వరీయ కర్త కొక్కొండ వేంకటరత్నం పంతులుగారు మొదలగు వారు పేర్కొనదగినవారు.''

వడ్డాది సుబ్బారాయడు పురాణమేదియు ననువదింపలేదు.

కొక్కొండ వేంకటరత్నం పంతులుగారి బిల్వేశ్వరీయము క్షేత్రమాహాత్మ్యము గాని పురాణముకాదు.

అదేపుట. వీరేశలింగము......''పురుషార్థ ప్రదాయిని, సకల విద్యాభివర్ధని, వివేకవర్ధనియను పత్రికల నిర్వహణము''. 'పురుషార్థ ప్రదాయిని' బందరునుండి చుండూరి రంగనాయకులుగారి సంపాదకత్వమున వెలువడుచుండెడిది. 'సకల విద్యాభివర్ధని' విశాఖపట్టణమునుండి పరవస్తు రంగాచార్యులవారి సంపాదకత్వమున వెలువడుచుండెడిది. ఈ రెండును వీరేశలింగముగారి పత్రికలుకావు 'వివేకవర్ధని' మాత్రమే వీరేశలింగముగారు నడిపిన పత్రిక.

అదేపుట. ''కవులచరిత్రమును, స్వీయచరిత్రమును తెలుగున మొదటిసారి నిర్మించుట''.

తెలుగున మొదటిసారి కవుల చరిత్ర రచించినది వీరేశలింగముకాదు, గురుజాడ శ్రీరామమూర్తి పంతులు (1878). అట్లే 'స్వీయచరిత్ర' రచనకు వీరేశలింగము తొలివారు కాదు. మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారు. ''ఆత్మ సపర్యా చర్య'' అను పేర తమ స్వీయ చరిత్రను రచించినారు (1884).

అది పద్య రూపమున నున్నది.

పుట 444. ''ఆ మహా పురుషుడు 1919లో దివంగతు డగు నాటికి ఆయన నాటిన నవ్యసాహిత్య ప్రక్రియలు దేశమున అంటునాటుకొని పెరగదొడగినవి.''

ఆధునికయుగము నవ్య సాహిత్య ప్రక్రియలకు నాటినవాడు వీరేశలింగము కాదు. అవి వీరేశలింగముకన్న ముందున్నవే. వీరేశ లింగము వానిని ప్రచారములోనికి తెచ్చినాడు. (చూడుడు: ''వీరేశ లింగము — సమగ్ర పరిశీలన'' డాక్టరు అక్కిరాజు రమాపతిరావు సిద్ధాంత వ్యాసము).

పుట 466. 'ఖిల్జీరాజ్య పతనము, మేవాడ్ పతనము, చిత్తూరు పతనము, రాణాప్రతాప్' అను నాలుగు చారిత్రక నాటక ములను 'పృథ్వీపుత్రి' అను స్వతంత్రనాటకమును రచించిన గుండు మెడ వెంకట సుబ్బారావు పేర్కొనబడలేదు. ''తెలుగు నాటక వికాసమున'' నీతని గూర్చి యున్నది.

పుట 473. ''తాళ్లపాక వారిపై వేటూరి రాళ్లపల్లి వారును రచించిన గ్రంథములు ప్రసిద్ధములు''. తాళ్లపాక వారిపై విమర్శలు, గ్రంథరచనలు గావించిన వారు వేటూరి ప్రభాకరఆనంద మూర్తులు.

అదే పుట. ప్రత్యేకముగా కవులను గూర్చిన గ్రంథములలో ప్రస్తుత వ్యాసకర్త రచించిన 'పోతన' లేదు.

సంస్కృత వాఙ్మయ సర్వేక్షణమున, లఘు కావ్యములలో మయూర మహాకవి సూర్యశతకము లేదు. అది అంతర్జాతీయఖ్యాతి గడించినది. సంస్కృత దూత కావ్యోత్పత్తి వికాసములను గూర్చి లేదు. కావ్య సముచ్చయములో కేలాది బసవరాజు శివతత్త్వరత్నా కరము; నిఘంటువులలో పరవస్తు రంగాచార్యులుగారి శబ్దార్థ సర్వస్వము లేవు.

సంస్కృత భాషా సాహిత్యములను యావద్భారత వర్షమున సజీవముగా నిల్పినవారు ఆంధ్రులు.

ప్రస్తుత గ్రంథము తెలుగు వారికి వినియుక్తము గావున 'ఆంధ్రులు-సంస్కృత భాషా సేవ' యను శీర్షికతో నొక వ్యాస ముండుట సముచితము.

'శకములు' (10–11 పుటలు) వ్యాసములో శకములను గూర్చిన వ్యాసమంత ఆశాభంగకరమైన వ్యాసమొందు కానరాదు. 11వ పుటలో ముఖ్యాతిక భాగము వెలితిగా విడిచి వైచిరి గాని శక ములను గూర్చి, శకకాలగణమును గూర్చి గాని వివరణలేదు. అనవస రంగా యుగ గణన ఇచ్చిరి. విక్రమ శకమును గూర్చి 1 వాక్యము, శాలివాహన శకమును గూర్చి అరవాక్యమును వ్రాయబడినది. విద్యార్థు లకు ఈ వివరణతోబాటు [illegible]శకము, [illegible]శకము, [illegible] విక్రమశకము, కనీసము క్రీస్తుశకమును గూర్చియైనను తెలుప వలసి యుండెడిది. బహుశః సంగ్రాహకుల కివి అపరిచితములై యుండవచ్చును.

'జీవితములు' అను శీర్షికలో గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు చోటుచేసుకొనలేకపోయిరి. పుట 582.గుణగ విజయా దిత్యుడు ''జయించిన త్రిపురములు కిరణపురము, అచలపురము, ఊరు నెల్లూరుపురము''. చరిత్ర తెలిసిన వారిట్లు వ్రాయరు. త్రిపురి, కిరణ్‌పూర్, ఎలిచ్‌పూర్ ఉత్తర హిందూస్థానములోనివి. **(Epigraphia Andhrjka vol III Page 35)**

పుట 607 ''రెంటాల సుబ్బారావుగారి అభిమాన పుత్రిక యగు రామాయమ్మతో కాశీనాధుని నాగేశ్వరరావుగారి భార్య వివాహ మయ్యెను.'' రామాయమ్మగారు సుబ్బారావుగారి మేనకోడలు కాని కూతురుకాదు. ఈ జీవితములు చదివిన విద్యార్థుల మనస్సులందు జీవిత నాయకుల గుణగణములు ఆకర్షింపవలెను. ఆ తీరుతో నీ వ్యాసములు రచించినట్లు కానరాదు.

కంపైలరు బాధ్యతలు

కంపైలింగు విషయమున నొకటి రెండు మాటలు చెప్ప వలసి యున్నది. భాషా విషయములో ముఖ్యముగా వాక్య నిర్మాణ విషయమున కంపైలరు తగినంత శ్రద్ధ వహించినట్లు కానరాదు.

మచ్చునకు ''వీరి పాద చిహ్నములలో లోక సంగ్రహకార్యము లను జరిపిరి.'' ఈ వాక్యము విద్యార్థులెట్లు గ్రహింపగల్గుదురు? ఇట్టి అయోమయ వాక్యములేగాక కృతక భాషా శైలిలో నొక కొంత భాగము, గ్రాంధిక భాషో, వ్యావహారికమో తెలియని శైలి లోను నీ విజ్ఞాన సర్వస్వ భాష వెలయుచున్నది.

వ్యాసకర్తలను గూర్చి వ్రాసిన పరిచయ వాక్యములలో నెవరి కెన్ని గౌరవప్రద వాక్యములు వ్రాయవలయునో తెలియక ఇచ్చ వచ్చినరీతిని వ్రాసిరి. మొదటి పుటలోనే సంపాకదవర్గమున కధ్యక్షు లైన యన్. నరోత్తమ రెడ్డికి శ్రీయను ప్రాథమిక గౌరవ సూచ కము లేదు. కాని కంపైలరు నామము ముందు శ్రీ తగిలించు కొన్నారు. శ్రీ గోపాలరెడ్డిగారు 1957నుండి సాహిత్య అకాడమీకి అధ్యక్షులే. కాని శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు కార్యదర్శి కాదా! రామానుజరావుగారినిగూర్చి వ్రాయుచు నిట్టి పొరపాటు వాటిల్లుట విచారకరము.

మొత్తముమీద వ్యాసకర్తల పరిచయమంతయు నస్తవ్యస్త ముగా నున్నది. కంపైలర్ అనువారు శ్రద్ధాభక్తులు ప్రదర్శించ నిదే నిట్టి బృహత్తర సంపుటములు వెలువడినను వ్యర్థమే.

[illegible]సాహిత్య ఎకాడమీవారు తలపెట్టిన ఇట్టి బృహత్తర గ్రంథములందు, దాని బాధ్యతలను స్వీకరించినవారు శ్రద్ధతో పని చేసిన కార్యదర్శి శ్రీ రామా[illegible]గారికి, శ్రీ గోపాలరెడ్డిగారికి గొప్ప పేరు సంపాదించి[illegible]దురు. విద్యార్థులకు చక్కటి గ్రంథములు ప్రసాదించినవా[illegible].

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

తాటాకుల చప్పుడు

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

మాసిన తలలాంటి రైలు యింజనులో
    తలమాసిన రక్కసుల్లాంటి నాలుగు జీవాలు
తలపడ్డాయి రాక్షసి బొగ్గుతో
ఆడుకొంటున్నాయి హాయిగా అగ్నితో ! ...

కొన్ని గళాలు పాడుతున్నాయి
కొన్ని చెవులు వింటున్నాయి
కొన్ని జీవాలు పేకాటాడుతున్నాయి
కొన్ని చూపులు గమనిస్తున్నాయి
కొన్ని కంఠాలు వాదిస్తున్నాయి
కొన్ని కండ్లు రోదిస్తున్నాయి
కొన్ని కండ్లు మూతలు పడుతున్నాయి
కొన్ని జేబులు కోతలు పడుతున్నాయి
కొందరు నిలబడి, నిలబడి
నిలబడలేక ప్రక్కనున్నవారితో కలబడి
కొందరు కూర్చుని
కొందరు కాళ్ళు నిగడదన్ని పడుకొని ...

రూపాంతరంచెందిన మానవాకారాల విభిన్నవేషాలు
రూపకల్పన కనువగు ఎన్నెన్నో తమాషాలు !
అదొక రైలుపెట్టె !
ఇంజన్నంటిపెట్టుకొన్న విచిత్ర వాతావరణ రసతెట్టె !!
అలాంటి పెట్టెలు ఒకటా ? రెండా ?
ఒకటి ప్రక్కన రెండేసినన్ని !

ఒక్కదాని వెంబడి ఒక్కటిగా అన్నీ
తోక తోకనంటుకొన్న ఎఱ్ఱటి గొల్లల సోలుపులా
ఆ యింజన్నంటిపెట్టుకొని
పట్టాలమీద పద్ధతిగా
గమ్యంవైపు సాగుతున్నాయి సముద్ధతిగా !

మాసిన తలలాంటి రైలుయింజనులో
తలమాసిన రక్కసుల్లాంటి నాలుగు జీవాలు
తలపడ్డాయి రాక్షసి బొగ్గుతో
ఆడుకొంటున్నాయి హాయిగా అగ్నితో !

గమ్యం చేర్చడానికి శ్రమిస్తున్నది నలుగురు
గమ్యం పేరుతో విశ్రమిస్తున్నది ఎందరో ?
ఆ అందరూ అమాంతంగా పైకిలేచి
ఒక్కొక్క వ్యక్తి సమస్త శక్తికాకపోయినా
కొంతకు కొంతశక్తిని ధారపోసి
ఆ రైలు యింజనులో తలాపిడికెడు
బొగ్గు వేసేదెప్పుడు ?
గమ్యం చేరడానికి సమిష్టికృషి కొనసాగేదెప్పుడు ?
ఇది కుందేళ్ళకు తాటాకుల చప్పుడు !!

- అంకితం -

ఒకప్పటి రైల్వేకార్మికుడుగా — అప్పుడూయిప్పుడూ కార్మికులై
అహోరాత్రాలు అగ్గితో బొగ్గుతో ఆడుకొంటున్న
నా రైల్వే కార్మిక సోదరులకు —



"సాంధ్య శ్రీ"

సంప్రదాయం ప్రగతి వ్యతిరేకమా–?

అభ్యుదయ రచయితలకు ఆద్యుడైన, ఆరాధ్యుడైన శ్రీ శ్రీ మాటలతో ఈ వ్యాసాన్ని ప్రారంభిస్తాను. "ఎంతో సంస్కార ముంటేనే తప్ప ఇతరులను అర్థం చేసుకోలేము. వెక్కిరించటం చాలా సులభం."

ఇక ఈ వ్యాసం చదవండి

సంప్రదాయాన్ని గురించి వర్తమాన సంఘానికి తెలియవలసినంత తెలియదు. ఎందువలన...? వీరెవరో సంఘసంస్కర్తలు తెలియచెప్పవలసినంత తెలియచెప్పలేదనియా ... ? అట్లెందుకవవలయును ? ఈ సంస్కార ప్రియులందరి గుంపు సంప్రదాయమొక విషవలయమని చాటియున్నారు కదా ? ఏ సంప్రదాయము మౌఢ్యమైయున్నదో – ఆ మౌఢ్యమెంత మాత్రములేని ఇంకొక సంప్రదాయమును ప్రతిష్ఠించి యుందురని భావింప వచ్చునా ? సాగరపు లోతును విసర్జించి ఒడ్డుకు కొట్టుకొని వచ్చిన తెట్టు నురుగు తెలివితో రేఖామాత్ర స్పర్శనుచేసి సంప్రదాయము మూఢమైనదని నిర్ధారించిరే! మరిదేమి ? ఏమో ! మనకు పరతంత్ర పీడనము తప్పినది. స్వేచ్ఛ వచ్చినది. అవసరము తీరినది. ఇపుడిక ఎవరైనను ఆలోచించవచ్చును.

"అథ శిక్షాం వ్యాఖ్యా స్యామః

వర్ణః స్వరః మాత్రాబలం సామసంతానః"

ఇది శిక్ష. దీనితో నేమి ? పని అయిపోయినది.

అసలాకులందని కొసాకులు మేయు ప్రవృత్తిమనది. పునాది ఏట్లేర్పడినది ? ఎందుల కేర్పరుపబడినది ?- అనవసరము గాలి మేడ కట్టుటలో మన ప్రజ్ఞ ఎంత ? ప్రగతిలోని గతి మాట లెందుకు? సాగుట మాత్రమే ? ఇది వర్తమాన యూహ. కొందరెన్ని రీతుల నిబద్ధించినారు ?

వచ్చిన చిక్కంతయూ ప్రకటనతోనే! ఒక పరమ సౌందర్యవతి యొక్క శరీరమును వర్ణించు యోచనలో, ఆమె అగణ్య లావణ్యమును, తత్పరమ పవిత్రభావ జనిత శృంగార రసమును వదిలివేసి, ఆమె యెన్ని కిలోగ్రాముల బరువున్నది ? ఆమె కరచరణముల దైర్ఘ్యమెంత ? ఎన్ని సెంటీమీటర్ల ఎత్తు మొదలైన విషయాదుల స్పృశించినట్లు. ఇంత చర్చకు మూలభూత మా సౌందర్యవతియే. ఇదంతయూ మన [illegible]ను. ఈ తత[illegible] సంప్రదాయమగును ? మనదిక[illegible]విపరీత భావ జని[illegible] నట్టిది. ఆ నాగరికతయే వేరు[illegible] భా[illegible]భావములను మనస్సుచేత, తపస్సుచేత కనుగొను ప్రయత్న మసలుచేయరు...! ఏవియో గుణకారములు, భాగహారములు చేయుదురు. ముందు చెప్పిన శిక్షనొదిలి, కొసాకులు మేయుటన్న నిదియే !

2

సంప్రదాయమన్నది గతం దిగవిడిచిన గుర్తుమాత్రమేకాదు. నేటి వాస్తవం భవిష్యదర్శము. త్రికాలాత్మకం. ఇన్ని తెలిసి సంప్రదాయము ననుసరించుట, "తెలిసి రామభజన చేయుట" యన్న త్యాగరాజులవారి కీర్తన వంటిది. కనుకనే తెలిసి సంప్రదాయము ననుసరింపవలె. లేక,జీవునిలోనున్న వాగ్వ్యాపారమునకు రూపకల్పన లేక నీరసపడిపోవును. సంప్రదాయమన్నది మనీష మండలి యొక్క గతా గతానుభవ సాపేక్ష సిద్ధాంత ప్రామాణికము. ఇది సమిష్టి. చైతన్య భాసురం. జీవైకదేశికా వృత్తిగలది. ప్రాణమువున్న దేహమునకు పట్టుబట్ట కట్టుట వంటిది. శవాలంకరణ ఏమి ప్రయోజనము సాధించును ? సంప్రదాయము గభీర మహోదధి. సర్వ విధ జల సముచ్ఛయాన్ని అంతర్లీనం చేసుకున్న సర్వసత్వ స్వరూపము. కాండాత్కాండాత్ప్రరోహము. ఇది త్రుణ రహస్యము.

ఇది సంప్రదాయము.

ఈ సంప్రదాయ మవగతము కావలయునన్న అగ్నిరహస్యాన్ని ఛేదించవలె. సంప్రదాయ మన నగ్ని.

"అగ్నిః పూర్వేభిః ఋషిభి రీఢ్యోనూత నైరుతః"

ఆకాశమునగల ధ్వని, శబ్దాదుల, నాభి స్థాన పరివర్తనా రహస్యమును పరిశోధించగలిగిన విజ్ఞాన జ్ఞాన మీ సంప్రదాయము. ఎవరు మేఘ స్థానమును, జల స్థానమును మనసులో అద్వైత సిద్ధాంతంగా తలచెదరో వారికి ముందుగా మోకరిల్లిన చాలు. పక్షి ఎన్ని దేశము లెంత సముద్రముమీద, ఎంత లెంతలుగా ఎగిరినను, కడకు గూటికేల చేరును...?

3

సంప్రదాయ మనునది తెలుసుకోదగినది. ఇందుకు సంప్రదాయాధ్యయనం చేయవలెను.

"One must take fire in order to get it"

[illegible] జలాలుద్దీన్ 'రు[illegible]న ఈ సత్యం, అధ్యయనం [illegible]స్తుంది. ఓపిక[illegible] తెరువగలిగిన ప్రహ్లాదుడూ చెప్పెకదా నిదే మాట.

మందబుద్ధులకు, బలహీనులకు, శ్రద్ధకసుస్తులకు ఏమాత్రం లభ్యం కానిది ఆత్మసాక్షాత్కారమనిచెప్పే మాండూక్యోపనిషత్తు, మాయలోపడే మందమతులకు సత్యమవగతం కాదనే కఠోపనిషత్తు సంప్రదాయాన్ని సాధనతో నేర్చుకోమంటాయి. ఇదే అధ్యయనం. ఎంతటి యోధ కావాలీ సాధనకు ...? అవ్యక్తంగా మానవుడే ఆశయసిద్ధికై అన్వేషిస్తాడో, ఆ ఫలమును జ్ఞాని, మహాయోధమై, రాక్షసుడై సాధించినట్టిది కనుకనే జ్ఞానిపట్ల మిగిలినవారికీ ఆరాధన!

ఈ సంప్రదాయము ధీమతుల అనుభవ పరిపాకమై అలరారినది వేదమైనది. "అథామ్నాయః సంప్రదాయః"!

అనాదికాల ప్రవృత్తము, పరంపరా ప్రాప్తము, కనుకనే జాతికి జీవనాళికయైనది. నిత్య నూతనత్వముతో భాసిల్లునది పవిత్ర యజ్ఞ స్వభావముతో ఏకీకృతమైనట్టిది.

"రథః రంహణః ద్రథోయజ్ఞః సచనవః!
సూయతే స్తూయతేః త్రేతివనః స్తుతిమాన్!
సస్నిః ష్ణ శౌచే శుద్ధః! ఏవం విధో యజ్ఞః
ప్రాతః కాలే యోజి అయోజ్య స్మాభిః"

స్తుత్యము, పరిశుద్ధమునగు యజ్ఞమనెడ రథము ప్రాతః కాలమున సిద్ధము చేయబడియున్నది. నిరంతర రంహణ శీలముగల చౌట నిట యజ్ఞము రథముగా వర్ణింపబడినది. ఇది అతి ప్రాచీనము కదా. అయినను ప్రతి దివసారంభమున, ఈ సూర్యుడమిత తేజుడై, నిత్య నూతనముగా భాసిల్లుటయందున్న తేజమువంటిదీ సంప్రదాయము. ఈ సంప్రదాయ మొక నిధి. తత్ప్రతిపాద్య ధర్మము ద్వితీయమగు నిధి. కాపాడుట తపముచేత. తపమధ్యయనము. ఫలితము రససిద్ధి యోగము.

4

ఆనందమయములైనంత మాత్రమే మానవుని ప్రతిదీ తృప్తి పరచునా? మానవుని కుత్తమోత్తమగుణ, ప్రవృత్తులనొసగి అంతర్గత మాలిన్య క్షాళనముచేసి; సద్యః పరనిర్వృతి కావలయును. ఇది కావ్య సంప్రదాయమైనదిగా కావలెను.

"రసోవైసః రసగ్ంం క్యేత్వాయం లబ్ధ్వా వందీభావతి" ఇది కవికున్న అవకాశము. కవి వాణికిని జనతావాణికిని ఎంత భేదమున్నదో తెలిసినకదా సంప్రదాయ మవగతమగును. కవివాణి వాఙ్మయమై యుండును. బహుజన వాణి అర్థశూన్యమైన కలవరముః కలకలము. అట్టి కలవరమును, కలకలమును అర్థవంతముగా మలచి వాఙ్మయముగా నిలుపు శిల్పి కవి. స్వశ్రేయముకంటే విశ్వశ్రేయమును పరామర్శించుట యుక్తమైయున్నది. విశ్వశ్రేయమును పరామర్శించుచో — స్వార్థమునకు తావులేక, సర్వజనామోదము నొందును. తనకిట్లో—తనుఎట్లో—తనపట్ల ఇతరులెట్లున్న. విషయాదులకు సమాధానము తాను కల్పించిన విశ్వశ్రేయములో, ఇతరుల కన్నట్లుగా దొరుకును. ఇది సంప్రదాయమును అనుసరించు కవిగల అంతర్లోకము. ఇందే ధ్వనించును మానవత. ఇతఃపూర్వం లేనట్లు, ఇదేదో తమకు తామై కనుగొన్న నూత్నాంశమైనట్లు ఒక వాదమును దిక్కుల కూదిరి. మానవతావాదమని. వీరు మానవతావాద నినాద జన్యమైన ఒక ప్రతిధ్వనిని, మూకగుంపునుండి గ్రహించి ఆహారముగా ఆరగించునట్టివారు. టోపీలనుండి రూపాయల వర్షమును కురిపించి మనమిచ్చు మెచ్చుకోళ్ల పైసలను ఏరుకుతినే గారడీవారి వంటివారు. వీరే సంప్రదాయమును తిరస్కరించు ధీమతులు. ఇట్టి వీరు సంప్రదాయమును బహుజన వాణిలో వినిపింతురు. వీరిలో కొందరు మానవతా మతమును, పాశ్చాత్యులు వారి నాగరికతలో వినిపించగా మన సంస్కృతతో భాష్యములు వ్రాయుదురు. మన నాగరికతా ప్రాభవమును, మన సంస్కృతి సభ్యతలను, పాశ్చాత్యులు తమ భాషలో ఎత్తిచూపిన, ఔనని, తమ పాశ్చాత్య గురువుల ప్రభలకెత్తుదురు. ఇది వీరి తీరు. వీరి విమర్శనా పటిమను ఒక్క ఉదాహరణతో చూపుదునా? రామాయణ మహాకావ్యమున "మార్క్స్‌నయ" దృక్పథము కనరాదనియందురు. 1818వ సంవత్సరములో పుట్టిన ఈ మార్క్స్‌గారి భావములు రామాయణమున నెట్లుండును? మార్క్స్‌గారిలో రామాయణ భావము లెచ్చట ఎన్ని యున్నవని ప్రశ్నింతును? సంప్రదాయంవేరు. వారసత్వం వేరు. కొందరు యోచనాపరుల కదేమి వ్రతమో; సంప్రదాయము ఇరుకు టరలను కల్పించు నటిదిగా వర్ణింతురు. ఇది కేవల మధ్యయన లోపము. ఇట్టిదీ సంప్రదాయమును తెలిసి అనుసరించుట యోగము. తెలియకనే నిరసించుట ప్రారబ్ధము.

ఆధునికులకు శ్రీశ్రీ ఆరాధ్యుడు కనుక ఆయనగారి మాటలతోనే ఈ వ్యాసమును ముగింతును.

"సంప్రదాయం తాత ముత్తాతలనాటి ధనం
జాతికి జీవనాళిక
జానపద గీతిక"

జాతక కథలు★

భారతీయ వాఙ్మయంలో భారత, భాగవత, రామాయణాలకు ఉన్న ప్రశస్తి, ప్రచారమూ మరి వేటికీలేదు. అక్షరాస్యులకేకాకుండా నిరక్షరాస్యులకు కూడా వాటిమీద ఆసక్తి ఎక్కువ. పురాణ కాలక్షేపాలు జరిగేటప్పుడు అందరూ వెళ్ళి ఆప్యాయతతో వాటిని వింటారు. అవి హిందూమత వ్యాప్తికి మిక్కిలి దోహదం కలిగించాయి.

హిందూమతంలోని యజ్ఞయాగాదుల్లో పశువిశసనంవల్ల జీవహింస కానవస్తుంది. మానవుల దుఃఖాలకూ, జరామరణాలకూ, రోగాలకూ తగిన కారణాలుగాని, వాటిని నివృత్తి చేసుకునే మార్గాలుగాని స్పష్టంగా అందులో గోచరించలేదు. ఈ విషయాలను గమనించియే గౌతమబుద్ధుడు మానవ సామాన్యపు తరుణోపాయాన్ని గురించి తీవ్రంగా యోచించి బౌద్ధధర్మాలను నిర్ణయించి, వాటిని ప్రచారంలోనికి తీసుకువచ్చాడు.

హిందూమతంలోని, భారత రామాయణాదులవలెనే బౌద్ధమతంలో కూడా ఎన్నో గ్రంథాలు వచ్చాయి. అతిప్రాచీనమై, సంస్కృత, పాళీప్రాకృత భాషలలోఉన్న లలిత విస్తర మహాపురాణం రామాయణం వంటిదే! పాళీ ప్రాకృతంలోఉన్న "ధమ్మపదం" భగవద్గీత వంటిది. ఆ విధంగానే బుద్ధుని పూర్వజన్మలలోని గాథలను వివరించే 'జాతక కథలు' మన పురాణ కథలవంటివి. ఈ గ్రంథాలన్నీ జనుల వ్యవహారంలోవున్న పాళీప్రాకృతంలోనే ఉన్నాయి. దీనికి కారణం అవి జనసామాన్యంలో ప్రచారం పొందాలనే సంకల్పమే! అందువల్లనే బౌద్ధమతం—అది స్థాపించబడిన తర్వాత కొన్ని శతాబ్దాలవరకూ చలనం లేకుండా ఉండినది. భారతదేశంలోనే కాకుండా టిబెట్, చీనా, జపాను, సింహళం మున్నగు దేశాల్లో కూడా వ్యాపించింది.

బౌద్ధమత గ్రంథాలీ విధంగాఉన్నా వాటిలో హిందూమతంలోని కథల వంటి కథలూ, అసితుడు, విశ్వామిత్రుడు, ఋష్యశృంగుడు మొదలైన మునుల పేర్లూ, శిబిచక్రవర్తి వంటి త్యాగధనుల నామములూ కానవస్తాయి. జన్మాంతరాలు, జగన్మిథ్యాత్వం మున్నగు విషయాలలో హిందూ, బౌద్ధమతాలు రెండింటికీ సాదృశ్యం ఉన్నది.

కథా వాఙ్మయంలో చేరి ఉన్నందున 'జాతక కథలు'అందరినీ ఆకర్షిస్తూ ఉంటాయి. వీటిలో కొన్నింటిని యిదివరకే చాలామంది విద్వాంసులు గద్య పద్యాత్మకాలుగా ఆంధ్రీకరించారు. వాటిలో "బుద్ధుని పూర్వ జన్మములు" మున్నగునవి గద్యాత్మకాలు. సుప్రసిద్ధ విద్వాంసుల శిరోమణి సన్నిధానం — సూర్యనారాయణశాస్త్రిగారి "జాతక కథా గుచ్ఛము" అనే పద్యానువాద గ్రంథాలు మిక్కిలి ప్రసిద్ధమైనవి. కొన్ని ఏండ్లనుండి గొప్ప విద్వత్కవులు, సాహితీ సమితి అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి మాజీ ఉపాధ్యక్షులు, యశశ్శరీరులు శ్రీ స్వామి శివశంకరస్వామిగార్లు ఈ 'జాతక కథల'ను ఆ పేరుతోనే గద్య పద్యాత్మకంగా అనువదించి వెలువరింప జేశారు. పాళీ భాషలోని గాథలు సంస్కృత శ్లోకాల మాదిరిగా సమానమైన నడక కలిగి ఉండవు. ఒకే గాథలో ఒక పాదం హ్రస్వంగాను, మరొకపాదం దీర్ఘంగాను—ఒకపద్ధతిలేకుండా ఉండడంవల్ల వాటిని తర్జుమా చేయడము చాలా కష్టం. బహుభాషా వేత్తలు, పాళీ ప్రాకృతంలో ప్రత్యేక కృషి చేసినవారుకాబట్టే శ్రీ శివశంకరస్వామిగారికి దీన్నితర్జుమా చెయ్యడం సాధ్యమయింది. ఆయన వ్యావహారిక భాషకు చాలా దగ్గరగా ఉన్న సులభ గ్రాంథికంలో దీనిని రచించారు. గాథలను సులభంగావుండే ఆటవెలదులు, తేటగీతులు, మంజరీ ద్విపదలు, ముత్యాలసరాలు మున్నగు శ్రీయచ్ఛందస్సులలోనికి అనువదించబడినవి.

'జాతక కథలు' మొత్తంమీద అయిదువందల నలభై యేడు ఉన్నవి. వాటిలో కొన్ని హ్రస్వాలు, కొన్ని దీర్ఘాలు. ఆ కథలలో ఇది ఆరవ సంపుటం. ఇందులో 522వ కథ మొదలుకొని 537వ కథవరకూ ఉన్నవి. ఇంకా పది కథలు మిగిలిపోయాయి. అవి సప్తమ సంపుటంగా వెలువడవచ్చును. వెనుకటి అయిదు సంపుటాల్లో ప్రకటించబడిన కథలు చాలా చిన్నవిగా ఉన్నవని గ్రహించవచ్చును. ఇందులో ఉన్నకథలు పెద్దవి.

మన పురాణాలు చాలావరకూ నైమిశారణ్యంలో సూతుడు శౌనకాది మహామునులకు వినిపించినట్లు చెప్పబడినది. ఆ రీతిగానే ఈ 'జాతక కథలు' అనాథపిండదుని జేతవనంలో శాస్త తన శిష్యులకు తెలిపినట్లు తెలుస్తున్నది. ఇందులోని కథలు కొన్ని ఇంచుమించు రామాయణాదుల్లోని కథలను పోలి ఉన్నవి. మచ్చునకు ఋష్యశృంగుని కథను తీసుకోవచ్చును.

రోమపాదుడనే రాజు పాలిస్తున్న రాజ్యంలో ఒకప్పుడు ద్వాదశ వార్షికమైన కరువు సంభవించింది. పాడి పంటలు నశించాయి. ప్రజలు ఆకలి దప్పులచే బాధపడుతూ హాహాకారాలు చేయసాగారు. అప్పుడు మహర్షులు ఆయనతో "విభాండక పుత్రుడైన ఋష్యశృంగుణ్ణి తీసుకునివచ్చినట్లయితేరాజ్యంలోవర్షాలు కురుస్తా" యని తెలియజేశారు. ఆ ఋష్యశృంగుణ్ణి విశ్వప్రయత్నంమీద రాజు తన రాజధానికి తెప్పించి, తన పుత్రిక అయిన శాంతను అతనికిచ్చి వివాహంచేసి తనవద్ద ఉంచుకున్నాడు. దేశంలో వర్షాలు కురి

★ జాతక కథలు—ఆరవ సంపుటి. పాళీ భాషనుండి శ్రీస్వామి శివశంకరస్వామిగారి ఆంధ్రీకరణ. డెమ్మీసైజు 293 పుటలు. వెల 7 రూ. లు. ప్రచురణ — ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాదు — హైదరాబాదు—4.

శాయి. రాజ్యం సుభిక్షంగా అయింది. ఇది రామాయణాన్నిబట్టి తెలుస్తున్న కథ.

ఈ 'జాతక కథల'లోని 'నళినికాజాతకకథ' ఇలా క్రింది విధంగా ఉన్నది: బ్రహ్మదత్తుడు వారణాసిలో రాజ్యంచేస్తున్న కాలంలో బోధిసత్త్వుడు ఉదీచ్య బ్రాహ్మణుల ఉత్తమవంశంలో జన్మించి, సమస్త విద్యలూ నేర్చుకున్నాడు. పెద్దవాడయాక ఋషి ప్రవ్రజ్యను గ్రహించి హిమాలయ పర్వతాలకుపోయి ఘోరమైన తపస్సు చేశాడు. అతని సంబంధంవల్ల ఒక లేడి గర్భం ధరించి ఒక మగబిడ్డనుకన్నది. ఆ బిడ్డకు'ఋషిశృంగుడు'(ఋష్యశృంగుడు)అనే పేరువచ్చింది. తండ్రి అతనికి ప్రవ్రజ్యనిచ్చి యోగవిధిని నేర్పాడు. ఆ బాలుడు శీఘ్రంగానే జ్ఞానాభిజ్ఞలు పొంది,తండ్రి ఆశ్రమంలోనే ఉంటూ ఘోరమైన తపస్సుచేస్తూ ఉండెను. వానికి స్త్రీ పురుష విచక్షణ జ్ఞానంకూడా లేదు. అతని తపస్సునకు ఇంద్రభవనం కంపించింది. అతని తపోనియమ భ్రంశానికి ఇంద్రుడు ఉపాయం ఆలోచించి మూడేళ్లపాటు కాశీరాజ్యంలో వానలు పడకుండాచేశాడు. పంటలులేవు. ప్రజలు తహతహలాడిపోయి రాజభవనం దగ్గరికిపోయి ఆయనను నిందింపసాగారు. రాజున్నూ తీక్షణంగా ఆలోచించి తీవ్ర వ్రత నియమానికి పూనుకున్నాడు. అయినా ప్రయోజనం లేక పోయింది. ఒకనాటి రాత్రి యింద్రుడు రాజునకు ప్రత్యక్షమై "నేను వర్షం కురిపించేటప్పుడు హిమాలయంలోని ఋషిశృంగుడు కోపంతో మాచి ఆపివేస్తున్నాడు. అతని తపస్సు భంగంచేస్తే వానలు కురుస్తాయి. ఆ పని నీ కుమార్తె నళినికవల్లనే గాని యితరులవల్ల సాధ్యపడదు" అని చెప్పి వెళ్లిపోయాడు. రాజు పుత్రికను పిలిచి—

"మండుచున్నవి జనపదమ్ములు
మండలమ్ము వినష్టమయ్యెను
ఓసి నళినిక! పోయి బ్రాహ్మణు
దానుగా నొనరించి తెమ్మా!"

అని చెప్తాడు. ఆ బాలిక మొదట భయపడినా, తుదకు తండ్రి ఆనతిని శిరసావహించి ముని ఆశ్రమానికి అమాత్యుల సహాయంతో వెళ్తుంది. అప్పుడు ఆశ్రమంలో ఋషిశృంగుడు మాత్రమే ఉన్నాడు. తండ్రి సమిత్కుశాదులకోసం అడవికి వెళ్లాడు. నళినిక ముని వేషంతో ఆశ్రమంలో ప్రవేశించింది. ఆమె తనవంటి ముని అని తలచి మునికుమారుడు ఆతిథ్యం యిచ్చాడు. అమాయకుడైన ఋషిశృంగుణ్ణి మోసపు మాటలతో లొంగదీసుకుని, అతనితో సంగమించి నియమాన్ని భగ్నం చేసింది. అక్కడ చాలాసేపు వుంటే అతని తండ్రివచ్చి దండిస్తాడని భయపడి, తన ఆశ్రమానికిరమ్మని దారి తెలిపి వల్లగా తప్పించుకుని మంత్రులతోకూడా ఇల్లు చేరుకుంది. రాజ్యంలో వర్షాలు కురిశాయి. తండ్రివచ్చి సమస్తమూ తెలుసుకుని, కుమారుణ్ణి మళ్లీ ప్రవ్రజ్యలోకి మళ్లించాడు.

ఈ కథలో అసభ్యవర్ణనలు, విషయాలు కొన్ని ఉన్నవి. అనువాదకులు ఎంతో నేర్పుతో అవి వాచ్యం కాకుండా వ్యంగ్యంగా తోచే రీతిలోనే రచన సాగించారు.

రామాయణంలోని ఋష్యశృంగుడు శాంతను వివాహమాడి గృహస్థుడైనాడు. ఇందులో నళినిక ఋషిశృంగుని తపస్సుకు భంగం కలిగించి తాను భ్రష్టురాలయింది. ఈపద్ధతికి రాజు సమ్మతించడం కొంత వింతగానే తోస్తున్నది. రామాయణ కథకు ఈ కథ చాలా తిసికట్టుగా ఉన్నది. అయినా వందలకొద్దీ ఉన్న 'జాతక కథల'లో ఇట్టివి చాలా-అరుదు. మిగిలినవి ఎంతో సమంజసంగా ఉండి, ఉత్తమ ధర్మాలను బోధిస్తూ ఉన్నవి.

శ్రీ శివశంకరస్వామివారే యీకథల అనువాదానికి సమర్థులు! వేరొకరు తర్జుమాచేస్తే ఇంత చక్కగా పుస్తకాలు తయారుకాగల వని అనుకోలేము.

శ్రీ శివశంకరుల పద్యానువాదం కూడా గద్యానువాదం వలెనే చాలా రసవంతమై, సులభ శైలిలో సాగుతుంది.

ఉదా. బోధిసత్త్వుడు పలికిన గాథలు—

"త్రికరణమ్ములయందు స్థిర సంయతుండు
పాపమ్ము చేయనివాడు చిత్తమున...
అనృతమాడనివాడు స్వార్థమ్ముకైన
అతడు సదాచారుడనిపించుకొనును.

... ...

బదులు సేయగనెంచు పడసిన మేలు
మరువక కల్యాణ మహిమాన్వితుండు
దృఢభక్తి యుక్తుండు, దీనుల కెపుడు
ఉపకార మొనరింప నుద్యుక్తుడైన
చూతండు సజ్జనుడనిపించుకొనును"

[పుట 18]

ఇప్పటివరకూ ఆరు సంపుటాలు వెలువడ్డాయి. మిగిలిన సంపుటం కూడా త్వరలోనే రాగలదని ఆశించవచ్చును.

—శ్రీ బులుసు వేంకటరమణయ్య

శ్రీ కలువకొలను సదానంద

మత్తకోకిల

వాల్ పోస్టరులోని వాళ్లంటి కాదు.

పత్రికల కొట్టులో వ్రేలాడుతున్న బూతుపత్రిక కూడా కాదు

వాటికంటే ఆకర్షణీయమైనది ప్రపంచంలో మరొకటుందా? ఉందనే అనుకోవాలి లేకుంటే, కంటిమీద రెప్పవేయకుండా కుశలయ్య ఎందుకలా నిలబడిపోతాడు?

ఆ దివ్యసౌందర్యం ఏది?

అదే! ఆ రాతిబొమ్మ! ముసలాడి బొమ్మ!

రెండు నిలువుల ఎత్తున్న నల్లని శిలాపీఠం. దానిమీద చేయెత్తున తెల్లని గాంధీవిగ్రహం. పాపంలాంటి, పాతకంలాంటి నల్లరాయి. దానిమీద పున్నెంలాంటి, పవిత్రతలాంటి తెల్లని గాంధీ!... రాముడి పాద స్పర్శతో రాతికి విమోచనం కలిగింది ఓ నల్లరాయీ! నీ బ్రతుకు ధన్యమైంది. గాంధీ నీమీద పాదం మోపాడు. నీ నలుపంతా కరిగిపోవాలని నీమీద వెలసినాడు. నువ్వూ తెల్లగా మారిపో!

.. మారిపోలేదు నల్లరాయి నల్లగానే వుంది

అయ్యో బాపూ! నల్లరాతిమీద నిలబడ్డావెందుకూ? నువ్వు కూడా నల్లబడిపోవూ ?

లేదు లేదు. గాంధీ తెల్లగానే వున్నాడు. కలగలిసిపోవటానికిదేమన్నా పాలూ నీళ్ళా? కిర్రాణా సరుకులా? ఇలా తలంమీద కాలూనడానికే చోటులేక, మహాత్ముణ్ణి ఆశ్రయించిన తెలుపు; మహాత్ముణ్ణి ఒక్కణ్ణిమాత్రం విడిచిపెట్టి దేశం నాలుగు దిక్కులనుండీ ఆ నల్లరాయివాకా లావాల పరచుకొన్న నలుపు.

కుశలయ్య రోడ్డుప్రక్కన నిలబడి ఒళ్ళంతా కళ్ళుచేసుకుని విగ్రహాన్ని చూస్తున్నాడు. నాలుగురోడ్ల కూడలిలో నిలబడ్డాడు గాంధీ. వీధిలో దొమ్మరాట చూడటానికి మదురుగోడ మీదికెక్కి కూర్చునే కుర్రాడిలా నల్లరాయిమీద నిలబడ్డాడు గాంధీ

కుశలయ్యకు కన్నుల పండుగ్గా వుంది.

ఇందరు మనుష్యుల్లో గాంధీ ఒక్కడుమాత్రం విలక్షణంగా వున్నాడు!...అతని అలవాట్లూ విలక్షణమైనవే! బోడితల, బోసినోరు, మూరెడు గోచీ, మీద గావంచా, రొండిలోనుంచి వ్రేలాడుతూన్న గడియారం, కుడిచేత పొడుగాటి ఊతకర్ర! పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ బిరబిరా నడిచిపోతున్నట్లున్నాడు.

లేక లేక పుట్టిన కొడుకును చంకనేసుకుని మురిసిపోతూ నిలబడ్డ కన్నతల్లిలా—జెండా గాంధీ ప్రక్కన నిలబడి సగర్వంగా రెపరెపలాడుతోంది.

పతాకధ్వజంనుండి రోడ్డు అవతలివైపున వున్న కరెంటు కంబానికి కట్టినమామిడాకుల తోరణంతెగిపోయి, నేలమీద విగ్రహం ముందర జారిపడి వుంది. శిలాపీఠం చుట్టూ సన్నని పూలసరాలు గొలుసులు గొలుసులుగా అలంకరింపబడ్డాయి. గాంధీ మెడలో కొండచిలువంత పెద్ద పూలదండ పాదాలదాకా వ్రేలాడుతూంది

కుశలయ్యకు సూటిగా రోడ్డుకు అవతలివైపున నిలబడ్డ నల్లమేకకూడా గాంధీ విగ్రహంవైపు చూస్తూవుంది విగ్రహం చుట్టూ నాలుగురోడ్లమీదా బస్సులు, లారీలు, కార్లూ బొయ్యిమంటూ దూసుకుపోతున్నాయి. నాలుగురోడ్లూ జాగ్రత్తగా దాటుకుంటూ ఒక చుట్టువేసి, అన్నివైపులనుంచీ విగ్రహాన్ని చూశాడు కుశలయ్య. విగ్రహం వెనుకవైపున నల్లరాతిమీద ఏవో తెల్లటి అక్షరాలు కనిపిస్తున్నాయి. ఆఅక్షరాలు స్పష్టంగా కనిపించడంలేదు. కుశలయ్య రోడ్డు దాటుకుని విగ్రహం దగ్గరకు వెళ్ళాడు అంత ఎత్తయిన విగ్రహం నీడలో నిలుచున్న కుశలయ్య—తాతగారి కాళ్ళు పట్టుకుని లేచి నుంచున్న చంటివాడిలా కన్పిస్తున్నాడిప్పుడు.

ముందు నడిచిన మందతోబాటు వంకదాటే గొర్రెలాగా — దూరంగా రోడ్డు అంచున వున్న నల్లమేక కుశలయ్యను చూచి విగ్రహం దగ్గరకు నడిచివచ్చింది నేలమీద పడివున్న మామిడాకుల్ని నమలసాగింది

కుశలయ్యకు ముచ్చట వేసింది.

గాంధీ, తానూ, నల్లమేక !

నల్లమేకయితేనేం? తెల్లని పాలనిస్తుంది! గాంధీ మేకపాలు త్రాగి బ్రతికాడు. మేకపాలు మాత్రం తాను త్రాగి, మేక మాంసమంతా మనకిచ్చాడు ఇప్పుడిది గాంధీగారి మేక! ఇక్కడి నుంచి వెళ్లిపోయిన పిమ్మట—కసాయివాడి మేక !

కుశలయ్యకు తనివి తీరినట్లయింది.

హఠాత్తుగా తన ఎదుట మెరుపు మెరిసినట్లయి తల పైకెత్తాడు కుశలయ్య. షూటింగులో సినిమాతార తొడుక్కున్న నకిలీ ఆభరణాలు లైట్లలో జిగేల్మన్నట్లుగా — గాంధీ ప్రతిమ ఎదుట రోడ్డుకు అవతలవున్న దుకాణం తాలూకు రంగు రంగుల

విద్యుద్దీపాలు తళుక్కున వెలిగాయి. 'గాంధీనెత్తిమీది డూమ్‌లైటు వెలవెలబోయింది.

"ఆత్మా రిక్కర్స్!'

అద్దాల బీరువాల్లోని రకరకాల సీసాలు బల్బుల్లా వెలుగుతున్నాయి. దుకాణంముందర—రోడ్డుమీదికి కనిపించేలా మౌల్డింగ్‌తో నిలువెత్తున తయారుచేసిన బొమ్మ ఒకటి అమర్చబడివుంది. ఒక గుండుమీద మూడు కోతులు కూర్చున్నాయి. ఒకటి కళ్ళు మూసుకుంది. ఒకటి చెవులు మూసుకుంది. ఒకటి నోరు మూసుకుంది.

'ఆత్మా రిక్కర్స్!'

కుశలయ్య ఆ దుకాణం దగ్గరకు వెళ్ళాడు. ఆ బొమ్మల్ని చూస్తూ నుంచున్నాడు అటు వైపున గాంధీ! ఇటు వైపున గాంధీగారి కోతులు! విశ్వరూప సందర్శనానంతరం దృష్టిరాహిత్యాన్ని ప్రసాదించమని భగవామణ్ణి ప్రార్థించే ధృతరాష్ట్రుడిలా—కళ్ళూ, చెవులూ, నోరూ మూసుకున్నాయి కోతులు.

దుకాణం ముందర పేవ్‌మెంటుమీద బిచ్చగాళ్ళిద్దరు బట్ట పరచి, బైరాయించారు. ఒకడు చక్కగా సినిమా పాటలు పాడుతున్నాడు. రెండోవాడు ఘటం వాయిస్తున్నాడు. హిరణ్యకశిపుడి కొలువులోని స్తుతి పాఠకులకు మల్లే—దాతలను అలరించగల పాటలే పాడుతున్నారు వాళ్ళు.

ఒక నాలుగు పాటలు విన్నాడు కుశలయ్య.

'పైకంతో కొనలేనిది ఏదీలేదు, నా మైకంలో పడనివారు ఎవరూలేరు...'

'నిషాలేని నాకు—హుషారేమి లేదు...'

'తాగితే తప్పేముంది? అఫ్‌కోర్స్, తాగితే తప్పేముంది?...'

'భూమ్మీద సుఖపడితే తప్పులేదురా—బులపాటం తీర్చుకుంటే తప్పులేదురా...'

గుడ్డమీద డబ్బులుకురుస్తున్నాయి. వ్యాపారదృష్టి లేకపోతే బిచ్చగాడు కూడా బ్రతకలేడు ఈ రోజుల్లో.

సీసాలు కలకలలాడుతున్నాయి. కిలకిలా నవ్వుతున్నాయి. గంగలా వాగుతున్నాయి. బాగ్దాద్ పురవీధుల్లో వేదికలమీద నిలబడ్డ అందగత్తెల్లా అమ్ముడుపోతున్నాయి

రోడ్డు కూడలిలో పోలీసు నిలబడ్డాడు. అతను ట్రాఫిక్‌ను అదుపులో పెడుతున్నాడు. అటువైపున టీ కొట్టు, ఇటువైపున బ్రాందీషాపు—అతని కంటికి ఒకటిగానే వున్నాయి.

ఏడ్చేవాళ్ళను చూస్తే కొందరికి ఏడుపొస్తుంది. త్రాగుబోతుల్ని చూస్తుంటే, కుశలయ్యకు ఏదోమైకం కమ్ముతున్నట్లయింది. వేదికమీది ప్రవక్తలా ఎత్తున నుంచున్న గాంధీ ముఖం వైపు చూశాడతను.

కదులుతున్న గాంధీ పెదవులు ఒక్క కుశలయ్యకే కనిపించాయి. 'పీనా బురా హై భాయీ!'

కోతులవైపు చూశాడు కుశలయ్య. మూడు కోతులూ సుమ్మారు తప్పన్నాయి. అతనికి కోపం వచ్చింది.

గాంధీగారండోయ్! సినిమాల్లో చిత్తూరు నాగయ్యగారిలాగా ధర్మపన్నాలు వల్లించడమేనా నీ పని? ఉప్పు, కారం తిని బ్రతుకుతున్న మనుషులం—మాకు ఏది రుచిస్తుందో, ఏది రుచించదో—సన్యాసివి నీకేం తెలుసు? నీ మాటే వేదమా? ఆ మాటకొస్తే, వేదమంటే కూడా మాకు గౌరవంలేదు తెలుసా? నువ్వు చెప్పినట్లు పని, ఇంద్రియాలకు బిరడాలు బిగించి ముడుచుకు కూర్చోవటానికి మేమేం కోతులమా? మనుషులం మేము! డార్విన్ సిద్ధాంతం తెలుసా నీకు? కోతులనుండి పుట్టుకొచ్చిన మనుషులం మేము! మా చూపు ముందుకే! మా నడక ముందుకే! మమ్మల్ని వెనక్కు—మళ్ళీ కోతుల దగ్గరకు నడిపించకు! నివ్వక్కడ నుంచోబెటాం, నుంచో! నీ పూజా పునస్కారాలకు మాత్రం లోటు చెయ్యం!

కుశలయ్య అక్కడ నిలబడలేకపోయాడు. అక్కడినుంచి వెళ్ళిపోలేకపోయాడు. ఉండలేక, వెళ్ళిపోలేక మెల్లగా నడవసాగాడు నల్లటిరోడ్డు! పాడుగాటి విస్కీ సీసాలాంటి రోడ్డు! సీసామీద విస్కీ బొట్టు జారి, ఆరిన చారవెంబడి నడిచే ఈగలా కదిలిపోతున్నాడు కుశలయ్య.

అతనికి గాంధీమీద జాలి పుట్టుకొచ్చింది. వేగంగా మలుపు తిరిగి అకస్మాత్తుగా ప్రత్యక్షమైన లారీకి సూటిగా పరుగెడుతోన్న కుర్రవాణ్ణి చూచినట్లు—లోకాన్ని చూచి గుండె గతుక్కుమంటోంది తనమీద తనకే కోపంగా వుంది. లోకానికి ఏదో చెప్పాలని వుంది. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో స్పష్టంగా తెలియకుండా వుంది సుఖంగా ప్రసవించలేక సుళ్ళు తిరిగిపోతున్న స్త్రీలాలికిమల్లే మూగే ఈ హృదయాన్ని—మత్తుమందు ఇచ్చి శాంతింపజేయాలని వుంది

కుశలయ్య ఆగాడు.

'మాదురీ బ్రాందీ షాపు!'

పేవ్‌మెంటుమీద నిలబెట్టిన బోర్డు—'మీ ఆరోగ్యానికి సావరిన్ బ్రాందీ!'

ప్రక్కన హోటలు—'కోడిపలావు తయారు!'

కుశలయ్య వెనక్కు తిరిగి చూశాడు. దూరంగా గాంధీ ప్రతిమ కనబడుతూ వుంది. దుడ్డుకర్ర చేతబట్టుకుని పెద్ద పెద్ద అంగలు వేస్తున్నట్లున్న జాతిపిత—ప్రియుడివెంట లేచిపోతున్న కన్నకూతుర్ని తరుముకుంటున్న ముసలి తండ్రిలా వున్నాడు.

కుశలయ్య ముందుకు కదిలాడు.

గమ్యం చేరుకున్న కోరికలా ఆగాడు.

'మోహినీ బ్రాందీషాపు!'

అతను వెనుదిరిగి చూశాడు. మలుపులో మరుగుపడిపోయా డేమో—గాంధీ కనిపించడంలేదు. మోకాళ్ళు డోక్కుపోయిన ప్రబో. ధంలా వెనకబడిపోయాడు.

ఇక్కడ గాంధీలేడు!

శిష్యులారా, ఇవిగో అరటిపళ్ళు. ఎవరికంటా బడకుండా వీటిని తినిరండి.

ఆచార్యా, తిని వచ్చాం. ఎవ్వరికంటా పడకుండా తిన్నాం.

నేను గది తలుపు గొళ్ళెం పెట్టుకుతిన్నాను.

నేను గోడచాటున తిన్నాను.

నేను గొంగళి ముసుగేసుకు తిన్నాను.

నాయనలారా! ఎవ్వరూ చూడలేదంటారు; మరి దేవుడు చూడలేదా? మీరెక్కడున్నా, ఏం చేసినా వాడొక్కడు చూస్తాడు.

దేవుడు! గాంధీ దేవుడు కాడా? గాంధీ ఇప్పుడిక్కడ లేడా? ఉన్నాడు! ఈ వెలుతురులో ఉన్నాడు. ఆ చీకట్లో ఉన్నాడు. నీలో ఉన్నాడు. నాలో ఉన్నాడు. మన జేబుల్లో ఉన్నాడు. ఆ బ్రాందీ సీసాల్లో ఉన్నాడు సర్వం గాంధీ!

కలలో కనిపించి కంసుణ్ణి కలతపెట్టే కృష్ణబాహుళ్యంలా బ్రాందీ సీసాలన్నిటిపైనా గాంధీ బోసినవ్వు! కుశలయ్య కళ్ళు నులుముకున్నాడు. గాంధీ మాయమైనాడు.

బ్రాందీదుకాణం ప్రక్కనే ఆధునికమైనహంగులతో క్రొత్తగా వెలసిన హోటల్ వుంది. 'అశోకా హోటల్—మాంసాహార భోజన శాల.' త్రాగుడు నీటికోసం వలస వచ్చిన ఒంటెల బారులా కార్లు వస్తున్నాయి. హోటల్ ముందర ఆగుతున్నాయి. రోడ్డు పొడుగునా మెర్క్యురీ దీపాలు పదుపుటింటి పరిచారికల్లా వరసగా నిలబడి, వచ్చే కార్లకు స్వాగతం చెబుతున్నాయి. కార్లు—నున్నటి రోడ్లు—మెర్క్యురీ దీపాలు—బ్రాందీ షాపులు—అన్ని వసతులూవున్న హోటళ్ళు-లాడ్జీలు—లాడ్జీలనిండా రంజైన రామచిలకలు — ఇదీ నీ దేశం!

ఎన్నో బోర్డులు! కప్పునుంచి వ్రేలాడుతున్నాయి కొన్ని. పేవ్‌మెంటుమీద నిలబడ్డాయి కొన్ని. వాటిలో ఒకటి — 'మీ ఆరోగ్యానికి సావరిన్ బ్రాందీ!'

దుకాణం ముందరికి వెళ్ళి నిలబడ్డాడు కుశలయ్య. అతని గుండె వేగంగా కొట్టుకోసాగింది.

'ఏం కావాలి?'

'గగ్గా గాంధీ!'

కొట్టువాడు తెల్లబోయాడు 'గాంధీనా?!'

కుశలయ్య సిగ్గుపడ్డాడు. తాను బడుద్దాయనని ఒప్పుకుంటున్న వాడిలా చిరునవ్వు నవ్వుతూ 'గాంధీ కాదండీ; బ్రాందీ!' అన్నాడు.

కొట్టువాడు బల్లమీద సీసాలు పెట్టాడు. బిహైవ్‌బ్రాందీ, హాస్పిటల్ బ్రాందీ, బిస్కెట్ బ్రాందీ...వెలలు...

సావరిన్ బ్రాందీ లేదా?'

'ఉంది!'

'ఎంత?'

'ఆరు రూపాయలు.'

'అదే యివ్వు.'

కుశలయ్య డబ్బిచ్చి సీసా అందుకున్నాడు.

రాకుమారుడి రథంలాగా రయ్యిమంటూ వచ్చి ఆగిందొక కారు. కారు ఆగడం, తలుపులు తెరుచుకోవడం రెండూఒక్కసారే జరిగాయి. గంధమాదన పర్వతంమీద వాలిన గంధర్వ కుమారుల్లాగా నలుగురు యువకులు—విద్యార్థులేమో—నేలమీద కాలు మోపారు. వేషభాషల్లో దేశద్రిమ్మరుల్లా వున్నారు వాళ్ళు. దేశద్రిమ్మరులకు నాజూకైన పేరు—హిప్పీలు! ఇంకా సీసాలైనా కొనకుండానే తాగుబోతుల్లా తూలిపోతున్నారు.

ఆ నలుగురూ సీసాలు కొనుక్కున్నారు. అశోకాలోకి నడిచారు. కుశలయ్య వాళ్ళను అనుసరించాడు.

స్వర్గానికి చేరువగా — తక్కిన మనుషులకంటే దగ్గరగా—పై అంతస్తున ఆరుబయట—చుక్కల చాందినీక్రింద విడిది చేశారు వాళ్ళు. మద్యంలో తాదాత్మ్యం పొందినవాళ్ళు రోడ్డుమీదికి బోల్తా పడకుండా వుండేందుకు చుట్టూ రెండేసి పిట్టగోడలు — ఫ్లాస్కు లోపలి గాజుగోడల్లా—కట్టి ఉన్నారు. కుశలయ్య ఒక వారగా బల్ల ముందరకుర్చీలో కూర్చున్నాడు.

'ఏం కావాలి సార్?' అన్నాడు కుర్రాడు.

'కాస్సేపు ఆగు.'

'హిప్పీ'ల వైపే చూస్తూ కూర్చున్నాడతను. ఓహో! క్రమంగా బోధపడుతోంది సోడా తెప్పించు. అదీ యిదీ గ్లాసులో కలగలుపు. ఒక్క దమ్మున గడగడా త్రాగేయి. ఆపైన—బల్లమీద కోడిపలావు!...పగలబడినవ్వు! బూతులు బనాయించి చమక్కులు విసురు! సోడాబుడ్లకు మల్లే కిసుక్కుమంటారందరూ! కముజా పిట్టల్లా కెకెకే అంటారు. చీకపూడిపోయిన నీ సంస్కారాన్నీ, ఔన్నత్యాన్నీ, నాగరికతను నగ్నంగాచూచి భేష్ అంటారు.

గొప్పవాళ్ళ గారాబు బిడ్డలు!

చిట్టి తండ్రులారా! పారిశ్రామిక వేత్తలుగానో, ప్రజా సారధులుగానో రేపు ఈ జాతికి ప్రాతినిధ్యం వహించబోతున్నవాళ్ళు మీరు. తాగుతున్నారా బాబూ? గాంధీగారి పేరు విన్నారా మీరు? మీలాగా శ్రీమంతుల యింట్లోనే పుట్టాడాయన. ఆయన కూడా తాగాడుగానీ, మీరు తాగుతున్న ఎర్రటి నీళ్ళుకాదు. తెల్లటి మేక

పాలు తాగాడాయన. మీలాగా హిప్పీ క్రాపులు పెంచుకోలేదాయన. వంగితే పుసుక్కున జారిపోయే గొట్టం పంట్లాములు తొడుక్కోలేదు. సామాన్యుడికిమల్లే గోచీకట్టుకున్నాడు. మీరు గాంధీకంటే గొప్పవాళ్ళా తండ్రీ? నేనూ తాగుతున్నాను చూడండి. నా కోసం కాదు, మీకోసం! మీలాంటివాళ్ళ కోసం! ఇందులో మీరు పొందుతున్న ఆనందమేమిటో స్వయంగా తెలుసుకుని ఏడవటం కోసం! నామాట మీరు వినితీరాలి. ఎందుకంటే — దేశానికి పనికొచ్చేవాళ్ళు మీరు. మీరు భ్రష్టులైపోతే దేశం చచ్చిపోయినట్లే! అభిమాన ధనుడు యితరుల సొమ్ము చిల్లిగవ్వయినా వాడుకోడు మంచినీళ్లకు మల్లే మీరు పారబోస్తున్న డబ్బు మీదికాదు. మీ పెద్దలది. వాళ్ళు చెమటోడ్చి సంపాదించిన సొమ్ము! చెమటోడ్చిన వాళ్ళ నోళ్ళుకొట్టి సంపాదించిన సొమ్ము! ఆ పాప పుణ్యాలకు వారసులమని చెప్పుకోవటానికి మీకు సిగ్గు లేదూ?

గ్లాసు నోటబెట్టుకున్నాడు కుశలయ్య. కుళ్ళిన శవంమీది నుండి ఎగిరివచ్చే దుర్గంధంలా — అతని ముఖంలో వెగటు సుళ్ళు తిరిగింది. ఆత్మహత్య చేసుకుంటున్న వాడిలా బలవంతంగా మింగాడు. చేదుగా వుంది — వేపనూనెలాగా! వేపనూనె ఆరోగ్యానికి మంచిది. వేపనూనె; సారాయి! ఇల్లాలు, ప్రియురాలు! ఇద్దరూ ఆడవాళ్ళే! ఇల్లాలు ప్రేమిస్తుంది; ప్రాణమిస్తుంది! ప్రియురాలు కామిస్తుంది; గెంటేస్తుంది! అయినా, మగవాళ్ళకు పెళ్ళాలకంటే ప్రియురాండ్రంటేనే ఎక్కువ మోజు!

మంటపుట్టి, గొంతు కరకరలాడింది. చింతనిప్పులు మింగినట్లుగా వుంది. హాలాహలాన్ని ఎలా మింగగలిగాడు శివుడు? బహుశా అది యింత ఘాటుగ వుండదేమో!

పళ్ళెంలో వున్నదేదో తింటున్నాడు కుశలయ్య. కల్లబొల్లి మాటలతో కన్నెపిల్లను లొంగదీసుకుంటున్న కుటిలుడిలా—మత్తు అతన్ని అంచెలంచెలుగా ఆక్రమించుకుంటోంది. కోరికల పడవనెక్కి చంకనున్న పంటిపాపను మరచిపోయినభర్తృవిహీనలా—కనురెప్పలు కంటిపాపకు దూరమైనాయి చేతులు గురితప్పుతున్నాయి.

మత్తు!

కుశలయ్య బిల్లు చెల్లించి పైకి లేచాడు. సముద్రంమీద తేలియాడే తెప్పలాగా కాళ్ళక్రింద నేల, మిణుగురు పురుగుల్లాగా చీకటి నిండా పొదిగిన దీపాలు—ఉయ్యాల లూగుతున్నాయి. పాము లాంటి ఘాట్ రోడ్డుమీద మలుపులు తిరుగుతూ పోయే బస్సులో పట్టు దొరక్క నిలబడ్డ ప్రయాణీకుడిలా — ముందుకు తూలాడు అతను.

'బుడ్డి మరిచిపోతున్నారు సార్!' అన్నాడు కుర్రాడు.

'ఎందుకదీ?'

'అందులో యింకా కొంచెం వుందండీ!'

'అలవాటుందా నీకు?'

'బొగ్గులుమోసేవాడికి తలమసిగాకుండా వుంటుందాసార్?' అంటూ యికిలించాడు కుర్రాడు.

'అయితే ఆ బుడ్డి నువ్వే వుంచుకో!' అన్నాడు కుశలయ్య— భోగం మేళానికి భూరి విరాళమిచ్చే సంస్థానాధీశుడిలా!

తన సంతృప్తిని మాటల్లో వెలిబుచ్చాడు కుర్రాడు. 'మీలాంటోళ్ళు అరుదుగా గానీ రారు సార్! కోడిపలావైనా వొదిలేసి వెళ్ళిపోతారుగానీ, బుడ్డీలో బ్రాందీ మిగలబెట్టి పోయేవాళ్ళను మిమ్మల్నొక్కర్ని చూస్తున్నాను. వాళ్ళంతా తాగుబోతులండీ!'

ఆ ప్రశంసతో కుశలయ్య మత్తు మరొక మోతాదు హెచ్చింది. వాడికి మరో సీసా కొని యిద్దామనిపించింది. వాడు మళ్ళీ పొగిడితే మరో సీసా యివ్వవలసి వస్తుంది గదా? దానికి అంతెక్కడ? మహామహా పాళెగాళ్ళే మొలనూలుతో మిగిలిపోయారు — కారణం? పొగడ్తలతో పాచికలాడి!

'జారిపోయే కొరమీనును వాటంగా పట్టుకున్నట్లు—శరీరాన్ని అదుపులోపెట్టుకుంటూ జాగ్రత్తగా క్రిందికిదిగివచ్చాడు కుశలయ్య

మోహినీ బ్రాందీషాపు!...రాక్షసులవంతు వచ్చేసరికి అమృతం అయిపోయిందంటూ కుండ బద్దలు గొట్టింది మోహిని. బ్రాందీ కొట్టు మోహిని — అన్నపూర్ణ! కామధేనువు! కల్పతరువు! కుండ క్రిందికి దించదు. అది జీవధార!

పోలీసు ఎదురుపడ్డాడు.

కుశలయ్య చిరునవ్వు నవ్వాడు. పోలీసూ నవ్వాడు

'ఏం సంగతి?' అన్నాడు కుశలయ్య.

'ఏముందీ?' అన్నాడు పోలీసు.

నడుస్తున్నాడతను — సుళ్ళు తిరిగే కాగితపు పడవలాగా! సుడిగాలిలో చిక్కుకున్న గాలిపటంలాగా! నున్నటిరోడ్డు—రాజుగారు నడవటం కోసం పరచిన తివాచీలాంటి రోడ్డు — గాలిపటంతోకలా, గాలికెగిరే రిబ్బనులా కదులుతోందిప్పుడు కెలిడోస్కోపులోని గాజుపూసల్లాగా విద్యుద్దీపాలు చిత్ర విచిత్రంగా బృందనాట్యం చేస్తున్నాయి కొత్తకారు మీదపడి సాగిపోతూ, వంగిపోతూ, జారిపోయే ప్రతిబింబాలకు మల్లే కనిపిస్తున్నారు — రోడ్డుమీది మనుషులు. రోడ్డు, దుకాణాలు, దీపాలు, మనుషులు, వాహనాలు ... రబ్బరు బుడగమీద అచ్చువేసిన బొమ్మలాగా వుంది! కోణాలు, దూరాలు, కొలతలు పాటించకుండా చిన్నపిల్లలు గీసిన చిత్తరువులాగా వుంది! రంగుటద్దాలు తీసివేసిచూస్తున్న త్రీడీపిక్చరులాగా వుంది ప్రపంచం!

కుశలయ్య మలుపు తిరిగాడు.

ఒక కొమ్మలో చింతకాయలు రాల్చి పక్క కొమ్మమీదికి దాటుకునేవాళ్ళలాగా — పాట పాడుతున్న బిచ్చగాళ్ళు మాధుర్ బ్రాందీషాపు వద్ద కనిపించారు.

దూరంగా నాలుగు రోడ్ల కూడలిలో — ఎవరది? ఎవరా భువనైక సుందరి? ఇంకెవరు? మోహిని! భుజంమీద అమృత భాండం బరువుగా వుందేమో — కందిరీగ నడుము కలువకాడలా వంగింది. కళ్ళలో కైపులాంటి పిలుపు! పెదవుల మీద మధువు లాంటి చిరునవ్వు! వంచి పట్టుకున్న అమృతభాండంలోంచి కుండ పోతగా దూకుతోంది అమృతం! శివుడి నెత్తినదూకి, అక్కడి నుంచి నేలమీదికి జారిన భాగీరథిలాగా—తలుపులు నెట్టుకుని పంట కాలువలోకి దొర్లే నదీ ప్రవాహంలాగా — ఆ అమృతధార నాలుగు రోడ్లనూపట్టుకుని నాలుగు దిక్కులకూ పారలిపారుతోంది. ఊరు ఊరంతా మునిగిపోయింది సాగరగర్భంలోని పగడాల దీవిలా—మునిగి పోయిన ఊరు మైకంగా నిద్రపోతోంది.

అలలపై ఈదులాడే చిన్నారి చేపపిల్లలా తేలియాడుతూ నాలుగురోడ్ల కూడలివద్దకు వచ్చాడు కుశలయ్య. కురుస్తున్న అమృతధార చప్పున ఆగిపోయి, గాంధీగారి ఊతకర్రగా మారిపో యింది ఇందాకా తాగండంటూ నుంచున్న మోహిని — ఇప్పుడు, తాగకు అంటూ కర్ర ఝుళిపించే గాంధీగా మారిపోయింది. మరణ దండన విధించబోయే నీతిపతివైపు చూస్తూ నోరాడక నిలబడి పోయే నేరస్తుడిలా స్తంభించిపోయాడు కుశలయ్య రద్దీ తగ్గిపోగా నాలుగురోడ్లూ తీరిక దొరికిన నర్సుల్లా కునుకు తీస్తున్నాయి.

రోడ్డుకు అడ్డంగా నడిచివెళ్ళి, గాంధీప్రతిమ ముందర సోపానాలమీద—మార్కండేయుడిలా వాలిపోయాడు కుశలయ్య. బోనులో చిక్కుకుని దారికోసం గిరికీలుకొట్టే ఎలుక పిల్లలా— అతని గొంతులో మాటలు విలవిల్లాడాయి. అతను రెండుచేతులూ పైకి చాపాడు. భూమిని చీల్చుకొంటూ పైకి చిమ్ముకొచ్చే జల ధారలాగా అతనిగొంతు పెగిలింది.

'బాపూ!'

నాలుగురోడ్లూ ఉలికిపడ్డాయి. 'ఆత్మాలిక్కర్స్'లోని సీసాల దొంతర లోకాంతర స్వరంలా ప్రతిధ్వనించింది.

అతని హృదయంలో ప్రాణం పోసుకున్న భావాలు—చీకి పొదలో దూరి కోకలు చింపుకున్న సుందరీమణుల్లా — మొండిబారిపోయిన అతని నాలుకమీదినుంచి బయట పడసాగాయి కోకలు చిరిగితేనేమి? భావాలు చెక్కు చెదరలేదు.

'బాపూ! నన్ను మన్నించు! నువ్వేమో తాగివద్దన్నావు. నీ మాటమీదనే నడిచాను కానీ ఏం చేయను? ఈ ప్రభుత్వం నన్ను తాగమంటోంది. తాగుతుంటే తరుముకోవద్దని పహరావాళ్ళకు ఫర్మానాలిచ్చింది. నేనూ, నా సోదరులూ—ప్రభుత్వం నడపండని పదిమందిని పంకా కిందికి పంపితే, వాళ్ళేం చేశారూ? ... మేమేం చెప్పినా, మేమేం చేసినా అది ప్రజాభిప్రాయమేగదా! మద్యపానమే తారకమంత్రం పొండి—అన్నారు. ఏరి కోరి కట్టుకున్న పెళ్ళాం మొగుణ్ణి మొట్టికాయవేస్తే మిరాయిలా ఉందనాలి! గత్యంతరం లేదు. నేను చాలా దుర్బలుణ్ణి! ప్రలోభానికి లోబడిపోయి పాపం రుచి మూశాను కత్తి పట్టుకున్న కసాయివాడివైపు చూచే మేక పోతులా—నా వైపు అలా చూడకు మహాత్మా! రాజధానివైపు చూడు! కుడిచేతనున్న ఊతకర్రను ఎడమ చేతిలోకి మార్చుకుని, ముక్కున వేలేసుకుని చూడు!...'

నాయనా!

కుశలూ!

'ఎవరు? ఎవరిదా పిలుపు? నన్ను పేరెట్టి పిలుస్తున్న దెవరు?'

నేనే తండ్రీ! తల పైకెత్తి చూడు!

కుశలయ్య లేచి నిలబడ్డాడు. అతనిముఖం గుమ్మడి పువ్వులా విచ్చుకుంది. 'నువ్వా బాపూ! నమోస్తునమః నీ దర్శన భాగ్యంతో నా జన్మ తరించింది! ధన్యోస్మి!'

...నీ తప్పేమీలేదు కుశలూ!

'చాలు! ఆ మాట చాలు! ఇక తాగను!'

ప్రభుత్వానిది కూడా తప్పుకాదు. ప్రభుత్వాన్ని పల్లెత్తు మాటన్నా పాపం చుట్టుకుంటుంది ఘోరనరకంలో పడిపోతావు సుమా!

'మహాత్మా! నువ్వేనా యిలా అంటున్నావు? నువ్వు ప్రజల మనిషివి కావా?'

ప్రజల మనిషినే! అయితే ప్రజల తప్పుల్ని పానకంలా తాగి భేష్ అనమంటావా? భలేవాడివే! తాగడం తప్పని ప్రజలకంటే ప్రభుత్వానికే బాగా తెలుసు! తాగుడు మానండి మొర్రోమంటూ నెత్తిన చేతులు బెట్టుకుని కుయ్యోడ్డాయి ప్రభుత్వాలు. మద్య పానాన్ని నిషేధించినప్పుడు చట్టబద్ధంగా నడుచుకున్నారా ప్రజలు? దొంగచాటుగా బట్టీలు పెట్టారు. ప్రజల దాగుడుమూత లెలాం టివో విను! ప్రభుత్వం లిక్కర్‌ను కంట్రోలుచేస్తే ప్రజలు టించర్లు వాడతారు టించర్లను కంట్రోలు చేస్తే కృతకమైన స్పిరిట్ల మీదికీ, కాఫీకి పాలు అవసరం గనుక నీళ్ళ పాలైనా కొనకతప్పనట్లు ఆ స్పిరిట్‌లకోసం ఫ్రెంచి పాలిష్, వార్నిష్ మొదలైన వాటిమీదికీ ఎగబడతారు స్పిరిట్లను అదుపు చేశారుపో, యుడికొలోన్ నీళ్ళ వాడకం ప్రారంభమవుతుంది. కొలోన్ నీళ్ళను కంట్రోల్‌లో పెడితే ఎసెన్సులూ, సుగంధ ఆల్కాహోలూ వాడతారు. ఏడ్చాద్ది పొడుగునా అసలైన సారాయి అతిగా తాగి వెయ్యమంది చస్తే. ఈ మిశ్రణ ద్రావకాలవల్ల ఒక్కనెలలోనే రెండువేలమంది చస్తారు కన్న తల్లిదండ్రులు కడుపున పుట్టిన బిడ్డల్ని చంపుకుంటారా? ఇలాంటి అకాల మరణాలను అరికట్టడం ప్రభుత్వంయొక్క ప్రధాన ధర్మంకాదా? నీ ఆరోగ్యంకోసం ఇక బాహాటంగా తాగు! నీ ప్రభుత్వం పేరు జెప్పుకుని మరీతాగు!

కుశలయ్య వెనక్కు రెండడుగులు నడిచి, మేడగది కిటికీ లోని లైలాను పిలిచే మజ్నూలా నిలబడ్డాడు. 'మహాత్మా! తాగ

మంటున్నావా? రోడ్డుమీద తప్పటడుగులు వేస్తున్న నన్నుచూడు, డేగలా నన్ను తన్నుకుపోలేక వెంద్రుకంత తేడాతో దూసుకుపోయిన ఆ లారీని—అందులోని డ్రైవర్నిచూడు! ఇద్దరిలోనూ ఒకేమత్తు. మనుష్ని లారీల కిందికి పడదోసే సారాయినా తాగమంటావు? పండ్లు, కాయలు, ఆకులతో నింపుకోవలసిన పొట్టకు — పాలు, మజ్జిగ, మంచినీళ్లతో తడుపుకోవలసిన పేగులకు సారా పోయమంటావా? నా ఆరోగ్యం కోసం తాగమంటావా? తాగితే ఆరోగ్యం అధోగతి పాలౌతుందని — లా చదువుకున్న నువ్వేకాదు, మెడిసిన్ చదువుకున్న డాక్టర్లు కూడా చెప్పారుకదా? ఈ మహమ్మారి మనుషుల నెత్తురుతాగి, ఎముకల్ని నమిలి వుమిసేసి, అంతటితోనైనా తృప్తిపడి వెళ్ళిపోతుందా? బుద్ధినీ, నీతినీ, మానవతను శుభ్రంగా నాకేసి, సమాజాన్ని, దేశాన్ని, ప్రపంచాన్నీ ఎడారిగా చెయ్యనిదే నిద్రపోదు. మతిచాంచల్యం, అనారోగ్యం, విడిపోవడాలు, నేరాలు, సాంసారిక దుఃఖాలు, ఆర్థిక బాధలు, మతిమరుపు, రోడ్డు ప్రమాదాలు, యంత్రాలకూ, పరిశ్రమలకూ, వస్తూత్పత్తికీ వాటిల్లే తీవ్రనష్టాలు — ఇవంతా సారాయియొక్క ప్రభావమేకదా? తాగటానికి కూర్చున్న బ్రహ్మరాక్షసికిమల్లే — ఈ త్రాగుడు మానవ జీవితాల్ని పెద్ద పెద్ద మోతాదుల్లో దిగమింగలేదా? తాగుబోతు పెళ్ళాం నూతిలో దూకదూ? తాడు ముడేసుకుని దూలానికి వేలాడదూ? తాగుబోతు బిడ్డలు బడుద్ధాయిలై, బిచ్చగాళ్ళై, దొంగలై, భ్రష్టులైపోరూ? తాచుపాము కాలిమీద కాటువేస్తే, నోట్లో ఎందుకు నురగలొస్తాయి? చచ్చిపోయినవాడు నోటితోకదా ఎండ్రిన్ తాగాడు! వాడి ఒళ్ళంతా ఎందుకు నల్లబడిపోయింది? విషం! మత్తుమందుకు మరో పేరు విషం! నాలుకపైనుంచీ గొంతులోకి జారి అక్కడే ఆగిపోవటానికి — అది వాసుకి కక్కిన హాలాహలంకాదు. వ్యామోహం కక్కిన విషం! నీ పేగుల్నీ, నీ గుండెను, నీ మూత్రపిండాల్ని — కాల్చేస్తుంది, మాడ్చేస్తుంది, మసిలా రాల్చేస్తుంది. ప్రపంచాన్నే జయించగలిగిన మహావీరులను కూడా పాదాలతో రాచిపారేసింది ఈ త్రాగుడు. అలెగ్జాండరు మరణానికి కారణం అతిత్రాగుడు. బర్గండీ వైన్ మోతాదుకు మించి తాగి, నెపోలియన్ వాటర్లూ వద్ద — పోయాడు. మామూలు మనుషుల్నే కాదు, మహా సామ్రాజ్యాలను కూడా తుడిచిపెట్టేసింది ఈ క్షుద్రశక్తి! మొదటిప్రపంచ యుద్ధంలో ప్రపంచాన్ని బెంబేలెత్తించిన జర్మనీ—పక్షవాతం వచ్చిన మనిషిలా—అనుకోకుండా పతనమైపోవటానికి కారణం ఏది? కేవలం ఫ్రెంచి వైన్! దానిపట్ల జర్మన్ సైనికుల మోహం! మహాత్మా! తాతకు దగ్గులు నేర్పినట్లు—నీయంతటి వాడికి నేనివన్నీ చెప్పాలా? అన్నీ తెలిసినవాడివి—యువ తరంలో పుట్టి పెరుగుతున్నవాడిలా — తాగమంటావా? తాగితే తప్పు లేదంటావా?'

కుశలూ! నువ్వు పట్టి భౌతికవాదిలా వున్నావు నాయనా...

'అదేమో నాకు తెలియదు. నేను నైతికవాదిని! మానవతా వాదిని!'

అది కూడా భౌతికమేనర్రా! నీతి నియమాలనేవి మనిషికి సంకెళ్ళ లాంటివి. నీకొక కిటుకు చెబుతున్నాను. నిజానికి ఈ సంకెళ్ళు భౌతికవాదంలోనూ వున్నాయి, ఆధ్యాత్మిక వాదంలోనూ వున్నాయి. ఆధ్యాత్మికవాదం వేసిన సంకెళ్ళను భౌతిక దృష్టితోను, భౌతికవాదం వేసిన సంకెళ్ళను ఆధ్యాత్మిక దృష్టితోను సడలించుకు తిరుగువాడు ధన్యుడు తండ్రీ! దీన్ని నువ్వు మెట్టవేదాంతమన్నా నాకు పోయిందేమీలేదు. ఇక విను! జాతస్య మరణం ధ్రువం! చావుకు కారణం ఒక్క త్రాగుడేనా? నేనెలా చచ్చాను? అబ్రహాం లింకన్ ఎలా చచ్చాడు? సోక్రటీస్ ఎలా చచ్చాడు? ఏసుక్రీస్తు ఎలా అవతారం చాలించాడు? మేమందరం తాగి చచ్చామంటావా? చావుకు కారణం ఒక్కటే! పుట్టుక! తనువు శాశ్వతం కానప్పుడు—నాఒళ్ళు నా యిల్లు, నా వాళ్ళు అంటూ మడిగట్టుకు కూర్చోవడం మూర్ఖత్వంకాదూ? వెధవ త్రాగుడును గురించి ఎందుకీ కంఠశోష? సాంఘిక సమస్యలెన్నో వుండగా, గోరంత మద్యపానాన్ని కొండంతగా ఊహించి భయపడిపోతావెందుకూ? త్రాగుడు కేవలం వ్యక్తిగతమైన విషయం. ఎవడికి యిష్టమైనది వాడు తాగుతాడు నీ కిష్టమైతే మేకపాలు తాగు, ఇష్టం లేకపోతే సారా తాగు. నన్ను వద్దనటానికి నువ్వెవరు, నిన్ను వద్దనటానికి నేనెవరు? చట్టాన్ని గౌరవించడమే పౌరధర్మం నాయనా! చట్టం మద్యనిషేధాన్ని రద్దుచేసిన పిదప, తాగితే నేరం కాదు.

'ఆహా! ప్రజల వ్యక్తిగత విషయాల్లో జోక్యంపెట్టుకోవడం తగని పనిగా భావించిందంటావా ప్రభుత్వం? అందుకే మద్యనిషేధాన్ని ఉపసంహరించుకొన్నదంటావా? మద్యపానం నేరం కాదంటావా? తప్పదియ్యా, నువ్వు తప్పు మాటన్నా అది ఒప్పై కూర్చుంటోంది గదా? సరే, నీ మాటకే వస్తున్నాను; త్రాగుడు మనవుడి స్వంత విషయం!... ఒకడున్నాడు. చచ్చేదాక చెయ్యి విడువనంటూ దారిద్ర్యం వాణ్ణి వరించింది. పెళ్ళాం పిల్లలతో పరువుగా బ్రతకలేడు. పదిమందిలో తలెత్తుకుని తిరగలేడు. అది వాడి వ్యక్తిగత సమస్య. వాడి బాధలు వాడివే! ఒకడి బాధల్ని పంచుకోవలసినంత గ్రహపాటు సమాజానికి లేదుకదా! వాడి సమస్యలకన్నిటికీ ఒకటే పరిష్కారమార్గం! చావు! వాడు చస్తే సమాజానికి నష్టంలేదు. మరైతే—వాడు మింగిన విషాన్ని కక్కించి, వాడిమీద కేసు నమోదు చేసుకుంటావెందుకూ? ఆత్మహత్యా ప్రయత్నం నేరమంటావా? ..ఒక స్త్రీ! నమ్ముకున్న మగవాడు నట్టేట ముంచిపోయాడేమో! కష్టపడి బతుకుదామంటే కూలీ గిట్టలేదేమో! ఆమెకు కూడు కావాలి. గుడ్డకావాలి. అది ఆమె వ్యక్తిగత సమస్య. ఆ సమస్య తనదిగా గుర్తించదు సమాజం. ఆమె వ్యభిచరిస్తుంది. ఒకడికి తాగుడు యిష్టం, మరొకడికి వ్యభిచారం యిష్టం. అలాంటి వాడితో ఆమె వ్యభిచరిస్తుంది. మన సొమ్మేం పోయింది? పొదరింట్లోని పక్షి మైధునాన్ని భంగపరిచే వేటగాడిలా ఆమెను పట్టుకుని కమ్మల సందుల్లోకి తోస్తావెందుకు? వ్యభిచారం నేరమంటావా?...కన్నెపిల్ల! కక్కుర్తిపడి తప్పులో పాలు

పంచుకుంది. బ్రతుకు బండలు కాదనుకొంది మోసపోయింది. కన్నీళ్ళకు కరువు లేదన్నట్లు కడుపు చెరువైంది. వెక్కిరించటానికి సాకు ఎప్పుడు దొరుకుతుందా అని వేచి చూచే ఈ లోకంలో ఏముఖం పెట్టుకు తిరగాలి? పరువే ప్రాణమనుకొని బ్రతుకుతున్న కన్నవాళ్ళు ఏ గంగలో దూకాలి? కన్నెరికం దోచుకున్నవాడు కడుపులో నాటిపోయిన కానుకను ఏ మూకుడుతో మూసిపెట్టాలి? ఆమె తన కడుపు చించుకుంటే మనకేం బాధ? అది ఆమె వ్యక్తిగత సమస్య గాదా? కుప్పతొట్టిలో నాలుగు నెలల గుడ్డు కనిపించిందని ఆమెను వెతికి పట్టుకుని బోనులో నిలబెడతావెందుకూ? భ్రూణహత్య నేరమంటావా? ఆత్మహత్యా ప్రయత్నం నేరం! వ్యభిచారం నేరం! భ్రూణహత్య నేరం! ఈమూడు నేరాలకు కారణాలు కనుక్కున్నావా? ఆ కారణాల్లో మద్యపానం కూడా ఒకటని తెలుసా? ఆ మూడు నేరాలకంటే పెద్దనేరం మద్యపానం! అయితే మద్యపానం నేరంకాదు! భళా భళి! మద్యపానం చేసుకున్న పుణ్యమేమి? తక్కిన నేరాలు చేసుకున్న పాపమేమి? ఒక్క మద్యపానంపట్లమాత్రం ఎందుకీ ఆశ్రిత పక్షపాతం? మద్యపానాన్ని సమ్మతించిన చట్టం ఆత్మహత్యను, వ్యభిచారాన్ని, భ్రూణహత్యను, శిశుహత్యను ఎందుకు సమ్మతించకూడదు? ఎందుకని నేనడుగుతున్నాను.'

ఓహో! ఇది మరీబాగుంది! ఇంట్లో ఎలకలున్నాయని, ఇల్లు తగలబెట్టుకుంటారా ఎవరైనా?

'ఆ మాటే నేనంటున్నాను. ఎలుకన్నమాత్రం ఏరి పారెయ్యాలి. ఎలుకలబోను పెట్టాలి. పిల్లిని పెంచాలి. పిల్లీ ఎలకా లాలూచీ పడితే, పిల్లిని దండించాలి ఇల్లు తగలబెట్టుకుంటారా ఎవరైనా?'

మైకుముందర నుంచున్న హరిదాసు కంఠంలా—కుశలయ్య గొంతు గింగురుమంటోంది నాలుగురోడ్లూ హరిభక్తులకుమల్లే ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటున్నాయి. బ్రాందీషాపు ముందర కదిలిపోతున్నవాళ్ళు, హోటల్లోను, టీకొట్టులోను కూర్చున్నవాళ్ళు, కూడలి దగ్గర రోడ్లప్రక్కన నుంచున్నవాళ్ళు—గారడీ వాడి చుట్టూ మూగి చప్పట్లుకొట్టే కుర్రవాళ్ళలా—భేష్ అంటూ, సెభాష్ అంటూ, వహ్వా అంటూ కుశలయ్యకు హుషారిస్తూ, వినోదం తిలకిస్తున్నారు.

'ఉలకనంటావేం మహాత్మా? నామీద కోపం వచ్చిందా?... నా ప్రబోధాలమీద జాతికే గౌరవం లేదు. ఈ కుశలయ్యకుమాత్రం ఎందుకుంటుంది? బుద్ధిగా కూర్చుని ఊ కొట్టకుండా, మాటకు మాట విసురుతూ, పదవి దొరకని పార్లమెంటు మెంబరులా వాదులాటకు దిగాడు; తాగుబోతు వెధవ! వీడితో ఎందుకొచ్చినగోల? నిద్రచేటు!...అనుకుంటూ పక్కసర్దుకుంటున్నావా? నీతో వాదు పెట్టుకోను! చెప్పు! ఒక్కమాట చెప్పు!...ఎందుకు తాగేవురా, నీ పాడె కట్ట...అను. నా ముఖాన తుపుక్కున ఊసేయ్. ముఖం తుడుచుకుంటూ వెళ్ళిపోతాను.'

కుశలయ్యకు కళ్ళు బైర్లు కమ్మాయి. చుట్టూవున్న ప్రతి వస్తువు అతని కంటికి చావు పుట్టుకల్లా, మంచిచెడ్డల్లా, పాప పుణ్యాల్లా జంటగా కనిపించసాగింది. గాంధీ ప్రతిమ కూడా రెండైంది. ఇద్దరు గాంధీలు!

కళ్ళు నులుముకున్నాడు కుశలయ్య. 'ఇదేమిటీ మాయ! రూపాయి బిళ్ళ బద్దలుగా చీలి బొమ్మా బొరుసూ పక్కన పక్కన నుంచున్నట్లు—రెండు రూపాలుగా నిలబడ్డావా బాపూ! మీలో ఎవరు గాంధీ? ఎవరు గాంధీ కాదు?'

ఆయనే మహాత్మా గాంధీ!

'మరి నువ్వో?'

నేను మహాత్మా బ్రాందీని!

'నువ్వు కూడా అచ్చంగా ఆయనలాగానే వున్నావే!'

ఆయన పేరు ఉచ్చరించే నాలుకలన్నీ పుణ్యతీర్థాలు కదా! కోటి తీర్థాలలో నేను స్నానం చేశానయ్యా! ఆ పుణ్యఫలితమే యిది!

'ఓ మహాత్మా! ఓ మహర్షీ!'

ఎందుకలా గజేంద్రుడిలా ఫీంకరిస్తావు? ఆయన మాట్లాడడు కుశలూ!

'ఎందుకు మాట్లాడడు? ఆయన నా దేవుడు!'

ఒకే దేవుణ్ణి ఎల్లకాలం పూజించాలని ఎక్కడుంది? ఈ దేశం ఎందరు దేవుళ్ళను పూజించలేదు?! హిందూమతంనుండి గాంధీమతందాకా ఎన్ని మతాలు పుచ్చుకోలేదు! ఇప్పుడు ఉచ్ఛస్థితిలో వున్నది, నా మతం! నేనే దేవుణ్ణి! గాంధీ స్థానాన్ని నేనే ఆక్రమించాను. ఆసేతు హిమాచల పర్యంతం ఇప్పుడు బ్రాందీ దండకాలే! బ్రాందీ స్తోత్రాలే! బ్రాందీ భజనలే! గాంధీ నీతో మాట్లాడడు బాబూ!

'లేదు! ఇందాకా నాతో మాట్లాడాడు గాంధీ!'

పిచ్చివాడా! నా మహిమలు నీకేం తెలుసు? గాంధీ చాటు నుంచీ మాట్లాడింది నేనేనయ్యా!

కుశలయ్య చెవులు మూసుకున్నాడు. చెరబట్టుకపోతున్న సైంధవుణ్ణి పరిపరి విధాల తిట్టిపోసే పాండవ పత్నికి మల్లే కేకలు వేశాడు. 'ఛీ! నీచుడా! నువ్వా? కళ్ళకు గంతకట్టి కోరిక వెళ్ళించుకునే కామరూపుడికిమల్లే—నా ఎదుట వేషం మార్చి నిలబడ్డావా? మాయావీ! నీ ముఖం చూస్తేనే పంచమహాపాతకాలు చుట్టుకుంటాయి. పో ఇక్కణ్ణుంచి! నీ పాపపు మాటలు నేను వినలేను. దుర్మార్గుడా! పోతావా, పోవా?'

వికటాట్టహాసాలు! కార్ఖానాలోని యంత్రాల చప్పుళ్ళ లాంటి నవ్వులు! ఊపిరాడనివ్వని ఉప్పెనలాంటినవ్వులు! రణగస్థలం మీద వినిపించే ఆత్మఘోష లాంటి నవ్వులు! అద్దాల మేడలోని ప్రతిబింబాలలాగా — లెక్కపెట్టలేనన్ని రూపాలు! పరికాలంలో

మంచుకురిసినట్లు, కుప్పపోసిన బూరుగుపత్తి గాలికెగిరినట్లు — చిత్రవిచిత్రంగా నాట్యాలు చేస్తున్నాయి.

'ఎవరు ? మీరందరూ ఎవరు ? ఎందుకలా నవ్వుతారు ?'

నేను విస్కీ ! నేను వైన్ ! నేను రం ! నేను బీర్ ! నేను జిన్ ! నేను సారాయి ! నేను కల్లు ! నేను స్పిరిట్ ! నేను ఆల్కహాల్ ! నేను టించర్ ! నేను నల్లుల మందు ! నేను ఎలుకల మందు ! నేను ఎండ్రిన్ ! నేనే ! అంతా నేనే ! అంతటా నేనే ! నా ముక్కోటి అంశలూ ముక్కోటి దేవుళ్ళు ! నన్ను ఎవరు ఏ పేరుతో స్మరించినా, ఏ రూపంతో పూజించినా నాకు యిష్టమే !

నవ్వులు ! బుడ్డీలన్నీ రాతినేల మీదపడి పగిలినట్లు !

కుశలయ్య కళ్ళు గట్టిగామూసుకున్నాడు. 'బ్రాందీమహాత్మా! బుద్ధి గడ్డితిని నీ తోక తొక్కా నీరోజు తప్పు రప్పు ! లెంపలేసు కుంటాను. నన్ను కాటేయకు. నన్నొదిలిపో ! ఫో !'

అతను మళ్ళీ కళ్ళు తెరచి చూశాడు. పుంకొట్టి పారేసి పోయిన మృత గోవులా—గాంధీ ఒక్కడే — మాట్లాడకుండా నిలబడి వున్నాడు. సుడిగాలిలో రెపరెపలాడే చిత్తుకాగితంలా — కుశలయ్య గాంధీ ప్రతిమ చుట్టూ ప్రదక్షిణాలు చేయసాగాడు

'అయిపోయింది బాపూ ! అంతా అయిపోయింది. చివరికి మిగిలిందేమిటి మాకు ? నీ పేరుతో యిక్కడొక ప్రతిమ ! నీ పేరుతో మాకొక పండుగ ! మా పండుగలన్నీ ఎలాంటివో తెలుసు కదా నీకు ? దేవుళ్ళకు మొక్కులాం — దున్నప్నె నరుకుతాం. దైవత్వానికి నైవేద్యం పెడతాం, దానవత్వానికి మద్యంపోస్తాం ! దానవుణ్ణి ఆంబోతులా ఊళ్ళమీద వదిలేసి, మానవుడికి గోరీ కట్టేసి, దేవుడికి గుడి కడతాం ! గొడ్ల చావడిలోని దున్నలా, గంప క్రింది కోడిలా, కుక్కిమంచంలోని ముసలాడిలా, కుక్కిన పేనులా—దేవుడు గుడిలోనే వుంటాడు ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు—పెద్ద పెళ్లాం దగ్గరకు వెళ్ళే ముసలి రాజులా — దేవుడి దగ్గరకు మేం వెడతాం గానీ, మా దగ్గరికి దేవుణ్ణి రానివ్వం. మేము పెంచుకుంటున్న అల్సేషియన్ కుక్కలాగా — మేము చెప్పినట్టు వింటాడు దేవుడు. ఇవీ మా సంప్రదాయాల అర్థాలు, మా పండుగల పరమార్థాలు. వినాయకుణ్ణి భజించి ఉండ్రాళ్లు భుజించినట్లు — నీ పేరున పండుగ జేసుకొన్నాం, ఈరోజు ! దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపాం గీత పఠించాం నీకు ప్రియమైన రామ్‌ధున్‌లు గానం చేశాం. భజనలూ, ఊరేగింపులూ జరిపాం. నూలు వడికాం హరిజనవాడల్లో వీధులు శుభ్రపరిచాం. నీ స్మృతి చిహ్నంగా ప్రధాన వీధులకు నీ పేరు పెట్టాం. నీ బోధనలను ప్రచారం గావించాం. నీకు జోహార్లు సమర్పిస్తూ ఏకధాటిగా ప్రసంగించాం పిల్లలకు మిఠాయిలు, కుష్ఠురోగులకు ఖద్దరు వస్త్రాలు పంచిపెట్టాం. బీదలకు అన్నదానం జరిపాం. మేము చుక్కేసుకుని, చికెన్ బిరియానీ తిన్నాం. జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ గైకొన్నాం. పక్షి జాతులన్నీ కలిసి బృందగానం చేసినట్లు 'జనగణమన' పాడాం. రేపటి మధ్యాహ్నం దాకా గుర్రుపెట్టి నిద్రపోతాం.

'అంతే ! నీ పండుగై పోయింది ఏడాదిపొడుగునా మరెన్నో పండుగలున్నాయి మాకు. నీ ముఖంచూచే తీరిక మాకులేదు. నీ మాటలు వినే ఓపిక కూడా లేదు అసలు అవి మాకు రుచిస్తే కదా ? పాత చింతకాయ పచ్చడి! నూలుపోగు తగిలించుకుని, నేను బ్రాహ్మణ్ణంటూ పరువుగా అడుక్కునే శూద్రుడికి మల్లే—నీ పేరు చెప్పుకుని అవసరాలు గడుపుకుంటాం. పరీక్షకోసం పాఠాలు బట్టీ పెట్టే విద్యార్థిలాగ — నీ ఆశయాలను, ఆదర్శాలను నోటికి నేర్చుకుంటాం. వాటి ఆసరాతో — నాయకులు కావటానికీ, మహానాయకులు కావటానికీ అవకాశాలు వెతుక్కుంటాం. వేదికలెక్కి వాటిని సొంతం అప్పజెప్పేసి చప్పట్లు కొట్టించుకుంటాం, హరికథ చెప్పి అందె తొడిగించుకున్నట్లు ! అయితే పొరబాటున కూడా వాటిని ఆచరణలో పెట్టం. అలాంటి అడియాసలు యిక పెట్టుకోవద్దు.

పరస్పర సహకారంద్వారా గ్రామాలలో ఐకమత్యం పెంచుకోమన్నావు నువ్వు. పంచాయతీ ఎలెక్షన్ల మీద మోహంతో సుందోపసుందులమై, గ్రామాన్ని చీలదీసుకుని, తలలు పగలగొట్టుకుంటున్నాం మేము.

మాలలు మాత్రం మనుజులు కారా ? — అన్నావు నువ్వు. వాళ్ళను హరిజనులని పిలవమన్నావు. వాళ్ళను ఉద్ధరించమన్నావు దేవతలను దివిజులనీ, సురులనీ, అమరులనీ అన్నట్లు — మాలమాదిగలకు మరొక పేరు హరిజనులని అనుకొన్నాము పేరు మారింది, భావం మారలేదు. మేము వాళ్ళుగాపుట్టి, ఆ అధమత్వమెలాంటిదో అనుభవిస్తేగానీ పాపం ప్రక్షాళనం కానంతటి అత్యాచారాలను వాళ్ళమీద జరుపుతున్నాము.

'హిందూ ముస్లిం భాయీ భాయ్, అన్నావు నువ్వు. మతాతీత జీవనాన్ని నెరపుతూ, అన్నదమ్ముల్లా వుండమన్నావు. ఆ మతాలను సరిగ్గా అర్థం చేసుకోటానికైనా ప్రయత్నించటం లేదు మేము మనిషి తర్వాత పుట్టిన మతాలవి అజ్ఞానం, ఆలోచన — ఈ రెంటి మైథునంవల్ల జన్మించిన మహారివి ! ఈ మతంపట్ల మాకున్న పిచ్చి వ్యామోహంతో, మూఢ విశ్వాసంతో మనుషులం వేరుపడిపోతున్నాం. మత పిశాచాల ప్రీత్యర్థం మారణహోమం సల్పుతున్నాం.

'తెల్లవాణ్ణికాస్తా బల్లకట్టు మీదికెక్కించి, స్వయంవరానికి ముస్తాబు కావటం ఒక్కటేకాదు పరమావధి, స్వాతంత్ర్యానికి పరమార్థం ప్రజాస్వామ్యం కాదు, ప్రజాసామ్యం — అన్నావు మా ముప్పైఏళ్ళ ప్రజాస్వామ్యం కలిమిలేముల మధ్య అఖాతాన్ని తొలుచేసింది. సామ్యవాదం మనుగడకు మేమిచ్చిన అవకాశాన్ని చూచి సిగ్గుపడటానికి మాలో చీమూ నెత్తురూ లేవు. కొత్తరాజును ఎన్నుకోమని మత్తేభానికి పూలదండ యిచ్చినట్లు — మనిషిని ఆర్థికంగా మెరుగుపరిచే అధికారాన్ని అదృష్ట దేవతలకు, మాంత్రిక—

తాంత్రిక శక్తులకు అప్పగించాం. ఇక చెప్పనేల? ప్రజాస్వామ్యం పరుగు పందెంలా తయారైంది. అక్రమం, అన్యాయం, అధర్మం, అవినీతి—మాకు ఆరాధ్యదైవాలైనాయి. అందుకోవటానికి అర్రులు చాస్తున్నాము. అందకపోతే చతికి బడుతున్నాము. అందుకుంటున్న వాళ్ళను చూచి, అందలాలు దిగని వాళ్ళను చూచి ఓర్చుకోలేక పోతున్నాం. అందుకోజూస్తున్న వాళ్ళను అణగదొక్కేస్తున్నాం. సంఘర్షణ! దోపిడీలు, దొంగతనాలు, దొమ్మీలు, హత్యలు, అరాచకాలు! నువ్వు ప్రవచించిన పరమ సాత్త్విక సామ్యవాదం అనాకారమై మా చేతుల్లో గండ్రగొడ్డలిగా మారింది! పాలు తాగటం మానేసి యిప్పుడది పచ్చి నెత్తురు తాగుతోంది చూడు!

మద్య నిషేధమే సామాజిక రుగ్మతలకు పరమౌషధం అన్నావు వెలయాలి మాటవిని సహధర్మచారిణిని వీధిలోకి గెంటేసినట్లు — వ్యామోహానికి బానిసలమై మద్యనిషేధాన్ని వెలివేసేశాం.

'అయ్యో, మహాత్మా! చివరికి దేవుడి స్థాయికి దింపేశాం నిన్ను! దేవుడంటే మాకు భయంలేదు. మృత్యువంటేనే భయం! నువ్వంటే మాకు గౌరవం లేదు. నువ్వు వెలివేసిన క్షుద్ర శక్తులంటేనే గౌరవం! పుట్టి చచ్చిన విచిత్ర శిశువును గాజు కుప్పెలో భద్రపరిచే ప్రదర్శనశాల యిది. నీ బిరుదు 'జాతిపిత'! అది గాజు కుప్పె! నువ్వొక ఎగ్జిబిట్! తాజ్‌మహల్‌లాగా మా జాతికి నువ్వొక ఆర్నమెంట్! హంగుకోసం అట్టిపెట్టిన శిథిల శిల్పంలా — నిన్ను శిలగాచేసి నాలుగు వీధులమధ్య నుంచోబెట్టాం. విగ్రహారాధకులమైన మాకు నీ విగ్రహం మాత్రమే కావలసొచ్చింది మహాత్మా! నీ ఆత్మ సౌందర్యమే మమ్మల్ని అలరించలేక పోయినప్పుడు — ఈ బాహ్యసౌందర్యం మాత్రం ఎందుకిక్కడ? కేవలం దర్శనానందానికే అయితే, యింతకంటే ఏ సినిమాతార బొమ్మనో యిక్కడ పెట్టుకోవచ్చుగదా? సినిమాతార శరీరంలోనైతే చూడదగినవన్నీవున్నాయి. అందం, ఆకర్షణ! రంగు, పొంగు! వంపు, సొంపు! లావు, లావణ్యం! నీలో ఏమున్నాయి మహాత్మా? బోడితల, బోసినవ్వు, ముడతలు పడిన చర్మం, కండలేని ఎముకలు, వంగిపోయిన నడుం, ముసలితనం, ఊతకర్ర... వెక్కిరించటానికి కాకపోతే, ఎందుకయ్యా నీ ప్రతిమ?...'

ఏడుపు వినిపించింది. ఊబిలోనుండి కదల్లేక, ఒలుచుకు తింటున్న రాబందుల్ని విదిలించుకోలేక 'ఈ... య్యా' అంటూ మూలిగే దున్న లాగా—ఆ ఏడుస్తున్న దెవరు?

కుశలయ్య వెనుదిరిగి చూశాడు.

బ్రాందీ దుకాణం ముందర ఒక అనాథ నిలబడి అడుక్కుంటోంది. ఆమె చంకలో పసివాడు. ఆ ఏడుపువాడిదే! చేసేపనులేమీ లేక చ్యూయింగ్ గమ్ నములుతూ కూర్చున్న ఆఫీసరులా—ఎండిపోయిన రొమ్ము నోటబెట్టుకుని నములుతున్నాడు. దవడలు నొప్పి పెట్టాయేమో—నమలడం మాని ఏడుస్తున్నాడు. కూటి మెతుకుకోసం

కుడితిలో చెయ్యివేసి కెలికే దర్రిద్రుడిలా—ఏడుపు మాని, మళ్లీ చన్ను నోటబెట్టుకున్నాడు. పాలు లేకపోతేమానె, జీవమైనా వుందా అందులో? బీటలు వారిపోయిన కరువు నేలలాంటి చన్ను!

అడుక్కుంటోంది! ఆడది అడుక్కుంటోంది! నా తల్లి లాంటి ఆడది! నా చెల్లిలాంటి ఆడది! మొగుడు చచ్చాడేమో—వదిలేసి పోయాడేమో—సాయపడమని లోకాన్ని చెయ్యి జాచిందేమో—సమయం చూచి లోకం ఆమె ఒంటిమీద చెయ్యి వేసిందేమో—బంగారు విలువ తెలియని వాడివద్దనుండి బంగారం కొనుక్కున్నట్టు, ఆమెనుండి కొనుక్కున్న ఆనందానికి పావలా డబ్బులిచ్చి బ్రతికి పొమ్మన్నదేమో—మగవాళ్ళ కక్కుర్తిని వ్యాపారంగా మలుచుకోవడం ఆమెకు చేతగాక పోయిందేమో—చెత్తకుండీలో పడిన ఎండుటాకులా, నమిలి పారేసిన చెరకుపిప్పిలా విసురుకొచ్చి పడింది! అన్నీ పోగొట్టుకుని, పోని మొండిప్రాణం వేపుకు తింటున్న పొట్టకోసం—పేవ్‌మెంట్లమీదికీ, పాలబల్బుల క్రిందికీ వచ్చింది. చంటివాడి పాలకోసం — బ్రాందీ దుకాణం దగ్గర నిలబడి అడుక్కుంటోంది.

అయ్యలారా! అన్నలారా' ఆమెకేదైనా యివ్వండి! ఆమె మీకు చేతులెత్తి మొక్కుతుంది ఆ జన్మాంతం మీకు ఋణపడి వుంటుంది. మీ ఋణం తీర్చుకోవటానికి ఆమెవద్ద ఏమీ లేదిప్పుడు. ఉన్నదంతా ఊడ్చుకుపోయింది ప్రతిఫలాపేక్ష లేకుండా—మీకు తోచింది ఆమెకు దానం చెయ్యండి!

ఆమెను చూచి అసహ్యపడి దూరంగా తప్పుకుపోతున్నారందరూ! ఆమె వైపు ప్రక్క చూపులైనా చూడటం లేదెవ్వరూ! గుడ్లప్పగించి చూడటానికి, ఎంత సొమ్మయినా కుమ్మరించటానికి ఆమె ఎగ్జిబిషన్‌లోని నగ్నచిత్రం కాదుగదా? గుండెలు కరగటానికి, చేతి రుమాళ్ళతో కళ్ళొత్తుకోటానికీ—యిది సినిమా కాదుగదా! అయ్యో అనటానికి—ఈవిడేమన్నా వేషం వేసుకొచ్చిన సినిమా తారనా! కేవలం ఈమెకోసమే సినిమాతార స్వయంగా వచ్చి నిధి ప్రోగుజేస్తే, లక్షలు కురిపించరూ మీరు? కలిగిన ప్రభువులారా! లక్షలెందుకూ ఆమెకు? గుండె ఆగి చావటానికా? వద్దు! అంతటి మహాదాతృత్వం వద్దు! ఆ సినిమా తార రాలేదు స్వయంగా ఈ అనాథ మిమ్మల్ని అడుక్కుంటోంది. తలా ఒక పదిపైసలిచ్చి, ఆ కుర్రాడి కాలే కడుపును చల్లార్చండి. వాడు భారతమాత పుత్రుడు!

కుశలయ్య బ్రాందీ దుకాణంవైపు నడిచాడు.

చేయి చాచాడు.

'అయ్యా! బాబూ! ధర్మప్రభువులారా!'

పర్సులోనుంచి నోటు లాగుతున్న వాడొకడు 'పో పో!' అన్నాడు.

'మాంధాతలారా! నాక్కాదు! నాకేం? దుంగలాగా వున్నాను. అటు చూడు! ఆమె ఎవరో బాగా చూడు! పైకి చూస్తూ కింద నుంచున్న మనిషి. ఆమె అలా పైకి చూస్తుంటే, పైనున్న మనం కూడా పైకి చూడకూడదు. కిందికి చూడాలి. అదే మానవత్వం! అడుక్కుంటోందామె! అడుక్కోటానికికూడా జంకుతూ, గడపదాటిరాని కుక్కలా నుంచుంది. సమానత్వంకోసం పోట్లాడటం లేదామె. సామ్యవాదాన్ని గురించి గొంతు చించుకోవటంలేదు నువ్వు తిండిపోతువైనా, తిరుగుబోతువైనా ఆమె వద్దనదు. నువ్వు కారెక్కినా, విమానమెక్కినా ఆమె కాదనదు. ఆమె నోరు చచ్చిందని, నువ్విలా తాగడం మాత్రం ధర్మంకాదు. నీ ఆస్తిపాస్తి, ఇల్లూ వాకిలీ, డబ్బూ దస్కం ఆమెకు పంచిపెట్టవద్దు. తాగటం మానేసి, నీ తాగుడుకయ్యే ఖర్చు మాత్రం ఆమె కిచ్చెయ్. అదే కొండంతగా ఆమె తృప్తి పడిపోతుంది భారతీయులు నా అన్నదమ్ములంటూ మురిసిపోతుంది.

'ఇదెక్కడిపీడ! మన డబ్బు దానికిమ్మంటున్నాడేమిటీ, పెద్ద హీరోలాగా!'

'మీ డబ్బులంటారా? ఆమాట అనకండి! ఆమె నోరు చేసుకుంటుంది. ఆమె వాదానికి దిగితే ధర్మదేవత ఆమె పక్కనే నుంచుంటుంది. మీరు కుడుస్తున్నది మీ డబ్బు; మీరు తొడుక్కుంటున్నది మీ డబ్బు; మీరు కప్పు వేసుకున్నది మీ డబ్బు; మీరు తాగుతున్నది మీ డబ్బా? అది మా డబ్బు! మా డబ్బుతో మీరు తాగేసి, మాకు కనీసం కూడైనాలేకుండా చేస్తున్నారు. మీడబ్బేదో మీరు వుంచుకుని, మా డబ్బు మాకిచ్చెయ్యండి — అంటుందామె. ఏం సమాధానం చెబుతారు?'

'ఏయ్! అద్దాలమీదపడకు! దూరంగా పో!' అంటూ అతన్ని రోడ్డుమీదికి నెట్టాడు దుకాణదారు.

'ఇవ్వరన్నమాట! సర్లే, మీ కర్మ! ఇప్పుడామె వూరుకుంటుంది ఆమె చంకలో వున్నాడు చూశావా — కాబోయే మహారాజులంగాడు — వాడూరుకోడు రేపు. వాడూరుకున్నా, వాడి కొడుకులూ, వాడి మనవళ్ళూ వూరుకోరు. ఒకడి వీపుమీద ఒకడెక్కి గొల్లపిల్లలు ఉట్టిదించుకున్నట్టుగా— వాళ్ళు మీ మేడలెక్కివచ్చి, వాళ్ళ డబ్బు వాళ్ళు తీసుకుంటారు. ఇది మీకు హెచ్చరిక!...అంత దూరం ఎందుకు? మీరు మహావైభవంగా బ్రతకండి, వాళ్ళనూ చల్లగా బ్రతకనివ్వండి! నాదీ భారతదేశమే అనవయ్యా! భారతదేశమంతా నాదే — అనకు!

బిచ్చగత్తె వెరగుపడిపోయి చూస్తూ వుంది కుశలయ్య ఆమెను సమీపించాడు. జేబులో చెయ్యివేసి రూపాయినోటు పైకి తీశాడు.

'అమ్మా, భారతమాతా! అలా కృంగిపోకు! రేపు నీ బిడ్డ గొప్పవాడౌతాడు. కంపు కొడుతున్న ఈ చీర విడిచేయమని, కొత్త చీర కొనిపెడతాడు నీకు! ఆశలు చంపుకోకు! ఇదిగో రూపాయి! దీనిమీద గాంధీ మొహరు వుంది చూశావా? ఇది నీదే! ఈగాంధీ నీకే! వెళ్ళు! కడుపునిండా కూడుతిను! నీ బిడ్డకు పొట్టనిండా పాలిచ్చి జోకొట్టు! వాడు రేపు నిద్ర లేస్తాడు. ఇందా రూపాయి!'

వాకిట్లోకీ వీధిలోకీ తప్పటడుగులువేస్తూ నడిచే పసివాడికి మల్లే — ఏరు దాటాలనుకుంటున్న కుక్కపిల్లకు మల్లే — గాంధీ

విగ్రహం దగ్గరికి, నాలుగు రోడ్లమీద తిరుగుతున్నాడు కుశలయ్య. అతని చుట్టూ ఏం జరిగిందో అతనికి తెలియలేదు.

సినిమాలు వదిలారు. రోడ్లన్నీ మగత నిద్రనుండి మేల్కొని సందడి చేయసాగాయి. కుశలయ్య చుటూ నాలుగు రోడ్లమీద కార్లు,జీపులు గూడ్సురైళ్ళకుమల్లే బారులుతీరి నిలబడిపోయాయి. తెరమీద చూచిన నర్తకిని తన మేడ పక్కన సందులో సుందరిలో ఊహించుకుంటూ కారులో కూర్చున్న షావుకారు కళ్ళురిమి, కారు అద్దాలలో నుండి కుశలయ్యమీద నిప్పులు కురిపించాడు. నాయికా నాయకుల శృంగార చేష్టలతో గుండె కుంపటికాగా, చల్లార్చుకోవ టానికి వేగిరపడుతూ జీపులో కూర్చున్న ఆఫీసరుగారి కొత్త పెళ్ళాం 'న్యూసెన్స్' అంటూ అందంగా కళ్ళు చికిలించింది. బలిచక్రవర్తి వంచిన కమండలంలోని నీళ్ళకుమల్లే ట్రాఫిక్ బంద్ అయిపోయింది.

ధార సాఫీగా పడటానికి వామనుడే కావాలి! దర్భ తీసు కున్నాడు వామనుడు. కమండలం మూతిలో పొడిచాడు. అడ్డంగా కూర్చున్న శుక్రాచార్యులవారికి చావు తప్పి కన్ను లొట్టపోయింది: అడ్డు తొలగి ధార జరజరా కారింది.

'ఎందుకు నన్నిలా లాగుతావ్ ? వొదులూ!' అన్నాడు కుశలయ్య.

'నడూ!'

'ఎక్కడికి ?'

కళ్ళు చికిలించి చూశాడు కుశలయ్య.

పోలీసు !

'ఓహో ! అక్కడికా !'

పోలీసు అతన్ని నడిపించుకు పోతున్నాడు.

'నన్నెందుకు పట్టుకుపోతున్నావ్ ? నేనేం తప్పు చేశానని?'

'నీవల్ల ట్రాఫిక్‌కు అవరోధం కలిగిందోయ్ వాజమ్మా! ఎంత గందరగోళం జరిగిపోయిందో తెలుసా ? బళ్ళన్నీ ఒక దాంతో ఒకటి గుద్దుకుని గల్లంతై వుంటే, ఎంత ఘోరంగా వుండేదో ఆలోచించావా ? కొట్లో కూచుందువుగానీ, పద!'

'ఓహో, అదా సంగతి !' అంటూ విస్మయం ప్రకటించాడు కుశలయ్య. 'అన్నా ! నన్నలా నెట్టుకుపోకు ! నేనే వస్తున్నానుగా?'

మూడేళ్ళ కుర్రాడెక్కిన మూడు చక్రాల సైకిలులా పోలీసు వెంట నడుస్తూ, వున్నట్లుండి నవ్వాడతను. 'కానిస్టేబులూ ! అసలు నీకు మతి వుందా ? అహ — వుందా అంటా!'

పోలీసు ఉడుక్కున్నాడు. 'ఏం ? ఎందుకు లేదూ ?'

'నేను తాగాను.'

'తెలుస్తూనే వుంది.'

'నువ్వెప్పుడూ తాగలేదా కానిస్టేబులూ ?'

పోలీసు పలుకలేదు.

'పోనీ, తాగటం తప్పంటావా ?'

'మహరాజుగా తాగు ! నాకేం ?'

'మరైతే నేను తాగాను గదా, నన్నెందుకు పట్టుకున్నావు?'

'తాగినందుక్కాదు. బళ్ళకడ్డంపడి, బొంగరాలు తిరిగి నందుకు !'

'అదీ! అందుకే నీకు మతి లేదన్నాను నేను తాగాలను కున్నప్పుడు పట్టుకోలేదు తాగబోతున్నప్పుడు పట్టుకోలేదు. తాగు తున్నప్పుడు పట్టుకోలేదు. తాగింతర్వాత పట్టుకున్నావు తాగిన వాడికి తప్పొప్పులు తెలుస్తాయా కానిస్టేబులూ? నిజంగా బళ్ళన్నీ బోల్తాపడ్డాయే అనుకో; నన్నిప్పుడు పట్టుకుని ఏం బావుకుంటావు నువ్వు ? తాగబోతున్నప్పుడే ఎందుకు పట్టుకోలేదు ?'

'మహరాజుగా తాగు ! నాకేం ?'

'తన్నదియ్యా! యింత దూరం నడిచి మళ్ళీ మొదటికే వస్తావే!'

కుశలయ్య మౌనం వహించాడు. పోలీసు మౌనంగానే వున్నాడు.

'ఇంకా ఎంత దూరం కానిస్టేబులూ?'

పోలీసు ఉలికిపడ్డాడు. తలెత్తి ముందరికి చూశాడు. వెనక్కు తిరిగి చూశాడు. 'భలేవాడివే! చిక్కుప్రశ్నవేసి, స్టేషను దాటించేశావు !'

ఏమిచేయాలో తోచకుండా, పిక్కలమీద లాటీక్రరతాటిస్తూ, చేతులువెనక్కు కట్టుకున్నాడు 'సరే! ఇక్కడ కూర్చో!' అన్నాడు.

కుశలయ్య కూర్చున్నాడు· 'ఇప్పుడెక్కడున్నాన్నేను?'అంటూ గుడ్లు వెళ్ళబెట్టి చుట్టూ చూశాడు. నల్లటి రోడ్డు. రోడ్డు ప్రక్కన నిలబడ్డ వీధిదీపాలు. మైలురాళ్ళకుమల్లే దూరదూరంగా వున్న భవనాలు. భవనాల చుట్టూ చిమ్మచీకట్లు చచ్చినవాడి గుండెలాగా — చుట్టూ నిశ్శబ్దం! రోడ్డువార చెట్టు. చెట్టుక్రింద తాను. ఆకాశానికి పెరిగిన వామనావతారంలా—తన ఎదుట పోలీసు!

'చూడబోతే నువ్వు మంచివాడిలా వున్నావు. నీపేరేమన్నా?' అన్నాడు పోలీసు.

'కుశలయ్య'

'ఈ వూరు కాదా ?'

'మా వూరు !'

'నా చేతుల్లో పడ్డావుగనుకసరిపోయింది.మరొకళ్ళయివుంటే, ఈ వూరూ గాకుండా, మీ వూరూ గాకుండా, మరో వూరికి పంపించి వుండురు నిన్ను!...ఇక్కడ నీకేమీ భయంలేదు కుశలన్నా! ఒళ్ళు నయమయ్యేదాకా యిక్కడే కూచుని, తరవాత మీ వూరెళ్ళిపో! ఏం?'

కుశలయ్య అతనివైపు సాదరంగా చూశాడు. 'కానిస్టేబులూ! ఇంకే ఉద్యోగమూ దొరకలేదా నీకు? చిన్నప్పుడు ఢిల్లీకి బయలు దేరాను, గాంధీని చూద్దామని! అప్పుడు కూడా యిలాగే ఓ పోలీ సాయన నన్ను భద్రంగా యిల్లు చేర్చాడు. ఇప్పుడు నువ్వే! పోలీసు వాళ్ళను నమ్మకూడదంటారు. ఎంత అన్యాయం!'

'గిట్టని వాళ్ళంతా అలాగే అంటారులే కుశలన్నా! నీలాంటి మంచివాళ్ళు కొందరున్నారు గనుకనే, మేమీ ఉద్యోగంలో వుండ గలుగు తున్నాం!...ఇక నన్ను పొమ్మంటావా కుశలన్నా?'

'ఎక్కడికి? ఇంటికా?'

'ఏం ఇల్లో పోనిద్దూ! ఇల్లా అది? నరకం! జోరీగలాంటి పెళ్ళాం. జలగల్లాంటి పిల్లలు. చాలీచాలని జీతం. ఊరినిండా అప్పులు. కడుపులో కొండంత దిగులు. కళ్ళు మూసుకుంటే పీడ కలలు. చుక్కేసుకోందే నిద్రరాదు చుక్కేసుకుందామంటే చిల్లర లేదు. చాలీ చాలని జీతం! ఊరినిండా అప్పులు!'

'అయ్యో! నాకు ముందే తెలియకపోయిందే! హోటలు కుర్రాడికిచ్చిన బుడ్డీ నీకిచ్చి వుందును పోతే పోయిందిగానీ, ఇదిగో కానిస్టేబులూ! నా జేబులో డబ్బులున్నాయి మా వూరికి దూరం ఒక రూపాయి! అదిమాత్రం అట్టేపుంచేసి—ఏది? గాంధీనోటు!... మిగతాది నువ్వు తీసుకో!'

'నువ్వు నన్ను తప్పుగా అర్థంచేసుకున్నావల్లేవుంది కుశలన్నా! నేను దొంగననుకుంటున్నావా? జేబులో చెయ్యి దోపడమంటే దొంగ తనం కదూ? కంచే చేనుమేస్తే ఎలా? ఇస్తే పుచ్చుకోవచ్చు! తప్పు లేదు!'

జేబులోవున్న డబ్బంతా వూడ్చి, 'ఇందా!' అన్నాడు కుశలయ్య పోలీసు డబ్బు పుచ్చుకుంటూ 'నిన్ను ఇబ్బంది పెట్టేస్తు న్నాను కుశలన్నా!' అన్నాడు.

'అమ్మమ్మ! మళ్ళీ అంతమాటెందుకు?' అంటూ దోసిలి పట్టాడు కుశలయ్య. ఆ దోసిట్లో రూపాయినోటు పెట్టాడు పోలీసు 'గాంధీ నోటేమో సరిగ్గా చూసుకో!' అన్నాడు.

కుశలయ్య చెయ్యి పైకెత్తి చిరంజీవిగా వుండు!' అన్నాడు.

'నీ నోటి చలవ!' అంటూ వచ్చిన దారినే వెనక్కు మర లాడు పోలీసు. క్రిందికి వాలిన రోడ్డుమీద దొర్లిపోయే రూపాయి బిళ్ళలాగా నడిచి వెళ్ళిపోయాడు.

చీకట్లోనుంచి వీస్తున్న గాలి టించర్‌లాగా చల్లగా వుంది. నల్లని ఆకాశంలో గుడారాలు వేసిన మబ్బులు — లాగేసి గుర్రు కొడుతున్న వాడిలా గొణుక్కుంటున్నాయి. బ్రాందీ దుకాణంమీద పడి ప్రతిఫలించే కారులైట్లకు మల్లే — దిక్కుల చివర గ్రుడ్డిగా మెరుపుమెరిసింది.

దూరంగా—గాంధీవీపు కనిపిస్తోంది. గాంధీ వెళ్ళిపోతున్నాడు. త్రాగుబోతుల సభలో ప్రసంగించి శృంగభంగం పొందిన దైవాం శలా వెళ్ళిపోతున్నాడు.

ఉన్నట్లుండి రోడ్డుమీద 'ఢాం' అంటూ పెద్ద చప్పు డైంది. నెలాఖరున రానున్న దీపావళికి—సీమటపాకాయ పేల్చి స్వాగతం పలికాడు ఓ కుర్రాడు. ఆ చప్పుడు విని అదిరిపడ్డాడు కుశలయ్య.

ఒక్క నిమిషంపాటు అతని శ్వాస స్తంభించిపోయింది.

పిస్తోలు!

తెల్లని ఖద్దరు!

ఎర్రటి నెత్తురు!

రాం! రాం!! రాం!!!

కుశలయ్య గొంతులోంచి సన్నటి ఏడుపు బయలుదేరింది—నెత్తుటి చారలాగా! పిల్లకాలవే మహానదియైనట్లు ఆ ఏడుపు క్రమంగా పెద్దదైంది. బిగ్గరగా ఏడుస్తున్నాడతను ఆకాశంలోని నల్లమబ్బులు జడుసుకుని పారిపోయేటట్లుగా—వెక్కిళ్ళుపెట్టి ఏడు స్తున్నాడు.

కూతవేటు దూరంలోవున్న టీ కొట్టులోనుండి ఇద్దరు మనుష్యులు లేచివచ్చారు. మరోవైపున వారధిమీద కూర్చుని మాట్లాడుకుంటున్న వాళ్ళిద్దరు కదిలివచ్చారు. దారినపోతున్న మరో యిద్దరు నిలబడిపోయారు. అందరూ కుశలయ్యచుట్టూ మూగారు.

'ఏమైంది?' అని అడిగాడొకడు.

'గాంధీని చంపేస్తున్నారు!' అంటూ భోరుమన్నాడు కుశలయ్య.

'ఎవరు?'

'ఎవరని చెప్పను? ఎవర్ని చూపించను? ఒక్కడా గాడ్సే?'

'గాంధీ ఈ రోజేకదా పుట్టాడు? ఈ రోజే ఎలాపోతాడు? అక్టోబరు రెండుకదా ఈరోజు!'

'కాదు! ఈరోజు జనవరి ముప్పై! ఈ తరమే జనవరి ముప్పై! భవిష్యత్తంతా జనవరి ముప్పై!'

అతని రోదనకు కారణమేమిటో తెలుసుకోగలిగామన్న తృప్తి వాళ్ళ పెదవులమీద హాసాన్ని చిందించింది. త్రాగుబోతును అనున యించే విధానాన్నే వాళ్ళు ప్రయోగించారు.


'చంపేస్తున్నారంటూ క గారు పడిపోతావెందుకూ? పోలీసు లున్నారుగా! పట్టుకుంటారులే! నువ్వు నిద్రపోరాదూ?'

'పోలీసులా!' అన్నాడు కుశలయ్య నిరాశగా. 'మీరెప్పుడూ చదరంగం ఆడలేదా? పోనీ, ఎవరైనా ఆడుతుంటే చూడలేదా? చదరంగపు గళ్ళలోని పావులు ఏం చేయగలవు? ఎటు కదిలిస్తే అటు కదులుతాయి. ఎక్కడపెడితే అక్కడుంటాయి. పోలీసులు మాత్రం ఏం చేయగలరు పాపం, చూస్తూ వూరుకోవటం తప్పితే!'

ఆ పిదప కుశలయ్య ఎవరితోనూ మాట్లాడలేదు. కన్ను మూసుకుని చెట్టు బోదెకు చేరగిలబడ్డాడు.

మరికొంత సేపటికి తలకొంచెంగా పైకెత్తి 'ఎప్పుడు తెల్లారుతుంది?' అని అడిగాడు.

అయితే, ఆ ప్రశ్నకు బదులు చెప్పటానికి అక్కడెవ్వరూలేరు.





పసి బిడ్డకు
జీర్ణసంబంధమైన
బాధలు కలిగినప్పుడు...

సౌమ్యంగా పనిచేసే

అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్

బాధను అతి త్వరగా తగ్గిస్తుంది

గృహౌషధములు
తయారుచేయుటలో
తరతరాలుగా
నమ్మికకు పాత్రమైన
అమృతాంజన్ వారి
తయారి.



కడుపునొప్పి, అజీర్ణము, వాయువు, పళ్ళు వచ్చేటప్పుడు కలిగేబాధలు మొదలైన వాటిలో దేనితోనైనా సరే, మీ పసిబిడ్డ బాధ పడుతూంటే అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్‌తో అతి త్వరగా ఉపశమనం కల్గింతుంది త్వరగా సులభంగా తిరిగి మీ పసిబిడ్డ ఆనందంగా నవ్వుతుంది.

అమృతాంజన్ లిమిటెడ్

OBM 3410/1 TG

అద్వైతామృతవర్షిణి

శ్రీ తిరునగరి

గొంతెత్తి పిలుస్తున్నావు నన్ను
యుగాలనుంచీ
ఒకప్పుడు ఉషోబాలవై దరహసిస్తూ
మరొకప్పుడు సంధ్యారాగిణివై పరవశిస్తూ
ఇంత సౌందర్యాన్ని గుప్పిట పట్టుకొని
ఈ హృదయాన్ని నైవేద్యంగా ఇద్దామని
నీకోసం చూస్తే
పూర్వ దిశాంచలాలు భళ్ళున నవ్వుతాయి
పశ్చిమాశా నిశీథాలు పకాలున పరచుకుంటాయి
వర్షా గగనంపైనించి నీ తళతళల హాసాలు
ఏ ఇంద్రచాపంపై నర్తిస్తున్నావోనని
తనివిదీరా నీతో ముచ్చటిద్దామని
అనుకుంటే
కుండపోతగా వర్షిస్తూ ఆకాశం
గుండెను వణకిస్తుంది
శారద రాత్రిలో చల్లని వెన్నెల్లో
తెల్లగా మెరిసే నిన్ను
చేరుకుందామని ఎన్నాళ్ళ తపన !

ఎప్పుడో ఆ తరుణం రాగానే
మబ్బుల చాటున నీవు మటుమాయం
ఏ వసంతమూ కించిత్కాలమూ నిలువదు
నిన్ను కలుసుకోనివ్వదు
భీకర గ్రీష్మాన్ని ప్రసాదించి మరీ నిర్గమిస్తుంది
ఋతువు ఋతువునా నీ సోయగం
నన్ను గికురిస్తుంది అలరిస్తుంది
ఓ పాటనో పద్యాన్నో ప్రసాదిస్తుంది
హృదయ విపంచి మీటి
ఆ పాటను నీకు వినిపిద్దామని
నేను
సాయంత్రాన ఏటి ఒడ్డున నిల్చుంటే
మళ్ళీ అదే నవ్వు చిలికిస్తూ పిలుస్తావు
సంధ్యవై
మహాకవి అన్నట్టు
జననాంతర సౌహృదానివై
నా మానస క్షేత్రాన ఆనందఝురులు పారించే
అద్వైతామృత వర్షిణివై.

....

మానససూక్తం

శ్రీ తిరునగరి

మనిషి : ఏదీ ? ఇన్నేళ్ళు గడచె
లేదే సుంతైన సుఖము
మరి యెన్నడు నాకు శాంతి
మనసా ! ఈ కంటకపథాన ?

మనసు : ఎన్నేడులు గతించినా
ఈ బాధలు తప్పవురా
బాధలలో నవ్వుకొనుచు
పథమందున సాగుమురా !

మనిషి : సంసారములో అశాంతి
జగతినిండ విభ్రాంతి
ఎటుగనినా అధర్మమే
ఎటు చరింతునో మనసా !

మనసు : శాంతము నీ మది నిండిన
సంసారమె స్వర్గమురా
క్రాంతి జగతి వ్యాపించిన
నాడీ రుజలుండవురా !

మనిషి : వాడెను ఈ బ్రతుకు మ్రోడు
వచ్చు నెపుడు మంచిరోజు
ఈ చీకటితో యుద్ధము
ఎన్నాళ్ళోకద ఎరుగము ?

మనసు : పసిపాపలవై పుచ్చూడు
వారిది రాబోవు రోజు
తిమిరమ్ముల జయింతువు
రేపు దివ్వె వెలిగింతువు

మనిషి : అంతరించు ఆశల నా
యందు మరల వెలిగింతువు
డెందములో దివ్వె నిలిపి
ముందుకు నను నడిపింతువు

మనసు : నీ యెదలో చిరదీపము
నై వెలుగుట నా ధర్మము
నిను ముందుకు కదలించుటె
మనిషీ ! నా కర్తవ్యము.

నేనూ దోషిని

"అసురా"

తన శరీరాన్ని నిర్లక్ష్యంగా నలుగురికీ బహిరంగంగా బట్ట-బయలు చేసే అతను కనబడినప్పుడల్లా గొంగళిలా కుంచించుకు పోతాను.

దహించే వెలుగును అడ్డుకునేందు కతని కెలాంటి ఆచ్ఛాదన లేనందువల్లే ఆ అనలుడు తన తీక్షణ కిరణాల్ని సూటిగా — అతని కణజాలంలో చొరబర్చి కండల్ని భోంచేసి తన ప్రతాపాన్ని ఇలా ప్రదర్శించి విర్రవీగుతున్నాడని తోచగానే కాలిపోతాను.

తాకితే విరిగి నుస్సైపోతాయేమోననిపించే ఆ పల్చటి ఎముకల్ని గట్టిగా చుట్టుకుని అతన్ని జోరుగా వీచే పెనుగాలుల్నించి పడిపోకుండా రక్షిస్తున్న ఆ నల్లటి ఎండిన చర్మంయొక్క నిజాయితీముందు నా తల వాల్చుకుంటాను.

దిన దినం ఏపుగా, బలంగా పైకి వుబుక్కొస్తున్న నా మాంసాన్ని, అందంగా, నునుపుగా తీర్చిదిద్దినట్లున్న నా అంగాల్ని రోజూ వుదయం బాత్‌రూంలో చూసుకొని గర్వించడం మానేసి గిల్టీగా ఫీలవుతాను.

తాము ఎక్కడైతే సహాయం చేయలేరో అక్కడ దిగులుపడి తమ కర్తవ్యం తీర్చుకొన్నామని సంతుష్టిపడే అసంఖ్యాక మానవుల్ని అల్పులు, కపటులు అని దూషించే నేనుకూడా వారికంటే ఎత్తుగా ఎదగలేదన్న నిజం స్ఫురించి నన్ను నేనే నిందించుకొంటాను.

విధ్వంసనృత్యము

మూలం: సుబ్రహ్మణ్యభారతి

డా॥ కె. ఐ. యస్. మూర్తి

గర్జించు గగనాలు భీకర అపస్వరాల వరుసలిడగ,
నక్షత్ర కూటాలెన్నో రక్తంపు పరిభాష మెఱయ,
అరుణవర్ణాల వాద్యబృందాలు మందముగ ఆలపింప,
నర్తింపవమ్మ కాళి! చాముండి! గంగాళి!
నీ రౌద్రతాండవమ్ము, ఓ దివ్యజననీ
కాంక్షించి కఱగిపోదును రక్తవర్ణాలలోన.

పంచభూతాలు ప్రజ్వలించి గర్జింప,
సృష్టినిర్వాహశక్తి క్షుద సర్వమును కబళింప,
ఉద్రిక్త నాదమ్ము ఆత్మవిధ్వంస మొనరింప —
అగ్నులు చిమ్ముచు అనంతముగ నర్తింపవమ్మ —
నీ రౌద్ర తాండవమ్ము, ఓ దివ్యజననీ
కాంక్షించి కఱగిపోదును రక్తవర్ణాలలోన.

పరుగులిడు దూరాలు కంపించి తూలిజాఱ,
తరతరాల ప్రాణిసమూహాలు మృత్యువాతపడగ,
సంహారరాక్షస పీడన పాదాలు త్రొక్కినడువ,
భువనాలు భీతిల్ల విధ్వంసనాట్యమ్ము చేయవమ్మ —
నీ రౌద్ర తాండవమ్ము, ఓ దివ్య జననీ
కాంక్షించి కఱగిపోదును రక్తవర్ణాలలోన.

ఖగోళధ్వంసమ్ముచేయ భేతాళరౌద్రమ్ముతో
మ్రోగించి ప్రళయదుందుభి మ్రోత,
ప్రజ్వలింపుచు అగ్నిజ్వాలలు కోపోద్రిక్త నయనాలనుండి
యుగయుగాల వైభవమ్ము భస్మముచేయ నర్తింపవమ్మ —
నీ రౌద్రతాండవమ్ము, ఓ దివ్యజననీ
కాంక్షించి కఱగిపోదును రక్తవర్ణాలలోన.

విశ్వమ్ముతో కలసి నిర్వాణరూపుడు శివుడుగూడ
పతనమ్ముకాగ అంగు ఆయువేలేని కాలమ్ము ధ్వంసమవగ,
దగ్ధమ్ముగావించు ప్రళయాగ్నిలో ఆగ్రహావేశమ్ము
చిందుచు ఆవహింపుము పరమాత్మ — ఉన్మత్తతనం:
నీ రౌద్ర తాండవమ్ము, ఓ దివ్యజననీ
కాంక్షించి కఱగిపోదును రక్తవర్ణాలలోన!

●●●●●●●●●●●●●●

స్వర్గం - నరకం!

శ్రీ దిలావర్

గుండెలోంచి అసంతృప్తిని తీసివేస్తే
శేషం స్వర్గం!
మనసును కోరికలతో పెంచివేసే
లబ్ధం నరకం!



తెలుగు - వాక్య నిర్మాణము

గ్రీకులోని 'Syn' = together, 'Taxis' = arranging అను దాని సమాహార రూపసాదృశ్యము కలదే ఇంగ్లీషులోని Syntax. Syntax అనగా 'The scientific method of sentence construction and its study' అని చెప్పవచ్చును. ఆంగ్లము నందలి 'Syntax' అను పదమునకు తెలుగున 'వాక్య నిర్మాణము' అనునది సమానార్థకము. వాక్య నిర్మాణము అను దానికి బదులు వాక్య రచన, వాక్య యోజన, వాక్య విన్యాసము అనియు నుపయోగించుట కద్దు. తెలుగు భాషలోని వాక్య రచనా విధానము స్థూలముగా కొంతవఱకు ఇందు చర్చింపబడును.

ప్రాచీన కాలమున వాక్య రచనా విధానమును గూర్చి, వాక్య భేదములను గురించి ఏ వ్యాకర్తయు విస్తరముగా పేర్కొనలేదు. పాణిని గూడ తన వ్యాకరణమున వాక్యమును గూర్చి చర్చింపలేదు. తెలుగు ప్రాచీన వ్యాకర్తలైన నన్నయ, కేతన, అప్పకవ్యాదులనుండి అర్వాచీనుడైన చిన్నయసూరి వరకు గల వ్యాకర్తలెవ్వరును వాక్య నిర్మాణ రీతిని గూర్చి పెద్దగా చర్చింపలేదు. ప్రౌఢ వ్యాకర్త మాత్రము వాక్యము పేర నొక పరిచ్ఛేదమును రచించెను.

పాశ్చాత్యులలోను ప్రాచీనులు వాక్య నిర్మాణమునుగూర్చి తమ గ్రంథములందు విశేషముగా పేర్కొనలేదు. బ్లూమ్‌ఫీల్డు, గ్లీజను, హాకెట్టు, హాల్, లాంగేకరు మున్నగు ఆధునిక భాషాశాస్త్రజ్ఞులు కూడ వాక్యమును సందర్భ వశమున కొద్దిగా చర్చించుటయే గాని మిగిలిన అంశములవలె దీనినిగూర్చి విపులముగా చర్చింపలేదు. ఆధునిక భాషాశాస్త్ర పరిశోధనలో ధ్వనిశాస్త్రమున, పద నిర్మాణమున, మాండలిక పరిశీలనలో, శబ్దార్థ పరిణామములలో జరిగినంత కృషి వాక్య రచన విషయమున జరుగలేదు వాక్య నిర్మాణ రీతి విషయమై ఇంకను ఎంతో కృషి జరుగవలసి యున్నది. తెలుగు వాక్య రచనా రీతిపై జరిగిన కృషి కూడ అత్యల్పమే డా చేకూరి రామారావుగారు ఇంతకుపూర్వము కొన్ని వ్యాసాలు 'భారతి'లో ప్రచురించినారు. ఈమధ్యన వారు రచించిన 'తెలుగు వాక్యం' అను గ్రంథమును ప్రపంచ తెలుగుమహాసభల సందర్భమున ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు [1975] ప్రచురించినారు. ఇందు ఆధునిక తెలుగు వ్యావహారిక భాషా వాక్య రచనా రీతి ఆధునిక భాషా శాస్త్ర దృష్టితో చక్కగా పరిశీలింపబడినది. తెలుగులో వాక్య నిర్మాణముపై ఒక గ్రంథమైనను లేదను లోటును ఇది కొంతవరకు తీర్చినది.

వాక్యము (Sentence) :—

భాషా వ్యవహారమున వాక్యము చాలా ప్రధానమైనది. వాక్యము వ్యవహారోపయోగి. వ్యవహారమనగా ఒకనిని బోధించు ఉద్దేశ్యముతో వాక్యమును ప్రయోగించుట 'బుబోధయిషాపూర్వక వాక్యప్రయోగో వ్యవహారః'. ప్రకృతి ప్రత్యయముల సమాహారము పదము. పదము కంటె వాక్యము విపులతరము. భిన్న పదముల కూడిక వాక్యము. భాషలో గరిష్ఠ భాషాభాగము వాక్యము. ఇది సంపూర్ణార్థ ప్రతిపాదకము. పదముల అర్థ సమూహనకంటె వాక్యార్థము కొంచెము ఎక్కువ. ఇదియే సంసర్గార్థము, తాత్పర్యము అనబడును.

అత్యంత ప్రాచీన కాలముననే మన దేశమున శాస్త్రకారులు వాక్య నిర్వచన గావించియున్నారు. పదసమూహము నుండి పుట్టిన అర్థము వాక్యమట—'పద సంఘాతజమ్ వాక్యమ్' (బృహద్దేవత) పదములవలన గాక పదార్థముల వలననే వాక్యార్థము పుట్టుచున్నదని కుమారిల భట్టు — 'పదార్థైః పద విజ్ఞాతైః వాక్యార్థః ప్రతిపద్యతే' (తంత్ర వార్తికము) ఆకాంక్ష కగి ఏకార్థమును బోధించునది వాక్యము — 'అర్థైకత్వాదేకం వాక్యం సాకాంక్షం చేద్విభాగే స్యాత్ (మీమాంసా సూత్రము). వాక్యము నిరాకాంక్షమని కాత్యాయన శ్రౌత సూత్రము చెప్పుచున్నది. అనగా వాక్యము తనకు వెలుపలి పదములతో అకాంక్షలేక స్వయం సమగ్రమగుట అన్నమాట.

వక్త చేసిన అర్థయుక్తమైన శబ్దసముదాయము వాక్యము. Otto Jesperson' 'A sentence is a (relatively) complete and independent human uttcrence' అని చెప్పినాడు కొందరు ఆధునిక భాషాశాస్త్రజ్ఞులు రెండు నిశ్శబ్దముల మధ్యగల అర్థయుక్తమైన శబ్దసముదాయము వాక్యము అని చెప్పుచున్నారు

వాక్యమునందు 'యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి' అను మూడు అంశములుండవలెననుట మనమందరము ఎరిగినదే. ప్రాచీనులు యోగ్యత అనగా సంబంధార్హత్వము అనిరి ఇది వాక్యమాత్ర పరము. అర్థ అబాధ అర్థాపరము దీనినే బాధా నిశ్చయ అభావమని కొందరు. కుమారిలభట్టు చెప్పినట్లుగ ఖండన ఖండ ఖాద్యమున ఉట్టంకింపబడిన వార్తికము ఒకటి ఇట్లున్నది: 'అత్యంతాసత్యపి హ్యర్థే జ్ఞానమ్ శబ్దః కరోతిహి, అబాధాత్తు ప్రమా మాత్ర స్వతః ప్రామాణ్య నిశ్చలమ్'. ఏమాత్రము లేనిదైన అర్థము నందుకూడ శబ్దమేమో అట్టి జ్ఞానమును కలుగజేయును. కాని అర్థమునకు బాధలేకుండుట అనునది ప్రమ (reality)కు మాత్రమే

సంబంధించినది. శశవిషాణము, గగన కుసుమమువంటి పదబంధము లలో అర్థగ్రహణమున క్లేశమేమియులేదు. వానిలోని దోషమంతయు అవి అనుభవమున కనబడకుండుటయే. ఆకాంక్ష అనగా పదార్థముల పరస్పర జిజ్ఞాసా విషయత్వ యోగ్యత్వము—'పదార్థానాం పరస్పర జిజ్ఞాసా విషయత్వ యోగ్యత్వ మాకాంక్షా' (వేదాంత పరిభాష). క్రియాశ్రవణము వలన కారకము యొక్కయు, కారక శ్రవణము నందు క్రియయొక్కయు, అట్లే కారణ శ్రవణమునందు 'ఇతి కర్తవ్యత' యొక్కయు జిజ్ఞాస కలుగును. కొట్టు అను క్రియ వినగానే దేనిచే? అను కారక జిజ్ఞాస, కఱచే అనగానే ఏమి చేయ వలెను? అను క్రియా జిజ్ఞాస కలుగును. అట్లే వానవచ్చుచున్నది అని వినినపుడు గొడుగు తెరచుకొనుటయో, తడువని చోటికిపోయి నిల్చుటయో మున్నగు ఇతికర్తవ్యతా రూపమైన జిజ్ఞాస కలుగును. ఇది వాక్యమాత్ర పరము; వక్త్రాద్దేశపరము. ఇదికాక శ్రోత జిజ్ఞాస ఒకటి గలదు. 'తెమ్మ' అను క్రియకు దేనిని? అనునది సహజ జిజ్ఞాస. ఇది ఉత్థితాకాంక్ష అనబడును (Natural expectency) ఎట్లు? అనునది ఉత్థాప్య ఆకాంక్ష (Potential expectency) శ్రోతకు క్రియాచరణమునందు ఇట్టి జిజ్ఞాస కలుగవచ్చును. కావున ఇది ఉత్థాప్య ఆకాంక్ష అనబడినది. వక్తతో ఎట్టి సంబంధములేదు అనునది స్పష్టము. ఆసత్తి అన్నది సన్నిహితత్వ అభావము, శబ్దబోధిత్వ అభావము అని రెండు రకములు. మొదటి దానిలో పదముల అవ్యవధానము లేకుండుట—ఫలితముగా అర్థము ఉపస్థితి తప్పుట—రెండవ దానిలో శబ్దము లోపించుట. 'ఆవును కట్టివేయుము' అనుటకు 'గుఱ్ఱమును కట్టి వేయుము' అనుట. మీమాంసకులు లోపించిన శబ్దమును ఊహించినచో శ్రుతార్థాపత్తి యందురు. ప్రకరణమునుబట్టి క్రియను ఊహించినచో క్రియార్థాపత్తి. తలుపు అనగానే తీయవలెనా? మూయవలెనా? అను దానిని ఊహించుట. శ్రుతార్థాపత్తిలో కేవల శబ్దమును ఊహించుట అభిధానా నుపపత్తి అగును. అభిహితా నుపపత్తి psychological expectency నిపూరించుట. శబ్దమును తెచ్చుకొన్నచో అధ్యాహార్యమనియు, అర్థమును తెచ్చుకొన్నచో వాక్యశేషమనియు భోజుడు చెప్పెను.

ప్రాచీనాభిప్రాయములను గమనించియే కాబోలు ప్రౌఢవ్యాకర్త 'వాక్యము నా యోగ్యతాకాంక్షా సహితంబగు నర్థముగల యాసత్తి యుక్త పదసముదాయంబు' (వాక్యపరిచ్ఛేదము—1) అని వాక్య నిర్వచనము గావించెను. 'యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి' అనువానితో గూడి సమగ్రార్థవంతమగు పదముల సముదాయమే వాక్యమని అర్థము. యోగ్యత అను పదములకు, అర్థములకుగల పరస్పర సంబంధమునకు బాధకలుగకుండుట—నిప్పుచే తడుపుచున్నాడు. ఇది వాక్యమనుటకు యోగ్యమైనది కాదు. ఇందలి విషయము అసంభవము, అనుభవ విరుద్ధము. కావున ఇందు యోగ్యతలేదు. ఆకాంక్ష అనగా నిలుపుదల లేకుండ వెంటవెంటనే వచ్చు పదార్థములమీది ఆదరము. ఇది వినువారికి తెలిసికొనవలెనను అపేక్షా రూపమున నుండును. పులి, సింహము, ఏనుగు అని పల్కినచో వినువారికి అపేక్ష కలుగదు. అట్లుగాక ఇది పులి; ఇది సింహము అనుచో ఏది? ఎక్కడ? అను ఆకాంక్షకు అవకాశమున్నది. ఇందుచే నిది వాక్యమగును. ఆసత్తి అనపదముల చేరిక. వాక్యమునందలి పదముల నవ్యవహితముగ నుచ్చరించునపుడుగాని దాని యర్థము బోధపడదు. 'రాముడు' అను పదము ఇప్పుడును, 'సీతను' అనుపదము మరియొక గంటకును, 'పెళ్లిచేసికొనెను' అను పదము రేపును చెప్పినచో అది వాక్యము కానేరదు పదముల అవిలంబోచ్చారణమున అవ్యవధానముగా పదజన్యమైన పదార్థము ఉపస్థితిలో నుండుట.

ఉద్దేశ్యము - విధేయము (Subject-predicate)

వ్యాకర్తలు వాక్యమును రెండు భాగములుగ విభజించిరి. ఒకటి ఉద్దేశ్యము. రెండవది విధేయము. విషయ బోధకము వాక్యము (వాక్య—5). ఉద్దేశ్య విధేయ భిన్నంబు విషయంబు. (వాక్య—6). ఉద్దేశ్యమనగా విశేష్యాదికము. విధేయమనగా క్రియాదికము. విశేష్యాదులనునందు విశేష్యమునకు సంబంధించిన విశేషణములు, సర్వనామములు అన్నియు చేరును. అందమైన రాముడు ఒక్కడే (ఉద్దేశ్యము) ఆలస్యముగా కాలేజికి వచ్చినాడు (విధేయము). ఉద్దేశ్యమనునది వక్త, శ్రోత ఇరువురికిని తెలియును. కాని విధేయము కర్తకు మాత్రమే తెలియును. విధేయమనునది క్రియా విశేషణము, క్రియావిశేష్యము, విశేషణము, సర్వనామము కావచ్చును. విశేష్యాదులు ఉద్దేశ్య విధేయములలో ఏదైనను కావచ్చును. కాని క్రియాదులు మాత్రము ఉద్దేశ్యములు కాజాలవు. కేవలము విధేయములే అగును.

సంపూర్ణ వాక్యము - అసంపూర్ణ వాక్యము :
(Complete - Incomplete Sentence)

వాక్యము సంపూర్ణము, అసంపూర్ణము అని రెండురకములు. 'సంపూర్ణ మసంపూర్ణమని వాక్యంబు ద్వివిధంబు.' (వాక్య—7) సమాపక క్రియగల వాక్యము సంపూర్ణవాక్యము—వానలు కురిసెను. అసమాపక క్రియగల వాక్యము అసంపూర్ణ వాక్యము — వానలు కురిసిన...(పంటలు పండును.) I had finished when he Came (complete) When he came ...... (Incomplete sentence.)

సామాన్య వాక్యము - సంశ్లిష్ట వాక్యము - సంయుక్త వాక్యము -
(Simple - Complex - Compound sentence)

సామాన్య వాక్యము క్రియా సహితముగానైనను, క్రియా రహితముగానైన నుండవచ్చును. సంశ్లిష్ట సంయుక్త వాక్యము

ంలో క్రియ ఉండును. ఒక వాక్యములో నిర్దిష్టమైన స్థానములో మరియొక వాక్యమును చేర్చుట సంశ్లిష్ట వాక్యములో కనబడును. ఒక వాక్యముతో మరియొక వాక్యమునుచేర్చుట సంయుక్తవాక్యములో కనబడును.

క్రియాసహిత సామాన్య వాక్యము —

తె. రాముడు వచ్చెను

త రామన్ వందాన్

ఆం. **Rama came.**

క్రియారహిత సామాన్య వాక్యము —

తె. అది ఒక రకమైన చిలుక.

త. ఆదు ఒరు విదమాన కిళి.

సంశ్లిష్ట వాక్యములో ఒక ప్రధాన వాక్యమునకు మరియొక ఉపవాక్యము చేరుట కనబడును. ఉప వాక్యములో క్రియ ఉన్న యెడల ఎల్లప్పుడు అది అసమాపక క్రియగానే ఉండును

సంశ్లిష్ట వాక్యము —

తె. రాముడు అన్నము తిని కాలేజికి వచ్చినాడు.

త. రామన్ సాప్పిట్టు కల్లూరిక్కు వందాన్.

ఆం. **Rama came to the collage after taking food.**

సంయుక్త వాక్యమునే ద్వంద్వ వాక్యమనుట కలదు. రెండు సమాన ప్రతిపత్తి గల వాక్యములు కలిసి ఒక వాక్యముగా ఏర్పడుట సంయుక్త వాక్యము. (తెలుగు వాక్యం పే. 68).

సంయుక్త వాక్యము —

తె. వాడు రానూ లేదు డబ్బు ఇవ్వనూ లేదు.

త. అవన్ వరవుమ్ ఇల్లై పణమ్ కొడుక్కవుమ్ ఇల్లై

ఆం. **Neither he came nor paid the money**

సముఖ వ్యవహారము - అనువాద వ్యవహారము-

(Direct – Indirect Speech)

వ్యవహారము సముఖ వ్యవహారమనియు, అనువాద వ్యవహారమనియు రెండు విధములు. తెలుగులో సముఖవ్యవహారము 'ఇట్లను' ప్రకారబోధక యుక్తమైన అనుధాతు సమాపకక్రియారూపముతో

ప్రవేశ పెట్టబడును. పరమందు అనుధావ్య సమాపక క్రియా రూపము మాత్రము ప్రయోగించి తర్వాత వారి సముఖ వ్యవహారమును నిర్వహింతురు. అనగా సముఖ వ్యవహారమునకు పూర్వము 'ఇట్లనియె, ఇట్లనున్' అనునవి ఉండును. పరముగా అనిసన్, అనగా ఇత్యాదులుండును.

'సతీదేవి దక్షునకుం బ్రియ సంభాషణ భావంబున నిట్లనియె. (కుమార సంభవము 2–18). హరి పితామహ దివిజేశ్వరాది దిగధిపతుల సురముని ద్విజుల రాబనిచి వరదు నభవుఁ బరమేశ్వరు రావింపవైతి నీవు దలచి పిలిచిన భక్తవత్సలుఁడు రాఁడె (2–19) అనినం బరమేశ్వరుండను పలుకు సహింపక దక్షుండాక్షేపించి (2–20)...భస్మాంగి రా నర్హుఁడే (2–21) అనిన విని నవఘనాఘునధ్వని వినిన కమల లక్ష్మియుంబోలె నదరిపడి

దాక్షాయణి దక్షున కిట్లనియె. (2–22)

He said to me, 'What are you doing? (direct)
He asked me What I was doing (Indirect)

పదక్రమము (Word order :)

తెలుగు, తమిళము, కన్నడము, మలయాళము మున్నగు ద్రావిడ భాషలందు కర్త, కర్మ, క్రియ వరుసలో వాక్యనిర్మాణము జరుగును తె రాముడు (కర్త) రావణుని (కర్మ) సంహరించెను (క్రియ). త. రామన్ రావణనై క్కొన్రాన్. ఆంగ్లమునందు కర్త (subject) క్రియ (Predicate) కర్మ (Object) అను క్రమములో వాక్యమేర్పడును. Rama killed Ravana. సంస్కృతమునందు కర్త, కర్మ, క్రియలు క్రమవిరహితముగా నుండవచ్చును. తెలుగునందు ప్రధానముగ నొకదాని నుద్దేశించి చెప్పవలసి వచ్చినపుడు పదముల క్రమము కొంతవరకు తారుమారగుచుండును. 'అట జనికాంచె భూమిసురుడంబర చుంబిత శిరస్సర ... శీతశైలమున్' [మను చరిత్ర 2-3] తమిళ కంబరామాయణమునందును 'కండనన్ కర్పినుక్కణియై కణ్గళాల్' అని కలదు. మలయాళమునందు 'కండేన్ సీతయె ఞాన్' (తుంచత్ ఎఴుత్తచ్చన్ అధ్యాత్మ రామాయణము) అనియు గలదు. దీనిని గమనించియే బాలవ్యాకర్త 'ఏకవాక్యంబు నందొక్కండు తక్క సర్వపదంబులు క్రమనిరపేక్షంబుగం బ్రయోగింపఁ జను' ననెను. (కారక–33) గాలి చల్లగా వీచెను, చల్లగా వీచెను గాలి, వీచెను గాలి చల్లగా– మున్నగురీతి.

సమాస రచన :(Compounds)

తెలుగునందు అలతి అలతి పదములతో చిన్నచిన్న సమాసములు కూర్పబడును. తల్లిదండ్రులు, ముక్కంటి, నిలువుటద్దము, జవరాలు, పసిఁడనము. కాని సంస్కృతమునందు అతిదీర్ఘ సమాస రచన ఉండుటవలన వాక్యములును అతిదీర్ఘముగ నుండుటలో నాశ్చర్యమేమియులేదు. ఆ సంస్కృతభాషా ప్రభావమువలన తెలుగు కావ్యములలో కూడా కవులు అతిదీర్ఘ సంస్కృత సమాసరచన గావించియున్నారు. పైన పేర్కొనబడిన మనుచరిత్రలోని పద్యము, రాయలకృత ఆముక్త మాల్యదలోని 'కాంచెన్ వైష్ణవుఁ డర్థయోజన...' (6–15) మున్నగు పద్యము లిట్టివే.

లింగము : (Gender)

వాక్యములో ఒక్కొక్కప్పుడు ఒక లింగమునకు బదులు వేరొక లింగమును ప్రయోగించుట కలదు. ఈ రచనారీతి కావ్యభాషలో గలదు. కాని వ్యావహారిక భాషలో పెద్దగా కనబడదు.

అ) స్త్రీ లింగమునకు బదులు పుంలింగము వాడుట– వనితలు కైలాసంబునకు నరిగి...సర్వాంగీణ ప్రణాములై.. పరమేశ్వరానుజ్ఞాతులై ... దివ్య విమానారూఢులై' (కు సం. 2–13) ఇక్కడ ప్రణామలై, అనుజ్ఞాతలై, విమానారూఢలై, అని ఉండవలెను

ఆ) నపుంసకమునకు బదులు పుంలింగము వాడుట – పరవశులై యుండు భద్రకరులు (కు. సం. 1–81) ఇక్కడ పరవశములై అని యుండవలెను.

ఇ) స్త్రీ లింగమునకు బదులు నపుంసకము వాడుట కూడ కనబడుచున్నది. – శరద్వ్యాప్తి వెలుఁగు కాశ సంకాశమగు మహీకాంతవోలె (కు. సం. 9–6) ఇందు కాశ సంకాశ యగు అని ఉండవలె గదా !

వచనము :– (Number) :–

ద్రావిడ భాషలో జడ వాచక శబ్దములకు బహువచన ప్రత్యయము చేర్పకయే ఉపయోగించు నలవాటుగలదు. తె వంద విస్తరి. త. నాలుమాడు. 'మాతంగము లభిరామమయ్యెఁ దద్వన భూమిన్' (కు సం. 1–83) అభిరామములు అనవలె.

అమహద్వాచకములలో తిర్యగ్జడ బహువచన కర్తకు ఏకవచనక్రియ వాడబడుట కనబడును తె చిలుకలు పలికెను. త. నాలుమాడుగళ్ మేయ్‌గిన్నదు. దీనిని చిన్నయసూరి పేర్కొనినాడు. 'తిర్యగ్జడంబుల వాచ్యంబు లగునపుడు లిడ్లోట్లుల ప్రథమ బహువచనంబున కేకవచనంబగు.' (క్రియా. 25).

విభక్తి (Case) :–

తెలుగునందు విభక్తులు లింగ వచనాను సారముగ మారవు. సంస్కృతమున మారుచుండును. మూడు లింగములలోను మూడు రకములైన విభక్తి ప్రత్యయముల చేరుచుండును–

పుంలింగము రామః రామౌ రామాః
స్త్రీ లింగము సీతా సీతే సీతాః
నపుంసక లింగము జలమ్ జలే జలాని

తెలుగులో ఒకే రకమైన విభక్తి మూడు లింగములలోను చేరుచుండును రామునకు—సీతకు—వనమునకు. వచనము ననుసరించియు సంస్కృతమున విభక్తులు మారును—రామస్య రామయోః రామాణామ్. తెలుగున మారవు—రామునకు—రాములకు.

తెలుగులో ఒక విభక్తికి మరియొక విభక్తి వాడుట కలదు. 'ఒకానొకచో నొక విభక్తికి మరియొక విభక్తియునగు' అని సూరి సూత్రించెను (కారక. 21)

అ) ప్రథమకు షష్ఠి — ఈయుని వరులకుం జూడ గౌరిం దోడ్కొని రండు. (కు. సం. 7–137) ఇమ్మని వరులు చూడ అనుటకు

ఆ) ద్వితీయకు ప్రథమ — వేదశాస్త్రము లందున్న సదర్థమెల్ల గొని (కు.సం.1–15) సదర్థమును. ఇది సర్వ సాధారణముగ కనబడుచుండును సూరి 'జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగానగు' (కారక–24) అని సూత్రించెను.

ఇ) తృతీయకు ప్రథమ — అర్ఘ్యపాద్యాది విశేషార్చనలర్పించి (కు. సం. 1–114) విశేషార్చనలచేత.

ఈ) చతుర్థికి ప్రథమ—తనువాసవడి (కు.సం. 5–160) తనువుకొరకు అన్నమాట.

ఉ) పంచమికి సప్తమి — జంగమ మల్లయ వరము నందుఁ గనిన వస్తు కవిత (కు. సం. 1–49) వరము వలన.

ఊ) షష్ఠికి ప్రథమ : ఉప్పరమెగసి (కు. సం. 11.3) ఉప్పరమునకు.

ఋ) సప్తమికి ప్రథమ—చిప్పరువు గవిసె భూతలమెల్లన్. (కు. సం. 6–100) భూతలమునందు. 'ప్రథమకు షష్ఠివాడు' రచన ప్రాచీన మహాకవులలో మెండుగా గలదు. అంతకుముందు ప్రాజ్ఞన్నయ శాసనము లందెక్కువ. ఇది సంస్కృత భాషాప్రభావమా? అది కావ్యభాషలో ఒక విలక్షణ వాక్యరచనా సంప్రదాయమై పోయినది. తన పట్టిన ప్రతినయ పట్టి క్రాలుచు (కు. సం. 2–39) (తాను పట్టిన) వారి కోరిన వరంబు దయసేసి(కు సం. 3–23) (వారు కోరిన)నీ పోయివచ్చిన కార్యం బెరింగింపుము (కు. సం 4–60) నా చేసిన యపరాధంబు సహింపవలయును. (కు. సం 10–86) నా చూడని రాజులు (భా 3–2–19) (నేను చూడని) అమ్మునివరు కఱపిన మార్గము. (భా. 1–6,232)

సర్వనామములు :(Pronouns)

ద్రావిడ భాషలలో నామములకగు వ్యాకరణ కార్యములన్నియు సర్వనామముల కగును. తెలుగు వాక్యములందు 'ఎవ్వరు, ఎవ్వతె, ఏది' మున్నగు ప్రశ్నార్థకసర్వనామములనువాక్యములందెచటనైనను వాడవచ్చును. ఉదా : నీవు చూచితివి ఎవరిని? నీవు ఎవరిని చూచితివి? ఎవరిని నీవు చూచితివి? ఆంగ్లములో పదాదియందు మాత్రమే వచ్చును. Where are you going? What are you doing? వ్యవహార ధోరణిలో You are going where? doing what? మున్నగురీతి ప్రయోగములు కలవు.

సంబంధ బోధక సర్వనామరచన తెలుగు భాషలోలేదు సంస్కృతమున 'యత్, తత్'లతో ఈవిధమైన వాక్యరచన కానగును. 'యదిచ్ఛసి తత్కురు'. ఈ ప్రభావముచే తెలుగులో కూడ 'ఏది యిష్టమో అది చేయుము' తమిళములో 'ఎద్దై విరుంబురాయో అద్దై శెయ్' మున్నగురీతి రచన బయలుదేరినది. ప్రాచీన కవులలో నీ రచన గలదు చూడుఁడు— 'ఎంత యోటువడిన వంతియ జూదంబునందుఁ దగులు జలము నతిశయిల్లు'(భారతము 3–2–63). పరసేన ఏంత గలదంతయు నొక్కట మ్రొగ్గనేసి (కు. సం 12–169) ఎవ్వనిచే జనించు...వాని నాత్మభవున్ (భాగవతము 8–73) సర్వసాధారణముగా ఇట్టి రచనకు బదులు తెలుగులో క్రియాజన్య విశేషణముల నెక్కువగా నుపయోగింతురు— వచ్చినవాఁడు ఫల్గునుఁడు (భారతము 4–4–234).

విశేషణములు : (Adjectives)

ద్రావిడ భాషలందు విశేషణములు వాక్యమునందు లింగభేదము ననుసరించి మారవు—అందమైన రాముడు, అందమైన సీత, అందమైన వనము — సంస్కృత భాషలో లింగము ననుసరించి విశేషణములు మారుచుండును—సుందరః, పురుషః, సుందరీ సీతా, సుందరమ్ వనమ్. ఆంగ్లములో కూడ కొన్నిచోట్ల లింగభేదము ననుసరించి hand - some men, beautiful women, అని విశేషణము మారును ద్రావిడ భాషలలో విశేషణములకు లింగ వచన విభక్తులు చేరవు. కాని సంస్కృతములో విశేష్యమునకువలె విశేషణమునకును లింగవచన విభక్తులగును అందువలననే సూరి 'విశేష్యంబునకుం బోలె విశేషణంబునకు లింగవిభక్తి వచనంబులగు' (కారక–19) అని చెప్పినాడు.

తెలుగుభాషలో విశేషణము లెప్పుడును విశేష్యములకు ముందే యుండును—సుందరమైన పురుషుడు, అందమైన బాల, తియ్యని మాట. సంస్కృతమున నందిట్టి నియమము లేదు. విశేషణములు క్రమనిరపేక్షముగ ప్రయోగింపఁబడును. విశేష్యమునకువలె విశేషణమునకు కూడ లింగవచన విభక్తులుండును. గావున క్రమనిరహితమైనను అర్థము చెడదన్నమాట.

అ) అయిన మున్నగు విశేషణ ద్యోతక ప్రత్యయములు ఏమియు లేకుండగనే విశేష్యములను విశేషణములుగ వాడుటకలదు. పరమాస్త్రిక విశారదుల్ బలయుతుల్ పాంచాల కౌంతేయులు. (భారతము 1–6–85).

ఆ) చిట్టచివరి దానికి మాత్రము విశేషణ ద్యోతకప్రత్యయమును చేర్చి వాడుటయు కనబడును — అతిమానుష మత్యద్భుత మతిదుష్కరమును న కేశవార్జున కృతి (భారతము 1–1–318)

ఇ) విశేష్యమునకు ముందు పెక్కు విశేషణములున్నపుడు మొదటి విశేషణములు 'అయి' తోను, చివరి విశేషణము 'అయిన తోను ప్రయోగించుట కలదు — పరిపూర్ణంబై దశ ప్రాణంబుల స్వప్రాణంబై షట్త్రింశ దలంకారాలంకృతంబై రమణీయంబయిన దివ్య కధారంభమునకు (కు సం. 1–45).

ఈ) విశేష్యమునకు ముందున్న మొదటి విశేషణములు 'అయి' తోను, చివరి విశేషణము మాత్రము 'అగు' తోను ప్రయోగింపబడుట కలదు — అఖిల భువనాధీశ్వరాకీర్ణంబై కనక ప్యాది సమస్త వస్తు సంపూర్ణంబై యతి రమణీయమగు నిజ పురోత్సవంబు (కు. సం. 2–9) ఈ విషయమునే బాలవ్యాకర్త (కారక – 29) సూచించెను.

ఉ) మరియొకచో సూరి 'ధాతుజ విశేషణ వ్యవధానంబున విశేషణంబు లన్నింటికయి పదంబను ప్రయుక్తంబగు' (కారక–31) నని సూత్రించి, ఆద్యుండయి యప్రమేయుండై యఖిలసేవ్యుండై యెసంగెడు దేవుని నభినుతింతు' అను ఉదాహరణము నిచ్చెను.

క్రియ విధానము (Verb) :-

ద్రావిడ భాషలందు లింగభేదము ననుసరించి క్రియలు మారుచుండును — రాముడు వచ్చుచున్నాడు, సీత వచ్చుచున్నది, చిలుక వచ్చుచున్నది. త. రామన్ వందాన్, సీదై వందాళ్, కిళి వందదు. సంస్కృతము నందుగాని, ఆంగ్లము నందుగాని లింగభేదము ననుసరించి క్రియ మారదు — సఃగచ్ఛతి, సాగచ్ఛతి, తత్ గచ్ఛతి; **Rama eats a fruit, Sita eats a fruit, Parrot eats a fruit.**

తెలుగు వాక్యము నందొక క్రియకు పెక్కు కర్తలున్నపుడు క్రియకు సమీపమున గల కర్త ననుసరించి క్రియ యుండును — నా యల్లురు నేనునై తన్నుంజేయుదు నాగమ బాహ్యు (కు. సం. 2–6), తమ సేనలు వారును విశ్రమించిరి. (ఉత్తర హరివంశం 4–31) ఈ విషయమునే ప్రౌఢవ్యాకర్త 'అనేక కర్తృక క్రియకు సమీపకర్త యొక్క లింగవచనంబులగు' (వాక్య–15) ననెను

సూరి ఒకచో 'ఆత్మార్థంబభి హితంబగుచోఁ దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతుజ విశేషణంబుల కగు' (క్రియ – 120) నని — రాముడు రావణుం బరిమార్చి సీతయుం దాను సౌమిత్రిసహితంబుగం బుష్పకారూఢుండయి సాకేతంబున కేతెంచె' నను దాని నుదాహరించెను 'రూఢులయి ఏతెంచిరి'అని వాడియుండవచ్చును.

ఒకానొకచో సహార్థంబున యుష్మదస్మ దర్థంబులభిహితంబులగునపుడు క్రియలు తత్కర్తృకంబులు విభాషనగు. (ప్రౌ. క్రియ–26) విప్రకులుండ వెల్వడుము వేగము నీవును నీ నిషాదియున్ (భా. 1–2–65).

మహద్వాచకముల సమూహము ను సూచించుపదము అమహద్వాచకమే అయ్యును దానికి సంబంధించిన విశేషణములు, క్రియ మున్నగునవి మహత్కార్య యోగ్యములగును. మహత్సమూహార్థక శబ్దం బమహత్కార్య యుక్తంబయ్యు దద్విశేషణ క్రియలు మహత్కార్య యోగ్యంబులు విభాషనగు (శబ్ద–17) — గీర్వాణ ప్రభుండాదిగ గీర్వాణ గణంబు గాలకేయుల తోడన్ గర్వించి రణముచేసి రఖర్వ పరాక్రములు కడిమిఁగడు నుద్ధతులై (భా. 3–3–41)

ద్రావిడభాషలలో కర్మణ్యర్థకరచనలేదు. తరువాతికాలపు లో సంస్కృత ప్రభావముచే నీ భాషలయందు ఈ రచన ప్రవేశించినది — ఇది నా చేత చేయబడినది. త. ఇదు ఎన్నాల్ సెయ్యప్పట్టదు. నన్నయాదుల కావ్యభాషలో ఈ కర్మణ్యర్థక రచన సంస్కృతము నందు వలె చాల ఎక్కువగ గలదు.—అగ్నిహోత్రముల్ పోఁడిగ వేల్వఁగాఁబడియె (బా. 1–3–112), భామ భరియింపఁబడుఁగాన భార్యయయ్యె. (భా. 1–4–228) ఈ రచన ఆంగ్లము లోకూడనక్కడక్కడకలదు. Ravana was **killed by Rama**

'కొన్నియెడలవాక్యంబు వాక్యాంతర గర్భంబు నగుచుండును.' (వాక్య–21) ఇందుల కెంత కాలంబయ్యె రాని కారణం బేమి (భా 3–2–30) ఇందులకు రాని కారణం బేమి అను వాక్యము మధ్యమున 'రాక ఎంత కాలంబయ్యె' అను వాక్యాంతరము చేరిన దన్నమాట.

వాక్యములో 'అన్యయుష్మ దస్మత్కార్యంబులం దుత్తరోత్తరంబు బరేయంబు'లుగ నుండును. (బా. కారక. 36) — వారును మీరును ధన్యులరు, మీరును మేమును ధన్యులము.

నామవాచకములపై సర్వనామా వశిష్టములైన "వు, రు, ను, ము" అను మధ్యమ, ఉత్తమ పురుషలోనివి చేరి ప్రయోగించుట కనబడుచున్నదట. నేను భవత్తనూజుడ—ను, మేము ధన్యుల—ము, నీవు దేవత—వు, మీరు ఆరాధ్యుల — రు — నున్నగు రచన ప్రాచీన కవుల నుండి నేటివరకు వచ్చుచున్నది.

క్రియా విరహిత రచన ప్రాఙ్నన్నయ శాసనములలో నెక్కువ ప్రాచీన కావ్యము లందును కనబడుచున్నది — నిందు మనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రులయందు నిక్కమీ రెండును రాజులందు విపరీతము (భా. 1–1–100), రవి కులశేఖరుండు కవిరాజ శిఖామణి కావ్యకర్త సత్కవి భువి నన్నె చోడుడటె (కు సం. 1–57)

ఏ భాషయందైనను వాక్య ప్రయోగ సమయమున సౌలభ్యమును, శ్రవణ సుభగత్వమును, ఆనురూప్యమును వక్త ఎల్లప్పుడు గమనించుచునే యుండును పద్య రచనలోగాని, గద్య రచనలోగాని వైవిధ్యము కొరకు, విచ్ఛిత్తి విశేషము కొరకు వాక్యమునందలి పద క్రమమును మార్చుచుందురు అన్య భాషా సంపర్కము వలన తెలుగు భాష ఎన్ని మార్పులకు లోనైనను, ఎన్ని విధానములను ఎరవు తీసికొనినను వాక్యరచనా విధానమున స్వతంత్రతను కోల్పోవక చాలవరకు నిలుపుకొనియే యున్నది.

శ్రీ జి. జవహర్‌లాల్

"ఆంధ్రదేశమున రాష్ట్రకూటుల కాలమున జైనమతము"

భారతదేశమున విలసిల్లిన అనేక మతములలో అత్యంత ప్రాచీనమైనది జైనమతము. జైనమత సాంప్రదాయిక కథనం ప్రకారం ఇరువదినల్గురు తీర్థంకరులచేత జైనమతం బహుళ ప్రచారం గావింపబడి వ్యాప్తిలోనికి వచ్చినది. సత్యమాలోచించినచో ఇది కొంత అతిశయంగా తోస్తుంది. కాని జైనమతంయొక్క పారంపరికమైన ప్రాచీనతకు యిది ఒక సూచనగా మాత్రం భావింపదగియున్నది. క్రీస్తుకు మున్నూరేండ్లకు పూర్వం భద్రబాహువుచే వ్రాయబడిన 'కల్ప సూత్రములనే' గ్రంథంలో[1] ఈ జైన తీర్థంకరులను గూర్చి వివరింపబడినది. ఆంధ్రదేశమున జైనమత ప్రచారము క్రీస్తుకు ఆరువందలఏండ్లకు పూర్వమే ఆంధ్రభూమికి దాపునవున్న కళింగదేశములో వర్ధమానమహావీరుడు స్వయముగా వచ్చి ప్రచారం చేసినపుడే వ్యాప్తిలోనికి వచ్చి ఉండునని 'హరిభద్ర వృత్తిని'బట్టి తెలియుచున్నది ఇందుకు ఉపబలంగా ఏ శాసనాధారాలు లభింపకపోయినా జైనమతం కళింగలో వ్యాపించినవిధం, వారి సాంప్రదాయిక కథనం—ఆంధ్రదేశానికి కళింగంనుండి జైనం చొచ్చుకొనివచ్చి ఉండుననే ఊహను మనకు కలిగిస్తూంది.

రాష్ట్రకూటుల కాలాన ఆంధ్రదేశంలో జైనమతం ఏ స్థితిలో ఉండినదో పరిశీలించుటకు పూర్వం ఆంధ్రదేశంలో తత్పూర్వ జైనాచార్యుల ప్రచార వ్యవహారాలు ఎలా ఉండినవో కొంత తెలిసికోదగియున్నది. దక్షిణభారతంలో జైనమతప్రచార్యుడు ప్రథమాచార్యుడుగా గుర్తింపబడిన కొండ కుండా చార్యుల నివాస ప్రబోధము జైనమతచరిత్రలో ఒక మైలురాయిగా పేర్కొనదగియున్నది ప్రత్యేకించి దిగంబర జైన పక్షీయులకు కొండ కుండాచార్యులపేరు అత్యంత పవిత్రమైనదియు, ఉత్తేజకరమైనదియు చాలమంది జైనగురువులు తాము కొండ కుండాచార్య శిష్య పరంపరకు చెందినవారమని చెప్పుకొనుట గౌరవంగా భావించినారు. కొండ కుండాచార్యులు అనంతపురంజిల్లాకు చెందిన కొనకొండ్ల గ్రామం దాపునగల ''రసాసిద్ధుల గుట్ట''అను కొండపై నివశించి ఉండినట్లు జైనమత గ్రంథాలు, శాసనాలు సాక్ష్యమిస్తూ ఉన్నాయి. కొనకొండ్లలోనే లభించిన ఒక శాసనమే[2] మహాసమర్థుడైన కొండ కుండాచార్యుల జన్మస్థలమిది అని లోకమునకంతకు వెల్లడిచేయుచున్నది. కొండ కుండాచార్యుల మరొకపేరు ''పద్మనంది'' కొండ కుండాచార్యులు ప్రాకృతభాషలో 84 పాహుడులువ్రాసి ప్రఖ్యాతిగన్నవాడు. కొండకుండాచార్యుడు మూలసంఘమున ప్రధానుడుగా మరియు దక్షిణభారతమున జైనమత విచారధారలో తీవ్రతార్కిక వాదములకు ప్రారంభకులైన జైనగురువులలో ప్రథమాచార్యుడుగా ఖ్యాతిగాంచెను. కొండకుండాచార్యులు దేశమంతయు సంచరించినవాడు. అతని అనుయాయులుకూడ పెద్దసంఖ్యలో ఉండినారు ఆ యాచార్యుల నిరంతర సంచారములతో, అద్భుతమైన తర్కవాదాలతో జైనమతం నూతనోత్తేజం పొందినది. కొండకుండాచార్యులు క్రీ.శ ప్రథమశతాబ్దిలో నివసించి యున్నట్లు డాక్టర్ జ్యోతిప్రసాదజైనగారి అభిప్రాయము.

దక్షిణభారతమున ప్రఖ్యాతుడైన మరియొక జైనగురువు సింహనంది. ఈ ఆచార్యుడు వక్రగచ్ఛ అనుపద్ధతికి నాయకుడు. ఈ పద్ధతిని ప్రారంభించిన గురువు కొండ కుండాచార్యుడే ఇతర జైనగురువులవలె సింహనందిపేరు కర్ణాటక దేశమున తలకాడు రాజధానిగా పశ్చిమ గాంగరాజులు రాజ్యస్థాపనచేయు సందర్భమున గుర్తింపబడినది. కడపమండలంలో సిదవటం తాలుకాకు చెందిన పెన్నఒడ్డున గల పేరూరు అను గ్రామమున ఆశ్రమము కల్పించుకొని జైనమతబోధకుడై, పేరుగాంచిన సింహనంది నిస్సహాయులై దేశత్యాగంచేసివచ్చిన దాడిగ, మాధవుడు అనే యిద్దరు ఇక్ష్వాకు వంశరాజకుమారులకు ఆశ్రయమిచ్చి వారిని సకలకళా ప్రవీణులను చేసినట్లు చరిత్ర చెప్పుచున్నది. పేరూరు నేడు గంగపేరూరు అను పేరునున్నది. సంగ్రహముగా కొండకుండాచార్యులకు కొనకొండ్ల ఎట్టిదియో సింహనందికి పేరూరు అట్టువంటిదని చెప్పవచ్చును

సామాన్యంగా జైనులు జనావాసముల నడుమ నుండక దూరంగా కొండలపై ఉండుటచే వారికి ఏ కొండ గుహలో వారి తాత్కాలిక నివాసానికి ఉపయోగపడుతూ ఉండినాయి. కాగా జైనుల ఆశ్రమాలు ఎట్టి ఆడంబరాలు లేని సాధారణ నివాసాలుగా ఉండేడివి. కప్పారావుపేట (కరీంనగరు జిల్లా), గుంటుపల్లి (పశ్చిమగోదావరి జిల్లా), పెంకలపాడు (కడపజిల్లా), మొదలగు తావుల కనిపించు జైనుల గుహలు, పలురకాలైన జైన శిల్పకళా ఖండాలు ఆంధ్రదేశంలో రాష్ట్రకూటులు అధికారానికి రాక పూర్వమే జైనమత ప్రభావం విస్తృతముగా వ్యాపించి ఉండినదని—నిస్సంశయంగా చాటుతూ ఉన్నాయి.

క్రమంగా జైనమతం బలమైన రాజాదరాన్ని పొందగల్గుట ఆ మతానికి అదృష్టమేనని చెప్పవచ్చును. వాఙ్మయపరంగా, శాసనాలు ఆధారంగా చూచినా జైనమతానికి ఆంధ్రదేశమున రాష్ట్రకూటుల కాలము స్వర్ణయుగముగా నిరూపింపదగియున్నది. జైన రచయితలు ఆ కాలముననే పెక్కు భాషలయందు పెద్ద మొత్తములో అమూల్యమైన రచనలు అనేక విషయాలపై సాగించి ఉండుట చూడగా ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రములలో రాష్ట్రకూటుల కాలాన జైన మతము అత్యున్నత దశకు చేరియుండినదని నిస్సంశయంగా చెప్పదగి యున్నది. ఆ కాలమున ఇంతమాత్రమేగాక జైన గురువులు, మతాధిపతులు జైనమత ధర్మాలను, నియమాలను ప్రబోధించుటతో నిలువక లౌకికంగా — సాంఘికంగా కూడా ప్రజా నాయకులుగా రాజులకు, సామంతులకు మార్గదర్శకులుగా వ్యవహరింపసాగినారు. గురువులలో కొందరు వాస్తవంగానే రాజకీయములందు రాజులకు వారి సామంతులకు శిక్షకులుగా ఉండినారు. రాష్ట్ర కూటు సైన్యంలో అన్ని తెగలవారును చేరి ఉండిన విషయం గమనింపదగి యున్నది. మత విశ్వాసాన్ని బట్టి చూచినచో రాష్ట్రకూట సేనాధిపతులలో చాల మంది, బంకయ్య, శ్రీవిజయ, నరశింహ మొదలయిన వారు శుద్ధ జైనులుగా కన్పిస్తారు ఈ కాలంలో ఆంధ్ర దేశాన హిందూమతము, జైనమతము, బౌద్ధ మతము అను మూడు మతాలు మాత్రమే ప్రజలు అనుసరించినారు రాష్ట్రకూటుల కాలాన ఆంధ్ర దేశమున జైన మతము సార్వదేశియమైన మతముగా చేయబడకపోయినను—హిందూమతమునకు బలమైన ప్రతిపక్షంగా ప్రజల యభిమానంతో నిలిచి యుండినదని చెప్పవచ్చును.

రాష్ట్రకూటుల కాలాన చాళుక్యరాజులు వేంగి తమ రాజధానిగా ఆంధ్రదేశ తూర్పు భాగాలను ఏలుచుండినారు. చాళుక్య రాష్ట్రకూట రాజుల నడుమ ఎన్నో ఘోరపోరాటాలు సాగి రక్తపాతం సంభవించినది. అట్లే వివాహాది సంబంధాలతో సాన్నిహిత్యమూ ఏర్పడి ఉండినది. దాని ఫలితంగా ఎందరో జైనులు కర్ణాటకం నుండి ఆంధ్ర దేశానికి రాకపోకలు సాగించి ఉండినారు

క్రీ. శ. 624 లో వేంగి యందు తూర్పు చాళుక్య రాజ్య స్థాపన ఆంధ్రలో జైనమత చరిత్రయందు అభివృద్ధి పథము వైపు ఒక మలుపు తిరిగినట్లయినది. చాళుక్యులు కర్ణాటకమునుండి వచ్చినా ఆంధ్రులుగనే నిరూపించుకొన్నట్లు కనబడుచున్నది చాళుక్య రాజ వంశీయులగు రాజులలో పెక్కుమంది వైదికమైన బ్రాహ్మణ మతమునే ఆదరించి అనుసరించినా కొందరు జైన మతమును అభిమానించిన వారు గూడా ఉన్నారు. క్రీ శ 718–752 సం. కాలాన ఉండిన మూడవ విష్ణువర్ధన చాళుక్యరాజుచే ఇవ్వబడిన ముషిణి కొండ తామ్ర శాసనమును బట్టి[4] బెజవాడలో 'నడుంబివసది' అనే జైన నిర్మాణము ఆంధ్రదేశంలో మొదటిదిగా కనబడుచున్నది. క్రీ. శ. 624–642 సం. కాలంలో తూర్పు చాళుక్య రాజ్యస్థాపకుడైన కుబ్జ విష్ణువర్ధన చాళుక్యుని ధర్మపత్ని అయ్యన మహాదేవిచే నిర్మింపబడిన నడుంబవసదికి ఖర్చులకై ఇవ్వబడియుండిన—ముషిణి కొండ గ్రామాన్ని మరల పునరుద్ధరించినట్లుగా ఈ తామ్ర శాసనం వివరించినది. ఇంతేగాక ఈ వసదికి చెందిన గురుపరంపరను, వారనుసరించిన సంఘాన్వయమునకు— చెందిన సౌరాష్ట్ర రేక కావూరి గణానికి చెందిన వైనాన్ని వివరించుచున్నది—కాని, నేడీ 'నడుంబవసది' మనకు కానరాకున్నది.

క్రీ. శ 750 ప్రాంతాన మూడవ విష్ణువర్ధనునికి తర్వాత రాజయిన మొదటి విజయాదిత్యుని కాలంలో బాదామి చాళుక్య రాజ్యం రాష్ట్రకూటుల చేత ఆక్రమింపబడినది. రాష్ట్రకూటులలో రెండవవాడయిన మొదటి కృష్ణుని కాలాన రాష్ట్రకూటులకు, వేంగీ చాళుక్యులకు మధ్య విరోధము మొదలయినది. రాష్ట్రకూట చక్రవర్తి గోవిందుని చేతిలో ఘోరంగా ఓడిపోయిన మొదటి విజయాదిత్యుడు పెద్ద మొత్తంతో నిర్బంధంగా శాంతిని నిలుపుకొన్నాడు. ఒక కథనం ప్రకారం మొదటి రాష్ట్రకూట కృష్ణుడు — ఆంధ్రమున తన ప్రతినిధులుగా కొందరు జైన బ్రాహ్మణులను నియమించినట్లు తెలియుచున్నది. ఈవిధంగా రాష్ట్రకూటుల పెత్తనం, ప్రాభవం ఆంధ్రదేశంలో క్రమంగా నాటి నుండి విస్తరించినది. చాళుక్య నాల్గవ విష్ణువర్ధనుడు తన కూతురు శీల మహాదేవిని రాష్ట్రకూట చక్రవర్తి ధ్రువునకిచ్చి పెండ్లిచేసినాడు.[5] ఈ నాల్గవ విష్ణువర్ధనుని కాలాననే రామతీర్థం ఆంధ్ర దేశంలో జైనమతానికి ఒక బలిష్టమైన కేంద్రంగా పెంపొందినదనడానికి ఇచట విరిగిన ఒక జైన తీర్థంకర విగ్రహం పాదపీఠంపైగల శాసనమే ప్రత్యక్షమైన సాక్ష్యము.

తూర్పు చాళుక్య రాజులలో రెండవ అమ్మరాజు విష్ణువర్ధనుడే క్రీ. శ. 945–70 ఆంధ్రదేశమున జైన మతానికి మహోపకారిగా నిలిచినాడు. అతడు తన బిరుదావళిలో పరమ మాహేశ్వరుడనని చెప్పుకొనియు, జైన మందిరాలకు, జైనమతాచార్యులకు ఔదార్యంతో పెక్కు వసతులు కల్పించి వేయించిన శాసనములే అమ్మరాజునకు జైన మతంపైగల అభిమానాన్ని వేనోళ్ళచాటి చెప్పుచున్నాయి. కర్మ రాష్ట్రాధిపతి (నేటి గుంటూరు) కటకరాజు దుర్గరాజు ఒక జైనాలయాన్ని నిర్మించి వ్రాయించిన మలియంపూడి శాసనం[6] అమ్మరాజు సామంతుడు కమ్మరాష్ట్రాధిపతియునగు కటకరాజు దుర్గరాజు మలియంపూడిలో ఒక జైనాలయం కట్టించినట్లును అమ్మరాజే స్వయముగా ఈ గ్రామదాన శాసనాన్ని ఆ ఆలయానికి ఇచ్చినట్లు చెప్పుచున్నది.

ఆ ఆలయాధిపతి యాపనీయ సంఘానికి చెందిన జైనాచార్యుడు "శ్రీమందిరదేవముని" అని అందేకలదు. అమ్మరాజు ఇచ్చిన మరొక గ్రామదానశాసనం కలుచుంబర్రుకు చెందినది.[7] అందులో "అడ్డకలిగచ్ఛ" పద్ధతికి చెందిన వాలహారి గణశాఖీయు డైన అర్హనంది అను జైనాచార్యుని వశమునఉన్న ఒక ఆలయానికి ఈనాటి 'కంచుమర్రి' గ్రామం దానం ఇవ్వబడినట్లు పేర్కొనుచున్నది. అమ్మరాజు తన సేనాధిపతులైన భీమ, నరవాహనుల ప్రార్థనపై పెదగాబెవర్రు అను గ్రామాన్ని విజయవాడలోని జైన వసదికి, కొన్ని జినాలయాల నిర్మాణానికి దానమిచ్చినట్లు అమ్మరాజు మచిలీపట్నం శాసనం[8] వివరించుచున్నది ఈ ఆలయాలు, వసదియు జైనగురువు 'జయసేనుని' అధీనమున వుండెడివి.

అమ్మరాజు నెంత శివభక్తుడైనా తనసేనాధిపతులు, అధికారులు తనకు విధేయులుగా విశ్వాసంతో కార్యాలు నెరవేర్చగలందులకై ఆ వుద్యోగుల ప్రార్థనమేరకు జైన వసదులకు, గురువులకు విరివిగా దానాలు చేసినట్లు పైన పేర్కొన్న అమ్మరాజు దానశాసనాలు స్పష్టంగా నిరూపిస్తున్నాయి. కాని నేడా ప్రాంతంలో యివే (వసదులు) వియు కానరావు.

ఈ కాలంలో పశ్చిమాంధ్రసీమలో కూడ రాష్ట్రకూట చక్రవర్తుల వారి సామంతుల ఏలుబడిలో రాష్ట్రకూటులు జైన మతాభిమానులగుటచే జైనమతము మిక్కిలి అభివృద్ధిదశలో ఉండినది. క్రీ.శ. 814–880 సం. కాలాన ప్రభువుగానున్న అమోఘవర్ష మొదటి నృపతుంగునకు ఆదిపురాణ గ్రంథకర్త జినసేనుడు గురువుగా ఉండుటే ఆ రాజునకు జైనమతంపైగల అభిమానాన్ని చాటుచున్నది. మరియు గణితశాస్త్రంలో గొప్ప పండితుడైన జైన మహావీరాచార్యుడు ఈ అమోఘవర్షుని జైనస్యాద్వాదాన్ని అనుసరించే వాణ్ణిగా పేర్కొన్నాడు అమోఘవర్షుడు తనసేనాధిపతి బంకేశరాయని ప్రార్థనపై ఒక జినాలాయానికి కొంత దానమిచ్చినట్లున్నది ఆ రాజు తనస్థానంలో యువరాజునో, మంత్రి మండలినో రాచకార్యాలు చూడడానికి నియోగించి తాను అడపా దడపా విశ్రాంతికో, కాలక్షేపానికో, జైన వసదులకో వెళ్లి జైన గురువుల సన్నిధిలో కాలంగడిపేవాడట.[9] అమోఘవర్షుడు తన తర్వాత పదవికి రావలసిన తన మొదటికుమారుడు కృష్ణునికి చక్కని శిక్షణకై జైన పండితుడగు గుణభద్రాచార్యుని నియోగించినట్లు తెలియుచున్నది. ఏ అనుకూల ప్రతికూలాధారాలు లేకున్న అమోఘవర్షుడు వేంగీచాళుక్య గుణగ విజయాదిత్యుని జయించుటలో యీ ఆంధ్రదేశానికి చక్రవర్తిగా చరిత్రకారులు గుర్తించినారు. ఆ కాలాన రామతీర్థం, చిక్కావోలు, దానవులపాడు ప్రసిద్ధ జైన క్షేత్రాలుగా ప్రఖ్యాతిగాంచివుండినాయి. అమోఘవర్షుని సేనాధిపతులు వనవాసి రాష్ట్ర రాజప్రతినిధులు అయిన బంకయ, అతని కొడుకు లోకాదిత్యుడును జైనమతానుయాయులలో మిక్కిలి ముఖ్యులు, పట్టుగొమ్మలుగా పేరు గాంచినవారు. కాగా అనంతపురం జిల్లా హేమావతిలోని ఒక శాసనం బంకయ్యకొడుకు కుందటి అనువాడు జైనదీక్షపూని నెలదినాలు సన్యాసపద్ధతిలో ఉపవసించి ప్రాణత్యాగంచేసిన విషయం తెల్పుచున్నది. కొన్నూరు శాసనాన్నిబట్టి బంకయ్యకు కుందటిఅను కొడుకు ఉన్నట్లును, వాడు నిడుగుంగి–12అను ప్రాంతాన్ని తనతండ్రిబంకయ్య ఆనతిపై అమోఘవర్షుని 20 వ రాజ్యవర్షమున ఏలుచున్నట్లును మనకుతెలుపుచున్నది.

అమోఘవర్షుని తర్వాత అతని కుమారుడు రెండవకృష్ణుడు రాష్ట్రకూట రాజ్యాధిపతి అయినాడు ఈ కృష్ణుడు గాఢ జైన మతాభిమాని. ఈ కృష్ణుడు ఆదిపురాణంలో చివరి అయిదు అధ్యాయాలకు కర్తయైన జైనపండితుడు గుణభద్రుని పర్యవేక్షణలో విద్యలు, శిక్షణ పొందినవాడుగా మనకు ఇంతకుముందే తెలిసియున్నది. వర్ధమానమహావీరుని పవిత్రోపదేశము అహింసను రాష్ట్రకూట కృష్ణుడు దేశ విదేశ రాజకీయములందు అంతగా పాటించినట్లు అగుపడదు. ఏ ఆధారాలు లేకపోయినా ఈ కృష్ణుడు ఎడతెగక సాధించిన అనేకయుద్ధాలే ఇందుకు నిదర్శనం కృష్ణుడు గూడా తన తండ్రివలె వేంగిని తన అధీనంలో వుంచుకొన్నవాడుగా పరిగణింపబడినాడు. ఆ కాలంలో రాష్ట్రకూట, చాళుక్య, పశ్చిమ గాంగరాజుల విజయశీలురైన సేనాధిపతులు అందరునూ జైనులే. పరికించి చూడగా రాష్ట్రకూటుల కాలాన జైనుల పవిత్ర నియమమైన అహింస యొక్క పూర్ణ రూపము సామాన్యులకు కొఱకు గాదనీ అది కేవలం జైన సన్యాసులకు, సన్యాసినులకు — మాత్రమేననీ అనుకోవలసి యున్నది. ఏలననగా రాష్ట్రకూటుల కాలాన రాజులు, వారి సేనాధిపతులు నిరంతరం రక్తపాత ప్రధానమై హింసాత్మకమైన యుద్ధ చర్యలు జైనమత ప్రభావానికి వశులయి ఉండియు సాగించి యుండుటే కారణం.

రాష్ట్రకూట రెండవ కృష్ణుని తర్వాత అధికారానికి వచ్చిన మూడవ ఇంద్రుడు కూడ గొప్ప జైన మతాభిమానియే. అతని పూర్వీకులవలె ఇంద్రుడు కూడ ఆంధ్ర రాష్ట్రాన్ని తన అధీనమున ఉంచుకొన్నాడే. ఇంద్రుని పరిపాలన కాలాన నిజామాబాదు జిల్లాలో బోధన్, కడప జిల్లాలోని దానవులపాడు జైనమత ముఖ్య యాత్రా స్థలాలుగా పెంపొంది ఉండినవి. పోదన నగరం (నేటి బోధన్) అతని పాలనలో తొలి దినాల్లో జైనమతానికి ఒక బలిష్టమైన కేంద్రంగా ఉండెడిది పోదన నగరం బాహుబలికి రాజధానిగా గౌరవ స్థానాన్ని పొంది ఉండినట్లు జైన గ్రంథాలు వివరించుచున్నవి. అట్లే పార్శ్వనాథ తీర్థంకరుని[10] జీవితంలో కూడ ఈ నగరానికి సంబంధం ఉన్నట్లు ఉల్లేఖింపబడియున్నది. ఈనాడు కూడ బోధన్ నగరం ప్రాచీన జైన శిల్పకళా ఖండాలకు, శాసనాలకు, నిర్మాణాలకు నిలయంగా ఉన్నది. శ్రావణ బెళగోలలోని ఒక శాసన ప్రకారం[11] ఆదినాథుని కుమారుడు భరతుడు బోధన పురమున 525 ధనస్సుల ప్రమాణం గల బాహుబలి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు పేర్కొనుచున్నది. ఎందరో కళాస్రష్టలచే నిర్మింపబడి పదర్శింపబడిన ఈ ప్రాంతంలోని కళాఖండాలు కాలక్రమాన సామాన్య జనుల కంటికి కగపడకుండ మరుగుపడిపోయినాయి. బోదన బాహుబలి శక్తివిన్న చాముండరాయడు ఈ ప్రాంతాన్ని దర్శించి శ్రావణ బెళగోళలో గోమటేశ్వర (బాహుబలి) విగ్రహాన్ని బోదన నగరంలోని విగ్రహం నమూనా (Replica)యే నిర్మించి ప్రతిష్ఠించినాడు ఇంద్రుడే కడప జిల్లా దానవులపాడు జైనాలయంలోని శాంతినాథునకు పాదపీఠాన్ని, స్నానపీఠాన్ని[12] నిర్మించి యిచ్చినట్లు తెలియుచున్నది. కళాత్మకములైన స్తంభాలపై, విగ్రహ పాదపీఠాలపై, శిలాఫలకాలపై అసంఖ్యాకాలైన శాసనాలు ఇచట లభించినాయి [13]

దానవులపాడుకడ పెన్న ఇసుక దిబ్బలలో పూడియుండిన పార్శ్వనాథ తీర్థంకరుని ఆలయముగల ఇటుక కట్టడము త్రవ్వకాల (Excavations) లో బయల్పడినది. ఇచట లభించిన ఒక శాసనం[14] మూడవ ఇంద్రుని ముఖ్యసేనాధిపతి మహావీరుడైన శ్రీవిజయుడు దానవులపాడులో సన్యాసన దీక్షపూని దేహత్యాగం చేసిన విషయం తెలుపుచున్నది. ఇచట కొన్ని శాసనాలు జైనమతం స్వీకరించిన వైశ్యులు మొదలగు సామాన్య భక్తుల సమాధులను

గూర్చి తెలుపుచున్నవి. దీనినిబట్టి చూడగా దానవులపాడు జైన మతంలో భక్తి విశ్వాసాలుగలవారికి (సుదూర వాసులకు కూడ) దేహాభిమానం విడచి జైనమత పద్ధతులలో ఆత్మత్యాగం చేసికొనుటకు అనువైన అత్యంత పవిత్రస్థలం (Tirtha)గా పేరు పొంది ఉండినదని తెలియుచున్నది. జమ్మలమడుగు కైఫీయతు ప్రకారం ఇప్పటి దానవులపాడు పూర్వం ''కురుమర్తి'' అని పిలువబడేదని తెలియుచున్నది. ఇప్పటి దానవులపాడను పేరు ఈ గ్రామానికి ప్రాణత్యాగం చేయగోరివచ్చి 'సన్యాసనా మరణం, సల్లేఖనా మరణం' పద్ధతులు అవలంభించుటచే 'దానవుల నివాస'మన్న అర్థంలో ఏర్పడి యుండును. మూడవ ఇంద్రుని దానశాసనాలనుబట్టియు, రాష్ట్రకూట నాల్గవ గోవిందుని హలహర్వి[14a] శాసనాన్నిబట్టియు రాష్ట్రకూటుల కాలాన పశ్చిమాంధ్రసీమలో జైనమతం అత్యున్నతదశలో ఉండినట్లు నిర్ధరింపవచ్చును.

రాష్ట్రకూట మూడవ కృష్ణుడును, అతని సామంతులు (Vassals) ముఖ్యంగా వేములవాడ చాళుక్యులను జైనమతాన్ని అభిమానించి, ఆదరించి అనుసరించిన వారిలో ముఖ్యులు. 'మాన్యఖేత' నగరంలో మూడవ కృష్ణుని రాజసభ ఆంధ్రదేశం నుండి వలస వచ్చిన కవిపండితులచే అలంకరింపబడి ఉండెడిది కృష్ణునిమంత్రి గజాంకుశుడు ఒక పెద్ద పండితుడు, కవి. ప్రసిద్ధ కన్నడ కవి పొన్నప్ప శాంతి పురాణకర్తయు కృష్ణుని సభ నలంకరించినవాడే. కృష్ణుడు పొన్నకవిని ఉభయ కవి చక్రవర్తి బిరుదుంతో సన్మానించి గౌరవించినాడు. పొన్నడు గుంటూరు జిల్లాలోని పుంగనూరునుండి మాల్ఖేడు చేరినాడు.[15] ఈ పొన్నకవియే తెలుగున ఆదిపురాణాన్ని భారత విరాట పర్వాన్ని రచించినట్లు కళాప్రపూర్ణ నిడదవోలు వెంకటరావుగారి యభిప్రాయం.[16]

రాష్ట్రకూట సామంతులలో ముఖ్యులైన వేములవాడ చాళుక్యులు జైనమతాభిమానులని పైనిచెప్పియున్నాను. క్రీ.శ.930 – 955 సం॥ కాలాన రెండవ అరికేసరి వేములవాడ చాళుక్య రాజ కుటుంబంలో మిక్కిలి గణ్యుడైన గొప్ప వ్యక్తిగా చెప్పదగినవాడు. కన్నడ భాషయందు ప్రథమ గణ్యుడైన మహాకవి పంపనకు ఆశ్రయమిచ్చినవాడే ఈ అరికేసరి కరీంనగర్ జిల్లాకు చెందిన కుర్క్యాల గ్రామానికి దాపునగల బొమ్మల గుట్టపై ఒక జైనమందిరాన్ని 'త్రిభువన తిలక' మను పేరుతో నిర్మించి, అందు తీర్థంకరులు 24 విగ్రహాలను, చక్రేశ్వరిదేవిని ప్రతిష్ఠించిన జినవల్లభుడు ప్రఖ్యాత కవియేగాక పంప మహాకవికి అనుంగు సోదరుడు అని కుర్క్యాల శాసనం [17] వెల్లడి చేయుచున్నది. పంప మహాకవికి జైన వాఙ్మయంలో శుభచంది అను మరియొక పేరు గలదని జాగీర్దారు [18] విశ్వాసం బోధను నగరంలోగల శుభనంది సమాధి పరికించిచూడగా సంపనిపేరు లేకున్నను పంపన్న ఇచట సమాధి అయ్యెనని భావింపవలసియున్నది ఇప్పటికీ అచటి ప్రజలు దానిని 'పంప సమాధి'గా భావిస్తూ ఉన్నారు.

వేములవాడ చాళుక్యులలో చివరివాడైన రెండవ బద్దెగ కూడ జైనమతంపైన దృఢమైన భక్తివిశ్వాసాలు చూపినవాడే. వేములవాడ రాజరాజేశ్వర దేవాలయం ఆవరణలోగల ఒక జైన విగ్రహం పాదపీఠంపైగల వ్రాత [19] ననుబట్టి రెండవ బద్దెగ భూపాలుడు వేములవాడలో 'శుభధామ' జినాలయమను పేర ఒక మందిరం నిర్మించి గౌడసంఘానికి చెందిన తన జినగురువు సోమదేవసూరికి అప్పగించి దేవాలయం 'దిన వెచ్చాల'కై 'వనికటుపు'లు అను గ్రామాన్ని ఇచ్చినట్లు తెలుపుచున్నది మూడవ అరికేసరి బద్దెగని కుమారుడు. ఇతడుకూడ జైనభక్తుడే. అరికేసరి తామ్ర శాసనమొకటి పర్బణి [20]లో దొరికింది. అందులో అరికేసరి సబ్బి–1000 మండలంలోని రేపాక–12 సీమలోఉన్న వనికటుపులు గ్రామంలోని కొంతభూమిని తన తండ్రి నిర్మించిన శుభధాము జినాలయం మరమ్మత్తులకు, సంరక్షణకు కల్పించి తన తండ్రి గురువు అయిన సోమదేవసూరి వశంలో ఉంచినట్లు చెప్పబడినది. తర్వాత కొంత కాలానికి ఈ సోమదేవసూరినే ఆ దేవాలయ స్థానాపతిగా అరికేసరి నియమించినాడు. ఆ కాలాన సోమదేవసూరి ప్రఖ్యాత పండితుడేగాక సంస్కృతంలో గొప్ప కవిగా కూడ కీర్తి కాంచినవాడు. అతడు సంస్కృత భాషయందు 'యశస్తిలక, చంపువు, నీతివాక్యామృతము' మొదలయిన ఉత్తమ రచనలెన్నో గావించి శ్యాదవాదాచలసింహ, తార్కిక చక్రవర్తి, కవికులరాజవంటి ఉత్తమ బిరుదములు పొందియుండెను.

ఈవిధంగా రాష్ట్రకూట సామంతులైన వేములవాడ చాళుక్యులు జైనమతంపై తమకుగల గాఢాభిమానాన్ని ఘనంగా ప్రదర్శించినారు వారికాలంలోనే ఆంధ్రదేశంలో జైనమతం రాజాదరంతో అత్యుత్తమ గౌరవాన్ని, ప్రతిష్ఠను పొందిఉండినది సుస్థిర నిష్కళంకమైన ప్రవర్తన ప్రకృతి దృశ్యముల యథాతథ చిత్రణ, వస్తునిత్రణలో నిర్దుష్టమైన నేర్పు, అనర్గళమైన కవితాధార గలిగి పంపమహాకవి కన్నడ వాఙ్మయంలో అసమానంగా వెలుగొందినాడు ఆ పంపకవి రెండవ అరికేసరి సభను అలంకరించి నట్లు చెప్పకొన్నాము. పంపని రచనలు రెండు—అందు పంప భారత మని పేరుపొందిన విక్రమార్జున విజయం ఒకటి, రెండవది ఆది పురాణం పంపని చిన్నితమ్ముడు జినవల్లభుడు. ఇతడూ అన్న పంపన వలనే జైనమతాభిమానిగా, కవిత్వ కళలో మిక్కిలి సమర్థునిగా, గొప్ప విద్యావేత్తగా కుర్క్యాల శాసనం వెల్లడి చేయుచున్నది

రాష్ట్రకూటులలో కడపటివాడైన నాల్గవ ఇంద్రుడు కఠోరమైన జినసల్లేఖన దీక్ష వహించి దేహత్యాగం చేసినట్లు తెలియుచున్నది. ఈ ఇంద్రుని సమాధిపైగల స్మృతిఫలకము (Epitaph)న ''నాల్గవ ఇంద్రుడు ధైర్యశాలులకెల్ల ధైర్యశాలి'' అని వ్రాయబడియున్నది. నాల్గవ ఇంద్రుడు కాని, అతని మేనమామ కాని చాళుక్య తైలపుని యెదుట తమ అస్తిత్వాన్ని కాపాడు కోలేక చిత్తుగా ఓడిపోయి, తత్ఫలితంగా విరక్తులైన ఆ యిరువురు జైనపద్ధతిలో 'సన్యాస' దీక్ష స్వీకరించి మేనమామ క్రీ. శ. 975లో తనువు చాలింపగా ఇంద్రుడు క్రీ శ. 982లో ప్రాణత్యాగం చేసినాడు.'''

రాష్ట్రకూటులు, వారి సామంతులేగాక రాజాధికార్లు కూడ జైనమతంచే ప్రభావితులై ఉండినారు. మూడవ ఇంద్రుని సేనాధిపతి శ్రీ విజయుడు, నాల్గవ గోవిందుని సామంతుడు కన్నారదేవుడు,

ఇట్లు, రాజులు, అధికారులు, సేనాధిపతులు సర్వులు జైనమతాన్ని సాభిమానంగా స్వీకరించినవారే.

డా. యస్. బి దేవ్‌గారు [21] రాష్ట్రకూట యుగంలో జైనమతం పొందిన రాజాభిమానాన్ని చక్కగనే గుర్తించినారు. "రాజుల జైనమతాభిమానం జైన తీర్థంకరులకు ఆలయాలు నిర్మించుటతోనే ముగియలేదు. ఇంతకంటే చాల ముఖ్యమయిన విషయం ఈ కాలంలో పెక్కుమంది జైనపండితులు పరిఢవిల్లి తమ అమూల్య రచనలచే సాహిత్యపరంగా, శాస్త్రపరంగా ఉన్న వివిధ భాగాలకు పరిపుష్టి కలిగించుటకు ఈరాజులు మిక్కిలి సహకరించినారు ఆ పండితులలో సామంత భద్రుడు, అకలంకుడు, విద్యానందుడు, మాణిక్యానందుడు, ప్రభుచంద్రుడు, జినసేనుడు, గుణచంద్రుడు మొదలయినవారు తర్కన్యాయాది వివిధ శాస్త్రములలో ప్రఖ్యాత పండితులు కాగా ఈ కాలంలో జైనవాఙ్మయం గణనీయమైన అభివృద్ధిని సాధించుట సాజమె!!

రాష్ట్రకూట యుగంలో ఆంధ్రదేశమున జైన వాఙ్మయం ఎట్టి అభివృద్ధి సాధించినదో పరిశీలింతము. రాష్ట్రకూట సామంతులుగా ఆంధ్రభూమిని తూర్పుచాళుక్యులును, తెలంగాణమును వేములవాడ చాళుక్యులును ఏలుచుండిరని మనకు తెలియునుగదా! రాష్ట్రకూట రాజసభా సంప్రదాయములు ఈ చాళుక్యరాజుల రాజసభలను ప్రభావితం చేసియుండిన విషయం సైతం మనము ఎఱిగియే యున్నాము. ఆంధ్రదేశంలోని కొన్ని జైన వసదులు చక్కని విద్యాలయాలుగా ఉపయోగపడు చుండినవి అనంతపురం జిల్లా రాయదుర్గంలోని 'రసాశిద్దుల' గుట్టపైగల ఒక జైన వసది గోడకు బిగింపబడిన శాతిపలకలపై విద్యార్థులు వ్యాసపీఠముల ముందుంచుకొని యుండగా గురువులు ఉపదేశ ముద్రలతో బోధించుచున్నట్లు చిత్రించిన చిత్రములు ఈ విషయానికి నిదర్శనములు ఆ కాలంలో పెక్కు రచనలు వెలువడియుండును. కాని అందు కొన్ని మాత్రమే వెలుగు మొగం చూడ నోచుకొన్నవి. అట్టి వానిలో మొదట పేర్కొనదగినది ఉగ్రాదిత్యుని కళ్యాణకారము. ఈ గ్రంథమున ప్రతి అధ్యాయము చివరిలోగల పుష్పిక యందును శ్రీ విష్ణురాజ పరమేశ్వరునిచే పాదపూజ లందుకొన్న శ్రీనంది ఆనతిపై మానవాభ్యుదయం కోరి తాను కళ్యాణకారక రచన గావించినట్లు ఉగ్రాదిత్యుడు చెప్పుకొన్నాడు. కళ్యాణకారక మొక వైద్య గ్రంథముగా ప్రసిద్ధమైనది. ఈ గ్రంథము నతడు 'రామగిరి' కొండపైగల జైనవసదిలో ఉండి వ్రాసికొన్నట్లు చెప్పుకొన్నాడు ఆ కాలానికి 'రామగిరి' త్రిలింగ దేశములో వేంగీ రాజ్యమునకు చెందినట్లు గ్రంథమునందే కలదు. చారిత్రకులు ఈ రామగిరిని విశాఖపట్టణం జిల్లాలోని 'రామతీర్థం కొండ' గాను, విష్ణురాజ పరమేశ్వరుని క్రీ.శ. 762–99 సం॥ మధ్య నుండిన వేంగీ చాళుక్య నాల్గవ విష్ణువర్ధన మహారాజుగాను గుర్తించియున్నారు. ఇక వేములవాడ చాళుక్యులు కావించిన భాషాసేవ ప్రత్యేకంగా పైని సంస్మరించియే యున్నాము.

రాష్ట్రకూట యుగమున జైనమతం రాజాదరంతో, మత విశ్వాస ప్రబోధంలో ఆధ్యాత్మిక రంగమందేగాక వివిధ శిల్పరచనలచే అలంకరింపబడిన మందిరాల నిర్మాణంలో వాస్తు శిల్పరంగంలోను, వివిధ శాస్త్రములందు ప్రవీణులైన పండితులను, కవులను కలిగి శాస్త్రరంగంలోను, వాఙ్మయ, సాహిత్య రంగమందును, అనితర సాధ్యమైన అభివృద్ధిని సాధించి యుండెనన్న విషయం మరువరానిది. డా ఏ. యస్ అల్టేకరు [22]గారి మృదుమధుర భాషణంలో "ఆ కాలాన ఆంధ్రదేశ జన సముదాయంలో మూడింట రెండు పాళ్ల జనం జైనమత ప్రభావంచే ప్రభావితులై జైన మతావలంబులుగా ఉండెడి వారని" వక్కాణించిరి. కావున మనం రాష్ట్రకూట యుగంలో జైనమతం సర్వతోముఖాభి వృద్ధిని సాధించి యున్నందున జైనమతానికి స్వర్ణయుగమని నిరాఘాటంగా చెప్పవచ్చును.

[ఈ వ్యాసం బెంగుళూరులో 'మిథిక్ సొసైటీ' వారు నిర్వహించిన "రాష్ట్రకూటుల కాలాన వివిధ రంగాలలో సాగిన అభివృద్ధి" అనే విషయంపై చదువబడిన వ్యాసానికిది ఆంధ్రానువాదము.]

ఈ వ్యాస రచనలో నాకు ఉపకరించిన పుస్తకాలు

1 S B E., VOL. XXII.
2 S I I, VOL. IX, No 150
3 J P JAIN, The Jaina Sources of the History of Ancient India, P. 125.
4 ARSIE, 1916-17, C P No 9, JAHRS, XVI,P 42
5 N Venkataramanayya, The Eastern Chalukyas of Vengi, P. 85-86.
6 E I Vol IX, P 47-56
7 Ibid, VOL. VII, P P. 177-182.
8 Ibid. VOL. XXIV, P 268
9 E. H D, P 275.
10 ఆదిపురాణం, IX 65—గద్య, మరియు XIV 43 గద్య ము
11 E. C, VOL. II, No. 234
12 A. S R, 1905-6 P.121-122.
13 ARSIE, 1906, Appendix B,
14 E I, VOL X P 147.
14a SII, VOL IX, Pt I No 62 :
15 G S.Dikshit, "Vengi and Karnataka" 91 HC-1953
16 N VenkataRao, Lives of Telugu Poets, P.8?
17 E. Andhrica, VOL. II. P. 21-22
18 Ibid, II, P 31-35
19 ARE, 158 of 1946-47
20 N Venkataramanayya, The Chalukyas of Vemulavada P. 92-98.
21 S. B Deo, History of Jaina Monachism, P.118-9
22 Early History of Deccan, P 306.



క్రొత్తది!
అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్ఠమైన
ఆముదము
శుద్ధిచేసినది.
వాసనలేనిది.
AMRUTANJAN
LTD'S
SPECIAL GRADE
CASTOR
OIL
SUPERIOR
PURE REFINED
AND ODOURLESS
NET CONT. 200 ML LOT No.
Manufactured by
AMRUTANJAN LTD.
UPPAL — HYDERABAD
MADE IN INDIA
మూడు సైజులలో లభిస్తుంది:
50 మిలి
100 మిలి
200 మిలి
OBM 3270 TG

శ్రీ ఇస్మాయిల్

కవిత్వంలో నిశ్శబ్దం

శబ్దంనించి ప్రపంచం ఉద్భవించిందని ఒక పురాణగాథ చెబుతున్నా, పూర్వమీమాంసకులూ, నైయాయికులూ శబ్దశక్తి గురించి కూలంకషంగా తర్కించినా, ప్రాచ్యదేశాల్లో ఆధ్యాత్మిక అనుభూతి కొచ్చేటప్పటికి మౌనానికే ఎక్కువ ప్రాముఖ్యమిస్తూ వచ్చారు. సత్యం, అనగా యథార్థం, అనిర్వచనీయమైందనీ, 'నేతి నేతి', అనగా 'ఇదికాదు, ఇదికాదు' అని చెప్పవలసిందేకాని, ఇదని చెప్పటానికి వీల్లేనిదనీ ఉపనిషత్తుల్లో కొన్ని భాగాలు. బ్రహ్మజ్ఞానం ప్రత్యక్షమైంది (immediate) కనక, వ్యావహారిక పరిధుల్లో ఇమడదనీ, అందువల్ల అనిర్వచనీయమనీ అద్వైతులు. ఆత్మకీ వాస్తవానికీ మధ్య తెరల్లాంటివి మాటలు; వాస్తవాన్ని ఎలా ఆవిష్కరించగలవు? అనే సంశయం ఇక్కడ ద్యోతకమౌతోంది. అనాది నించీ కవుల్ని, తెలిసో తెలీకో, వేధిస్తున్న మౌలికప్రశ్న ఇదని గుర్తించాలి 'దేవుడున్నాడా? లేడా?' వంటి ప్రశ్నలగురించి బుద్ధుడు నిశ్శబ్దం ప్రకటించాడు. 'జెన్' సంప్రదాయంలో జ్ఞానారోహణ చేసేకొద్దీ మాటలు పలచబడిపోయి, సంపూర్ణ జ్ఞానసిద్ధిలో నిశ్శబ్ద మొక్కటే మిగులుతుంది. చైనాలో టావోయిస్టులు కూడా జ్ఞానానికీ నిశ్శబ్దానికీ తాదాత్మ్యం పాటిస్తారు.

పాశ్చాత్య సంప్రదాయం ఇలాకాదు. అది పూర్తిగా శబ్దనిష్ఠమైంది. 'In the beginning was the word' అని సువార్త. 'ఆదిలో శబ్దముంది'. గ్రీకుల నియోప్లాటోనిక్ సంప్రదాయంలో దీన్ని 'లోగోస్' అన్నారు. సర్వజ్ఞానాన్నీ శబ్దశాసనంతో బంధించటం వీళ్ల ఆశయం. మధ్య మధ్య నిశ్శబ్దంలోకి జారుకున్న "స్టయిలయిట్‌లు, డెసర్ట్ ఫాదర్‌లు, ట్రాపిస్ట్‌లు, సెయింట్ జాన్ ఆఫ్ ది క్రాస్" వంటి వాళ్లున్నా, శబ్దం సకల జ్ఞానాన్నీ శాసించగలదనే వీళ్ల అభిప్రాయపడ్డారు.

ఐతే, పదిహేడో శతాబ్దంలో గాలి మళ్లింది. న్యూటన్, లైబ్నిజ్‌లు కాల్‌కులస్‌ని సృష్టించాక, గణితం శాస్త్రభాషగా ప్రభుత్వం చేబట్టింది. భౌతికానుభవానికి చెందిన చాలా క్షేత్రాలు శబ్దం అధికారాన్నించి చేజారటం మొదలెట్టాయి. సైన్సు అభివృద్ధి చెందేకొద్దీ విషయ వివరణకు సామాన్యభాష పనికిరాకుండాపోతోంది. శాస్త్ర జ్ఞానానికి గణితం పరిభాష కావటమొక్కటేకాదు; గణిత భాషని సామాన్య భాషలోకి మార్చటంకూడా అసాధ్యంగా పరిణమించింది. ఆధునిక గణితంలో కనిపించే చాలా ఫంక్షన్‌లు, రిలేషన్‌లు, స్పేస్‌లు మొదలైనవాటికి మన ఇంద్రియానుభవంలో సమానాంతరాలు లేవు. క్వాంటమ్, ఇన్‌డిటర్మినెసీ ప్రిన్సిపల్, రిలెటివిటీ కాన్‌స్టెంట్ వంటి విషయాలగురించి సామాన్యభాషలో మాట్లాడ్టమే హాస్యాస్పదం. ఆధునిక జ్ఞానసీమని గణితం ఎంత విస్తృతంగా ఆక్రమించుకుందంటే, అది పరస్పర సంబంధంలేని రెండు సంస్కృతులుగా చీలిపోయిందని సి. పి. స్నో వంటి పండితులు ఇటీవల గోలపెట్టారు. ఇవి ఒకదానికొకటి లంకెలేని సైన్సూ, హ్యూమానిటీస్. ఒకదాన్లో పండితుడైనవాడు రెండవదాన్లో తప్పకుండా పామరుడౌతున్నాడు. ఇటువంటి పామర పండితులతో ప్రపంచమంతా నిండిపోయిందని అతని గోల

ఈ నవ్యగణితం ప్రభావం దర్శనశాస్త్రంలో మొట్టమొదటిసారిగా స్పినోజ రచించిన "ఎతిక్స్"లో కనిపిస్తుంది. గణితశాస్త్రంలో లభ్యమయ్యే నిశ్చయకత, సంగతత్వం తత్వశాస్త్రంలోకి దింపాలని అతని ఆశయం. అందుకని, తత్వభాషని శబ్దగణితంగా మార్చటానికి ప్రయత్నించాడు. తన గ్రంథాన్ని ఎనలిటిక్ జామెట్రీలాగే సిద్ధాంతాలు, నిర్వచనాలు, నిదర్శనాలు, ఉపసూత్రాలుగా తీర్చిదిద్దాడు. దీని ఫలితమేమిటంటే, ఈ శబ్దాల అద్దాల మేడలో చిక్కుకుని నిజాలేవో, ప్రతిబింబాలేవో తెలుసుకో లేకపోయింది తత్వశాస్త్రం. ఈ మయసభలో ప్రవేశించినవాళ్లకి గోడలకీ గుమ్మాలకీ తేడా తెలీదు.

ఈ శబ్దాల సుడిగుండాన్నించి తత్వాన్ని మొదటిసారిగా తప్పించటానికి ప్రయత్నించినవాడు విట్‌గెన్‌స్టైన్. పదానికీ యథార్థానికీ అసలు సంబంధముందా అని కూపీతీయటం మొదలెట్టాడు. ఇతని అన్వేషణకి పర్యవసానమేమిటంటే, యథార్థానికి సంబంధించిన చాలా క్షేత్రాల గురించి తత్వం మాట్లాడ్టానికి వీల్లేదని. నీతి శాస్త్రం, అతిభౌతిక శాస్త్రం లాంటివి అవచనీయాలు. కొన్ని విషయాల్లో మినహాయించి మిగతావాటిల్లో భాషకి నిశ్శబ్దమే శరణ్యం.

అనుభవిక ప్రపంచంలో ఈ విధంగా నిశ్శబ్దం విస్తరించుకుని భాష కుంచించుకు పోతుంటే, కవిత్వంలో నిశ్శబ్దాన్ని వెనకనెట్టే ప్రయత్నాలు పందొమ్మిదో శతాబ్దంలో మొదలెట్టాయి. బ్లేక్, డోస్టోవ్‌స్కీ, నీట్షె, ఫ్రాయిడ్ రచనల్లో కవులకి ఇంతకు మునుపెరుగని మానసిక అగాధాలూ, శక్తులూ గోచరించాయి. ఈ కొత్త అనుభవాల్ని వచించటానికి పాత మాటలూ, పాత ఛందస్సూ పనికిరాదు. సింబలిస్టు కవులు రింబో, మల్లార్మె, కొత్త మూసల్లో పోసేందుకు వీలుగా భాషనీ, వ్యాకరణాన్నీ కరగబెట్టారు. పదాలకి మంత్రశక్తి ఆపాదించాలని వీరి యత్నం. మంత్రోచ్చాటన లాగ పద్యం కూడా నిద్రపోతున్న భూతాల్ని మేల్కొలపాలని వీళ్ళంటారు

దీంతోనే మరో విశయం వీళ్లకి. కవిత్వాన్ని తన సరిహద్దును అతిక్రమింపచేసి సంగీత పట్టం కట్టించాలని. కవిత్వంకన్నా సంగీతం ఉన్నత స్థాయికి చెందిన కళ అని వీళ్ల అపోహ ఎందుకంటే ఏ ఉపకరణాల అవసరమూ లేకుండానే సంగీతం ప్రత్యక్షానుభూతి కలిగింపగలదు; రెండోది, సంగీతం సంగీతమే, అది మరి దేనిలోకీ అనువదింపబడదు. ఈ రెండు కారణాల వల్లా సాహిత్యం కన్నా సంగీతమే గొప్పదని వాళ్ళు నమ్మారు. అర్థాలతో అవసరం లేకుండా వట్టి శబ్దాలవల్లే కవితానుభూతి కలిగించటానికి ఫ్రెంచి కవులు వెర్లెయిన్, వాలెరీ, జర్మన్‌కవి రిల్కే ప్రయత్నించారు. కాని వీళ్లయత్నాలు ఆట్టే ఫలవంతమైనట్టు కనిపించదు. కవిత్వమూ, సంగీతమూ కానిది మరోటేదో పుట్టింది. వీళ్ళ అనుకరణలు మన శ్రీ శ్రీ కవిత్వంలో చూడొచ్చు.

సరే, సంగీతం కలిగించే ప్రత్యక్షానుభూతి వంటి అనుభూతిని కలిగించే ప్రయత్నంలో కవిత్వం విఫలమైంది ఐతే, కవిత్వం చేసే పనేమిటి? ప్రత్యక్షానుభూతిని కలిగింపటం కాదా? దీనికి తగ్గ సాధనాలు కవిత్వానికి స్వయంగా లేవా? ఫ్రెంచి సింబలిస్టులు ఈ విషయాల గురించి లోతుగా ఆలోచించినట్టు తోచదు.

మన చుట్టూ వున్న ఆనుభవిక ప్రపంచాన్ని ఆవిష్కరించటమే కవిత్వలక్ష్యం. దీనికై సాధనాలు శబ్దాలు, లేక, మాటలు. మాటలుమన మనస్సృష్టించినవి. అనుభవాలు పంచేంద్రియాలకు సంబంధించినవి. మాటలుఅనుభవాల్ని యథాతథంగా అనువదిస్తున్నాయని గ్యారంటీ ఏమిటి? సామాన్య భాష అనుభవాల్ని ఆవిష్కరించక పోగా, ఆచ్ఛాదించటం తరచూ చూస్తుంటాం అనుభవాన్ని అనుభవంగానే ప్రత్యక్షంగా అందింపటం కవిత్వం పని. అంటే, మనం సృష్టించుకున్న కొద్ది శబ్దాల్లోకి మనల్ని ఆవరించివున్న మహా నిశ్శబ్దాన్ని, ఆనుభవిక ప్రపంచాన్ని, ప్రవేశపెట్టటం కవిత్వ లక్ష్యమన్నమాట.

ఈ పని కవిత్వం ఎలా నిర్వహిస్తోంది? మాటలు మనస్సు కల్పించుకున్నవి. అనుభవాలు ఇంద్రియాలకు సంబందించినవి. మనకు ఐదు ఇంద్రియాలున్నాయి ఇవే మన అనుభవజ్ఞానానికి మూలాలు. దీన్ని ప్రత్యక్షజ్ఞానమంటారు మనస్సు వల్ల కలిగేది పరోక్షజ్ఞానం. ప్రత్యక్షజ్ఞానాన్ని పరోక్షమైన శబ్దాల్లోకి ఎలా దించటమన్నదిప్రశ్న శబ్దాల్లోకి నిశ్శబ్దాన్ని ప్రవేశ పెట్టటమెలా?

దీనికై కవిత్వం ఉపయోగించే సాధనాలు పదచిత్రాలు వీటినే ప్రతీకలంటారు. వీటి వివిధ ప్రక్రియలే రూపకాది అలంకారాలు పదచిత్రాలు అమూర్త (ఆబ్‌స్ట్రాక్ట్) భావాలు కావు మూర్త (కాంక్రీట్) విషయాలు ఇవి మన ఇంద్రియాల్ని తాకి, ఐంద్రియక అనుభూతుల్ని మేల్కొలుపుతాయి మాటలకందని

సంశ్లిష్టమైన అనుభవాలతో జటిలమైన అనుభవ ప్రపంచం ఈ పదచిత్రాల మార్గం ద్వారా మన అనుభూతి ఆవరణలోకి ప్రవేశించకలుగుతోంది. కవిత్వంలోకి విశాలమైన జీవితాన్ని ఆహ్వానించే కిటికీలన్నమాటిది. మన గదికిటికీ ఆకాశాన్ని ఆహ్వానించినట్లు.

ఉదాహరణ ఒకటిస్తాను. 'విలియమ్ కార్లోస్ విలియమ్స్'అనే అమెరికన్ కవి వృద్ధాప్యం గురించి రాశాడు. వృద్ధాప్యమనగానే ప్రస్ఫుట దర్శనంలేని సామాన్యబుద్ధికి తోచే ఊహాలు ఒకలా ఉంటాయి. తేజస్సులేని కళ్ళూ, తెల్లబడిన జుత్తూ కనిపిస్తాయి. శీతకాలమూ, మంచూ లాంటి బింబాలు తడతాయి. కాని, పారదర్శి ఐన కవికి వృద్ధుల్లోనూ జీవం, ఉత్సాహం, అందమూ కనిపించవచ్చు. ముసలితనమూ, చురుకూ, ఈ రెండూ మిళితమైన సంశ్లిష్ట అనుభవాన్ని వ్యక్తపరచేందుకు కవికి కొత్త పదచిత్రాలు కావలసొస్తాయి. హేమంతమూ, హిమమూ అంటే సరిపోదు.

ఈ పద్యం పేరు 'టు వేకెన్ యాన్ ఓల్డ్ లేడీ' ముసలావిడికి మేలు కొలుపులు.

Old age is
a flight of small
cheeping birds
skimming
bare trees
above a snow glaze
Gaining and failing
they are buffeted
by a dark wind-

But what ?
On harsh weedstalks
the flock has rested
The snow
is covered with broken
Seedhusks
And the wind tempered
By a shrill
pipng of plenty.

అర్థం మాత్రం చెబుతాను: ముసలితనమంటే కిచకిచలాడుతో మంచుతెరపైని ఆకుల్లేని చెట్లమీదుగా ఎగిరే పిట్టలు. చీకటి గాలుల తాకిడికి అవి లేస్తూ పడుతో ఎగురుతున్నాయి. ఐతే నేమి? మొరటు మోళ్ళమీద పిట్టగుంపు కూచుంది. చుట్టూరా మంచు మీద గింజల పొట్టు. సమృద్ధి నిండిన కూజితాలతో గాలి వెచ్చబడింది.

ఇంత జటిలమైన అనుభూతి సామాన్య భాషకు అందదు. దాని పరిధి కావలి నిశ్శబ్ద, అనుభవిక ప్రపంచంలోనిదిది. ఈ అనిర్వచనీయాన్నీ, నిశ్శబ్దాన్ని కావ్యంలోకి ప్రవేశపెట్టాలంటే కిటికీలూ, గుమ్మాలూ అవసరం. ఇవే పదచిత్రాలు. ఇవి లేకపోతే కావ్యం మూసుకుపోయి, చదువరికి ఊపిరాడదు. ఒక ముసిలికవికి ముసిలిప్రేయసి యెడలకల tenderness, ప్రేమా వ్యక్తపరచటానికి సామాన్యభాషకి మాటల్లేవు. ఇటువంటి అనుభూతులు శబ్దప్రపంచానికి చెందినవికావు. ఈ నిశ్శబ్దాన్ని శబ్దాల్లోకి ప్రవేశపెట్టటమే కవిత్వం విశిష్ట లక్షణం. కవిత్వానికి శబ్దమెంత ముఖ్యమో నిశ్శబ్దం కూడా అంతే.

నేను

కుమారి మంగళగిరి ప్రమీలాదేవి

వనితను మొదటనేను
యువజన మనోహారిణిని నేను
ప్రతీకను విద్యాశక్తి సంపదలకు
కాణాచి నొకప్పుడు కళలకు
ఐతే ఆ తరువాతే
అడ్డం తిరిగింది కథ.
ఓర్పుకూ నేర్పుకూ పుట్టినిల్లైన నేను
ఓటమికి మరొక మారుపేరుగా
అంతర్ద్వంద్వాలలో
ఆరుతూ వెలుగుతుండే
జీవితపు తృషిత గాథగా
మిగిలిపోయాన్నేను.

అబలనని అంటారందరు
అది నిజమో, కాదో, ఏమో
మరి నా మనసు మాట ?

పర్వతం మౌనంగా ఉండవచ్చు
ఐతే తరిగిందా దాని ఉన్నతి ?
సామాన్యంగా కనిపిస్తుంది సముద్రంపైకి
అంత మాత్రాన అంటారా
అది లోతైనది కాదని ?

శ్రీ జంధ్యాల బాలగంగాధర తిలక్

స్వతంత్ర భారతదేశములో విద్యాభివృద్ధి

"మన దేశభవిష్యత్తు విద్యాలయాలపై ఆధారపడి ఉన్నది." [1]

స్వతంత్ర భారత దేశంలో ప్రణాళికల అంచనాలను, ఆశయాలను అధిగమించి అభివృద్ధి చెందిన రంగాలలో ప్రధానముగా పేర్కొన దగినది విద్యారంగము 1947 లో ఆంగ్లేయుల నుండి స్వాతంత్ర్యము సముపార్జించుకొన్న దేశము 1950 లో సంపూర్ణ స్వతంత్ర భారతిగా అవతరించింది. సంపూర్ణస్వాతంత్ర్యం సిద్ధించే నాటికి మన దేశ జనాభా 36కోట్లు వారికై దేశంలో 2 లక్షలకు పైగా ప్రాథమిక పాఠశాలలు, దాదాపు 14 వందల మాధ్యమిక పాఠశాలలు, 7288 ఉన్నత పాఠశాలలు, 516 సాధారణ కళాశాలలు, 27 విశ్వ విద్యాలయాలు ఉన్నాయి. 1 98 కోట్ల విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలలోను, 30 లక్షల మంది మాధ్యమిక పాఠశాలలలోను, 12 లక్షల మంది ఉన్నత పాఠశాలలలోను, 3. 3 లక్షల మంది ఉన్నత విద్యాలయాలలోను విద్య నభ్యసిస్తున్నారు. 1973–74 నాటికి దేశ జనాభా 57 కోట్లకు పెరిగింది. దాదాపు 40 లక్షల ప్రాథమిక పాఠశాలలు, ఒకలక్ష మాధ్యమిక పాఠశాలలు, 50 వేలు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. దాదాపు 4 వేలు కళాశాలలు, 100 విశ్వవిద్యాలయాలు వెలిశాయి. ప్రాథమిక పాఠశాలలలో 6. 38 కోట్ల మంది విద్యార్థులు, 1.5 కోటి మంది మాధ్యమిక పాఠశాలలలోను, 70లక్షల మంది ఉన్నత పాఠశాలలలోను నమోదు అయి ఉన్నారు. దాదాపు 3 4 కోట్ల మంది ఉన్నత విద్య నభ్యసిస్తున్నారు. ఈ విధంగా పరిమాణ దృష్ట్యా ఎంతో ఘనత సాధించాము. విద్యా రంగానికయే ఖర్చు కూడా నేడు చాలా అధికమయింది. విద్యారంగంపై ప్రభుత్వ ఖర్చు 1950–51 లో రు. 114 కోట్లు. 1973–74 లో రు. 1250 కోట్లు ఖర్చు అయినట్లు అంచనా.

పరిమాణదృష్ట్యా ప్రగతి పథంలో పయనిస్తున్న విద్యరంగంలో అసంతృప్తికరమయిన లక్షణాలు కనిపించటం ప్రారంభమయింది. విద్యాప్రమాణాలు (Standards of education) నానాటికి తగ్గుతున్నాయి మరెన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఆ కారణంగా విద్యారంగం తీవ్ర విమర్శలకు గురియగుచున్నది. విద్యారంగంలోని అభివృద్ధియే కాక లోటుపాట్లను, సమస్యలను సమగ్రంగా చర్చిస్తూ ఆయా సమస్యలకు సరయిన సమాధానాలు సూచించటం ఈ వ్యాసంయొక్క ప్రధానోద్దేశ్యం.

మొదటి నాలుగు పట్టికలలోను స్వతంత్ర భారతదేశంలో విద్యారంగ ప్రగతి గురించి వివరాలు పొందుపరుపబడ్డాయి.

పట్టిక సంఖ్య 1

స్వతంత్ర భారతదేశంలో విద్యాభివృద్ధి
విద్యా సంస్థల అభివృద్ధి

	ప్రాథమిక పాఠశాలలు (సంఖ్యలు	మాధ్యమిక + ఉన్నత పాఠశాలలు వేలలలో)	కళాశాలలు	విశ్వ విద్యాలయాలు	మొత్తము (సంఖ్యలు వేలలలో)
1950–51	210	21	816	27	287
1955–56	278	33	1204	32	367
1960–61	330	67	2140	45	473
1965–66	389	103	5362	64	723
1969–70	403	123	6‹69	85	752
1973–74	430	137	—	95	—

మొత్తము సంఖ్యలో పూర్వప్రాథమిక (నర్సరీ) పాఠశాలలు, విద్యాబోర్డుల సంఖ్యకూడా కలుపబడినవి.

మూలము : Jandhyala B.G.Tilak · "Education in the Five year plans", Eastern Economist (April 15, 1977)

ప ట్టి క స ం ఖ్య 2

స్వతంత్ర భారతదేశములో విద్యాభివృద్ధి గుర్తించబడిన విద్యాలయాలలో విద్యార్థులు

(మి లి య ను ల లో)

	1950–51	1955–56	1960–61	1965–66	1968–69	1973–74 (అంచనా)
ప్రాథమికవిద్య	19.2	25.1	35.0	50 5	53.9	68.6
(1–5 తరగతులు)	(43 1)	(52.8)	(62.4)	(76.7)	(75 1)	(85.3)
మాధ్యమిక విద్య	3 1	4.3	6.7	10 5	12 1	18.1
(6–8 తరగతులు)	(12.8)	(16.5)	(22 5)	(30.8)	(32 1)	(41 3)
ఉన్నత పాఠశాల విద్య	1.25	1.98	3.03	5.27	6.47	9.70
(9–10/11 తరగతులు)	(5 5)	(8 3)	(11.1)	(16.9)	(19.1)	(25.6)
ఉన్నత విద్య	134	228	627	1 '14	1801	3200
(సంఖ్యలు వేలలలో)	(0.4)	(0.6)	(1.2)	(2.3)	(3.0)	(4.5)

కుండలీకరణములలో ఉన్న సంఖ్యలు ఆ విద్యాస్థాయికి నిర్ణీతమయిన వయసులోగల జనాభాకు విద్యాసంస్థలలో నమోదు అయిన విద్యార్థుల శాతములు

మూలము : Education in the Fifth Five year plan 1974-1979

ప ట్టి క స ం ఖ్య 3

స్వతంత్ర భారతదేశంలో విద్యాభివృద్ధి

అ ధ్యా ప కు లు (వేలలలో)

	ప్రాథమిక పాఠశాలలు	మాధ్యమిక + ఉన్నత పాఠశాలలు	ఉన్నత విద్యాలయాలు	మొత్తము
1950–51	539	212	25	804
1955–56	693	343	38	1107
1960–61	746	642	62	1508
1965–66	1198	724	130	2149
1969–70	1038	1221	130	2149
1973-74	1168	1352	174	2466

మొత్తము సంఖ్యలలో ప్రప్రాథమిక పాఠశాలలలోని అధ్యాపకుల సంఖ్యకూడ కలుపబడినది.

మూలము · Jandhyala B. G. Tilak · "Education in the Five year plans" Eastern Economist (April 15, 1977)

పట్టిక సంఖ్య 4

స్వతంత్ర భారత దేశములో విద్యాభివృద్ధి: విద్యారంగముపై ప్రభుత్వ వ్యయము

	వ్యయము (రు. మిలియనులలో)	జాతీయాదాయములో శాతము
1950–51	1144	1 2
1955–56	1897	1 9
1960–61	3444	2. 4
1965–66	6220	2 8
1968–69	8500	2. 8
1973–74 (అంచనా)	12500	3. 3

మూలము : **Education in the Fifth Five year plan 1974–79.**

1950–51 నుండి 1969–70 వరకు సంవత్సరము సటు ప్రాథమిక విద్యాలయాలు 3 7 శాతము చొ. న, ఉన్నతర పాఠశాలలు 10 9 శాతం చొ. న, విశ్వవిద్యాలయాలు 6.3 శాతం చొ. న అభివృద్ధి చెందాయి. విద్యార్థుల సంఖ్యలో అభివృద్ధి రేటు 6. 88 శాతం ఉంది. ప్రాథమిక విద్యార్థుల అభివృద్ధి రేటు 6 46; ఉన్నతర పాఠశాల విద్యార్థుల అభివృద్ధి రేటు 8. 54; ఉన్నత విద్యార్థుల అభివృద్ధి రేటు 10.08 శాతము విద్యారంగంపై ప్రభుత్వ వ్యయం సంవత్సరమునకు 12. 8 శాతం చొ. న అభివృద్ధి చెందింది.[2]

విద్యారంగం ఈ విధంగా తీవ్రగతిని అభివృద్ధి చెందటం సంతోషదాయకం కాకపోగా ఈ అభివృద్ధి ప్రమాదకరంగా భావించ బడుతున్నది

మన జాతీయాదాయము సంవత్సరమునకు 3 -4 శాతము అభివృద్ధి చెందుచుండగా విద్యారంగంపై వ్యయము 12 – 12 శాతము చొ. న అభివృద్ధి చెందటం మిగిలిన ఆర్థిక రంగాలపై పెట్టుబడులమీద దెబ్బ తీస్తుంది.

అంతేకాక ప్రణాళికా అంచనాలను, ఆశయాలను అధిగమించి విద్యారంగం విద్యార్థులను ఉత్పత్తిచేస్తే నిరుద్యోగసమస్య మరింత ప్రబలమవుతుంది. నిరుద్యోగులలో విద్యావంతుల శాతం నానాటికి ఎక్కువవుతున్నది. 1956 లో దేశంలోని నమోదు చేయబడిన నిరుద్యోగులలో చదువుకొన్నవారు 32 4 శాతము నుండి మాత్రము ఉన్నారు. ఈ సంఖ్య 1971నాటికి 51. 2 శాతానికి పెరిగింది. ఈ క్రింది పట్టిక (సంఖ్య 5)లో నిరుద్యోగ సమస్య గురించి వివరాలు సేకరించి పొందుపరుపబడ్డాయి.

పట్టిక సంఖ్య 5

భారత దేశములో నిరుద్యోగ సమస్య

	ఉపాధి కేంద్రముల సంఖ్య	నమోదు గావించిన నిరుద్యోగుల సంఖ్య (లక్షలలో)		మొత్తము నిరుద్యోగులలో విద్యావంతుల శాతము
		మొత్తము	విద్యావంతులు	
1956	143	7. 59	2 46	32. 41
1961	325	18 33	5 90	32. 18
1966	396	26. 22	9. 18	35 00
1967	399	27. 40	10 02	36. 57
1968	405	30· 12	13 09	43. 46
1969	416	34. 24	14. 17	41. 38
1970	426	37. 26	16 43	44 10
1971	434	40 02	20. 50	51 22
సగటు అభివృద్ధి రేటు		65%	44%	

మూలము. 1 **Basic statistics Relating to employment, 1964, 1967, and 1971.**

2. **Indian Labour Journal (Sept , 1973)**

కాబట్టి విద్యా ప్రణాళికలను ఆర్థిక ప్రణాళికలతో ముడి వేయవలసిన అవసరం ఎంతయినా ఉన్నట్లు విద్యావంతులలో నిరుద్యోగ సమస్యను చూచినపుడు తెలుస్తున్నది.

విద్యారంగంలోని అభివృద్ధి పరిశీలించి చూడగా ముఖ్యంగా తేలుతున్న మరో విషయం ఏమిటంటే విద్యారంగంలో అభివృద్ధి అసమానతతో కూడుకొని ఉంది ఉన్నత విద్య బాగుగా అభివృద్ధి చెందింది. ఉన్నత పాఠశాల విద్యలో కూడా అభివృద్ధి మెరుగ్గా ఉంది. కానీ ప్రాథమిక విద్య అన్నిటి కంటె వెనుకబడి ఉంది ఈ అసమానత ఎక్కువ కాలం ఇలా కొనసాగటం విద్యారంగానికే హాని కరము ఉన్నత విద్య బాగుగా అభివృద్ధి చెందుతూ ఉండగా కనీస అవసరమయిన అక్షరాస్యతలో అభివృద్ధి చాలా అసంతృప్తికరంగా ఉంది. స్వాతంత్ర్యము సిద్ధించినపుడు కంటె నేడు దేశంలో నిరక్షరాస్యు లధికంగా ఉన్నారు. 1951 లో మన దేశ జనాభాలో 30 కోట్లమంది నిరక్షరాస్యులు ఉండగా 1971లో 38.7 కోట్ల మంది నిరక్షరాస్యులున్నారని తెలుస్తున్నది. జనాభాలో నిరక

రాస్యుల శాతము 83.4 నుండి 70.7 కు తగ్గినది కాని నిరక్ష రాస్యుల సంఖ్యలో తగ్గుదల లేదు. అక్షరాస్యతలో అభివృద్ధి రేటు సంవత్సరమునకు 1 శాతము కూడా లేదు. ప్రపంచంలోని నిరక్ష రాస్యులలో సగము మంది (38–40 కోట్లు) మన దేశములో ఉన్నారు. విద్యార్థుల సంఖ్యలో ప్రపంచములో చైనా తరువాత అగ్రస్థాన మలంకరించిన మన దేశములో నిరక్షరాస్యతా సమస్య ఇంత ప్రబలముగా ఉండుట విచారకరము.[3] ప్రజాస్వామ్య దేశము లలో సంపూర్ణ అక్షరాస్యత కనీస అవసరము; నిరక్షరాస్యత ప్రజా స్వామ్య మనుగడకే ముప్పు తెచ్చును నిరక్షరాస్యతా నిర్మూలనకు నిర్బంధ ప్రాథమిక విద్య, వయోజన విద్య ముఖ్యమయిన పరి కరములు.[4] కావున ఉన్నత విద్య కంటె ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యత ఈయవలసిన అవసరము ఎంతయినా ఉన్నది. నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యా ప్రణాళిక ఆశయాలు ఇంకా నెరవేరలేదు. 6–14 సం. ల లోపు వయసుగల ప్రతివ్యక్తి ప్రాథమిక విద్యా లయాలలో 1960 నాటికి చేరునట్లు చేయవలెనను ఆశయము ఆరవ పంచవర్ష ప్రణాళికాంతమునకు సాధించగలమేమో అని తల పోయుచున్నారు.

ఇది ఇలా ఉండగా ఉన్నత పాఠశాల విద్యలో కూడా అవక–తవకలు లేకపోలేదు. ఉన్నత పాఠశాల విద్యార్థులలో ఎక్కువమంది సాధారణ విద్యకే ప్రాధాన్యత ఇచ్చుచున్నారు. ఉన్నత పాఠశాలలలో ప్రస్తుతము ఉన్న 85 లక్షల విద్యార్థులలో కేవలము 9 శాతము మంది మాత్రము వృత్తి విద్యాలయాలలో ఉన్నారు. ఇది విచారింప దగ్గ విషయము. అంతేకాక ఉన్నత పాఠశాల విద్య గడించినవారు ఏ ఉద్యోగములకు అర్హులు కాకపోవుచున్నారు. వారు కేవలము ఉన్నత విద్యాలయాలలో ప్రవేశమునకు మాత్రమే అర్హులుగా తయారగు చున్నారు. తత్ఫలితముగా ఉన్నత విద్యకై ప్రాకులాడువారి సంఖ్య నానాటికి అధికమయి పోవుచున్నది ఈ విధముగా ప్రజల కోరికల ననుసరించి కళాశాలలు విరివిగా స్థాపింపవలసి వచ్చుచున్నది. కేవలము ప్రజల కోరికలేకాక కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత రాజకీయ ఆర్థిక పురోగతికై చేయు ప్రయత్నములు కూడ కళా శాలలు, విశ్వవిద్యాలయముల స్థాపనకు కారణము లవుచున్నవి. అసంఖ్యాకముగా పెరుగుచున్న కొన్నివిశ్వవిద్యాలయములలోసౌకర్యములు తగినన్ని లేక అవి సాధారణ కళాశాలలకంటె హీనదశలో ఉన్నవి. ఇట్టి విశ్వవిద్యాలయములనుండి అధిక ప్రామాణ్యత **(Standards)** కలిగిన విద్య లభించునని ఆశించుట సమంజసము కాదు. కావున విద్యాలయముల స్థాపనలో సామాజిక వ్యయ – లాభ విశ్లేషణ సూత్రము (Social Cost-Benefit Analysis) ను పాటింపవలసిన ఆవశ్యకత ఉన్నది.

విద్యారంగములో ప్రణాళికా విధానములు సరిగా లేనందున మరెన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యాభివృద్ధిలో విభిన్న రకాల అసమానతలు నానాటికి పెరుగుతున్నట్లున్నాయి గాని తగ్గు తున్నట్లుకనిపింపటంలేను ఉదాహరణకు విద్యాభివృద్ధిపురుషులలోను స్త్రీలలోను సమానంగాలేదు. 1966–67లో మొత్తం విద్యార్థు లలో కేవలం 33.7 శాతం మంది మాత్రం స్త్రీలు. అంటే విద్యా సంస్థలలో స్త్రీ పురుషులు 1 : 2 నిష్పత్తిలో ఉన్నారన్నమాట. దేశ జనాభాలో స్త్రీ పురుషుల శాతం 9 : 10 నిష్పత్తికి ఎప్పుడూ ఏ ప్రాంతంలోను తక్కువలేదు. దేశజనాభాలో స్త్రీ పురుషుల నిష్పత్తి–విద్యాసంస్థలలో స్త్రీ పురుషుల నిష్పత్తి సమానమయి నపుడు విద్యాభివృద్ధిలో సమానత ఉన్నదని చెప్పవచ్చు. ఇదేవిధంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలు మిగిలినవర్గాల విద్యాభివృద్ధిలో అసమానతలు గోచరమవుతున్నాయి. ఇంతేకాక విద్యాభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలు కూడా ప్రబలముగా ఉన్నట్లు కనిపిస్తు న్నాయి. మన విద్యాలయాలు ఎక్కువ పట్టణ ప్రాంతాలలో ఉన్నాయి గ్రామీణ ప్రాంతాలలో విద్యాసౌకర్యాలు పరిమాణదృష్ట్యా చాలా స్వల్పంగాను, సదుపాయాలదృష్ట్యా చాలా శోచనీయంగాను ఉన్నాయి.[5] ఈ విధంగా గ్రామీణ పట్టణ ప్రాంతాలమధ్యేకాకుండా విభిన్న రాష్ట్రాల మధ్యకూడ అసమానతలు ప్రబలంగా ఉన్నాయి సమగ్ర విద్యాభివృద్ధి సూచిక ననుసరించి మహారాష్ట్ర, కేరళ, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు బాగా అభివృద్ధి చెంది నట్లు, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు బాగా వెనుకబడి ఉన్నట్లు తెలుస్తున్నది [6]

ఈ క్రింది పట్టిక (సంఖ్య 6)లోని సమగ్ర విద్యాభివృద్ధి సూచిక విభిన్న రాష్ట్రాలలోని విద్యాస్థాయి గురించి బాగుగా తెలియ జేస్తుంది.

పట్టిక సంఖ్య 6

విభిన్న రాష్ట్రాలలో విద్యాభివృద్ధి

శ్రేణి		రాష్ట్రముపేరు	సమగ్ర విద్యాభివృద్ధి సూచిక
మొదటిశ్రేణి	1	మహారాష్ట్ర	146.98
	2	కేరళ	123.78
	3	ఉత్తర ప్రదేశ్	109.64
	4	తమిళనాడు	105 28
రెండవశ్రేణి	5	అస్సామ్	98.65
	6	పశ్చిమ బెంగాల్	96.63
	7	గుజరాతు	95 00
	8	కర్నాటక	91.70
మూడవశ్రేణి	9	హర్యానా	85 67
	10	పంజాబు	83.41
	11	ఆంధ్రప్రదేశ్	82.33
	12	జమ్ము–కాశ్మీర్	80 41
నాల్గవశ్రేణి	13	ఒరిస్సా	79.51
	14	బీహారు	78.58
	15	మధ్యప్రదేశ్	76.74
	16	రాజస్థాన్	76.02
		భారతదేశము	100.00

మూలము : Jandhyala B G Tilak : "Inequality in Human capital Formation in India: A Thearitical and Empirical Analysis within Educational Frame work."

ప్రాంతీయ అసమానతలు గురించి పై పట్టిక వివరంగా తెలుపుతుంది.

ఇంతేకాక మన విద్యారంగం అనేక ఇతర విమర్శలకు కూడా గురి అవుచున్నది. విద్యాలయాలు విద్యార్థులకు ఏ ఒక్క రంగం లోను నైపుణ్యత, సామర్థ్యత కలుగజేయలేకపోతున్నాయి. కావుననే వ్యక్తి నేర్చుకొన్న విద్యకు, అతడు చేయు ఉద్యోగానికి సంబంధం లేక పోతున్నది విద్యకు ఉత్పాదకతకు ఏమాత్రం సంబంధం లేకపోవటం శోచనీయమయిన విషయం.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత దేశంలో ఏర్పడిన జాతీయ ప్రజాస్వామ్య ప్రభుత్వం విద్యారంగంలో చేయవలసిన అనేక సంస్కరణలు గురించి తీవ్రంగా చర్చించింది 1948 – 49లో విశ్వ విద్యాలయాల విద్యపై రాధాకృష్ణన్ కమిషన్, 1951 లో ప్రాథమిక విద్యపై ఖేర్ (Kher) కమిటీ,1953లో ఉన్నత పాఠశాల విద్యపై మొదలియార్‌కమీషన్, 1964–66లో విద్యారంగంపై సమగ్ర నివేదిక తయారు చేసిన కొఠారి కమీషన్ మొదలయిన కమిటీలు, కమిషనులు విద్యా సంస్కరణలు గురించి ఎన్నో సూచనలు చేశాయి. విద్యారంగంలోని విభిన్న శాఖలను అభివృద్ధి పరచటానికి అనేకసంస్థలు వెలిశాయి. వాటిలో విశ్వవిద్యాలయ అనుదాన సంస్థ (University Grants Commission), విద్యా పరిశోధనా శిక్షణా జాతీయ సంస్థ (National Council of Educational Research and Training), విద్యా పాలకులకు ప్రశాసకులకు జాతీయకళాశాల (National Staff College for Educational Planners and Administrators), విద్యాపాలనా జాతీయ సంస్థ (National Institute of Educational Administration), భారతీయ వైద్య పరిశోధనా సంస్థ (Indian Council of Medical Research), భారతీయ వ్యావసాయిక పరిశోధనా సంస్థ (Indian Council of Agricultura' Research), భారతీయ సామాజిక శాస్త్రపరిశోధనా సంస్థ (Indian Council of Social Science Research), భారతీయ ఆరోగ్య పరిశోధనా సంస్థ (Indian Council of Health Research) మొదలయిన ఎన్నో సంస్థలు పేర్కొనదగినవి. అయిదు పంచవర్ష ప్రణాళికల లోను విద్యారంగం గురించి ఘనంగా స్తుతించటం జరిగింది. [7]

కానీ స్వాతంత్ర్యం సిద్ధించిన మూడు దశాబ్దాల పిదపకూడా వలస రాజ్యాధికారులయిన ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన విద్యా విధానం అలాగే కొనసాగుతున్నది వలస రాజ్యాధికారుల విద్యా విధానమే నేటి పెక్కు సమస్యలకు మూలకారణము. 1904లో మన విద్యా విధానాన్ని గురించి— 'మన విద్యా విధానం విజ్ఞానాత్మకంగా లేదనియు, మన విద్యాలయాలు విద్యార్థులలోని తెలివి తేటలను, ఆలోచనా శక్తిని అభివృద్ధి చేయటానికి బదులు జ్ఞాపక శక్తిని మాత్రమే అభివృద్ధి పరచే విధంగా ఉన్నదనియు, మన విధానంలో పరీక్షలకు అధిక ప్రాధాన్యత ఈయబడినదనియు' చేసిన విమర్శలు నేటికి కూడా వర్తిస్తాయి.

ఆర్థిక ప్రణాళికలకు విద్యా ప్రణాళికలకు, ఉచిత సంబంధం లేకపోవటం విద్యారంగంలోని ఎగుడు దిగుడులకు ముఖ్య కారణంగా పేర్కొనవచ్చు. అభిలషణీయమయిన ఆర్థికాభివృద్ధి రేటు ననుసరించి, ఏ ఏ రంగములలో ఎంతమంది విద్యావంతులు ఏయే స్థాయి వారు కావలెనో ముందుగనే నిర్ణయించి తదనుగుణముగా విద్యా రంగము నభివృద్ధి పరచవలసిన ఆవశ్యకత ఉంది. ఈ విధానాన్నే 'విద్యావంతుల ఆవశ్యకత భవిష్యత్‌వ్యూహము' (Manpower Forecasting Approach) అంటారు. మన దేశంలో ఈ విధానాన్ని తు. చ తప్పక అనుసరిస్తే మంచిది.

విద్యారంగంలో ప్రస్తుతం కనిపిస్తున్న అనేక రకాల అసమానతలను రూపు మాపటానికి విద్యాలయాలలో ప్రవేశానికి సంబంధించిన విధానాలను ఉచిత రీతిని సంస్కరించవలె.

విద్యారంగంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల, ఉన్నత విద్యా స్థాయిల అభివృద్ధి దాదాపు సమానంగా ఉండటం విద్యారంగం సర్వతోముఖాభివృద్ధికి ఎంతో అవసరం. 70 శాతం నిరక్షరాస్యులున్న మన దేశ ప్రస్తుత పరిస్థితులలో ఉన్నత విద్యకంటె ప్రాథమిక విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం మంచిది.

పాఠ్యగ్రంథాలలో సాహిత్యతత్వము (Literary naturre) ను, కేవలం జ్ఞాపకశక్తిని పెంపొందించే రీతిగా ఉండే భాగాలను తగ్గించి, విజ్ఞానాత్మక భావాలను, ఆలోచనా శక్తిని నిర్మాణాత్మక శక్తిని పెంపొందించే విధంగా పాఠ్యప్రణాళికను సరిదిద్దటం ఎంతో అవసరం. అదే విధంగా పరీక్షా పద్ధతులలో కూడా మార్పులు చేయవలసి ఉంది.

విద్యారంగంపై వెచ్చించే వనరులను సంపూర్ణంగా ఉపయోగించటమే కాకుండా ఆ వనరుల నుండి అత్యధిక ఉత్పాదకత కలుగు రీతిగా వనరులను ఉపయోగించినపుడు తలసరి విద్యార్థికి అగు ఖర్చు చాలా తగ్గవచ్చు; అంతే కాకుండా విద్యాప్రామాణ్యతను పెంపొందించే అవకాశాలు కూడా కలుగుతాయి.

'దేశ సామాజిక ఆర్థిక రాజకీయ — సర్వతోముఖాభివృద్ధికి జాతీయ జీవితానికి అనువుగా మలచబడిన చక్కని విద్యావిధానం ఒక ముఖ్య సాధనము. జాతీయ అవసరాలకు అనువుగా లేని విద్యావిధానం దేశాభివృద్ధికి నిరోధకమే కాక జాతిని సర్వనాశనం చేస్తుంది.[8] కాబట్టి బూజుపట్టిన మన విద్యా విధానాన్ని ఎంతో వేగంగా సంస్కరించవలసిన అవసరం అందరు గుర్తిస్తే మంచిది.

అసతో మా సద్గమయ !

అధోజ్ఞాపికలు

1 Ministry of Education (Govt. of India) : Report of the Education commission 1964-66· Education and National Development (New Delhi) 1966,P 1

2 ఇతర వివరములకు Jandhyala B G Tilalk · "Education and Economic Growth in India (1950-51 and 1969-70) . An Empirical Investigation", Indian Educational Review (Jan. 1975) చూడుడు.

3 A R Kamat : "Education After Independence . . A Social Analysis" Lala Lajapat Rai Memorial Lectures, 1975.

4 నిరక్షరాస్యతా నిర్మూలనము గురించి ఇతర వివరములకు జంధ్యాల బాలగంగాధర తిలక్ : ''అక్షరాస్యత — అభివృద్ధి'' 'భారతి' (జూన్ 1977) చూడుడు.

5 పైన చెప్పిన మూడురకాల అసమానతలు గురించిన ఇతర వివరములకు Jandhyala B G Tilak . "A Note on Equality in Education in India," Indian Journal of Economics (Oct 1975) చూడుడు.

6 సమగ్ర-విద్యాభివృద్ధి సూచికా నిర్మాణము, మిగిలిన వివరాలకు Jandhyala B G ·Tilak : "Inequality in Human Capital Formation in India· A Thearitical and Empirical Analysis within Educational Framework" in Essays in Honour of Professor B Sarveswara Rao. (Andhra University Press, Waltair) Forth coming చూడుడు

7 పంచవర్ష ప్రణాళికలలో విద్యారంగము గురించిన వివరాలకు Jandhyala B G Tilak . "Education in Five year plans", Eastern Economist (April 15, 1977) చూడుడు.

8 J.P.Naik : Educational planning in India (Allied Publishers, Bombay 1965)



కారుచీకట్లోంచి కాంతిలోకి

ఆంధ్రప్రదేశ్ కోస్తాజిల్లాలలో ఇటీవల సంభవించిన పెనుతుఫాను, ఉప్పెనల ఫలితంగా ఎందరెందరో ఆప్తులనూ, ఆస్తులనూ కోల్పోయారు. ఈ సందర్భంలో జాలర్ల గాథలూ, బాధలూ హృదయ విదారకంగా వున్నాయి. 1977 నవంబరు 19వ తేదీ శనివారం కాళ రాత్రి కానవచ్చిన బడబాగ్ని గురించి కొందరూ జలప్రళయంలో సర్వం పోగొట్టుకున్న దీనులు కొందరూ వివరించే అనుభవాలు అందరినీ సాగరంలో ముంచివేస్తున్నాయి. ప్రభుత్వం ఉదారంగా అందజేస్తున్న సహాయంతో వారు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు.

నష్టపోయిన పడవలను మళ్లీ కొనుక్కోవడానికి, పాడైపోయిన నాటిని బాగుచేయించుకోవడానికి జాలర్లకు ఆర్థిక సహాయం అందజేసే నిమిత్తం కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, నెల్లూరు, ప్రకాశం, విశాఖజిల్లాల కలెక్టర్ల అధీనంలో ఒక కోటి 28 లక్షల రూపాయలు ఉంచారు.

బి. డి. ఓ. ల ద్వారా పరికరాలను పంపిణీ చేయడానికి వీలుగా రు 35.60 లక్షల రూపాయలు కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాల కలెక్టర్ల అధీనంలో ఉంచారు.

కొల్లేరు ప్రాంతానికి చెందినవారు వెదురు బుట్టలు అల్లించుకోవడంకోసం 3.9 లక్షల రూపాయలు కేటాయించారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ మత్స్యపరిశ్రమాభివృద్ధి సంస్థకు రు. 2.5 లక్షలు, గిలకల దిన్నెలోని పడవల నిర్మాణ పారిశ్రామిక సహకార పరపతి సంఘానికి పునరావాస నిమిత్తం రు. 5 లక్షల రూపాయలు కేటాయించారు.

సాగరపుత్రులు సాహసంతో పురోగమించి భవిష్యత్తును సముజ్జ్వలం చేసుకుంటారనడంలో సందేహం లేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధశాఖ డైరెక్టరుచే ప్రకటితము

32/77–78

శ్రీ పి. యస్. శాస్త్రి

"పెరుగుట విరుగుట కొరకే"

(చైతన్య స్రవంతిలో రచన)

హాహహ!... హుహుహు! అబ్బా చలి! అమ్మో చలి! ఏం చెయ్యనేం చెయ్య నేంచెయ్యను! లాభంలేదు. లాభంలేదు...లేదులా...కాదులా!...ఏదికాదు ఏదిలేదు?...ఉహ్హాహ్హా...చలి!...భంభం...చలి...భంభం...లాలా...లే లే...దుదు!...చలి...

..."కమాన్ గెటప్ రామ్రావ్!" "ఛప్!షటప్!మై డియర్ అంతర్ ఆత్మా! అంతర్‌జంతర్‌మంతర్...ఆత్మా...పరమాత్మా...ప్రత్యగాత్మా... ఆత్మారావ్... నీకు బుద్ధుందా? చలికాలం ఉదయాన్నే వొంటరిగాణ్ణి లేపచ్చా? నేను చచ్చినా లేవను!".

...అదేమిటి అదేమిటి? ఛస్తే లేవడమెలాగా?

...ఛీ ఛీ !...ప్రొద్దున్నే దుశ్శకునపు...దుశ్శకునమా అపశకునమా? దుర్ ప్లస్ శకునం దుశ్శకునం అనగా చెడ్డ శకునం...అలాగే మరో మాట లాగేద్దాం!...దుర్ ప్లస్ శాలువా...దుశ్శాలువ అనగా చెడ్డ శాలువా!...

...హోల్డాన్ హోల్డాన్! దేర్ ఇజ్ యె స్లైట్ హిచ్! దుశ్శాలువలు గౌరవ పురస్సరంగా యిచ్చేవి! చెడ్డవైతే ఎందుకిస్తారు? ... దుశ్శాలువకు అమరంలో నిర్వచనం యేముందో చూడాలి!...అంతవరకు మన పరిశోధనని కట్టిపెడదాం!

...అబ్బాచలి!...అబ్బబ్బాచలి!..."లేవయ్యా రామారావూ!"..."అబ్బబ్బా! నీ గొడవేమిటోయ్ ఆత్మా! నేనిందాకా చెప్పానా? నే నిప్పుడు వచ్చినా లేవను!" నేనిలాగే యుగాలూ జగాలూ గడచినా..."అదీ భలే పడుతోందియమకం!...కం కం...కమ్‌కమ్‌కమ్! కమాన్ డియర్..." కం కం కం కంగారు నీకేలనే ... నావంక రావేలనే..."లేస్తావా రావూ?" ..."అబ్బా లేస్తున్నా అత్మా!"...

... ముఖం కడుక్కోగానే కనిపించిన ఆ అప్సరస ఎవరెవరెవరు?..."ఎవరివో నీవెవరివో ఎవరివో..."ఎవరెవరు? ఇంకెవరు? మై డియర్ డ్రీంగర్ల్ హేమమాలిని...డ్రీంగర్ల్...స్వప్నసుందరి...అలనాటి అంజలీదేవి...ఈనాటి నాట్యతార స్వప్నసుందరి...సుందరి సుందరి..."ఓహో సుందరీ ఆహా సుందరీ"...

...అవునవును! ఆమె స్వప్నబాల హేమమాలిని ఆ వొంపు సొంపులు...గ్రాండ్‌వొంపులు...కెంపులు పోసినా కాని దొరకని వొంపులు... మై డియర్ శారదా రమణీ...మణీ! ఈ చలిదినాలలో నీ భర్త నొదిలి పుట్టింటికేగి నీకు న్యాయమా?... "న్యాయమా నామనో నాయకీ?"...ఓహో భలే వచ్చింది...ఒంటివేడి బుర్రకెక్కుతోంది...ఏం చెయ్యనేం చెయ్యను?...

..."మసకమసక చీకటిలో...మల్లెతోట వెనకాల...మాపటేల కలుసుకో నీ మనసైన"......అహా!ఓహో!..."ఈ భంగిమ నచ్చిందా?"...నచ్చదూ నచ్చదూ? ఎందుకు నచ్చదు? కాంచన వండ్రఫుల్! బంగిమ! భంగిమ...రంగైన బంగారు బొమ్మబంగిమ!

"ఒస్తా!వెళ్ళొస్తా! మళ్ళెప్పుడొస్తా? రేపు సందేళకొస్తా"...ఓహో శారదామణీ నువ్వు రావు రావు రావు! "నువ్వు రామారావు!"

"అవునయ్యా! నేను రామారావునే! రావు గోపాలరావు నేం కాదు! మధ్యలో నీ నస ఏమిటంట!" "శారదామణీ! నీ మొగుడిగాడి బాధ నీకేం తెలుస్తుంది?...అబ్బా చలి! ఒంటికి చలి...ఒంట్లో చలి! ఊపేస్తోంది - మనస్సును!... వొణికిస్తోంది నరనరాన్ని...మనసు వానరంలా గంతులు వేస్తోంది!" ఒరేయ్ రామారావ్! ఏమన్నా వెధవ వేషాలేస్తే మళ్ళీ రంగనాయకమ్మగారు పెళ్ళాలు ఊళ్ళోలేని మగాళ్ళగురించి మరో కథ రాసేస్తుంది జాగర్త!" "...అబ్బే అబ్బే!. ఏం లేదేం లేదు! అటువంటిదేం లేదు!"

..."నీవు లేక వీణ పలుకలేనన్నది. నీవురాక రాధ నిలువలేనన్నదీ"......"నీవు లేక నేనూ నిలవలేక వున్నానూ... నీవు రాక నన్ను చంపుతూవున్నావూ!"...ఓహో! మనమూ పాటలురాయగలం సందేహం లేదు! వెధవది! ఒట్టిపాటలేమిటి ? పాటలు, మాటలు, ఫొటోగ్రఫీ, దర్శకత్వం, కళాదర్శకత్వం, సంగీతదర్శకత్వం...అన్నీ మనం చెయ్యగలం!..."రామారావ్! కోతల జోరు తగ్గించు! అన్నీ నువ్వే చేస్తే చివరలో (భానుమతి వోసారి చెప్పినట్టు!) సినిమాను చూసుకోవడం కూడా నీవొక్కడివే చేయాల!

..."అబ్బా ఆత్మా! .. ప్రోత్సాహమిచ్చి ముందుకి నడిపించవలసిందిపోయి అస్తమానం నువ్విలా వెనక్కి దిగలాగితే నేను ముందుకువెళ్ళేదిఎలాగాలని?"...'అంతరాత్మ'మాటలుఅప్పుడప్పుడు విన్నవాళ్ళు మాత్రమే బాగుపడతారట! కనక ఇసారికి ఆత్మకి 'నో' చెబ్దాం! మన కలల లోకంలోకి వెళ్ళిపోదాం!...జల్దీ ఛలో!...ఆ!...అన్ని దర్శకత్వాలు నెరుపుదాం!...అది సరే కాని ఆ ఫీల్డులోకి వెళ్ళడానికి వెనకటికి దుర్యోధనుడు చెప్పినట్టు...అసలు 'దుర్యోధనుడు' అంటే చెడ్డగా యుద్ధం చేసేవాడనేనా? మరి

యీ దుర్యోధనుడికే 'సుయోధనుడు' అని కూడా పేరున్నట్టుందే! ఏమిటో యీ గందరగోళం అంతా! "సంస్కృతం చదువుకోక పోవడంతో మా వికొచ్చి పడింది"! .. ఇది గిరీశం డైలాగుల ఫక్కీకాదూ?... కాదేమిటి మక్కికి మక్కీ!...ఆ యింతకీ ఆ దుర్, సు,యోధనుడు చెప్పినట్టు సూదిమోపినంతస్థలంకూడా యివ్వటం లేదు ఫీల్డులో వాళ్ళు!...ఆ మాత్రం అవకాశం యిస్తేనా...ఒక వూపు వూపమూ?..." ఒరేయ్ రామారావ్! ఇప్పుడు ఫీల్డులో వున్న వాళ్ళు వొకప్పుడు నీలాగే అనుకుని వుంటారు! అక్కడికి వెళ్ళాక ఆ గాడిలో యిరుక్కుపోయి వుంటారు".

..."అబ్బా ఆత్మా! నా కాంక్షాజ్వాలపై నీరు చిలకరించెద వేలా?"...మన ప్రజ్ఞాప్రాభవాలిలా మాసిపోవలసిందే...ఏ ఇరవై లక్షల లాటరీయో తగిలి మనమే సినిమా తీసేవరకూ అవకాశం లేదు!..."లాకేత్వము దాకు కొమ్ము".. అంతే!

...అమ్మా టిఫిన్ కాఫీ పూర్తయింది! పాన్ షాప్‌లో కాదు తెలుగు దేశపు రాజధానిలో ఉండి తెలుగులో మాట్లాడకపోతే ఎలా? 'కిళ్ళీ బడ్డీ'లో...'కిళ్ళీ' తెలుగుమాటేనా? శబ్దరత్నాకరం చూడాలి! సీతారామాచార్యులవారి కాలం నాటికి 'కిళ్ళీ' ప్రాచుర్యంలో వుందో లేదో! లేకపోతే యీమధ్య నిడదవోలు వెంకటరావుగారి అనుబంధంతో ప్రచురించారుగా సి. యల్. యస్. వాళ్ళు శ. ర.వి. అందులో వుండదా? సాయంకాలం వెళ్ళగానే చూ. శ. ర ...

...ఇంతకీ 'పాన్ షాప్' అదే 'కిళ్ళీ బడ్డీ'లో వక్కపొడి కొనా లనుకున్నాం గదా...ఒక పాకెట్...ఏది? అదే "ఒక్క త్రివేణి వక్క పొడి పెద్ద పాకెట్ యివ్వండి... ఏక్ త్రివేణీ సుపారీ దేవ్!" "అబ్బ! త్రివేణీ వక్కపొడికింత డిమాండా?".. "అహ్హాహ్హా మరే మనుకున్నావ్!" వివిధ భారతిలో ప్రకటన! అడ్వర్‌టయిజ్‌మెంట్... శ్రోతల బుర్రల్లోకి ఆదేశాల్నితిన్నగాయెక్కించే సాధనం' సాధనం... ధనం సంపాదించడానికి! అడ్వర్‌టయిజ్‌మెంట్ ద్వారానూ, అడ్వర్ టయిజ్ చెయ్యడానికీను! ఒహో! "ఎటుచూసిన చటులాలంకారపు మటుమాయలలో"... "కవితా—...నా కవితా!"...

"హలో రావ్! ఏం చేస్తున్నావ్? ఏవీ చెయ్యటంలేదా? సరే! "ఎంటర్ ది డ్రాగన్" మార్నింగ్ షోకు వెడదామా?!... "రావూ?...రావు! నువ్వెందుకొస్తావ్! రాణీ యింటికి వెడతావ్! నువ్వు "రావు" ..నువ్వు రావు!"

...వెధవ వెధవవ్వెధవ! వెధవన్నర...అరవెధవ పావువెధవ... చికిలి కళ్ళతో కులికే రాణి యింటికి సెలవురోజు ప్రొద్దున్నే తయారు! ఆఫీసులో రోజంతా చెప్పిన కబుర్లు చాలలేదు! ప్రొద్దుటి నుంచి సాయంత్రందాకా పొగడటం చాలలేదు! ..."ఏం చేస్తాడు!" "తా వలచింది రంభ తా మునిగింది గంగ!" ... కాని మనకు ఆ సంభాషణావకాశమూలేదే!...అవకాశం .. పావకాశం ...ఆకాశం ... కాశం...శంకా నహి నహి రక్షతిరే శంకా...నహీ నహీ! నహీ!... పోనీ మనమే పోదాం సినిమాకు...

... "గుడ్మార్నింగ్ సార్! మార్నింగ్‌షోకని బయలుదేరా! ... అబ్బే పెద్ద "షోకేం" లేదండి. మామూలుగానే ఉన్నా! షో లేకా? పదోసారి పోలేదండి! ... అహ్హాహ్హా! మీరు రమ్మంటే రానా?" ... కొంపదీసి ముసలి ముండాకొడుకు, కూడా రమ్మనడు గదా? వాడు పట్టించే జిడ్డు కుక్క సబ్బెట్టి తోమినా వదలదు!"

... అమ్మయ్యా! పీడా పోయింది ... ఆడగాలి సోకితేచాలు గురుడు మరి అటు యిటూ చూడడు .. ముక్కుకు ఎవరో తాడు వేసి లాగినట్టే! ... వెధవ! మళ్ళీ మారు పలక్కుండా వెళ్ళి పోయాడు ...

... ఓరీ రామారావూ! నీకు మాత్రం ఆడగాలి యిప్పుడు ఇష్టం లేదూ? కదిలే చీరల రెప రెపలను కళ్ళు చించుకు చూస్తావేం?" ...

..."నాకా...నాకా? ఛ! అదేం లేదు! ఆ చీరల డిజైన్లు చూస్తున్నా!"

... "ఏడిశావ్ నీ సంగతంతా నేను కనిపెడుతున్నా! ఆ చీరల డిజైన్లుబదులు కొంగుజారడాన్ని ఆతృతతో గమనిస్తున్నావు! ఒరేయ్! నేను నీ అంతరాత్మని— నన్నే మోసం చేద్దామని ప్రయ త్నిస్తున్నావురా డింగరీ? వాడు కాదు. నువ్వు వెధవ్వి! పెళ్ళాం యింట్లో లేకపోయేసరికి రోడ్డున పడ్డావు! "... మనిషి రోడ్డున ..."

"షటప్! అంతరాత్మవంటూ గౌరవించి వొకసారి కాకపోతే మరోసారేనా నువ్వు చెప్పినట్లు వింటూవుంటే నీకు వొళ్ళుకొవ్వెక్కి పోయి నామీదే అభాండాలు వేస్తున్నావు! ..."

"హహహ! ఓరీ రామారావూ నాకు వొళ్ళులేదురా! నిరా కారుణ్ణి! నీ దేహాన్ని ఆధారం చేసుకున్నా! ఆ నీ వొళ్ళే కొవ్వెక్కింది!" ...

"హా! కనిపించను కదా అని కండ కావరం పెరిగింది నీకు!"

"హహహ! ఇందాక ఓసారి చెప్పా! కండేలేదు నాకు! కావరం ఎక్కడిదిరా? అదంతా నీదే! ..."

"అబ్బబ్బా! ఆత్మా! షటప్ అండ్ గెటౌట్ ఫస్ట్! లేని పోని వూహలు నా కంటగట్టి, నూరిపోసి, "బ్రెయిన్ వాష్" చేసి నన్ను దుర్మార్గుడిగా మార్చేద్దామని చూస్తున్నావు! నీ ఆటలింక సాగనివ్వను? గెటౌట్. వెళ్ళు! వెళ్ళి ఆ హృదయ కుహరంమధ్యలో "నీ లతో యద మధ్యస్థ విద్యుల్లేఖేవ భాస్వరా"...లా తలక్రిందు లుగా పడుకో! పో ... పో ముందు!

... "ఫూల్! నన్నే డబాయించగలననుకున్నాడు! దెబ్బకి దెయ్యం జడుస్తుంది! దైవాంశ సంభూతుణ్ణి అని చెప్పుకునే వీడెంత? ... దెబ్బకిపోయి పడుకున్నాడు. మన అంతరాత్మ నోరే మనం మూయించ లేకపోతే ఎలాసార్!"...

... అయినా మనస్సు చంచలం ... చలం ... అరుణాచలం లోకి కరుణా చలం ... చలం ... కళాప్రపూర్ణ చలం ... కవిగా చలం ... రవిగా చలం ... ఎన్నో వేల హృదయాలలో చలనం కలిగించిన చలం ... చంచలమైన ... చ ం చ లా .. మై డియర్ చంచలా ! ఎక్కడున్నావ్ ? ... ఆ...మనస్సు చంచలమని షణ్మత స్థాపకాచార్య జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులవారినుంచి యీనాటి సూక్తి ముక్తావళీ ఆచార్యుల వరకూ ... సూక్తిముక్తావళి చెప్పడానికి డాక్టరేట్ ఆచార్యులు, పౌరాణిక ఆచార్యులు అని రెండు కేటగిరీలుట ! ... వివి గిరి గారేం చేస్తున్నారో?...ఆ ... అందరూ చెప్పారు. అందుకని ఆత్మగాణ్ణి బుకాయించినా, అందులో యే కొంతో నిజముందో నేమోనని చిన్న అనుమానం !...హు! మనకేం ఫరవాలేదు ! మనకెంతో ఆత్మబలం, మరెంతో ఆత్మనిగ్రహం ఉన్నాయి ! 'ఆత్మ నిగ్రహం' అంటే ఆత్మని నిగ్రహించడమా? ... ఛ కాదు . . మనని మనం అదుపులో పెట్టుకోగలగడం అనుకుంటా. అబ్బ శాంస్క్రిట్ రాకపోవడం పెద్ద డ్రా బాక్ అయింది !

''పోనీ ఉదయాన్నే రేడియోలో సంస్కృత పరిచయం విని నేర్చుకోరాదూ ?'' ...

''ఓయ్ ఆత్మా ! నిన్నిన్ని తిట్టినా నన్నొదల లేదా ?''

''ఎందుకొదులుతాను ? నీ శరీరం ఉన్నంతసేపూ నీలోనే, నీలోనే వుంటా ... నీడలా, తోడులా !''

... ఔరా ! ఈ ఆత్మకి తెలుగు సినిమాలు చూసి చూసి యమకం చమక్కులు సినీ డైలాగులు నర నరాన్నా జీర్ణించి పోయాయి ! ...

''అదే కాదురోయ్ రామారావ్! నీవీ మధ్య వచన కవిత్వం వెలిగించాలని ప్రయత్నించటంలేదూ? అది నాకు మాత్రం రాదనుకున్నావేమిటి!''

''సరే సరె సరే! కాసేపు నోరుమూసుకో! నా ఆలోచనలు వో దారిలో సాగనివ్వక అడ్డం తగులుతావేం!''

ఆ ! మనస్సు చంచలం. అది దాని సహజ స్వభావమట. విద్యారణ్యులవారు కూడా చెప్పారు దాని సహజ స్వభావాన్ని నేను మార్చగలనా? రోడ్డుమీద నడుస్తూ కాస్త అటు యిటూ చూసి వుండచ్చు. పెళ్ళాం యింట్లో లేనివాడికి కాస్త కంటి మెరమెర వుండచ్చు!

''అదే! అదే! అదేరా రామా, నేనన్నదీను! కాదని నన్ను డబాయించావు! నా నోరు మూయగలవేమోకాని నీ మానసలోకం నోరు ముయ్యలేవు!

''ఛవ్! ఒద్దన్నకొద్దీ వెంటబడి వేధిస్తావేం! ఫో లోపలికి పోయి పడుకో మదీయ ఆత్మరాజమా!'' ...

''తప్పకుంటాలేవయ్యా బాబూ ! ఆ బొమ్మనిచూసి నేనేం మై మరచిపోవటంలేదు!'' ...''మై'' అంటే 'మెయి' అంటే శరీరం అయి వుంటుంది అంటే శరీరం మరచిపోవటం అన్న మాట—అంతేనా?...

అబ్బ! కళ్ళు చెదరగొట్టే సెక్సీ బొమ్మలు...లంగాలతో, లుంగీలతో, స్లీవ్‌లెస్‌లతో, టాప్‌లెస్‌లతో.. అమ్మాయిల అంద చందాలు...సినిమాల్లో పుజ్జ్వలంగా,బొమ్మల్లో ఆకర్షణీయంగా... అబ్బా వెన్నులో జలదరింపు, ఒంట్లో చలి ప్రారంభమవుతున్నాయి ఆ రోడ్డుమూల పందిట్లో రికార్డుల ...''ఎక్కుమామా బండెక్కు మామా''...''కొట్టుమామాపంపు కొట్టుమామా''...''ఎందుకంటే ఏమి చెప్పను...ఏమిటంటే ఎలా చెప్పను?'' చెప్పను చెప్పను. . ''అందుకే''...''అందుకే''...ఇంకెందుకు? అబ్బా వళ్ళు వేడెక్కి, వేడెక్కి, నరాలు పోటెట్టి, ఎక్కి...ఎక్కి...

''ఎక్కు ఎక్కుసిటీబస్సెక్కు ! ''...సిటీ...టీబస్సు...టీ టీ టాటా టూ టూ...నిలబడి కాళ్ళు తొక్కుకుంటూ, కుదుపులకు అటు యిటూ వొరిగిపడుతూ ... విసుక్కుంటూ ... నిలుక్కుంటూ కుంటూ...ప్రయాణం...ఆడామగా బేధంలేదు.. లేదు లేదులే ...

అబ్బా ! హాయి ! నాముందు నన్ను హత్తుకుని, నావొంటికి మెత్తగా వొత్తుకుని తగిలే ఇసుక తిన్నెల్లాంటి మెత్తని శ రీ ర పు కండలు...నా శరీరపు వేడిని పెంచుతూ...నా నరాన్నివాణికిస్తూ, నా రక్తపుపోటు పెంచుతూ...అబ్బా...యీ ఆడవాళ్ళు! ... ''ఇటీజ్ వుమన్ దట్ సెడ్యూస్ ఆల్ మేన్ కైండ్!'' ... ఆమె ముందుకు జరగదేం...కొంపదీసి నాలాగే ఆమెకీ ? నిజంగానేనా...ఇంకొంచెం దగ్గరకు జరిగి చూద్దాం ..సంగతి తేలిపోతుంది!దగ్గరికి...ఇంకొంచెం ...ఇంకొంచెం . ఏమీ అనటంలేదు...అంటేపరపురుష స్పర్శ ఆమెకీ? అంతే అయివుంటుంది. ఎవరూ గమనించటంలేదు! ''ఎవరూ చూడటంలేదు,క్షితిజరేఖ వెనుక నిలిచి పిలిచే రత్నకంకణ హస్తాన్ని''

ఓ చెయ్యి బుజంమీదకు మెల్లిగావొదిలిచూద్దాం! 'స్లో'గా... 'స్లో'గా 'లో'గా అబ్బ!జర్రున జారే ఆ నునుపు ...ఆ గుండ్రదనం... ఆ మెత్తని కండక్రిందకు .. ''ధైర్యే సాహసే'' కానీ ..కానీ... మెల్లగా మెల్లిగా బుజంమీంచి...

''ఫూల్! ఇడియట్! ఇందాకటినుంచి చూస్తున్నా! వెధవ్వేషా లేస్తావ్! పోలీసుల కప్పజెబుతా! ఏమనుకున్నావో! రాస్కెల్!''

అబ్బ! దవడ పేలిపోయింది! కళ్ళముందు మెరుపులు మెరిసాయి! దవడమీద పిడుగులు కురిసాయి! భలే అయింది! వెధవలా మొహం దించుకుని క్రిందకి దిగిపోయా! బాగా అయింది. కావలసిందే! సుమతీ శతకంలో చెప్పలేదూ? ''పెరుగుట విరుగుట కొరకే'' అని! ఒచ్చిం దొచ్చింది! బుద్ధొచ్చింది! శారదామణి వచ్చే వరకూ మళ్ళీ యిల్లు కదలను! మణీ...అబ్బా! ఈ పన్ను కదులుతోంది... ఊడిపోతుందేమో!...

కలగూరగంప

చతుర్భాణీ

కవిగారు తమ సంస్కృత గ్రన్థ గవేషణా కార్యములో కను గొనిన ప్రబన్ధరత్నము 'చతుర్భాణి'. ఇది నాలుగు అపురూప భాణముల సంపుటి. 1922లో శ్రీ రామనాథశాస్త్రి సహ సంపాదకత్వమున పాట్నా నుండి కవిగారు ప్రకటించిరి. శృంగార శృంగాటము అనుటకు నిదానమయిన ఈ చిరంతన భాణములకు 1975లో శ్రీ మనోమోహన ఘోష్, కలకత్తా చక్కని విపుల భూమికతోను, ఆంగ్ల భాషాంతరీకరణతోను ప్రకటించియున్నారు. రసవంతమగు కవిత్వమునకు ఆటపట్టులయిన చతుర భాణముల సంపుటి ప్రాశస్త్యమును ఇప్పటికినీ గుర్తించు స్థితిలో లేనందున రేఖామాత్ర పరిచయమే ఈ రచన ఉద్దేశ్యము.

అస్తాం వస్తుషు వైదగ్ధ్యం
కావ్యే కామపి వక్రతాం
ప్రధాన సంవిధా నాంక
నామ్నాపి కురుతే కవి :

— వక్రోక్తి జీవితం ౪_౨౪

అను కుంతకుని సూక్తికి అనువుగ ఈ భాణముల నామములును ఔచిత్యవంతములయి, రసపోషకములయి భాసిల్లుచున్నవి.

ఇందు మొదటి భాణము పేరు ఉభయాభిసారికా వరరుచి కవి కృతము. ధూర్తవిట సంవాదము రెండవ భాణము. ఈశ్వర సేన ప్రణీతము. మూడవ భాణము శూద్రక మహాకవి నిర్మిత పద్మప్రాభృతకము. చివరిది సౌమిల్లకుని పాదతాడితకము.

కవిగారి ముద్రిత ప్రతిలో పాదతాడితక భాణకర్త శ్యామిలక కవిగా గ్రహీతము. కాని ఆచార్య మనోమోహన్ ఘోష్‌గారు క్రింది ఆర్యా పద్యమును చర్చించి, సోపపత్తికముగా సౌమిల్లకకవి ప్రణీతముగా నిశ్చయించినారు.

వరరుచి రీశ్వరదత్త : శ్యామిలక :
శూద్రక శ్చత్వార : ।
ఏతే భాణాన్ బభణు కా
శక్తి : కాలిదాసస్య॥

పై ఆర్యాలో రెండవ పాదమందు అనగా 'శ్యామిలక : శూద్రకశ్చత్వార :'' లో ఛన్దోదోషము స్పష్టము. పదునెనిమిది మాత్రలుండవలసిన చోట పదునేడు మాత్రలే యున్నవి. పై ఆర్యను ఉదహరించిన పూర్వ సంపాదకులు దీనిని గమనించలేదు. శ్రీ ఘోష్‌గారు ఛన్దో భంగము వింగడించి శ్యామిలక : అను చోట సౌమిల్లక : అనిన ఆర్య చక్కగ కుదురును — అని స్పష్ట పరచుట గమనించునది.

కవికుల గురువు మహాకవి కాళిదాసకవిచేత ''మాళవికాగ్నిమిత్ర'' ప్రస్తావనలో భూషించబడిన సౌమిల్లక కవియే మనకు లభించిన పాదతాడితక భాణకర్తయని నిశ్చయమయినది. ఈ విధముగ వరరుచి, ఈశ్వరసేన, శూద్రక, సౌమిల్లకులు కాళిదాసకవి కంటె పూర్వులై, శృంగార మధుకోశములగు భాణకర్తలగుట సాహిత్య పరిశోధకులు గమనించతగినది.

ఇక కాలనిర్ణయమునకు 'చతుర్భాణీ'లోని అపూర్వ పదములే నిదర్శనము. అతీత్య, ఆలభన, తృతీయాప్రకృతి, శూన, అంఘో, పరిశర, శీఘర, సోపస్నేహ, ఉపోహన, నిష్పన్న శిష్య, దేవానాం ప్రియ, ధ్వాంక్ష, ఊడా, సంఘాత బలిన్, అనుశిష్టి, చౌక్ష, ప్రత్యనీక, గోగ్గా, అసంగ, ఉల్ముక, సహస్రచక్షు : — ఇత్యాది ప్రత్యేకపదములు భాసనాటకాదులలో కాంచనగును. కొన్నిపదములు కోశములలో కన్పించవు. కొన్నింటికి అర్థములు విలక్షణముగ నున్నవి.

ఛన్దోవిశేషములనుబట్టి గూడ 'చతుర్భాణీ' ప్రాచీనత నిరూపించనగును. నాట్యశాస్త్రములో పేర్కొనబడిన 'కామదత్తా' వృత్తము 'చతుర్భాణి'లో కాంచనగును. ఇతర కృతులలో ఇది మృగ్యము. ధూర్తలో ఇరువది అక్షరములుగల న, న, ర, ర, ర, ర, ర—గణములతోడి అజ్ఞాత నామవృత్త ప్రయోగము, భుజంగ విజృంభితము, వియోగినీ వృత్తములు చతుర్భాణి' చిరంతనతను ధృవీకరించుచున్నవి. కామశాస్త్ర కర్తలలో విస్తృత నాముడయిన వాత్స్యాయనుని పేర్కొనక, దత్తకుని మాత్రమే ఉగ్గడించుట విమర్శకులు సంవీక్షించవలసిన మఱియొక ఉదాహరణ.

'చతుర్భాణిని' చక్కగ పరిశోధించి, సుసంస్కృత ముద్రణ గావించిన ఆచార్య మనోమోహన్ ఘోష్‌గారు చతుర్భాణికిని, భాస, భరత, పాణిని, కౌటిల్యుల రచనలకును సామాన్యతను నిరూపించి, తులనాత్మక పరిశీలనద్వారా 'చతుర్భాణీ'రచనను క్రీ. పూ. 350—250 మధ్య అని నిరూపించిరి. విమర్శకులు, పరిశోధకులు, కావ్య వినోదులు, గమనించవలెను.

ఎంతో చిరంతన రచనలు ఐనప్పటికి, నవ్యతను సంతరించు కొని, ప్రత్యగ్రస్ఫూర్తితో భాసిల్లు రూపకములు చతురభాణములు. ఇందుకు ధూర్తప్రారంభ పద్యమే చక్కని ఉదాహరణ.

విద్యయా ఖ్యాపితా ఖ్యాతి :
సజ్జనారా ధనం ధనం ।
తేషాం ప్రీత్యా భవేద్ ధర్మ
ఇత్య స్మాకముపక్రమః॥

మొదటి రెండు పంక్తులు చాలు, ధూర్త. కర్త ఈశ్వర సేనుడు ఎంతటి అభ్యుదయ కవియో తెలుసుకొనుటకు. మంగళా

చరణ శ్లోకములో దైవమునకు స్థానమీయక, సజ్జనుల ఆరాధనమే ధనమని ప్రబోధించినాడు.

'చతుర్భాణి' సూక్తులకు గని. వర్ణనలకు రావు. వైదర్భీ రీతికి కాణాచి. చక్కని గద్యకు నిదానము.

సూక్తులు కొన్ని :

1. దానం నామ సర్వసామాన్యం వశీకరణం లోకస్య।
2. ప్రత్యక్షే హేతువచనం నిరర్థకం।
3. సర్వో హి సుఖినం ద్వేష్టి లోకః ।
4 సుకుమారః ఖలు కామినీ సంపరిగ్రహః
5. సర్వథా ఖలు దుర్లభః మోక్షః।

'చతుర్భాణిని' కనుగొని ప్రకాశింపచేసిన కీర్తి కవిగారిది ఐతే, సుష్ఠుగా పరిష్కరించి వెలయించిన ఖ్యాతి శ్రీ మనోమోహన్‌ఘోష్ గారిది.

శ్రీ ఇ. సాయిబాబా

తిరుపతి వేంకటకవులు-వచన రచనలు

ఆగష్టునెల 'భారతి'లో శ్రీ క్రొవ్విడి లక్ష్మన్నగారు తిరుపతి వేంకటకవుల గురించి వ్రాసిన ''క్రియాసిద్ధిస్సత్వే భవతి'' అన్న వ్యాసంలో వారి వచన రచనల గురించి ఇలా వ్రాశారు :

''ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలద్వారా వీరు వెలువరించిన రచనలు అపారం. అందులో ముఖ్యంగా యెన్నదగినవి నవలలు. వీటిలో చాలావఱకు బెంగాలీ, కన్నడ భాషలనుంచి పరివర్తనాలు. 'వసుమతీ వసంతం, దుర్గేశనందిని, చతురచంద్రహాసం' మొదలైనవి పుంఖాను పుంఖాలుగా రచించి ప్రచురించేరు ఈ గ్రంథమాల ద్వారా నవలా వాఙ్మయం ఎంతో అభివృద్ధి చెందింది. మొదట మొదట ప్రేమ ప్రధానంగా ఉన్నవల్లా తరవాత తరవాత అపరాధ పరిశోధకాలుగా మారినై వీటిని చూసి ఆంధ్రదేశంలో 'అన్ని మూలలా నవలాకారులు బయలుదేరారు ''

తిరుపతి వేంకటకవులు కొన్ని వచన రచనలు చేసింది జగద్విదితమే. కాని వారు నవలలున్నూ వ్రాసినారని చదువటం ఇదే మొదటిసారి. ఈ విషయాన్ని తెలుగు పాఠకుల దృష్టికి తేవటంలో ఈ రచయిత మొదటివారు. ఏ సాహిత్య చరిత్రకారుడూ వ్రాయని విషయమిది. పైగా వారికి వంగ, కన్నడ భాషలు వచ్చుననడం విచిత్రంగా వున్నది.

మొట్టమొదట తెలుగులో నవలవంటి వచన గ్రంథం ''మహాశ్వేత'' కొక్కొండవేంకటరత్నం పంతులుగారు వ్రాసి, తెలుగు నవలా రచనకు శ్రీకారం చుట్టినారు. ఈ విషయమై కొంత వివాదం వున్నా ఈ ప్రక్రియకు 'రాజశేఖర చరిత్ర' రచనతో ఒరవడి పెట్టింది వీరేశలింగం పంతులుగారు ఆదే కాలంలో ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల స్థాపించి, వంగనవలలను ఆంధ్రీకరించి తెలుగులో నవలా వాఙ్మయానికి దోహదం చేసినవారు వేంకట పార్వతీశ్వర కవులు. ఒక ఉద్యమప్రాయంగా నవలా రచనకు పూనుకున్నారు వారు. అనువాదాలే కాక స్వంతంగా నవలలు వ్రాశారు. వీరి మౌలిక నవలల్లో 'మాతృమందిరం' నవలా సాహిత్యంలో ఎన్నదగిన రచన. ఇటీవల ఎమెస్కో వారిచేత పునర్ముద్రించబడింది కూడా.

ఇక తిరుపతి వేంకటకవులు నవలా రచనలు ఎరుగుదురేమో కాని ఏవల లెన్నడూ వ్రాయలేదు. వంగాంగ్ల కన్నడాది భాషలు వారికిరావు. వారు సంస్కృతాంధ్రాలలో మాత్రమే లబ్ధప్రతిష్ఠులు. వారి జీవితమంతా అవధానాలతో, సాహితీ సమరాలతో గడిచిపోయింది. వారు తిట్టిందీ, తిమ్మిందీ కూడా పద్యంలోనే కొన్ని సంస్కృత కావ్యాలను మాత్రమే—హర్షచరిత్రము, విక్రమాంకదేవ చరిత్రము మొదలగు వానిని అనువదించి తెలుగు గద్యంలోకి తెచ్చారు అవి నవల అనదగినవికావు గద్యకావ్యాలు. వారి మిగతా వచన రచనలన్నీ వారి సాహిత్య సమర గాథలకు, కావ్యానుభవాలకు, స్వీయభావాలకు సంబంధించినవి. అందులో పేర్కొనదగినవి, పేరొందినవి వారి ''కథలు గాథలు'' అనే వ్యాససంపుటాలు. వీనిలో వారు చేసిన తెలుగు సాహిత్య—ముఖ్యంగా కావ్యాల—విమర్శ చాలా వున్నది. వీటి ప్రసక్తి పై వ్యాసంలో లేకపోవటం ఒక లోపమే. ఆ కథలు గాథల రచనలో చెళ్లపిళ్లవారు చూపిన కథన నైపుణ్యం, శైలీవైశిష్ట్యం నిరుపమానమైంది. నేటి యువ రచయితలకు అది ఆదర్శప్రాయమైంది కూడ. ఆ వ్యాసాలు సాహితీపరులకు కరదీపికలవంటివని ప్రసిద్ధి పొందినవి. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ''తిరుపతి వేంకటకవుల జీవితము, సాహిత్యము'' గురించి ఒక పరిశీలనాత్మక గ్రంథం ప్రకటించారు

పైన పేర్కొనబడిన 'వసుమతీ వసంతం, దుర్గేశనందిని, చతుర చంద్రహాసం' అనే రచనలు తిరుపతి వేంకటకవులవి కానే కావు వ్యాసకర్త వాక్యాలను ఉద్ధరణ చిహ్నాలతో (inverted Commas)చూపటం వలన ఆ వాక్యాలు వారి స్వంతం కావనిపిస్తున్నది. కాని ఆ వాక్యాలు తిరుపతి వేంకట కవులకు సంబంధించినవి కావు. కనుక ఆ వాక్యోద్ధరణకూడా పొరపాటుగానే జరిగింది.

'యుగకవులా?' అన్న ఉపశీర్షిక క్రింద వ్రాయబడిన ఈ వాక్యాలు గమనార్హాలు—''వేంకట పార్వతీశ్వర కవుల పేరనే ఆబాయుగము పిలువబడవలయునని తద్భక్తు లనుచున్నారు..'' రెండవపేరా: ''ఆంధ్రదేశంనిండా ఆ తరవాత వెలసిన జంటకవులకి ఒరవడి వేంకటపార్వతీశ్వర కవులే ననాలి. వీరిని అనుకరించని కవులు చాలా తక్కువ.''

తిరుపతి వేంకట కవుల గురించి వ్రాస్తూ ఈ వేంకట పార్వతీశ్వర కవుల ప్రసక్తి తేవటం ఎందుకో. రచయితకు తిరుపతి వేంకటకవులు నవలా రచయితలు కారనే విషయమేకాక తిరుపతి

వేంకటకవులు, వేంకట పార్వతీశ్వర కవులు వేరు వేరనే విషయం కూడా సరిగా తెలియనట్లున్నది.

దివాకర్ల తిరుపతిశాస్త్రి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, కలిసి 'తిరుపతి వేంకట కవులు' అని పిలువబడుతున్నారు. బాలాంత్రపు వేంకటరావు, ఓలేటి పార్వతీశంగారలు కలిసి "వేంకట పార్వతీశ్వర కవులు" అని పిలువబడుతున్నారు.

వేంకట పార్వతీశ్వర కవులు నవలా రచయితలుగా ఎంత ప్రసిద్ధులో మార్మికకావ్య ప్రణేతలుగా అంతకంటె ఎక్కువ సుప్రసిద్ధులు. వీరి 'ఏకాంతసేవ', 'భావ సంకీర్తనము' కావ్య సాహిత్య భండాగారంలో కొల్లవోని కోహినూరు వజ్రాల వంటివి. వీరు తిరుపతి వేంకట కవులవలె జంటగా కవిత్వపు పంట పండించారే కాని అవధాన విద్యా విద్యా విశారదులు, సాహిత్య సమరవీరులుకారు. వారు(తి॥వే॥క) బాలసరస్వతులు, కింకవీంద్ర ఘటాపంచాననులూ ఐతే వీరు కవిరాజహంసలు, కవి కులాలంకారులు. ఈ జంటకవుల కవిత్వాలనూ, వ్యక్తిత్వాలనూ ఆస్వాదించి, అర్థం చేసుకున్న ఆంధ్ర సాహితీపరులు, రసికులు మెచ్చి యిచ్చిన ఈ బిరుదాలు సత్య ప్రతిపాదకాలు. ఇచ్చువచ్చి పెట్టుకున్నవైనా అన్వర్థములే రచయితకు ఈ విషయం తెలియనట్లున్నది. ఈమధ్య సండేస్టాండర్డ్‌లో కె. సుబ్రహ్మణ్యంగారు తమ వ్యాసంలో ఇలాగే పొరబడ్డారు. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు వేంకట పార్వతీశ్వర కవులుగా ప్రసిద్ధి పొందిన జంటకవులలో ఒకరు అని వ్రాశారు. ఈ వేంకట నామ సామ్యం ఇలా పొరపడటానికి కారణం కావచ్చు. అందులో ఈ జంటతనం ఒక తంటా.

ఈ జంట కవుల సంప్రదాయం ఈనాటిదికాదు. ప్రబోధ చంద్రోదయ కర్తలైన నందిమల్లయ్య, ఘంటసింగయలు రాయల యుగంలోనివారు. అవధాన విద్య కూడా అంతకు పూర్వం నుంచే వున్నది. ఐతే తిరుపతి వేంకట కవుల జంట వెలసి అవధానాల తిరునాళ్ళ సాగించిననాటికి కాని మళ్ళీ ఆ సంప్రదాయం, ఆ అవధాన విద్యా ఆంధ్రాళికి ఆరాధ్య ప్రాయం కాలేదు. తిరుపతి వేంకట కవుల కాలంలో వెలసినన్ని కవుల జంటలు—కొప్పరపు సోదరకవులు, శ్రీనివాస సోదర కవులు, వేంకటరామకృష్ణ కవులు, శేషాద్రి రమణ కవులు మొదలుగాగలవారు — ఆవలి ఈవలి కాలంలో మళ్లీ వెలయలేదు. కనుక పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధాన్ని తిరుపతి వేంకట కవుల యుగమన్నా తప్పలేదు. ప్రేయసీ ప్రియులకు క్షణమొక యుగమైతే సాహితీ ప్రియులకు ఓ 50 ఏళ్లు లేదా పాతికేళ్లు ఒకయుగం అనుకోవడం చెల్లదా? ఐతే ఇన్ని జంటలు వారి వెంట బయలుదేరినవే కనుక తిరుపతి వేంకట కవులకా కీర్తి చెల్లుతుంది. వేంకట పార్వతీశ్వరులు ఈ యుగంలోనివారే కాని యుగకర్తలెన్నటికీ కాలేరు ఒక సంప్రదాయాన్ని పాటించారు, పోషించారు, ఆంధ్ర సాహిత్యాన్ని నవలలద్వారా సుసంపన్నం చేశారు కాని అనన్యమార్గ ద్రష్టలు, నవ్య సంప్రదాయ స్రష్టలుకారు.

జంటకవులు చేసిన ఆంధ్ర సాహిత్య సేవనుగూర్చి ఒక పరిశోధనాత్మకగ్రంథం తెలుగులో వెలుగులోనికి ఇంకా రావలసేవున్నది. సాహిత్య పరిశోధకుల, విద్యార్థుల కర్తవ్యమిది.

సరే, 'భారతి'వంటి ప్రామాణికమైన, ప్రసిద్ధ సాహిత్య పత్రికకు పంపిన రచనలో ఇలాటి పొరపాటు వ్రాతలు, భ్రమకారకమైన వ్యాఖ్యలు ఉండరాదు. రచయిత నిర్దిష్టమైన విషయపరిజ్ఞానాన్ని కలిగి వుండవలె. విస్పష్ట పరిశీలనా, వివేచనా కలిగివుండవలె. కొందరు ప్రముఖుల గ్రంథాల నుండి ఉద్ధరించిన వాక్యాలవలన రచయిత వారికి సైతం తప్పిదాన్ని అంటగట్టినట్లైతున్నది. నిజానికి రచయితగారే భ్రమ ప్రమాదాలకులోనైనారు ఇకముందు అటువంటివి జరుగనివ్వరని ఆశిస్తున్నాము. తిరుపతి వేంకటకవుల గురించి వారుచేసిన ప్రశంసలుకొన్ని ప్రశంసనీయంగానే వున్నందుకు అభినందనలు సత్య తత్పరతతో వ్రాసిన ఈమాటలను సహృదయతతో ఆమోదించగలరనుకుంటాను. స్వస్తి

శ్రీ కే నారాయణ గౌడు

'వైశ్వనాథీయ ఛాందసమౌఢ్యం'

అక్టోబరు 77 'భారతి'లో ప్రకటితమైన శ్రీ సోమసుందర్ గారి 'నల సమర్పించిన ఉత్తమ కావ్యాలు—౧' చదివాను. అది శ్రీ ఆర్. యస్. సుదర్శనంగారు రచించిన 'నిశాంతం' అనే కావ్యాన్ని ప్రశంసిస్తూ వ్రాయబడిన వ్యాసం. అంతకుముందే నేను 'నిశాంతం' చదివి ఉన్నాను. అందులో మంచికవిత్వం ఉన్నదని గుర్తించి ఉన్నాను. అందుచేత శ్రీ సోమసుందర్‌గారి వ్యాసాన్ని మరింత ఆసక్తితో చదివాను. శ్రీ సుదర్శనంగారి కావ్యాన్ని గురించి, శ్రీ సోమసుందర్‌గారు చేసిన ప్రశంసను గురించి నేనేమీ ఆక్షేపించ దలచుకోవటంలేదు. కాని ఆ మధ్యలో అసందర్భంగా, అన్యాయంగా చోటుచేసుకున్న దురుసుతనంతో కూడిన ఒక వాక్యం నాకు చాల బాధ కలిగించింది. ఆ వాక్యం ఇది: "భగవంతుడ్ని కూడా, వర్ణాశ్రమ పక్షపాతిగా, బ్రాహ్మణీకపు అంగరక్షకునిగా మార్చిన వైశ్వనాథీయ ఛాందస మౌఢ్యానికి అస్పృశ్యత కల్పిస్తాను."

అసందర్భం అని నేను అన్న ఈ వాక్యానికి నిజానికి ఆ వ్యాసంలో కొంత సందర్భంలాంటిది లేకపోలేదు. 'నిశాంతం' కావ్యానికి విశ్వనాథవారు ఒక 'మున్నుడి' వ్రాశారు. ఆ 'మున్నుడి'ని తాము సమీక్షించ దలచుకోలేదని చెప్పడమే పై వాక్యంలో శ్రీ సోమసుందర్ గారి తాత్పర్యం. ఇలా సోమసుందర్‌గారిచేత అస్పృశ్యత కల్పింపబడటానికి ఆయన దృష్టిలో అపరాధాలైన వర్ణాశ్రమధర్మ సమర్థన, బ్రాహ్మణీకపు కోపు కాయటం వంటివేవైనా ఆ 'మున్నుడి'లో ఉన్నవేమోనని మళ్ళీ ఒకసారి చదివి చూశాను. అలాంటి పొలకులే అందులో ఎక్కడాలేవు. అంటే శ్రీ సోమసుందర్‌గారి అక్కసంతా ఆ 'మున్నుడి'లోఉన్న విషయాన్ని గురించికాదు. విశ్వనాథవారి ఇతర రచనలలో ప్రస్ఫుటమయ్యే ఆయన సిద్ధాంతాలను గురించి అన్న

ాట. ఒకానొక రచనను గురించి విమర్శించేటప్పుడు అందులోని ంచిచెడ్డలను గురించి మాత్రమే విమర్శించటమే వాస్తవికతా ృష్టిగల సదసద్విమర్శన పటువైన విమర్శకుని ధర్మం. అదే ందర్భోచితం అవుతుంది అంతేగాని ఆ రచయిత తాలూకు ఇతర చనలలోని దోషాలకుగాను నిర్దుష్టమైన మరో రచనను కూడా ూషించటం సద్విమర్శ అనిపించుకోదు. అది న్యాయమూకాదు; ందర్భశుద్ధి కలదీకాదు. అందుచేతనే పై చెప్పిన వాక్యం శ్రీ సోమ ుందర్‌గారి వ్యాసంలో అసందర్భంగా, అన్యాయంగా చోటు చేసు ున్నది అన్నాను.

విశ్వనాథవారి కొన్ని రచనల్లో — కాదు చాల రచనల్లో— శ్రీ సోమసుందర్‌గారికి నచ్చని అభిప్రాయాలు కొన్ని ఉన్నవి. అంత ాత్రంచేత విశ్వనాథవారి రచనల కన్నిటికీ—అలాంటి విరుద్ధమైన భిప్రాయాలులేని రచనలకు కూడా — అస్పృశ్యత కల్పిస్తున్నారు శ్రీ సోమసుందర్‌గారు. విమర్శకుడికి ఉండవలసిన ప్రధాన లక్షణం హృదయత. అదే శ్రీ సోమసుందర్‌గారిలో లోపించినట్లు కని ిస్తోంది. సహృదయత అంటే ఎలా ఉండాలో శ్రీ సోమసుందర్‌గారే దే వ్యాసంలోనే ఇలా చెప్పారు: ''వాస్తవికవాదీ, ఫ్యూచరిస్టు, ధివాస్తవికవాది, అస్థిత్వవాది, ఆదర్శవాదీ—రాసినవాడి విశ్వాసా ేవైనప్పటికీ, రాయబడింది కళావైభవంతో తనరారితే సహృదయు ుకు అవశ్య మనుభోక్తవ్యమే. ఒక రచయితనుంచి రసజ్ఞుడు కోరు ానేది అచ్చమైన కవితా హృదయాన్నే కాని వాడి విశ్వాసాలను ాదు.'' విశ్వనాథవారి విశ్వాసాలు శ్రీ సోమసుందర్‌గారికి నచ్చక ోవచ్చు. ఆధునికులమనుకునే వాళ్ళకు చాలమందికి నచ్చటంలేదు. ాని విశ్వనాథవారి రచనల్లో 'కళావైభవమూ' 'అచ్చమైన కవితా ృదయమూ' నాన్యతోదర్శనీయంగా అత్యున్నతస్థాయిలో ఉన్నా ుని ఆయన సిద్ధాంతాలను ఖండించేవారు కూడా—సహృదయులైన ారు—అందరూ అంగీకరిస్తున్నారే. కనుక విశ్వనాథవారి 'ఛాందస ౌఢ్య' దూషితాలైన రచనలు కూడా శ్రీ సోమసుందర్‌గారికి— ారు సహృదయులైతే 'అవశ్య మనుభోక్తవ్యములు' కావలెనే. శ్రీ సోమసుందర్‌గారు 'శాస్త్రీయ మానవతావాది'ట. 'పైగా గతి ార్కిక భౌతికవాది' కూడానట. నిజానికి 'మంచి కవిత్వాన్ని అనుభ ించటానికి పై రెండూ ఎన్నడూ అభ్యంతరం' కానక్కరలేదు. ినా శ్రీ సోమసుందర్‌గారు విశ్వనాథవారి రచనల్లోని 'మంచి'ని నుభవించలేకపోతున్నారంటే వారి బుద్ధిపూర్వ గ్రహదూషితం ావటమే కారణమనుకోవాలి. శ్రీ సోమసుందర్‌గారి ప్రకారమే సాహిత్య విమర్శకులుగా సుప్రసిద్ధులైన శ్రీ సుదర్శనంగారు ఈ 'నిశాంతం' కావ్యంలోనె విశ్వనాథవారిని 'కవీంద్రు'లని ప్రశం ించారు. అంతేకాదు 'నీవు మెచ్చిన ఈ కవితావధూటి ధన్య' అని ఆయన ఉత్తమ విమర్శకత్వానికి నివాళిపట్టారు. ఈ గ్రంధ ప్రకటన ిషయంలో జరిగిన అవకతవకలెలా ఉన్నప్పటికీ విశ్వనాథవారి ిమర్శన పాటవంమీద ఇప్పటికీ శ్రీ సుదర్శనంగారికి ఉన్నతాభి ప్రాయం ఉన్నదనే అనుకోవాలి. లేకుంటే వారి 'మున్నుడి'ని తమ గ్రంథంలో చేర్చుకొనేవారే కాదు. శ్రీ సోమసుందర్‌గారి ప్రకారమే ప్రఖ్యాత కవి, విమర్శకులైన శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు 'నిశాంతం' కావ్యానికి ఒక విపులమైన భూమిక వ్రాశారు. ఆ భూమికవల్ల వారు 'ఈ కావ్య సౌగంధికం విపులీకరించారు' అని శ్రీ సోమసుందర్‌గారు మెచ్చుకున్నారు. శ్రీ శేషేంద్రశర్మగారి భూమిక నిండుగ జీవుడు, ఈశ్వరుడు, యోగము, మోక్షము, తంత్రవిద్య మొదలైన పడికట్టు రాళ్ళు లెక్కకు మిక్కిలిగా ఉన్నవి. ''ఈ కావ్యకాంత సామాన్యకాదు ఈమె కుండలినీ శక్తి శక్తి అపరావతారమే. దేవీమూర్తి''. ఇది శ్రీ శర్మగారి భూమిక యొక్క సారాంశం. గతి తార్కిక భౌతికవాది అయినవాడికి ఇదంతా శుష్క వాగింద్రజాలం కావాలి. విశ్వనాథవారి 'మున్నుడి'లో ఇలాంటి పడికట్టురాళ్ళు లేవు. అయినా శ్రీ సోమసుందర్‌గారికి శ్రీ శర్మగారి భూమిక 'చక్కని తాత్త్వికభూమిక' అయింది. విశ్వనాథవారి 'మున్నుడి' అస్పృశ్యం అయింది. అంటే ఈ రుచి భేదానికి కారణం శాస్త్రీయ మానవతా వాదమూ కాదు, గతి తార్కికభౌతికవాదమూ కాదు. మరేదో కారణం ఉండిఉండాలి.

ఇక విశ్వనాథ 'భగవంతుడ్ని కూడా వర్ణాశ్రమ ధర్మపక్ష పాతిగా, బ్రాహ్మణీకపు అంగరక్షకునిగా మార్చిన' సంగతి. 'సంప్ర దాయ పరుల భాషలో నాస్తికుడైన' శ్రీ సోమసుందర్ భగవంతుడి ఉనికిని అంగీకరిస్తున్నట్లున్నాడు. సంతోషం. అదలా ఉంచి, భగ వంతుడిని ఈ విధంగా మార్చడమే జరిగినా, ఆ మార్చింది విశ్వనాథ కాదు అనే సంగతి ఈ దేశంలో పుట్టిన పసిబిడ్డలకుకూడా తెలిసిన సంగతి. శ్రీ సోమసుందర్‌గారికి తెలియదంటే ఆశ్చర్యం వేస్తోంది ఈ దేశంలో 'సంప్రదాయం'అంటూ ఒకటున్నదని శ్రీ సోమసుందర్ గారు కూడా గుర్తించారు. భగవంతుడిని ఒకవేళ మార్చడమే జరిగి ఉంటే ఆ మార్చింది సంప్రదాయమేకాని విశ్వనాథ కాదు. మరి ఆ సంప్రదాయం ఈనాటిది కాదు కొన్ని వేల యేండ్లు నిలుకడ కలి గింది. ఆ సనాతనమైన సంప్రదాయానికి విశ్వనాథ ఇటీవల వెలసిన ఒక శక్తివంతమైన ముఖయంత్రం మాత్రమే. ఆ సంప్రదాయం అంతా పనికిమాలినదని 'ఈనాటి ఆధునిక శాస్త్రీయ బుద్ధిమంత మ్మన్యులు' కొట్టిపారవేయవచ్చు అది వేరే విషయం. గురిగింజల రంగును మెచ్చుకొనే కోయపడుచుకు ముత్యాల విలువ తెలియక పోవచ్చు. దానికేం చేస్తాం.

'బ్రాహ్మణీకపు అంగరక్షకత్వం' అనటంలో అయినదానికీ, కాని దానికీ కూడా బ్రాహ్మణ వర్ణపు అధికతను, అంటే ఇతర వర్ణాల న్యూనతను నిరూపించటమే విశ్వనాథ లక్ష్యమన్నట్లుగా శ్రీ సోమసుందర్‌గారు ధ్వనిస్తున్నారు. కాని విశ్వనాథవారి 'వీర వల్లడు', 'బద్దన్న సేనాని' మొదలైన రచనలు చూస్తే ఈ అపా దన ఎంత అభూత కల్పనో తెలుస్తుంది.

ఇక వైశ్వనాథీయ 'ఛాందస మౌఢ్యాన్ని' గురించి. శ్రీసోమ సుందర్ వర్ణాశ్రమ ధర్మ విరోధికావచ్చు. 'ఆధునికులలో' చాల మంది విరోధులే. నేటి ప్రభుత్వం కూడా వర్ణాశ్రమ ధర్మ వ్యతి రేకం కావచ్చు. రాజానుమతమైనదే ధర్మంగా చలామణీ కూడా

అవుతుండవచ్చు. కాని వర్ణాశ్రమ ధర్మమే శ్రేష్ఠమైన ధర్మమని నమ్మేవారు ఇప్పటికీ కొద్దిమందియైనా ఉన్నారు. అధిక సంఖ్యాకులైనంత మాత్రాన అల్పసంఖ్యాకుల మతాన్నీ, ప్రభుత్వాధికారం ఉన్నంతమాత్రాన అధికార రహితులైనవారి విశ్వాసాలను మూఢము లనటంలోగల సహృదయత ఎలాంటిదోఅర్థంకావటంలేదు. హిందూ దేశంలో హిందువుల మనుకొనేవారు అధిక సంఖ్యలో ఉన్నారు గనుక అల్పసంఖ్యాకులైన మహమ్మదీయుల, క్రైస్తవుల మతవిశ్వాసాలను మూఢములని ఎందుకు నిందించరాదు. వారు అల్పసంఖ్యాకులైనా బలవంతులు. తమనుగాని, తమ మత విశ్వాసాలనుగాని నిందిస్తే వారు సహించరు. ఆ నిందించిన వాళ్ల అంతుచూచికాని వదలరు. వర్ణాశ్రమ ధర్మ విశ్వాసపరులు బలహీనులు. ఎవళ్ళెన్ని తిట్టినా ఎదురుతిరగలేరు. ఇదే కారణం కావాలి — కూర్చుండి లేవలేని ప్రతివాడూ నల్లేరుమీదికి బండి సాగినట్లుగా దండెత్తుతాడు వర్ణాశ్రమ ధర్మవిశ్వాసులపైకి మతప్రసక్తి రహితమైన నేటి సెక్యులర్ రాజ్యాంగంలో ఇతరులకు బాధ కలిగించకుండా వైరివో, మైత్రివో తమ మతవిశ్వాసాలను అనుసరించి తాముబ్రతికేందుకూ, దౌర్జన్యం లేకుండా శాంతియుతంగా ప్రచారం చేసుకునేందుకు కూడా అధికారం లేదా? ఒకనాడు మతవిద్వేషాలతో మానవ మారణహోమాలు సాగించిన మతాంధుల సంకుచిత తత్వంకంటె యిది ఎలా భిన్నమైనది ?

ఈ ఊరికి ఆ ఊరు ఎంతదూరమో, ఆ ఊరికి ఈఊరూ అంతే దూరం. 'ఆధునికులకు' 'సంప్రదాయపరుల' విశ్వాసాలు మూఢములుగా కనిపిస్తే, సంప్రదాయపరులకూ ఆధునికుల అవిశ్వాసం మౌఢ్యంగానే కనిపిస్తుంది.

వైశ్వనాథీయ మౌఢ్యానికి 'ఛాందస'అనే విశేషణం శ్రీ సోమసుందర్ ఏ అర్థంలో వేసినా, ఆ పదాన్ని వాడినందుకు వారిని అభినందిస్తున్నాను. మౌఢ్యంగానీ మరొకటిగానీ—మొత్తానికి విశ్వనాథ వారి మతం ఛాందసమే. అంటే వైదికమే. వైదికం అనంగానే విశ్వనాథవారు చెందిన ఒకానొక బ్రాహ్మణ వర్ణశాఖ అనే అర్థమే స్ఫురించవచ్చు వితండ పండితులకు. వైదికమతమంటే వేద ప్రామాణ్యాన్ని విశ్వసించే మతమని అర్థం. వేదములకే ఛందస్సులని వ్యవహారం. వేదములు మాకు ప్రమాణం కాదనేవారున్నారు. వారికి 'నమోవాకం ప్రశాస్మహే'.

ఏమయినా అనవసరంగా నోరు పారవేసికోవటం అంత మంచిది కాదేమో అని నా మనవి.

డా చన్నాప్రగడ తిరుపతిరావు

సహాయ నిరాకరణోద్యమము - చీరాల ప్రజల ఉజ్వల పాత్ర

భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో గుంటూరు జిల్లా నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమైంది. కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వంటి నాయకులకు జన్మ నిచ్చిన ఘనత గుంటూరు మండలానికి దక్కింది. విద్య, రాజకీయ పరిజ్ఞానం ఉన్న నాయకులు ముందు ఉండగా నిరక్షరాస్యులు, ఏమాత్రం విజ్ఞానంలేని సామాన్య ప్రజలు ఈ మండలంలో గాంధీజీ పూరించిన శంఖారావంతో ఉత్తేజితులై స్వాతంత్ర్య సమర రంగంలోకి దుమికారు. గుంటూరు మండలంలో జరిగిన పలనాటి అడవిసత్యాగ్రహం, చీరాల ప్రజలు మునిసిపాలిటికి వ్యతిరేకంగా జరిపిన ఉద్యమం, పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం దేశానికే తలమానికాలు. వీటిలో చీరాల ప్రజల సత్యాగ్రహం అనేక కారణాలవల్ల విశిష్టత పొందింది.

1920 సెప్టెంబర్ 9వ కలకత్తా ప్రత్యేక సమావేశంలో అహింసాయుత సహాయ నిరాకరణోద్యమాన్ని స్వరాజ్య సంపాదనకు ఆయుధంగా చేపట్టాలని కాంగ్రెసు నాయకులు నిర్ణయం తీసికొన్నారు. గుంటూరు మండలం నుండి కలకత్తా సమావేశానికి హాజరైనవారిలో కొండా వెంకటప్పయ్య, దుగ్గిరాలగోపాలకృష్ణయ్య, గొల్లపూడి సీతారామ శాస్త్రి ప్రముఖులు.[1]

కలకత్తా ప్రత్యేక కాంగ్రెసు సమావేశం తరువాత భారత దేశంలో అసమానమైన జాతీయ ఉద్యమాలు ప్రారంభమై, దేశం రాజకీయ చైతన్యంతో తొణికిసలాడింది. అంతకుముందు కని విని ఎరుగని ఉత్సాహపు వెల్లువ కోట్లాది భారతీయులను జాతీయోద్యమంలో ముందుకు నడిపించింది. సహాయ నిరాకరణోద్యమం అనేక విమార్పులు, ప్రాంతీయ పరివర్తనలతో రూపకల్పన చేసికొంది. జుడిత్ యం. బ్రౌన్ (Judith M. Brown) వ్రాసినట్లు "భారతీయ సమాజంలో అన్ని వర్గాలు పాల్గొనే విధంగా గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని రూపొందించారు. గాంధీజీ లక్ష్యం అసహాయోద్యమంలో రౌలట్ చట్ట వ్యతిరేకోద్యమంలో కన్నా ఎక్కువగా ప్రస్ఫుటించింది. తమప్రాంతీయ అవసరాలను రక్షించుకోడానికి లేదా మెరుగు పరచుకోడానికి సత్యాగ్రహమనే ఆయుధం ప్రజలకు ఆయన అందించారు.'' జాతీయ ఉద్యమం కొన్నిచోట్ల ప్రాంతీయ రూపాలు, వాటి వాటి అవసరాలుబట్టి, తీసికొన్నది. అటువంటి వాటిలో చీరాల — ప్రజలు మునిసిపాలిటీకి వ్యతిరేకంగా సాగించిన సత్యాగ్రహం ప్రత్యేకంగా చెప్పకోవచ్చు.

1919 నవంబరులో మద్రాసుప్రభుత్వం చీరాల-పేరాలను మునిసిపాలిటిగానూ, జాండ్రపేట, పాత చీరాలను పంచాయితీగానూ చేస్తూ ఆజ్ఞాపత్రాన్ని జారీచేసింది.[3] 1914నుండి ప్రభుత్వానికి చీరాలను మునిసిపాలిటీగాచేయాలనే సంకల్పంఉంది. ఆ సంవత్సరం గుంటూరు మండలంలో ప్లేగువ్యాధి ప్రబలి అనేక మంది మృతిచెందారు. అందువలన పంచాయితీకి బదులు చీరాలలో మునిసిపాలిటీ ఉండాలని శానిటరీ కమీషనర్ సిఫారసు చేశాడు.[4] నిజానికి ఒంగోలు పట్టణం 1876లో మునిసిపల్‌పాలన క్రిందకు వచ్చినా[5] అది కూడా ప్లేగు వ్యాధికి గురై పట్టణ ప్రజలు ఊరి వెలుపల తాటాకుల పాకలలో కొన్ని నెలలు ఉండవలసి వచ్చింది. పట్టణం

లోని వీధు లునిర్మానుష్యాలయ్యాయి.[6] దీన్నిబట్టి మునిసిపల్ పాలన లోని పట్టణాలు పారిశుద్ధ్యానికి, పరిశుభ్రతకు ప్రతీకలు కానే కావని తేలుతుంది. 1888నుండి 1905వరకు దక్షిణ దేశంలోని మునిసిపల్ వ్యవస్థలను క్షుణ్ణంగా సమీక్షించిన యం రామచంద్ర రావు మునిసిపల్ పాలనలోని అవక తవకలనెన్నింటినో ఎత్తి చూపారు. రు 200/ మించిన ఏ పనికైనా శానిటరీ కమీషనరు, శానిటరీ ఇంజనీరు, శానిటరీ బోర్డు అనుమతిలేనిదే మునిసిపాలిటీలు చేపట్టరాదు. ప్రభుత్వ ధృతరాష్ట్రుని కౌగిలిలో ఆనాటి మునిసి పాలిటీలు నలిగిపోతుండేవని రామచంద్రరావు నిరూపించారు.[7]

అదీగాక, ఆనాడు చీరాల ఎదుర్కొన్న పారిశుధ్య సమస్యలు అంత ఎక్కువగానూ లేవు. ఇసుకనేల అయినందువల్ల మురుగునీరు చేరదు. తియ్యటి త్రాగే నీరు ప్రతిచోటా పడుతున్నందువల్ల చీరాలకు మంచినీటి సరఫరా గురించి ప్రభుత్వం పథకాలు వేయ వలసి కూడా రాలేదు. అదీగాక చీరాలకన్నా పెద్ద నగరాలైన పొన్నూరు, బాపట్లలకు మునిసిపాలిటీలు ఏర్పడలేదు. ఇన్ని కారణాలు ఉన్నప్పటికి చీరాల—పేరాలను మునిసిపాలిటీగా ఏర్పరచ డంతో ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం ఇనుమడించింది. 'ది హిందూ' (The Hindu) ప్రత్యేక విలేఖరి డి. యస్. ఆర్. రావు 1921 మే నెలారంభంలో చీరాలలో పర్యటన జరిపి అక్కడి ప్రజలు మునిసిపల్ పన్నులు కట్టలేని స్థితిలో ఉన్నారని తన పత్రికలో ప్రత్యేక వ్యాసం వ్రాశాడు. చీరాల ప్రజలలో 90 శాతం నేత, అద్దకాలమీద బ్రతికేవారు. దానికిగాను వారికి 4, 5 అణాల కూలి గిట్టేది. వ్యవసాయయోగ్యమైన భూములు పరిసర ప్రాంతా లలో చాలా తక్కువ. వ్యాపారమూ అంతంత మాత్రమే. ఒక బియ్యపుమిల్లు తప్ప పరిశ్రమలు లేవు. అటువంటి బీదవారిపై రు. 4,000/నుండి రు 40,000కు పన్నులు పెంచేసరికి వారి స్థితి చాలా దుర్భరమయింది.[8]

అనేక విధాలుగా ప్రజలు మునిసిపాలిటీకి వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని తెలియజేశారు 1920, ఫిబ్రవరి 18న చీరాలలో రేట్ పేయర్సు అసోసియేషను (Rate Payers Association) ఏర్పడింది. 1921, ఫిబ్రవరిలో మద్రాసు ప్రభుత్వపు స్థానిక స్వపరిపాలనామాత్యుడు రాజారామరాయనింగార్ చీరాల వచ్చినప్పుడు మునిసిపాలిటీ రద్దుచేయమని ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. న్యాయసమ్మతమయిన ప్రజల ప్రార్థనను సానుభూతితో పరిశీలించ డానికి నిరాకరించి చీరాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వే స్టేషనును మూసివేస్తానని ఆయన బెదిరించాడు.[9] రాజారామ రాయనింగార్ పానగల్ జమీందారు. బ్రాహ్మణ వ్యతిరేకోద్యమంలో ప్రముఖపాత్ర నిర్వహించినవాడు. మద్రాసు రాష్ట్రంలోని జస్టిస్ పార్టీ నాయక శిఖామణి. చీరాల—పేరాల ఉద్యమం కాంగ్రెస్ నాయకత్వం క్రిందకు ముఖ్యంగా బ్రాహ్మణుడైన గోపాలకృష్ణయ్య అధిపత్యంక్రిందకు వెళ్లేటప్పటికి రామరాయనింగార్ ఆ విషయంలో మరీ బిగిసిపోయాడు.

మునిసిపాలిటీ వ్యతిరేకోద్యమం నానాటికి బలపడుతుండడం చూసి మద్రాసు ప్రభుత్వం తన పబ్లిసిటీ బ్యూరో (Publicity Bureau) ద్వారా ఒక ప్రకటన చేసింది అందులో ప్రజలకు స్థానిక స్వపరిపాలనలోని ప్రయోజనాలను అందజేయడానికే మునిసి పాలిటీని ఏర్పరచామని ప్రభుత్వం ప్రకటించింది. చీరాల ప్రజలు సంపన్నులైనట్లు, నేత,అద్దకపుపరిశ్రమలు అక్కడ బాగాఅభివృద్ధి చెందుతున్నట్లు, అదనపు పన్ను భారం ప్రజలు తేలికగా భరించ గలరని ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియచేసింది పట్టణం చాలా అపరిశుభ్రంగా ఉన్నదని, పరిస్థితి మరీ క్షీణించకుండా ఉండ డానికి చీరాలలో మునిసిపాలిటీని ఏర్పరచడం తప్ప తనకు వేరే గత్యంతరం లేకపోయిందని కూడా ప్రభుత్వం ప్రకటించింది, కానీ ప్రభుత్వ ప్రకటన వాస్తవానికి చాలా దూరంగా ఉంది జి. వి. కృష్ణారావు, బసవరాజు అప్పారావు, గుమ్మిడితల వెంకటసుబ్బారావు, డి. యస్. ఆర్. రావు తమ ఆనాటి రచనలలో చీరాల ప్రజల బీదరికాన్ని గురించి సమూలంగా వివరించారు. డి.యస్.ఆర్. రావు ఇంకా ఈ విధంగా 'హిందూ' పత్రికలో వ్రాశాడు : ''నేను చూచి నంత వరకు చీరాలలో అపారిశుద్ధ్యం ఉన్నట్లుతోచదు పరిస్థితిని మెరుగు పరుచదలచుకొన్నా ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఒక కలం పోటుతో పంచాయితీని మునిసిపాలిటిగా మార్చడం విజ్ఞత అనిపించుకోదు. నిజానికి, దేశంలో నాగరికతకు, సభ్యతకు సిగ్గు చేటైన మునిసిపాలిటీలు కోకొల్లలుగా ఉన్నాయి.''

ఉద్యమం నానాటికి తీవ్రతరమౌతున్న ఆ సమయంలో దుగ్గిరాల గోపాల కృష్ణయ్య దానికి నాయకత్వం వహించి ఉండక పోయినట్లైతే ప్రజలు తప్పకుండా శాసనోల్లంఘనాన్ని ప్రారం భించడం, ప్రజలకు, ప్రభుత్వానికి సంఘర్షణలు జరగడం, దానితో తీవ్ర పరిణామాలు, చివరకు రక్తపాతం సంభవించిఉండేవి. గోపాల కృష్ణయ్యగారు ఒక సంవత్సరంలో దేశ స్వాతంత్ర్యం తేవాలన్న దృఢ సంకల్పంతో సహాయ నిరాకరణోద్యమంలోకి దుమికారు. ఆయన కార్యక్రమానికి చీరాల రంగస్థలమైంది.

కలకత్తా ప్రత్యేక కాంగ్రెసు తీర్మానాన్ని అనుసరించి చీరాల ప్రజలు మాంటెగు — చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల క్రింద జరిగిన ఎన్నికలను అత్యధిక సంఖ్యలో బహిష్కరించారు. తిలక్ స్వరాజ్య నిధికి చీరాల—పేరాలప్రజలు రు 8,000 విరాళం క్రింద ఇచ్చారు. అదీగాక బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలలో క్రమశిక్షణ నెలకొల్పి సభలు సక్రమంగా జరిపిన ఘనత చీరాల స్వచ్ఛంధ దళమైన రామదండుకే దక్కింది.[11] బెజవాడ సభలు జరిగే కాలానికే చీరాల ఉద్యమానికి కొంత రూపం చేకూరింది 1921 మార్చిలో పన్నులు కట్టడానికి నిరాకరించిన పన్నెండు మందిని ప్రభుత్వం చెరసాలకు పంపింది. వారిలో ఒక మహిళ — రావూరి అలివేలు మంగమ్మ — ఉంది. గాంధీజీ స్వాతంత్ర్యోద్య మానికి నాయకత్వం వహించిన తరువాత రాజకీయ కారణంగా జైలుకు వెళ్ళిన స్త్రీ బహుశః అలివేలు మంగమ్మ అయి ఉండ వచ్చు.[12]

1921 ఏప్రిల్ 6న గాంధీజీ బెజవాడ సమావేశాలనంతరం చీరాలకు రావడం అక్కడి ఉద్యమానికొక మలుపురాయి. మునిసిపాలిటీకి వ్యతిరేకంగా చెరసాలకువెళ్ళిన పన్నెండుమంది దేశభక్తులను ఆయన పూలమాలలతో సత్కరించారు. ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా మునిసిపాలిటీని ఏర్పరచి ప్రభుత్వం పెద్ద పొరపాటే చేసిందన్నాడు. ఆయన అభిప్రాయం ప్రకారం ప్రజలకు ఇప్పుడు రెండు మార్గాలే ఉన్నాయి : పన్నులు కట్టడం నిరాకరించి ప్రభుత్వ దమన నీతిని ఎదుర్కోడం, లేదా తులసీదాసు చెప్పినట్లు దేశత్యాగం చేయడం. ప్రజలు పట్టణాన్ని బహిష్కరించినట్లైతే మునిసిపాలిటీ దానంతటదే రద్దౌతుందనే అభిప్రాయం బాగా ఆనాడు బలపడింది. గాంధీజీ పిలుపు ననుసరించి గోపాలకృష్ణయ్య పట్టణాన్ని ఖాళీచేయించడానికి నిర్ణయించాడు. గాంధీసలహా, గోపాలకృష్ణయ్య పిలుపులతో ఉత్సాహభరితులైన ప్రజలు తమ తాతలనాటి ఇళ్ళు, వాకిళ్లను వదలి 'రాంనగర్' అనే గ్రామాన్ని సమీపంలో ఏర్పరచుకొని పర్ణశాలలలో నివసించడానికి ఆనందంగా ముందుకువచ్చారు.[13]

ఏప్రిల్ 25 వ తేదీ రాత్రి డప్పుల చప్పుళ్లతో ''మహాత్మా గాంధీకి జై'' అనే నినాదాలతో చీరాల పట్టణాన్ని ఖాళీ చేయడం ప్రజలు ప్రారంభించారు ఎండాకాలపు ఆరాత్రి పురుషులు, స్త్రీలు, వృద్ధులు, బాలురు తమ వస్తువులను మోసుకొంటూ తరతరాల నాటి ఇండ్లలను వదలి తాటాకు పాకలకు వెళ్లడం చూసిన నాకళ్ళు చమర్చాయి, అని ఆ దృశ్యాన్ని కళ్లారాచూచిన బసవరాజు అప్పారావు వ్రాశారు[14] చీరాల పట్టణం పాడుపడ్డట్లయింది. ఎక్కడా మానవ సంచారమే లేకుండా పోయింది. పోలీసు, రెవిన్యూ అధికారులు ఈ వలసను ఆపివేయించడానికి అన్ని ప్రయత్నాలు చేశారు కాని 'దుగ్గిరాలయ్య' సమయస్ఫూర్తి, రాజకీయ చతురత, రామదండు క్రమశిక్షణ అధికారుల యత్నాలను వమ్ము చేశాయి[15]

తాటాకు పాకలలో చీరాల ప్రజలు పదకొండు నెలలు ప్రవాసం చేశారు. 'రామ్ నగరు'లో గోపాలకృష్ణయ్య ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పరచాడు. పంచాయితీ ఏర్పడి న్యాయ పరిపాలన చక్కగా సాగింది సాంఘిక బహిష్కరణ పూర్తిగా అమలు జరగడంమూలాన ప్రభుత్వాధికారులకు తినడానికి తిండి, త్రాగడానికి నీరు కూడా లభ్యంకాలేదు[16]

రామ్‌నగరులో ఏర్పడ్డ ప్రత్యామ్నాయ ప్రభుత్వ వార్తలు దేశం నలుమూలలా వ్యాపించాయి. ప్రభుత్వ యంత్రాంగంలో బెంబేలు బయలుదేరింది. ఏ విధంగానైన ఈ ఉద్యమాన్ని అణచివేయాలనే కృతనిశ్చయానికి శ్వేత ప్రభుత్వం వచ్చింది. ప్రభుత్వ పోరంబోకులలో గుడిశెలు వేశారన్న నెపంమీద ప్రభుత్వం ప్రజలపై కేసులు బనాయించి, జుల్మానాలను విధించింది. అసహాయోద్యమానికి కంకణం కట్టుకొన్న చీరాల నగరవాసుల ఆస్తులను ప్రభుత్వం వేలం వేయించింది.[17]

ప్రభుత్వం కలిగించే కష్టాలేగాక దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, రామ్‌నగర వాసులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చింది. గోపాలకృష్ణయ్య ఇంటింటికి తిరిగి చందాలు వసూలు చేసినా, ''రామ్‌నగరు'' ఖజానా వట్టిపోయింది 1921 సెప్టెంబరులో ఆంధ్ర మహాసభలు బరంపురంలో జరిగాయి. గోపాలకృష్ణయ్య చందాల వసూలు నిమిత్తం బరంపురం వెళ్లి 27, 28 తేదీలలో ఉత్తేజకరమైన ఉపన్యాసాలు ఇచ్చి అక్కడి ప్రజలలో చీరాల సత్యాగ్రహంపట్ల ఆసక్తిని కలిగించాడు. ముఖ్యంగా మద్రాసు ముఖ్యమంత్రి, స్థానిక స్వపరిపాలనామాత్యులు రాజారామరాయనింగార్ చీరాల వీరుని ఛలోక్తులకు గురిఅయ్యాడు. 28వ తేదీ సాయంత్రం గోపాలకృష్ణయ్య కొందరు మిత్రులతో కలసి గురజాడ కృష్ణమూర్తి పంతులు గారింటికి వెళ్లుతుండగా గంజాం మాజిస్ట్రేటు టి జి. రూధర్‌ఫర్డ్ ఆయనకు రెండు నెలలవరకు బహిరంగ ఉపన్యాసాలు ఇవ్వకూడదని ఒక వారంటును అందజేశాడు. అది అందిన వెంటనే గోపాలకృష్ణయ్య శాసనోల్లంఘనానికే నిశ్చయించి బహిరంగసభలో ఉపన్యసించాడు. బ్రిటిషు ప్రభుత్వాన్ని హిరణ్యకశ్యపుని ప్రభుత్వంగాను, మద్రాసు గవర్నరు లార్డ్ వెల్లింగ్‌టన్‌ను రావణునిగానూ ఆయన వర్ణించాడు.[18] దానితో గోపాలకృష్ణయ్యను అరెస్టుచేసి రూధర్‌ఫర్డ్ కోర్టులో హాజరుపెట్టారు. మాజిస్ట్రేట్ ఆయనను విచారించి ఒక సంవత్సరం శిక్ష విధించాడు[19].

అసలే ఆర్థిక ఇబ్బందులకు గురైన చీరాల ప్రజలను గోపాలకృష్ణయ్య కారాగార ప్రవేశం మరీ కృంగదీసింది. దానికి తోడు చౌరీచౌరా సంఘటనల మూలంగా గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని ఉపసంహరించడంతో చీరాలవారికి ధైర్యం సన్నగిల్లి తాము పదకొండు నెలల్క్రితం వదలి వచ్చిన స్వగృహాలకు తిరిగివెళ్లి మునిసిపాలిటీని ఆమోదించవలసి వచ్చింది.

తాము అనుకొన్నది సాధించలేకపోయినా 'హిందూ' ప్రత్యేక ప్రతినిధి డి. యస్. ఆర్. రావు అన్నట్లు—''చీరాలవారు తమ అభీష్టానికి వ్యతిరేకంగా పరాయి ప్రభుత్వపు పరిపాలనను పదకొండు నెలలు కొనసాగనీయకుండా చేశారు. భారతజాతి తన దైన్యస్థితిని గుర్తించి, రాజకీయ నిద్రనుండి మేల్కొంటే ఏమి చేయగలదో ఈ ఉద్యమంద్వారా బ్రిటిషువారికి తెలియవచ్చింది. స్వరాజ్యసిద్ధి లక్ష్యంగా పెట్టుకొన్న భారతజాతికి చీరాలవారి సాహసం, త్యాగనిరతి మార్గదర్శాలయ్యాయి.''[20]

అధోజ్ఞాపికలు :

1 అయ్యదేవర కాళేశ్వరరావు : నా జీవితకథ, నవ్యాంధ్రము (విజయవాడ, 1959,) పుట 295.

2 Judith M. Brown Gandhi's Rise to power (Cambridge, 1972), P. 322

3 G. V. KrishnaRao : Chirala and Perala Tragedy: An Episode of Voluntary Exite (Madras, 1922) P. 8.

4 బసవరాజు అప్పారావు : శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు (విజయవాడ, 1963), పుట 67

5 Un classified Ongole Municipal Administration Records.

6 పిశుపాటి చిదంబరశాస్త్రి : ఒంగోలు మహమ్మారి (ఒంగోలు, ప్రచురణ సంవత్సరంలేదు) పుట 4

7 M Ramachandra rao ; Municipal Reforms in South India (Madras year of publication not mentioed), P. 6.

8 D. S R. Rao's article "Chirala and Self-determination" in The Hindu (Madras) dated May 27, 1921.

9 G V. Krishnarao : Op. Cit P 10·

10 Gummidithala Venkata Subbarau Andhra Ratna Duggirala Gopalakrishnayya : Life and Message. (Bezawada, 5035 Sravanam), P 80.

11 Ibid. P. 118.

12 M. Venkatarangaiya The Freedom struggle in Andhra Pradesh (Andhra) (Hyderabad, Vol-III) P. 32.

13 Sorojini Regani : Highlights of Freedom Movement in Andhra Pradesh (Hyderabad, 1972) P. 84.

14 బసవరాజు అప్పారావు : శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు. (విజయవాడ, 1963) పుటలు 82, 83

15 Gummidithala Venkata Subbarau Op Cit, P. 109.

16 Ibid. P. 117.

17 The Hindu (Madras) dated July 27, 1921.

18 బసవరాజు అప్పారావు : శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు (విజయవాడ, 1963) పుటలు 115, 116.

19 ఆంధ్రపత్రిక (మద్రాసు), తేదీ అక్టోబరు 14, 1921.

20 The Hindu (Madras) dated May 27, 1921.

—డాక్టర్ భద్రిరాజు శేషగిరిరావు

—శ్రీమతి భద్రిరాజు విశాలాక్షి

"ఆంధ్ర గీర్వాణ ఛందము"

నవంబరునెల "భారతి"లో కళాప్రపూర్ణ శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు "ఆంధ్ర గీర్వాణ ఛందము" అను గ్రంథమును సమీక్షించుచు —

"ఆంధ్ర గీర్వాణ చ్ఛందము" అని బ్రౌను ముద్రించినదే సరియైన రూపము. "ఆంధ్ర గీర్వాణ ఛందము" అని విశ్వ విద్యాలయము వారు ముద్రించిన రూపము సరియైనది కాదు" అని పలికిన పలుకులు పరమ సత్యములు — పండిత సమ్మతములు. కాని పిదప వారు పాణినీయము ననుసరించి ప్రక్రియా సాధనమున కుపక్రమించిన తీరు మాత్రమే నే నీ లేఖను వ్రాయుటకు పురికొల్పినది. ఆ రూపసాధన ప్రక్రియాక్రమము సమీక్షకుల పాండితీ ప్రకర్షకు గొడ్డలి పెట్టని చెప్పక తప్పుటలేదు. వారు పాణినీయమును సమగ్రముగ పరిశీలించినటుల నాకు తోచుటలేదు ప్రకృతమును సరామః

సమీక్షకుల రూప సాధనము :

"పాణినీయమున, "ఛ"కారము సమాసమున హ్రస్వముపై వచ్చునపుడు ద్విత్వమగును. దీర్ఘముపై వచ్చునపుడు వికల్పమగును. "స్తోశ్చునాశ్చుః"–"ఆఙ్మాఙోశ్చ"–"దీర్ఘాత్"–"పదాన్తాద్వా" అని పాణినీయ సూత్రములు. (8–4–48–51) వీనిచే హ్రస్వములపై "ఛ" పరమగునపుడు "తుక్" ప్రత్యయము వచ్చును

అందువలన "ఆంధ్ర గీర్వాణ + ఛందను". ఆంధ్రగీర్వాణ + తుక్ = ఆంధ్ర గీర్వాణ + తు = ఆంధ్ర గీర్వాణ + తే + ఛందము = 'ఆంధ్ర గీర్వాణ చ్ఛందము' అని రూప మేర్పడినది" అని వేంకటరావుగారు పాణినీయము ననుసరించి తాము రూప సాధనమును నిర్వర్తించినటుల వ్రాసిరి. కాని పాణినీయమునలటుల లేదు. వారటుల "అర్థము" చేసికొనిరని భావింతును.

ఇక పాణినీయము ననుసరించి నా సమాలోచనా సరణి ·

"ఛ" కారము పరముగా నున్న అపదాన్త దీర్ఘమునకు "దీర్ఘాత్" (6–1–75)అను సూత్రముచే నిత్యముగను (ఉదా— చేచ్ఛిద్యతే), "పదాన్తాద్వా" (6–1–76) అను సూత్రముచే పదాన్త దీర్ఘమునకు వికల్పముగను (ఉదా — లక్ష్మీచ్ఛాయా— లక్ష్మీ, ఛాయా) "తుగాగమము"ను చేయవలయును.

"తుక్" ప్రత్యయము వచ్చుననుట కంటెను "తుగాగమము"ను చేయవలయుననుట వ్యాకరణ సంప్రదాయ సిద్ధము.

"స్తోః శ్చునా శ్చుః" – "ఆఙ్మాఙోశ్చ" – "దీర్ఘాత్" – "పదాన్తాద్వా" అను పాణినీయ సూత్రములచే హ్రస్వములపై "ఛ" పరమగునపుడు 'తుక్' ప్రత్యయము వచ్చుననుట హాస్యాస్పదము. అవి దీర్ఘమునకు ఛకారము పరముగా నుండగా 'తుక్' వచ్చుటకు సంబంధించిన + ప్రకృత ప్రక్రియకు సంబంధించని +

శిష్టకార్య విషయక సూత్రముల కలగూరగంప. ఆ సూత్రములను కూడ క్రమమున వ్రాయకపోవుటయు కరము విచారకరము. కుండలి కరణములోని సూత్రముల సంఖ్య దోష ప్రతీక! కావున "అష్టాధ్యాయి" ప్రకారము సరియైన సూత్రముల సంఖ్యను దిగువ నిచ్చుచున్నాను :

"స్తోః శ్చునా శ్చుః" (8–4–40) – "ఆఙ్మాఙోశ్చ" (6–1–74) – "దీర్ఘాత్" (6–1–75) – "పదాన్తాద్వా" (6–1–76).

పాణినీయము ననుసరించి సమగ్ర ప్రక్రియాక్రమ మిది —

"ఆంధ్ర గీర్వాణ + ఛందము" – "సంహితాయామ్" (6–1–72) అను అధికార సూత్రము ననుసరించి 'ఛే చ' (6–1–73) అను సూత్రముచే ప్రకృత సమాసమునందు 'ఛ'కారము పరముగానున్న హ్రస్వమగు ణ కారోత్తర వర్ణ్యాకారమునకు తుగాగమమును చేర్చి 'తుక్'లోని కకారమునకు ఇత్సంజ్ఞాలోపముల చేసి, ఉకారమును ఉచ్చారణార్థ ప్రయుక్తముగా భావించి, కిత్త్వమూలమున హ్రస్వమునకు అన్త్యావయవముగచేయగా "ఆంధ్ర గీర్వాణత్ + ఛందము" అని యుండగా, శ్చుత్వము సిద్ధమగుటచే ముందుగ "ఝలాం జశోఽన్తే" (8–2–39)అను సూత్రముచే జశ్త్వ ప్రాప్తమగు దకారము నుంచగా "ఆంధ్ర గీర్వాణద్ + ఛందము" అని కాగా, చర్త్వమసిద్ధమగుటచే ముందుగ "స్తోః శ్చునా శ్చుః" (8–4–40) అను సూత్రముచే శ్చుత్వ ప్రాప్తమగు జకార మాదేశముకాగా "ఆంధ్ర గీర్వాణజ్ + ఛందము" అని యుండగా "ఖరిచ" (8–4–55)అను సూత్రముచే చర్త్వమును చేయగా "ఆంధ్ర గీర్వాణచ్ + ఛందము=ఆంధ్ర గీర్వాణచ్ఛందము" అను రూపము సిద్ధించును.

పూర్వాపరములు పరిశీలింపక వ్రాసిన వ్రాతలు వారిస్తై గీచిన గీతలు కాగలవు. మాస్తు తథా!!

శ్రీ దేవి శ్రీనివాస దీక్షితులు

'భారతి' అక్టోబర్ 1977మాసపత్రికలో ప్రచురించబడిన "విష్ణుకుండినులు – వేంగి దేశము" అను శ్రీ ఆదిత్య శర్మగారి వ్యాసమును బాగుగా పరిశీలనతో చదివిన పిదప ఈ లేఖ వ్రాయుచున్నాను.

శ్రీ ఆదిత్యశర్మ తమ వ్యాసములో విష్ణుకుండిన రాజవంశ కాలానుక్రమణికను, వంశ వృక్షమును, డా॥ నేలటూరి వేంకటరమణయ్యగారి 'విష్ణుకుండినులు' అన్న పుస్తకమును ఆధారముగా తీసుకొని పై వ్యాస రచన చేసినట్లు తెలియజేసిరి. ఇందు నాకు కొన్ని సందేహములు కావవచ్చుచున్నవి.

I. శ్రీ శర్మగారు తమ వ్యాస ప్రారంభంలోనే విష్ణుకుండినులు క్రీ. శ. 6, 7 శతాబ్దములలో ఆంధ్రదేశమును పరిపాలించిరి అని తెలియజేసిరి. క్రీ. శ. 6వ శతాబ్ద ప్రారంభమ అనగా క్రీ. శ. 501 నుండి అని మనము గుర్తించగలము శ్రీ శర్మ విష్ణుకుండిన రాజవంశములో 4 వ తరమునకు చెంది రెండవ మాధవవర్మ పరిపాలనా కాలము (క్రీ. శ. 445–482 అని తెలియజేసిరి. అట్లాయిన విష్ణుకుండిన రాజ్యస్థాపకుడు అయి ఇంద్రవర్మ, రెండవ మాధవవర్మకన్న ముందువాడు. కావు విష్ణుకుండిన రాజ్యస్థాపన 6 వ శతాబ్దము కాదు అని గుర్తిం వలసియున్నది. డా॥ బి.యన్. శాస్త్రి విష్ణుకుండిన రాజ్యస్థాపకు అయిన ఇంద్రవర్మ 388 A. Dలో రాజ్యమును తన స్వబలము స్థాపించినట్లు తెలియజేసిరి.

అదియునుకాక క్రీ. శ 624 నాటికి ఆంధ్రదేశము తూర్పు చాళుక్య రాజ్యస్థాపన జరిగినట్లు వారి శాసనములవల తెలియుచున్నది. బాదామి చాళుక్య రాజు అయిన రెండవ పులకే 21వ రాజ్యపాలనా సంవత్సరములో వేయబడిన కొప్పారం శాసనవ (629–30) వలన కర్మ రాష్ట్రంలో ఒక గ్రామము దానవ చేయబడినట్లు తెలియుచున్నది. ఎట్టి పరిస్థితులలోను విష్ణుకుండిన రాజుల పరిపాలన క్రీ. శ 624 దాటి నిర్ణయింపరాదు

II. ఈపూరు రెండవ తామ్రశాసనమున మూడవ మాధవర్మ 'త్రికూట మలయాధిపతి'అని వర్ణించబడినాడు. త్రికూటమ అన్నది నాసిక్ ప్రాంతములోని సహ్యాద్రి అని, మలయామ అన్న పేరు తూర్పు గోదావరి జిల్లా పశ్చిమ ప్రాంతములోని పర్వత శ్రేణి అని శ్రీ శర్మగారు తెలియచేసిరి.— కాని ఈ విధము 'త్రికూటమలయ' అన్న ఏకపదమును విభజించి అన్వయక్రమమ చెప్పుట యదార్థముకాదు డా. యం. రామారావు మొదలగ పలువురు ఆధునిక చరిత్రకారులు 'త్రికూటమలయ' అన్నది నే గుంటూరు జిల్లా నర్సరావుపేట తాలూకాలోగల "కోటప్ప కొండ' అని గుర్తించిరి. అంతియేకాక ఉదాహరణకు ఆనందగోత్ర వం స్థాపకుడు అయిన కంధరనృపతి, త్రికూట మలయాధిపతి అని కృష్ణవేణ్ణా నాధుడు అని చేజెర్ల శిలాశాసనము వర్ణింపబ నాడు. ఇతని రాజధాని 'కంధరపురం'. ఇది నేటి గుంటూరు జిల్లా నర్సరావుపేట తాలూకాలో కలదు.

III ఇంద్రభట్టారకవర్మ తన రామతీర్థ శాసనములో పుక్కిరాష్ట్రంలోని 'పెరువాడక' అను గ్రామమును దానను చే నట్లు చెప్పబడినది. పుక్కిరాష్ట్రం అనగా నేటి విశాఖ జిల్లాలో ఒక ప్రాంతముగా గుర్తించబడినది. ఇందు సందేహమునకు తావు లేదు. ఇంద్రపాలనగర శాసనములో ఇతడు (ఇంద్రభట్టారకవర్మ "అనేక చతుర్దంత సమర సంఘట్ట ద్విరద గణవిపుల విజయస్య' అని కీర్తించబడినాడు. ఈతడు మిక్కిలి పరాక్రమవంతుడై అనే యుద్ధములు నిర్వహించి విశాల సామ్రాజ్యమును జయించినాడ అనుటలో సందేహములేదు. ఇతని కాలమున తీరఆంధ్రమున త్రికూట మలయమునుండి రామతీర్థమువరకు విష్ణుకుండిన రాజ్యము విస్త రించబడియున్నది అని గుర్తించగలము. కావున వేంగిదేశ యీతని రాజ్యములో ఒక భూభాగము మాత్రమే. డా. బి. యన్

శాస్త్రి ఇంద్రవర్మ క్రీ. శ (528–556) వరకు రాజ్యపాలన జేసెను అని తెలియజేసిరి.

IV. శ్రీ ఆదిత్యశర్మ తన వ్యాసంలో రెండవ మాధవవర్మ అనంతరము త్రికూట మలయాధిపతి అయిన మూడవ మాధవవర్మ వారసుడైనాడు అని తెలియజేసిరి. అంతియేకాక ఇంద్రభట్టారక వర్మ తన దాయాది అయిన మూడవ మాధవవర్మను ఓడించి రాజ్యాధికారము పొందినట్లు తెలియజేసిరి.

పరిశీలించి చూచినచో ఇది శాసనాధారములకు భిన్నముగా కానవచ్చుచున్నది. ఈపూరు IIవ శాసనమున రెండవమాధవవర్మ ➔దేవవర్మ➔మాధవవర్మ (త్రికూట మలయాధిపతి) పేర్లు తెల్పబడినవి. రామతీర్థం, చిక్కుళ్ళ, తుండి శాసనములలో, మాధవవర్మ➔ విక్రమేంద్రవర్మ ➔ ఇంద్రభట్టారకవర్మ➔ విక్రమేంద్ర భట్టారకవర్మ పేర్లు చెప్పబడినవి.

కావునశాసనములనుపరిశీలించిచూచినచో రెండవమాధవవర్మ అనంతరం ➔ దేవవర్మ, అతని తరువాత మూడవ మాధవవర్మ (త్రికూట మలయాధిపతి) రాజ్యము పరిపాలించవలెను.

అంతియేగాని, రెండవ మాధవవర్మ వారసుడు అయిన మూడవ మాధవవర్మను విక్రమేంద్రవర్మకుమారుడు అయిన ఇంద్ర వర్మ ఓడించి రాజ్యమును ఆక్రమించుకొనెను అని తెలియజేయుట యదార్థమునకు భిన్నముగా గోచరించుచున్నది.

V. క్రీ. శ 480 వరకు వేంగీదేశము పల్లవరాజు అయిన యువ మహారాజు అయిన విష్ణుగోపవర్మ కుమారుడు రెండవ సింహవర్మ ఆధీనములో ఉంది అని, ఆ తర్వాత కూడా క్రీ. శ. 566 వరకు వేంగీదేశం వారి ఏలుబడిలోనే ఉన్నది అని, అనుట అసంగతము కాదు అని, పల్లవులచే విష్ణుకుండినులు ఓడించబడి నారు అని శ్రీ ఆదిత్యశర్మ తెలియజేసిరి.

విష్ణుకుండిన శాసనములతో పాటు, సమకాలీనురుయ్యైన శాలంకాయన, శాసనములు, సముద్రగుప్తుని అలహాబాద్ శాసనమును పరిశీలించినచో, మనకు మరికొన్ని వివరములు తెలియవచ్చును శాలంకాయన రాజు అయిన రెండవ హస్తివర్మ సముద్రగుప్తునిచే ఓడించబడినాడు అని చరిత్రకారులు పలువురు గుర్తించిరి. ఇది క్రీ శ.4వ శ॥మధ్యకాలమున జరిగినది హస్తివర్మ II అనంతరం శాలంకాయన రాజు పలువురు పరిపాలించిరి కాబట్టి శాలంకాయ రాజులు స్కందవర్మ, చండవర్మ, నందివర్మ II మరియు విజయ స్కంద వర్మలు (క్రీ. శ. 360 నుండి 376) పరిపాలించిరి. శాలంకాయన రాజ్యపతనం అయినతర్వాత పల్లవులు, కృష్ణాగోదావరి మధ్య మండలమున తమ ప్రాబల్యమును విస్తరింపచేయుటకు తీవ్ర మైన ప్రయత్నములు చేసిరి. విష్ణుకుండిన రాజు అయిన రెండవ మాధవవర్మ వాకాటకరాజుల సహాయముతో వేంగి ప్రాంతమునుకూడా వశపర్చుకొనెను. ఆతని అనంతరము విక్రమేంద్రవర్మ, ఇంద్ర భట్టారకవర్మ తీర ప్రాంతమున తమ రాజ్యమును సంరక్షించి విస్తరింపచేసిరి.

విక్రమేంద్ర భట్టారక వర్మచే వేయబడిన ఇంద్రపాలనగర శాసనమున "కృత్వా పల్లవ భంగ పేలవబలం సింహ హ్వాయం పల్లవం భూత్వా వృత్య యధాగతః ప్రదమతశ్చ క్రాభదానంపురం, ప్రాదద్వాసన ముత్త మాశ్రయ ఇతి ఖ్యాతిస్తదేదం నృపః సాష్టా శీతి చతుః శతే శకపతే సంవత్సరాణాంగతే",..అని కలదు. అనగా పల్లవునివలె స్వల్ప బలముగల సింహహ్వయుడగు పల్లవుని భంగ పరచి తిరిగివచ్చి మొదట శక్రాభిదానమను పట్టణమును ఉత్తమా శ్రయుడుగు రాజు దానము చేసెను. ఆ దానము శక సంవత్సరం సాష్టాశీతి చతుఃశ్శతే అనగా 488 గడచిన పిదప ఇవ్వబడినది

విక్రమేంద్ర భట్టారకవర్మ జయించిన పల్లవరాజు ఐదవ సింహవర్మ అను పల్లవరాజు అని డా. బి. యన్. శాస్త్రి, డా. రామారావుగార్లు గుర్తించిరి. ఆ సింహవర్మ క్రీ. శ. 550లో రాజ్యమునకు వచ్చెను.

శ్రీ ఆదిత్యశర్మగారు తన వ్యాసంలో, ఒక క్రమబద్ధం లేకుండా వ్యాసరచన చేసియున్నారు—వేంగీదేశంను రెండవ విక్ర మేంద్రవర్మ అనంతరము 2వ గోవిందవర్మ, ఆతని తరువాత 4వ మాధవవర్మ పరిపాలించిరి. నాల్గవ మాధవవర్మ కాలమున వేంగీ దేశము విష్ణుకుండినుల పరిపాలనలోనే కలదు ఈతని పరిపాలన చివరి రోజులలో దుర్జయులు బహుశ వేంగీదేశమును ఆక్రమించు కొని స్వతంత్రులు అయి ఉండవచ్చును. వారిని తొలగించి బాదామి చాళుక్యులు ఆ ప్రాంతమును ఆక్రమించుకొనినట్లు శాసనములవలన తెలియుచున్నది. రెండవ పులకేశి ఐహోలు శాసనమున చాళుక్యులు, తొలుత కోసల – కళింగ మధ్యరాజ్యమును అనంతరము, కళింగ - పిష్ఠపురప్రాంతమును, ఆ తరువాత పిష్ఠపుర–కొల్లేరు ప్రాంతమును —ఆ తరువాత పల్లవ రాజ్యమును జయించినట్లు ఒక వరుసక్రమమున తెల్పబడినది.

కావున పరిశీలించి చూచినపుడు శ్రీ ఆదిత్యశర్మగారు తన వ్యాసంలో, కాలానుక్రమణికలోను, వంశక్రమమును అన్వయపర్చుట లోను, వ్యాసములో విషయమును సమగ్రముగా తెలియచేయుటలోను లోపములు కన్పించుచున్నవి. ప్రతిభావంతులైన చరిత్రకారులుగాని, శ్రీ శర్మగారు గాని, పై విషయముపై సందేహాస్పదముగాని, వ్యాసమును ప్రచురించవలసినదిగా కోరుచున్నాను.

శ్రీ కె పి. నాయుడు

బంగోరె బాంబు

'భారతి' సెప్టెంబరు 77—లేఖలు శీర్షిక క్రింద డా. మల్లి ప్రియ "నాగరాజు" అనేవారు 'శ్రీ నిడుదవోలువారి విచిత్ర సమా ధానం' అని ఒక లేఖ వ్రాశారు దానిని పురస్కరించుకొని నాకు

తెలిపిన అభిప్రాయాలు, ఇంక కొన్నిటిని గూడా నివేదించు కొంటున్నాను—

1 'బంగోరె' అనేది బండి గోపాలరెడ్డిగారి సంక్షిప్త (గుప్త) నామం. వారి పేరు "శ్రీ బంగోరె బాంబు" కాదు; బంగోరెగారు. అప్పుడప్పుడు "బాంబులు" (bombs) వదులు తుంటారు! (మా జిల్లాలో 'బాంబు' అంటే అపానవాయువు అని గూడా వ్యవహారం.) బంగోరె బాంబు అంటే శ్రీ బంగోరె వదిలిన బాంబులాంటి విమర్శ అని అభిప్రాయం. ఆ విమర్శ ఏమిటంటే, "చిన్నయసూరి బోగస్ బొమ్మ: కళాప్రపూర్ణ నిడుదవోలు వారికి ఒక చిన్న ప్రశ్న" అన్నది. కాబట్టి డా. మల్లీప్రియగారు "శ్రీ బంగోరె బాంబు" అని (రచయిత పేరుగా) పేర్కొనడం పొరపాటు. లేదా శ్రీ బంగోరె ఆ విధంగా వ్రాయటం లేక ఆంధ్ర జ్యోతి—దినపత్రికవారు అల్లా ప్రచురించటం పొరపాటు.

2. తంజ నగరం తేవప్పెరుమాళ్లయ్య ఫోటోను, చిన్నయ సూరి రేఖా చిత్రమని నిడుదవోలువారు అచ్చువేశారని శ్రీ బంగోరె అనుమానించారు; తంజ నగరం వారి ఫోటో, చిన్నయసూరి రేఖా చిత్రం రెండూ ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధం 22–5–77లో పక్కపక్కన ఇచ్చారు. "రూప సామ్యం వుండ వచ్చుగాని వేషసామ్యం కూడా కలసి వుంటుందంటారా ?" అని బంగోరెగారు డౌట్ పడ్డారు. సహజంగా వేషసామ్యం ఎక్కువగా, రూపసామ్యం యాదృచ్ఛికంగా ఉంటాయి అసలింతకీ బొమ్మ గీచింది నిడుదవోలు వెంకటరావుగారా ? ఎవరిచేతనైనా గీయించారా? విష్ణుమూర్తి ఊహా చిత్రాలు రామారావు రూపసామ్యంలో రావడం మనం చూడ్డంలేదా ? చిన్నయసూరిది ఊహా చిత్రమని మవ్వూరి వెంకటరమణ శాస్త్రిగారు వ్రాయలేదా ? విద్వాన్ సరవస్తు వెంకయ్యగారు కూడా ఆ మందట ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఊహా చిత్రమేనని పేర్కొన్నారు గద ?

"చిన్నయసూరి చిత్రంఊహించి వేసిందే" అని నిడుదవోలు వారు సమాధానం చెప్పారు. అయితే, "అది అసలు ఫోటోగాని ఊహా చిత్రం కాదే !" అని డా. మల్లీప్రియగారు అంటున్నారు. ఏమిటీ పులిమీద పుట్ర ? డా. మల్లీప్రియగారు ఫోటో అని, బంగోరెగారు రేఖా చిత్రమని బలకొడుతున్నారు. మరి యిప్పుడు 'బంగోరె బాంబు' ఎట్లా ప్రేలుతుందో చూడాలి !

3. బంగోరె బాంబుకు సంబంధించి మరి రెండు అంశాలు కూడా స్పృశించాలి. అందులో ఒకటి, "నేటి కాలపు తెలుగు పండితులలో ఒక వర్గం వారికి దురదృష్టం కొద్దీ ఇంకా ఆరాధుడుగానే చెలామణి అవుతున్నాడు చిన్నయసూరి" అన్న అభిప్రాయం. శ్రీ బంగోరె అన్నట్టు అది దురదృష్టమో, అదృష్టమో గాని, పరవస్తు చిన్నయసూరి బాల వ్యాకరణం, బహుజనపల్లి సీతారామాచార్యుల శబ్దరత్నాకరం, కాకునూరి అప్పకవి అప్పకవీయం — చదవకుండా గ్రాంధికాంధ్ర భాషా సాహిత్యాలు తెలిసిన మొనగాడెవడూ యింకా ఇప్పటికి పుట్టలేదు. బాల వ్యాకరణానికి భాష్యాలమీద భాష్యాలు ఇప్పటికీ యింకా వస్తున్నా అందులో ఒక సూత్రం చూచి సరిగా ఎత్తి రాయడానికి చేతగానివాళ్లు చిన్నయ సూరి చెలామణికి చింతించాల్సిన పనిలేదు.

శ్రీ బంగోరె "మొట్టమొదటి కన్యాశుల్కము" విపులమైన వ్యాఖ్యాన వివరణలతో ప్రచురించారు. (అసలు మొట్టమొదటి కాదు; మొదటి మాత్రమే. మొదటి కన్యాశుల్కము, రెండవ కన్యాశుల్కము అని రెండేఉండేది. మూడోదిఉన్నప్పుడే 'మొట్టమొదటి' అనవచ్చు.) అందులో "మొదటి యంకము" అనే మాటమీద బంగోరెగారి వ్యాఖ్యానం చూడండి : "ఇది వ్యవహారానికి దూరమైన సమాసం; చిన్నయసూరిగారి 'బాల వ్యాకరణ' బానిసత్వజనితమైన కృతకమైన గ్రాంధిక ప్రయోగం. 'సంధి లేనిచోట అచ్చున కచ్చు పరంబగునపుడు యడాగమం బగు' అని బాల వ్యాకరణ సూత్రం" అని తమ బాలవ్యాకరణ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. ఈసూత్రం ప్రకారం 'మొదటి యంకము' కారాదు. ఎందుకు కాదో వారికి తెలియదు సూత్రం తప్పుగా ఎత్తిరాశారు. ఆ లప్పుడు ఉటంకింపు ప్రకారం"మొదట్యె అంకము" అవుతుంది! ఇటువంటి మరొక వర్గం పండితులు వాళ్ల అదృష్టంకొద్దీ చెలామణి అవుతూ చిన్నయ సూరిని నిందిస్తున్నారు.

చిన్నయసూరి బాల వ్యాకరణ సూత్రం (యడాగమానికి) ఇట్లున్నది—"సంధిలేనిచోట స్వరంబుకంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు" ఇందులో రెండో అచ్చుకు యడాగమం (అచ్చుకు పూర్వం యకారం) వస్తుందని సూత్రాభిప్రాయం. "అచ్చున కచ్చుపరం బగునపుడు", "పరంబయిన స్వరంబునకు" అన్నమాటలలోని పరిభాషాపరమైన భేదం శ్రీబంగోరెకు తెలియదు. "యడాగమం" అన్న పరిభాషకు సంబంధించిన వివరం కూడా తెలియదు "యట్" అన్నదానిలోని టకార (ఇత్‌సంజ్ఞ) ప్రయోజనం ఆయనకు అబ్బని విద్య. ఇదేమీ మిడతం బొట్లు జోస్యం కాదు డబాయించడానికి కనీసం ఆయన రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారి వ్యాకరణ మైనా చదువుకొని వుంటే "అచ్చున కచ్చు పరంబగునపుడు" అని వ్యాకరణ జ్ఞానం వెలగబెట్టి వుండరు. (చూ సంధి ప్రకరణము–35వ అంశము.)

చిన్నయసూరి బాలవ్యాకరణం తాను చూచినట్లున్నూ, అందులోని విషయాలు అవగత మైనట్లున్నూ, సదరు చిన్నయసూరి ఆరాధ్యుడేమీ కాడన్నట్లున్నూ శ్రీ బంగోరె ఫోజు కొడుతున్నారన్న మాట !

అదిసరేగాని, వ్యావహారికంలో యడాగమం లేదా? దాదా? మాయమ్మ, నీయక్క, పాడియావు (పాడావు?), వెలయాలు, నీయంత మూర్ఖుడు మొ. రూపాలు అనేకం గమనించవచ్చు.

4. మరొక విషయ మేమిటంటే, ఇంగ్లీషులో (కాపీరైట్ రిజిస్ట్రేషన్ కోసం) వ్రాయబడిన జాబులో చిన్నయసూరి సంతకం మాత్రం తెలుగులోనే చేశాడు. ఆ యింగ్లీషు వ్రాతా ఈ తెలుగు చేవ్రాలూ వేర్వేరు చేతి వ్రాతలుగా కనబడుతున్నాయి; చిన్నయ

సూరికి ఇంగ్లీషు వ్రాయడం రాదేమో నసుకోవాల్సి నట్టుగా వుంది అంటూ శ్రీ బంగోరె మరొక సందేహం వెలిబుచ్చారు.

''రాదేమో
నను కోవాల్సి
నట్టుగా''

అని భోగాతం దరువు వేస్తున్నారు శ్రీ బంగోరె గార్నమెంటు స్టాంపు (దస్తావేజు)లో తెలుగులో వ్రాయించి యింగ్లీషులో సంతకాలు పెడితే వాటి అభిప్రాయమేమని? ఆయనకు తెలుగు రాదని (దస్తావేజు వ్రాసినవారు వేరే గనక). ఇంగ్లీషు మాత్రమే వచ్చునని అర్థమా? టైపు చేయించిన రెజిష్ట్రారు పత్రంలో చేవ్రాలు పెడితే ఆ టైపు చేయించినది వ్రాయడానికి తనకు చేతగాక చేయించినట్టా? ఏమి వగలు పడుతున్నారండి, బంగోరెగారు! గోపాలకృష్ణను పెట్టి ఇంగ్లీషునుంచి చేసిన తర్జుమాను ఆధారం చేసుకొని, చిన్నయసూరి భాషను సవరించి పకడ్బందీ చేసినందువల్ల ఈ గ్రంథం (హిందూ ధర్మశాస్త్ర సంగ్రహము) ఇద్దరి పేర్ల మీద ప్రకటన జరిగిందనుకోవాలి—అని బంగోరెగారు ముక్తాయింపు వేశారు. 'భాషను సవరించి పకడ్బందీ చేసినందువల్ల, అందువల్లనేనని యీయన కెవరు చెప్పారు? 'ఇద్దరి పేర్ల మీద ప్రకటన జరిగిందను కోవాల'—పైన చెప్పిన ''అందువల్ల'' అన బడ్డ కారణం నిరూపించకుండానే ''అనుకోవాలి'' అని తేలుస్తున్నా రెందుకు? అంటే యివన్నీ శ్రీ బంగోరె సందేహాలేగాని చిన్నయ సూరికి ఇంగ్లీషురాదని ఘంటాపథంగా చెప్పలేక పోతున్నారన్న మాట. అయ్యో పాపం, ఒక్క ఆధారమైనా దొరికి, చిన్నయ సూరికి ఇంగ్లీషు రాదనిపిస్తే ఎంతబాగుండును! శ్రీ బంగోరెకు తమిళమూ, చిన్నయసూరికి ఇంగ్లీషూ రాకపోతే 'జలాబుడ్డి' మునిగిపోద్దా? (ఈయన గూడా తమిళంలోని చంద్రిక కథను మరి యిద్దరు మిత్రుల తోడ్పాటుతో తెలిగించి వెలిగించారు లెండి!)

అనవసర ప్రస్తావన కాదనుకుంటే ఒక చిన్న విజ్ఞప్తి—

ఇప్పుడు యూనివర్శిటీ పరీక్షార్థులకు పెట్టిఉన్న అప్ప కవీయపాఠ్యం, బాలవ్యాకరణం తొలగించివేసినట్లయితే, ఎం. ఏ. విద్యార్థి లేదో పందేరం కింద సర్టిఫికెట్లు పుచ్చుకొని కళ్ల కద్దుకొని కుంకుమ పోసి పెట్టుకోడానికి ఉపయోగించు కొందురు గద! ఇంగ్లీషుదొరలు వ్రాసిపెట్టుకొన్న ఛందో వ్యాకరణాదులు రెఫరెన్సుకింద పెడ్తే చెప్పేవాడికీ, వినేవాడికీ యిబ్బంది వుండదు. ఏది రాసినా చెల్లుబడై పోతుందిగద? శుభస్య శీఘ్రమ్!

5. ఇంక బ్రౌన్ లేఖల గురించి గూడా ఒక ముఖ్యాంశమే ప్రస్తావిస్తాను—

''ప్రస్తుతము శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమువారు ప్రకటించిన గ్రంథము ప్రాతదియేగాని నూతనము కాదు'' అని నిడుదవోలు వెంకటరావుగారు అన్నారు. ఆ విషయం గూర్చి కొంత చర్చించారు. దాని విషయమై శ్రీ బంగోరె సమాధానం చెప్పలేదు. కీలకమైన విషయాన్ని వదలి బంగోరెగారు చిల్లర వివరాలు చెప్పారు.

''......నిడదవోలు వెంకటరావువంటి పాతకాలపు పండితులలో ముఖ్యంగా ఒక జాడ్యం వుంది. కొన్ని ఆయువుపట్లువంటి సన్నివేశాలలో ఆధారాలు ఇవ్వకుండానే, దాఖలాలను గురించి చర్చ చేయకుండానే ఒక మాట అనేస్తారు......'' అని బంగోరెగారు తవ బాంబులో గుర్తుచేసి వున్నారు. ఆయువుపట్టు వంటి యీ సన్నివేశంలో ఆధారాలు ఇచ్చి, దాఖలాలను గురించి చర్చచేసి అన్న నిడుదవోలు వారి మాటను బంగోరెగారు పట్టించుకోలేదేమి? కొత్తకాలపు పండితుల నిజాయితీని ఇక్కడ శంకించవలసి వస్తున్నది. కె. వి. రమణారెడ్డిగారు గూడా ఈ సంగతి దాటవేశారు! ఇంతకుముందే అచ్చుకు సిద్ధమై వుండిన, అచ్చులో ఉన్నదని సూచించబడిన గ్రంథాన్ని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంద్వారా ప్రచురింప జేయించుకున్నాడన్న నిందను తొలగించుకోవలసిన బాధ్యత శ్రీ బంగోరెపై అట్లనే వుంది. పదహారు నెల్లు బంగోరె గారు విశ్వవిద్యాలయం ఖర్చుతో తిని, తిరిగి ఆషా మాషీ కబుర్లతో కాలక్షేపంచేసి సిద్ధమై వుండిన పుస్తకాన్ని అచ్చు వేయించుకున్నారా? జి. ఎన్. రెడ్డిగారి పర్యవేక్షణ వట్టిదేనా? ఒక యూనివర్సిటీ ప్రొఫెసరు పర్యవేక్షణలో సిద్ధమైన గ్రంథంలో మర్యాద తెలియని భాష వాడబడుతుందా? యూనివర్సిటీ ప్రచురణలో మన్ననగల (వ్యావహారికమే కావచ్చు) భాష, విషయ వివేచన ఆదర్శప్రాయంగా, సత్సంప్రదాయాన్ని సూచించేదిగా వుండాలికద? ఏదో జర్నలిస్టు ధోరణిలో వ్రాయడం సబబుకాదు. శ్రీ బంగోరె తన 'కూనిరాగాల' స్థాయిని మించి అటు విషయంలో గాని, యిటు భాషలోగాని యూనివర్సిటీ సీనియర్ రిసెర్చి ఆఫీసరయి ఒక ప్రొఫెసరు క్రింద పదహారు నెల్లు మెలిగినా యెదగలేదు అదే ఆయన గొప్ప వ్యక్తిత్వమనుకుంటే న్యూస్‌పేపర్లకు, యూనివర్సిటీ ప్రచురణలకు తేడా ముగిసిందనుకోవాలి!

— శ్రీ బండి నాగరాజు



గ్రంథ విమర్శలు

1 శారద నవ్వింది

[కందుకూరు తాలూకా రచయితల సంఘ ప్రథమ వార్షికోత్సవ సంచిక.

డెమ్మి 1/8 – 50 పుటలు; వెల రు. 2-50/– ప్రతులకు: అధ్యక్షుడు–తాలూకా రచయితలసంఘము, కందుకూరు; ప్రకాశంజిల్లా; 523105.]

'శారద నవ్వింది' – అన్న పేరే బాగున్నది. కవి–కవయిత్రి సభ్యుల గేయ కథానికల సంకలనం . ఇది కొత్తవారి రచనకు ప్రోత్సాహమిచ్చే ప్రయత్నం. కొమండూరు రామానుజాచార్యుల ''జనార్దనా'' అన్నది – ఆ ప్రాంతపు రుద్రకవి జనార్దనాష్టకాన్ని జ్ఞప్తికి దెస్తున్నది. ప్రబంధ ఫక్కీలో పద్యాలు బాగా నడుస్తున్నవి. కేసరి సుందరరామశర్మ ''పసిడి ఉసిరికలు'' ఒక ఫేరి టేల్ గా ఉన్నది లలితా రామకృష్ణ ''స్వాతంత్ర్య దినం''అనవసర ఆక్రందనం, ఊరకే వాపోతే ఎట్లా – కార్యవాది కావాలగాని కుమారి సుహాసిని ''స్నేహం'' – ''నీలాకాశపు టంచులతో పరచుకొన్న పైడివన్నె చిందులేసి, గిక్కన్నై చీకటి రువ్వేళ వంటి'' నుడికారంతో బాగున్నది.

మాండలికాలు భాష అనే ఇంద్రధనుస్సులో వెలిగే శబల వర్ణాలు. అందువల్ల దేశమంతా విజయవాడ భాషనే వ్రాస్తే, సాహిత్యం సొబగు ప్రాణంలేని మొండెం అవుతుంది.

కందుకూరు వారు తమ భాషనే వ్రాస్తే భూషణాలు అవుతవి. ''కృశిస్తోంది'' ఇది వర్తమానమా ? భవిష్యత్తా ?

వేదగిరి వెంకట రామశర్మ ''మా సీమ'' స్థానికాభిమానాన్ని చక్కగా రేకెత్తిస్తున్నది దీనిని దురభిమానం అనరాదు. స్థానిక పురుషులను పేర్కొంటూ, 9వ. శతాబ్దం మొదట కందుకూరు నేలిన బ్రాహ్మణ సేనాని పండ్రంగను పేరెత్తాడు. ఈయన ఎప్పుడో తెనుగు పద్యాల శాసనం వేయించినాడు. శ్రీనాథుడు–అనిసి తిప్పయ్యశెట్టి సింగరాయకొండ ప్రాంతంవారని గదా ఇప్పటి వాదం· గోపినాథం వెంకటకవి ఈ సీమవాడేనయ్యా !...ఈ ముగ్గురి దిగవేత పొరపాటేమో ''సీ–ంగ్'' కథానికలో పవని నిర్మల ప్రభావతి, భూసంస్కరణలు మాబ్ అట్ట్రాక్షన్ అని (చేలు పుచ్చనా?) మంత్రి చేతనే చెప్పించడం మంచి ఎత్తిపొడుపే !

2. దీపశిఖలు

[కవితా సంపుటి – కనపర్తి.

డెమ్మి 1/8 – 72 పారటలు, ధర రు. 4/–ప్రతులకు: పూర్ణిమ ప్రచురణ; పబ్లిషర్సు; వేములవాడ; 505302.]

కనపర్తి డా. సి. నారాయణరెడ్డి శిష్యుడు; ఆయన కవితా వాసనలు కనబడుతూనే ఉన్నవి. గురువు మాత్రా ఛందాన్ని వదలినా, శిష్యుడు పట్టుకోని ఉండటం మంచి పనే ! వ్రాత నిలవాలంటే ఇదే మందని ఈ రచయిత గ్రహించినట్లున్నది.

ఇవి 20 ఏండ్లనాటి వ్రాతలు. భావాలు, భాషా పేరీపేరని స్థితిలో ఉన్నా కవితా శిల్ప ప్రభలు డాలు కొడుతూనే ఉన్నవి. నుడికారపు కమ్మదనం ఖండిక ఖండికకు ఎదిగేటట్లున్నది. ''నా మానవతకు మోడులు చిగురింపలేదు'', ''కాలానికి నాగరికత కట్టిన గోరీలు''. ఇందు భావంగూడ బాగున్నది. ''ఆకాశ మంటెడు భువన ప్రాకారము.''

''నిశిత సత్యాలు'' లో రాళ్ల పూజను వేమనవలె తిట్టబోతున్నాడు. కాని చెప్పే తీరు ఇంకా పండ బారలేదు. మతంవారు వట్టిరాయిని దేవుడు అనలేదు గదా, ప్రతీకమన్నారే ! సైన్సు – మతం ఒకేచోట పుట్టినవని పెద్దలంటారు. ఈ కవి ఆవేదనను ఆటంబాంబును పుట్టించిన సైన్సు మాన్పగలదా ? ఇక మతమే శరణ్యం. మానవ సేవ కోరుతాడు ఈయన; ఈ సేవనే గదా మాధవ సేవ అన్నది; ఇక భావంలో మార్పు కలగాల. ''మతోన్మాదాన్ని రగల్చను'' అన్నది చాలా మంచిమాట. ''ఏకం సత్ విప్రా బహుధా వదంతి''అన్న ఉపనిషద్వాక్యమే (హిందువులుమరచినా)మానవాళిని ప్రోవ గలిగినది. ''అంతశ్శోధన'' మొదలైన ఖండికలలో 'ఎరుకకు' లోచూపు పుట్టుతున్నది. ''అయాచిత జన్మలు'' లో పృథ్వికి భారమైన వటవృక్షంగా పుట్టనేల ? అని వృథాగా బాధపడుతాడు. కాని సృష్టిలో వ్యర్థమైనదే లేదే – ఇక కూర్పువాడొక్కడే కొదువ. వల్లేరుగూడ మంచి ఓషధి.

వృద్ధికి వచ్చే రచయిత కాబట్టి భాషలో కొంత జాగ్రత్తగా ఉండాం. ''మూసవుడు'' లో పురిటి నొప్పులంటాడు. పురుడంటే కన్న తర్వాత బాలింతకు చేయించేస్నానం; అప్పుడు నొప్పులెందుకు. వీటిని కాన్పు నొప్పు లనాల. ప్రసవవేదన – Birth pangs or throes

3 విశ్వ విపంచి

[భావ రాగతూలికలు.

ఆచార్య భావన్.

డెమ్మి 1/8 – పొరటలు 50; ధర రు. 3/– ప్రతులకు: విక్రాంతిపబ్లికేషన్సు;48–5–22,శ్రీనగర్, విశాఖపట్టణం–4]

విపంచి కాబట్టి భావ రాగాలను వెలువరించడం బాగున్నది గాని అవి తూలికలా? (దూది–ఈకలు)మూర్ఛనలా? విశ్వాన్నంతా ఒకే కుటుంబంగా భావించడం తప్పనిసరి అయినది గదా నేడు,

కాబట్టి కవి మంచి పూ గొమ్మనే పట్టుకొన్నాడు. గ్రంథం తమాల వృక్షంతో ప్రారంభం. తమాలమనే మన ప్రబంధాల వృక్షాన్ని చీకటి మానన్నారు. అందువల్లనే ఆ చీకటిని మాత్రం తీసుకొని ఆరాటపడుతున్నాడు. "ఇది" అని ప్రారంభించిన ఎత్తుగడ బాగున్నది. కాని ఆ 'ఇది' ఏదో స్పష్టంగా చెప్పడు. అక్కడక్కడ జాను పదాలున్నా—వ్రాత భావన్ని బాగా వివరించి చెప్పలేకున్నది.

"సమాధి"లో లోక కల్యాణము మానవ శ్రేయము తన ఆదర్శమన్నాడు; ఈ చీకటి చెట్టులో వెలుతురు కాయఇది. అక్కడక్కడా ఆశ చూపుతాడు—తపన పడుతాడు. ఇదే ఈయన కవితా పథాన్ని వెలిగించగలదని ఆశపడుతున్నా.

4. కిరణాలు - కెరటాలు

[కవితా ముక్తకాలు
తిరుమల శ్రీనివాసాచార్య.
డెమ్మి 1/8 – 64 పేజీలు; మూల్యం రు. 2; ప్రాప్తి స్థానం – యువభారతి; 5–కింగ్స్‌వే, సికిందరాబాదు–3.]

దీనిని 'సూక్తి సుధ' అందాం. ఆచార్య లోకపు తీరుతెన్నులను గుర్తించి, భావించి, వాటిని కళామయమైన రూపంలో మలువగలిగిన శిల్పి. పండి పనికివచ్చే లోకానుభవం గలిగిన సూక్తులు ఈ ముక్తకాలు సంస్కారితమైన ఈయన హృదయం వెలువరించిన కాలగతి తలపోతలు ముక్తకాలు అంటే ముత్యాలని గూడా గదా; అట్లనే ఉన్నవి. "లోకజ్ఞతలేని ప్రతిభ రాణించడం కష్టం" అంటాడు. ఈ లోకజ్ఞత ఈయనలో దండిగా ఉన్నది.

బిగువు కుదింపు ఉంటే మాటకు ప్రాణం. ఇదే చాటువ లేక సామెత లక్షణం. ఈ 362 ఇంటిల్లో చాటవలుగా నిలిచిపోదగినవి చాలా ఉన్నవి. ఎవడో అజ్ఞాత శిల్పి—చదువురాని పల్లెటూరి సేద్యగాడు గూడ—అనుభవంతో చెప్పినవే సామెతలు. "కదిలితేనే కావ్యం గొప్పతనం" అంటున్నవి కిరణాలు — అవునంటున్నవి కెరటాలు. "కన్నీరంటే తెలియనివాడికి కవిత్వం ఎలా తెలుస్తుంది?" అంటాడు — కవి గుణాలను అంతుబట్టిన ఈ కవి!

రవీంద్రనాధుని 'Fire Flies'(మిణుగురులు)ఇట్టి ముక్తాయింపులే! మాటకారి వీటిని బాగా ఉపయోగించుకోవచ్చును. "మమతకు ముకురంగా మెరవాలి నీ మనసు — కమ్మని స్నేహానికి బంగరు నాణెం బొమ్మ బొరుసు రెండూ సమానం — పూలు తెంపుకొనే వాళ్లంతా నీళ్లు పోసే వాళ్లేనా? — పాలిచ్చేతల్లివైపు ఏ పాప చూడదు — కావలసినది నిద్ర కనులకుగాదు, మనసుకు — వంట చేస్తుంటేనే తింటుంటే వడ్డనకు మిగిలేదేమున్నది". ఇట్లాటివి ఎన్నో ఉన్నవి.

5. కవి జీవిక

(ధనేకుల వెంకటేశ్వరరావు.
క్రౌన్ 1/16 – 100 పేజీలు; ధర రు. 4/– దొరకు చోటు : నవోదయ పబ్లిషర్స్; ఆరండల్‌పేట; గుంటూరు.)

ఈయన సాంప్రదాయిక కవి, భాషలో భావంలో అరాచకం లేకపోవడమే కాకుండా గురువులపట్ల, పెద్ద కవులపట్ల భక్తిచూపే సంస్కార మున్నది. "ఏనాటికో నా హృదయ వన వాటిలో పూలు పూచి, కాయలు కాచి మోదు మాకులు కూడుకొనుట" అని ధర్మ పరివేదన పడుతున్నాడు. "జీవిత మొక రస చిన్మయ జ్యోతి — భావ బంధురమైన బహువర్ణ గీతి" అని కవితాత్మ అన్వేషణలో నున్నది. ఇట్టి ఆశయే జీవన జ్యోతికి ప్రమిద గదా!

రచనలో నడక, దీనిని నడిపే నుడికారం భావానికి అలంకారాలుగా ఉన్నవి. "నల్ల పలక నిండ తెల్లగీతలలోన, తెల్ల పుటల నిండ నల్ల గీతలలోన" "లోకబాంధవుడై వెలుగు సూర్యభగవాను నెల్లప్పుడు ప్రదక్షించు సాధ్వి" అని సామాన్య భూభ్రమణాన్ని ఉదాత్త పరుస్తున్నాడు. పేదరాలు బెట్టిన అంబటి విందుకు మురిసిపోతున్నాడు. సీతాకోక చిలుకలో ప్రకృతి సౌందర్యాన్ని దర్శిస్తూ "జీవించు తీరు నేర్పిన మానవునికే జీవిత మానంద జీవికయౌను" అని హతాశులకు తారకమిని చెపుతున్నాడు.

సర్కస్ వంటి పేలవమైన ఖండికలను తీసివేస్తే ఏమి పోతుందయ్యా?

6. కవి - కవిత

[(రసిక్) డాక్టర్. గుర్రం భానుమూర్తి.
డెమ్మి 1/8 – 48 పుటలు; వెల రు. 5/– ప్రతులకు: జి. వి. సుబ్రహ్మణ్యం, అడ్వొకేట్, వేదం వారి అగ్రహారం, నెల్లూరు–2.]

రసిక్ అనే పొట్టి పేరులో అణగిఉన్న పొడుగు మనిషి — డాక్టర్ గుర్రం భానుమూర్తి — సైన్సు నిపుణుడు; కాలేజి అధ్యాపకుడు; విదేశాలు చూచివచ్చిన లోకజ్ఞుడు. కాబట్టే ఈ అనుభవాలకు కవితను మేళవించినాడు. పండితులు కవులు అధ్యాపకులను గన్న ప్రఖ్యాత కుటుంబం—గుర్రం వారింటి బుట్టిన చిగురుకొమ్మ గూడ చేవ. ఈ తుమ్మగుంట ద్రావిడ శాఖీయులలో, పూర్వం ఎప్పుడో కుంపిణీ రాజ్యంలో — గుర్రం అప్పన్నశాస్త్రి మదరాసు హైకోర్టు పండితుడుగా (హిందూ ధర్మశాస్త్రం వివరించేవారు) ఉండినారు.

అనుభూతి ఆవేశాన్ని వెలువరించి ఆనందించేకవి, పరిశోధన ఫలితాలకు మురిసిపొయ్యే శాస్త్రజ్ఞుడు — ఈ రెండు కలసిన వాడు ఈ కవి కాబట్టి, ఈ యుగానికి కావలసిన కలగలుపు కవిత్వం బయటపడుతున్నది. ఎదసానలో బుట్టిన భావాన్ని అనుభవించి పఠితను అనుభవింపజేయదగిన కవి ఈయన. చిన్న ఛందంలో చిన్న మాటలలో పెద్దభావం కుదించి చెప్పగలిగిన నేర్పు ఈ రచనలో కనబడుతున్నది.

కవిని పెద్దజేసి, కవితను మహిమపరుస్తూ, నిలువ గలిగిన సుద్దులు చాలా చెప్పినాడు. కరుణం ఒక రసం కానే కాదనే మని

పిడివాదపు లాక్షణికులను లెక్క బెట్టక ఈ కవి కరుణరసంతట్టు కొంత మొగ్గుచూపినాడు. ''అహము కవికి మిగుల సహజగుణము'' అంటాడు; ఇది సైంటిస్టుకు అవునేమోగాని వేదాంతికి కాదు. ''కవుల కనులు గూబ కన్నులేమో'' అన్నది మనోజ్ఞమైన సైన్సు నుడికారం; ఎక్సురేలు అన్నదీ బాగున్నది· గూబ బదులు గబ్బిల మంటే ఇంకా బాగుండేది; గబ్బిలానికి రేడర్ కండ్లంటున్నారుగదా. ఇట్లనే ''పాము చెవులు'' అన్నది అర్థవంతమైనది.. కన్ను, చెవ్వు పాముకు ఒకటేనని, అది నాలుకకదలికతోనే వింటున్నదంటున్నారు. మనవారు పామును చక్షుశ్శ్రవ మన్నారు.

కాని, రవిని కవిని కలిపి చెప్పినది కాస్త పేలవంగా ఉన్నది. ''రవి గాననిచో కవి గాంచ గల్గు నెయ్యదన్'' అన్న దాని బిగువు ఈ సూక్తిలో రాలేదు. వ్రాసినవన్నీ రసగుళికలు అవుతవా? మొత్తంమీద ఆనందించదగిన రచన. ''అన్ని రకాల కవితా రీతులు నాకు ఆదరణీయాలు'' అనగలిగిన ఈ కవికి సేగేలేదు.

శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి

రితం ఆర్ట్ సొసైటీ దశాబ్ది సంచిక

[ప్రొఫెసర్ వేలూరి రాధాకృష్ణగారి పర్యవేక్షణమున ప్రకటితము. డబుల్ డెమ్మీ. 66 పుటలు ప్రకాశకులు, రితమ్ ఆర్ట్ సొసైటీ, భోపాల్.]

మధ్యప్రదేశ్ ముఖ్యపట్నం భోపాల్‌లోని వివిధ కళాభిమానులు పదేళ్ల కిందట పది సమాజాన్ని స్థాపించి నాట్య, శిల్ప, చిత్రాది కళల అభివృద్ధికోసం బహుముఖాల పాటుపడుతున్నారు. భో(జ)పాల్ మధ్యప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యనగరం కావడంవల్ల వివిధప్రాంతాల వారూ ఉద్యోగరీత్యా అక్కడ చేరుకున్నారు. అందువల్ల వివిధ పద్ధతులలోని నాట్య శిల్ప చిత్రకళాభివృద్ధికి అది కేంద్రమై శక్తి వంచనలేక కళాభివృద్ధికి దోహదమిస్తున్నది. పదేండ్లు గడవగా— దాని దశవార్షికోత్సవ చిహ్నంగా ఈ 'ప్రత్యేక సంచిక' ప్రకటింపబడింది.

ఈ సంచికలో పదహారు వ్యాసాలున్నవి. వానిలో పదమూడు ఆంగ్లంలోనూ, మూడు హిందీలోనూ ఉన్నవి ఆంగ్ల వ్యాసాలలో డాక్టర్ ముల్క్‌రాజ్ ఆనంద్‌గారి కళావిద్యను గూర్చిన వ్యాసం, ఎన్. ఎస్. బెంద్రేగారి విద్యలో కళకుగల స్థానాన్ని గూర్చినవ్యాసం, సంజీవదేవ్‌గారి కళా ప్రశస్తివ్యాసం, డాక్టర్ రాయ్‌కర్‌గారి మహారాష్ట్రంలోని దేవాలయ శిల్పాన్ని గురించిన వ్యాసం, ప్రొఫెసర్ వేలూరి రాధాకృష్ణగారి కళావేత్త శాస్త్రవేత్తల తారతమ్యాన్ని గురించిన వ్యాసం, డిఖోలేగారి వర్ణచిత్రవ్యాసం, వి వి తంపేగారి దాక్షిణాత్య వర్ణచిత్ర వ్యాసం, నామన్‌గారి ఛాయా చిత్ర వ్యాసం, అయోధ్య ప్రసాద్‌గారి బౌద్ధ స్తూపాలను గురించిన వ్యాసం ఎన్నదగినవి.

హిందీలోని మూడువ్యాసాలూ కూడా నిలువైనవే! వాటిలో ఉమేశ మిశ్రాగారి సమకాలీన సందర్భంలో ఆదివాసి కళకుఉండే మహత్త్వాన్ని గురించినది ఒక వ్యాసం. రెండవది శంకర్ హోంబర్ గారి చిత్రకళ, నృత్యకళల తులనాత్మకవ్యాసం. మూడవదానిలో ప్రాచీన నగరమైన విదిశాపట్నం కళాకేంద్రంగా ఉండిన విషయాన్ని కృష్ణదత్త వాజపేయిగారు బాగా వివరించారు.

ఆంగ్లంలోనూ, హిందీలోనూ ఈ సమాజానికి సంబంధించిన నివేదికలు, కొన్ని ఛాయా చిత్రాలూ కూడా ఉన్నవి కేంద్ర ప్రభుత్వ, రాష్ట్రప్రభుత్వాల మంత్రులు పంపిన సందేశాలు చేర్చబడినవి.

ఈ సంచికనుబట్టి అక్కడఉన్న వేలూరి రాధాకృష్ణగారు ఈ సమాజాభివృద్ధికి పెక్కు విధాలగా పాటుపడుతున్నట్లు తెలుసుకోవచ్చు. భోపాల్‌లో కళాపోషణకు ఎట్టి కృషి జరుగుతున్నదీ ఆంధ్రులందరూ తెలుసుకొనుటకు ఈ 'సవనీర్' మిక్కిలి ఉపయోగపడుతుందని తప్పక చెప్పవచ్చును

సాహిత్యాధ్యయనం

[వివిధ సాహిత్య ప్రక్రియల సమాలోచనం. డెమ్మీ 48 పుటలు వెల 2 రూ. ప్రకాశకులు — యువభారతి — సాహితీ సాంస్కృతిక సంస్థ, 5 కింగ్సువే, సికిందరాబాదు—3.]

ఆంధ్ర సాహిత్యంలోగల వివిధ ప్రక్రియలలో నేటి కాలంలో బహుముఖంగా పరిశోధనలు సాగుతూ ఉన్నవి. వాటిలో ఇప్పుడు నవలలు, నాటకాలు, నవ్యకవిత్వం, పత్రికలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించి ఉన్నవి ప్రజాసామాన్యానికి వాటిపైని అధికంగా ఆసక్తి ఉన్నదేకాని, వాటి నిర్వచనాన్ని గురించి, ప్రారంభాన్ని గురించీ, క్రమ పరిణామాన్ని గురించీ వివరంగా తెలియదు అందువల్ల వాటిని గురించిన యధార్థ విషయాలు, ఆయా విషయాంశ పరిశీలించినవారి అభిప్రాయాలు వెల్లడించే వ్యాసాలు నాలుగు ఇందులో ఈయబడినవి. నేటి కాలంలో బహువిధాలుగా సాహిత్యాభ్యుదయానికి పాటుపడుతున్న యువభారతి సంస్థవారు, ఆయా విషయాలలో ఆరితేరినవారిచే ఉపన్యాసా లిప్పించి, వాటికి వ్యాస రూపాన్ని కల్పించి ఇలా చక్కని చిన్న పుస్తకాన్ని ప్రకటించారు

శ్రీమతి పరిమళా సోమేశ్వర్‌గారు ఆమూలాగ్రంగా నవలలను గురించీ, వాటిలోని బాగోగులను గురించీ వివరిస్తూ, నవలా రచయితలు అనుసరించవలసిన పద్ధతులను సూచించారు.

తిరుమల శేషాచార్యులుగారు దృశ్యకావ్యాలను గురించి వివరిస్తూ, దృశ్య శ్రవ్య కావ్యలక్షణ స్వరూపాలనూ, తెలుగువారు వెనుకటికాలంలో నాటకాలను రచించకపోవడానికి కారణాలను, ప్రాచీన ప్రబంధాలలోని నాటకీయతను, సంభాషణలను, ఆధునికుల దృష్టిలో దృశ్య కావ్యాల స్వరూప స్వభావాలను వివరించారు.

పి. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రిగారు పత్రికలను గురించి తెలుపుతూ పత్రికలకు వాఙ్మయంలోగల స్థానాన్ని గురించీ, జనుల మానసిక తత్వాన్ననుసరించి పత్రికలలో వస్తూవున్న మార్పులను గురించీ, పత్రికా రచయితలూ, విలేఖరులు చేస్తున్న కృషినిగురించీ, పత్రికా నిర్వాహకుల బాధ్యతలను గురించీ, పత్రికలు ఉండవలసిన విధానాన్ని గురించీ విపులంగా చర్చించారు

ప్రాచ్య నవ్యకవితా తత్వాన్ని బాగుగా ఎరిగిన డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యంగారు కవితకూ, జనసామాన్యానికీగల సంబంధ మునూ, రసానుభూతిని, కవి బాధ్యతలను, పాఠకుని పరిస్థితులనూ వివరిస్తూ ప్రాచీన, నవీన కవుల రచనలనుండి ఉదాహరణలను చూపారు కవితకు రసానుభూతి ప్రధానమని చక్కగా వివరించారు. కవిత్వాభిమానులు గ్రహించవలసిన విషయాలెన్నో ఇందు తెల్పబడి నవి ఈ నాలుగు వ్యాసాలూ సాహిత్యాభిమానులు శ్రద్ధగా చదువ దగినవి.

నూతన పద్ధతి ననుసరించి, జనబాహుళ్యమునకు ఉపయో గించు ఇట్టి చిన్న పుస్తకములద్వారా ఆంధ్ర సంస్కృతీ సాహితు లను ప్రచారం చేస్తున్న యువభారతివారి సాహిత్యసేవ ప్రశంసింప దగినది

శ్రీ బులుసు వేంకటరమణయ్య

శ్రీ హర్ష నైషధము

[(ద్వితీయ భాగము—టీకా తాత్పర్య సహితము) వ్యాఖ్యాత: శ్రీ ఉడాలి — సుబ్బరామశాస్త్రి, ఎం. ఏ ప్రిన్సిపాలు, వైదిక, సంస్కృత కళాశాల, నెల్లూరు. డెమ్మీ 463 పుటలు వెల : 8 రూ. ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవనం, సైఫాబాదు, హైదరాబాదు—500004.]

ఆంధ్ర భాషా వాఙ్మయాలకు సాటిలేని సేవచేస్తూఉన్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు చేపట్టినగ్రంథప్రచురణ కార్య క్రమంలో సంస్కృత గ్రంథాలుకూడా ఉన్నాయి. ఆ ప్రణాళికలో ఇదివరకు కులపతి ఎస్. టి. జి. వరదాచార్యులుగారు సంస్కృతీక రించిన శతకాలు కొన్ని, సన్నిధానం—సూర్యనారాయణశాస్త్రిగారి కళాపూర్ణోదయం మున్నగునవి ఉన్నవి. ఈ విధంగా సంస్కృతాను వాదాలేకాక సంస్కృతంలో ప్రధానంగాఉన్న కావ్య నాటకాలంకార గ్రంథాలు తెలుగు వ్యాఖ్యలతో కూడా ప్రచురితమయాయి. వాటిలో కీ శే. వేదాల — తిరువెంగళాచార్యులుగారి రసగంగాధర వ్యాఖ్య, నేలటూరివారి ఉత్తర రామచరిత్ర, ముద్రారాక్షస నాటక వ్యాఖ్యలు ఎన్నదగినవి. అకాడమీవారు ప్రకటించిన తెలుగు—సంస్కృత నిఘం టువు ఒక ప్రత్యేక ప్రచురణ. దానిని డాక్టర్ పుల్లెల—శ్రీరామ చంద్రుడుగారు, శిరోమణి కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు సంపా దకులై సంకలనం చేశారు. అకాడమీవారు తమ సంస్కృత సలహా సంఘం నిర్ణయం ప్రకారం శ్రీహర్షుని నైషధకావ్యాన్ని తెలుగు టీకా తాత్పర్యాలతో కూడా ప్రకటించుటకు నిశ్చయించారు. వారు ఆ కార్యక్రమాన్ని నెల్లూరు వేద సంస్కృత కళాశాలకు ప్రిన్సి పాలుగా ఉన్న ఉడాలి సుబ్బరామశాస్త్రి, ఎం. ఏ, గారికి అప్పగించారు.

సంస్కృతాంధ్రాలలో గట్టి విద్వాంసులైన సుబ్బరామశాస్త్రి గారు సంస్కృతప్రౌఢ కావ్యాలలో సుప్రసిద్ధమైన నైషధానికి వ్యాఖ్య వ్రాయడం సంతోషించదగినది. వారు ఆ కావ్యంలోని 4-5-6 సర్గలకు వ్రాసిన వ్యాఖ్య ద్వితీయభాగంగా ప్రకటింప బడుతున్నది. ఆయన ఇందులో ప్రతి శ్లోకానికీ పదవిభాగం, టీక, విశేషార్థాలు, సమాసాలు, భావం వివరించారు. స్వయంగా చదువు కుని జ్ఞానాన్ని సంపాదించగోరేవారికి ఈ రీతి వ్యాఖ్య ఎంతో ఉపయుక్తమైనది. వ్యాఖ్యాత తమ బాధ్యతను చక్కగా గుర్తించారు— కాని, కొన్నిచోట్ల—ఒక్క ఉదాహరణ — వ్యాఖ్య యింకా విపులంగా ఉంటే బాగుంటుంది

''శ్లో ఉదయతి స్మ తదద్భుత మాలిభి
ర్ధరణి భృద్భువి తత్ర విమృశ్యయత్,
అనుమితోఽపి చ బాష్ప నిరీక్షణాత్
వ్యభిచచార న తాపకరో నలః.''

[పుట 26]

టీక. ఆలిభిః=చెలికత్తెలచే, తత్ర=ఆ, ధరణి భృద్భువిః ధరణిభృత్=భూమిని భరించెడి భీమరాజు నుండి, భువి=జనించిన దమయంతియందును, ధరణిభృత్=పర్వతముయొక్క, భువి=భూమి యందును, విమృశ్య=వ్యాప్తిని నిశ్చయించి, బాష్పనిరీక్షణాత్— బాష్ప=కన్నీరనెడి లింగమును, నిరీక్షణాత్=చూచుటవలన, బాష్ప= ధూమమనెడి లింగమును, నిరీక్షణాత్=చూచుటవలన, అనుమి తోపి=అనుమానింపబడినను, లింగాభాసముచే నిశ్చయింపబడినను, తాపకరః=సంతాపమును కల్గించు, నలః=నలమహారాజు, (అనలః= అగ్ని) న వ్యభిచచార ఇతియత్=తప్పలేదు — అనగా నియమముగా నుండెననునది యేది గలదో, తత్ =ఆ, అద్భుతం = ఆశ్చర్యము, ఉదయతి స్మ=ఉదయించినది.

వి ధూమముచే అనలుని ఊహించుట యుక్తము కాని ఇచ్చట నలుని ఊహించుట యేర్పడినది. కాన విరోధము. ఏల యనగా — ధూమమునకు వ్యాప్తి అనలునితోనేగాని నలునితోగాదు. కాని యిట బాష్ప శబ్దమునకు ధూమ మెట్లర్థమో అట్లే కన్నీ రనియు నర్థము గలదు. కాన దమయంతీ బాష్పములచే నామెకు సంతాపము కలిగించు నలుడుఊహింపబడెనని చెప్పుటవలన నా విరో ధమునకు పరిహారముగాన విరోధాభాసము. శ్లోకములోని కడపటి పాదములో ''తాపకరోనలః'' అనునెడ 'తాపకరః అనలః' అనియు, ''తాపకరః నలః'' అనియు విభాగము చేయుటవలన పై విరోధ— పరిహారములు సంభవించునని పై విరోధాభాసాలంకారము. ''ధరణి భృద్భువి'' అను నర్థశ్లేషను, 'తాపకరో నలః' అను ''శబ్దశ్లేషను నాశ్రయించినది.''

ఇది వ్యాఖ్యాత యిచ్చిన టీకా వివరణాలు. ఆయన విపులంగా ఇచ్చిన భావంలో కూడా యీ విషయాలే ఉన్నవి

ఇది మల్లినాధుని వ్యాఖ్యననుసరించి వ్రాయబడింది. ఇక్కడ ఒక విశేషాన్ని కూడా గ్రహించ వచ్చును.

హేతువువల్ల పక్షమునందు సాధ్యాన్ని ఊహించడం సముచితం. హేత్వాభాసంవల్ల ఊహిస్తే వ్యభిచార దోషం వస్తుంది. పర్వతమునందు ధూమాన్ని చూచి అగ్ని ఉన్నదని నిశ్చయించడం సరియైనదే! కాని భాష్పాన్ని, ఆవిరిని చూచి, అక్కడ అనలాన్ని ఊహించడం సరికాదు. అలా ఊహిస్తే — వ్యభిచారం లేకపోతే, అది అద్భుతమైన విషయమే! ఈ విధంగా హేత్వాభాస వల్ల సాధ్యాన్ని నిర్ణయించడం విరోధం. దీన్ని శ్లోకంలోని శబ్దార్ధశ్లేషల వల్ల పరిహరించ వచ్చును. రాజకుమారియైన దమయంతి యందు బాష్పంవల్ల — అంటే విరహతాపంవల్ల కలిగిన కన్నీటివల్ల—ఆమెకు తాపాన్ని కలిగించే నలమహారాజు ఊహింపబడుట సమంజసమే అని చెప్పడంవల్ల ఆ విరోధాన్ని పరిహరించ వచ్చును విరోధాభాసాలంకారాన్ని చక్కగా నిరూపించనూవచ్చు.

"బాష్ప నిరీక్షణంవల్ల అనలాన్ని అనుమితి మూలంగా ఊహించడంలో వ్యభిచారం ఉంటుంది. అది లేదంటే ఆశ్చర్యమే! ఇది న్యాయశాస్త్రాన్ననుసరించిన నిర్ణయం శ్లోకాన్ని చదవగా ఈ విషయమే మొదట స్ఫురణకు వస్తుంది.

ఈ వ్యాఖ్య విద్యార్థులకు చాలావరకూ ఉపయోగకరమై ఉంటున్నది.

"ఆంగీరస"

స్వాతంత్ర్యోద్యమానికి మణిదర్పణం
'అతడు - ఆమె'(3) సమీక్ష

ఇటు సంప్రదాయ మూఢాచారాల అరదండాలలోనూ, అటు భారత స్వేచ్ఛాపోరాట సముత్సాహంలోనూ గిజగిజలాడిన మూడు తరాలగాధ—'అతడు-ఆమె'. సామాజిక వాస్తవిక స్థితిగతులు అస్థిపంజరం కాగా, రచయిత ఉపజ్ఞ కళాసుయవ్యక్తిగా రూపొందించిన ఉత్తమ నవల ఇది.

[అతడు — ఆమె; నవల మూడవభాగం; గ్రంధకర్త— డాక్టర్ ఉప్పల లక్ష్మణరావుగారు. 1/8 క్రౌన్, పుటలు 220; వెల : 7–50 రూ.లు. ప్రకాశకులు. విశాలాంధ్ర ప్రచురణాలయం; విజయవాడ—4.]

వైజ్ఞానిక శాస్త్ర శాఖలలో విద్యాధికులూ, రాజకీయ శాస్త్రావగాహనలో నిష్ణాతులూ, వయః పరిపాకంతో అనుభవ పారంగతులూ అగు డాక్టర్ ఉప్పల లక్ష్మణరావుగారు రచించిన ఉదాత్త గ్రంధమిది.

స్వాతంత్ర్యానంతర భారతంలో ఏ భాషా సాహిత్యాలలోనూ యింత ఎక్కసెక్కెంగా కానరాని ఆడమగాళ్ల నవలల వెల్లువతో ఉప్పొంగిపోతున్న వర్తమానాంధ్ర సాహిత్యానికిదొక ఆనకట్ట వంటి కళాఖండం స్త్రీ నవలా సాహిత్యంలో సాధారణంగా కనిపించే ఊహాకల్పిత పాత్రల తోలుబొమ్మలాట యిందులో మచ్చుకైనా కనిపించదు. వైవిధ్యంలేని సన్నివేశాలుగాని, ఒకేమూసలో సాగే ఆలోచనా విధానాలుగాని, ముందే నిర్ణయించుకొన్న ఫార్ములా ప్రకారం రూపొందే కథాకమామీషూ ఈ నవలలో దర్శనమీయవు. విశాల జఘనతా, పీనోరస్సులూ, ఇందులో ఎక్కడా తారసపడరు బూర్జువా సమాజంలోని సోఫిస్టికేషన్ను విపరీత ఆకర్షవంతం చేయబడటం ద్వారా తీరని కోరికలు తీర్చుకొనే మధ్యతరగతి అల్పత్వమూ, బుద్ధిమాంద్యత వంటివీ 'అతడు—ఆమె' నవలలో మచ్చుకైనా కానరావు!

పాత్రల ఆత్మావిష్కారం ద్వారా (Self Revelation of the Characters) పాత్రల శీల పరిశీలన సాగుతుంది. రచయిత తానుగా కల్పించుకొని 'అక్కచకాథముం డిట్లనియె' వంటి స్వాత్మక దుగ్ధాతిశయం గాని, ప్రతి పాత్రకూ మహా విద్వత్తు నాపాదించి ఉపన్యాసాలిప్పించే విశ్వనాథవారి బులిపెంగాని ఈ నవలలో ఎంత వెదికినా కనిపించవు!

శ్రీ ఉప్పలలక్ష్మణరావు 'అతడు—ఆమె' నవలను 1946లో ప్రారంభించి రచించారు. గతంలో రెండు భాగాలు వెలువడ్డాయి. మేధావుల సంస్తుతి కానాడే పాత్రమయ్యాయి. ఐతే ఇంత అనిదంపూర్వ సంవిధానంతోనూ, ఓజస్వంతంగానూ రచించబడిన ఈ నవ

లకు ఆంధ్ర, కేంద్రసాహిత్య ఎకాడమీల గుర్తింపు ఎందుకు లభించ లేదు అనేది వేరే ప్రశ్న !

లేఖల ద్వారాగాని, దినచర్యల ద్వారాగాని ఒక పాత్ర జీవిత కథను ఆవిష్కరించే సంవిధానం ఆంధ్ర సాహిత్యానికి బహుళవ్యాపక మైనది కాదు. ఎప్పుడో నలభై సంవత్సరాల క్రితం స్వర్గీయ చింతా దీక్షితులుగారు డెయిరీ స్వరూపంలో ఒక నవలిక రచించారు. ముప్పయ్యేళ్ల వెనుక శ్రీ కొడవటిగంటి కుటుంబరావు ఒక నవలిక రచించారు శ్రీ చాగంటి సోమయాజులు 'బదిలీ' అనే కథానిక రచించారు తదుపరి మరికొన్ని రచనలు వెలువడినా ఈ సంవిధానం తెలుగు సాహిత్యంలో పరిపాటిగా మారలేదు. కాని పాశ్చాత్య సాహిత్యంలో ఈ సంవిధానానికి దాదాపు నవలకున్నంత వయః పరిణతి ఉంది.

ఆంధ్ర సాహిత్యానికి నవీనమైన లేఖా సంవిధానంలో రాయ బడటమే ఈ 'అతడు — ఆమె' నవల విశిష్టత కాదు. ఆ సంవిధానంలోనే వీరు మరో ముందడుగు వేశారు. ఇతః పూర్వం ఈ సంవిధానంలో రచింపబడిన నవలల్లో, సాధారణంగా ఒకే పాత్ర స్వీయ దినచర్య ద్వారాగాని, రెండు పాత్రల నడుమ సాగిన లేఖల ద్వారాగాని, వివిధ సంఘటనలూ, సన్నివేశాలూ ఆవిష్కరించడం, కథా కథనం సాగడమూ కానవచ్చేవి 'అతడు—ఆమె'లో అలాగాదు అతని డెయిరీ, ఆమె డెయిరీల క్రమంద్వారా కథ, పాత్రలు, సన్నివేశాలు ఆవిష్కృతమవుతాయి

2

మొదటి రెండు భాగాలలోనూ, జాతీయ విముక్తి పోరాటంలో దుమికిన విద్యాధికులు, ధనాఢ్యులూ అగు యువతీ యువకులు ఎలాంటి ఉద్యమావేశంతో క్రక్కదలిందీ చిత్రితమైంది.

'అతడు — ఆమె'లో ప్రధాన పాత్ర శుభ. అందమైనది, మేధావి; సౌశీల్యవతి పైన పేర్కొన్న రీతిగా సమాజంలో పై అంతస్తుకు చెందిన నలుగురైదుగురిని ఆకర్షిస్తుంది. తండ్రి శాస్త్రి. 'శుభ'కు లక్ష రూపాయల ఆస్తి ముట్టచెబుదామనుకుంటాడు. ఆమెకే సంబంధం లాభసాటిదో ఆలోచిస్తూ ఉంటాడు. ఈ ప్రేమికులు నలుగురూ (Suitors) నాలుగు రకాల మనస్తత్వాలకూ, జీవన విధానాలకు, ఆలోచనా మార్గాలకూ చెందినవారు; కాని ఆమె ఆ నలుగురిలోనూ ఎవరిని ఏ కారణంవల్ల ఎన్నిక చేసుకుంటుందీ అన్న మీమాంస దగ్గరే — పాఠకుల ఉత్కంఠను నవల ప్రోది చేస్తుంది. ఆలోచనావిధానాలు తెరుస్తుంది. తాను క్విట్టిండియా ఉద్యమానికి సంబంధించిందని నమ్ముతూన్న విధ్వంస కార్యక్రమం (SUBOTAGE) ఏదోఒకటి చేసి జెయిలుకు పోవడానికి నవలలో ఆద్యంతమూ మథనపడుతుంది. ఈమె ఆకర్షణకులోనైన ఇంజనీరింగ్ కంట్రాక్టరు — తాను నిర్మించిన బ్రిడ్జిని తానే కూల దోయడానికి—తద్వారా ఆమెకి సహాయం చేయడానికి పథకంవేస్తాడు ఈ విధంగా తనకు తానే విధ్వంసం చేయడంలో ఒక సదుపాయం ఉంది. పునర్నిర్మాణానికి మళ్లీ తనకే కాంట్రాక్టు లభించవచ్చు. తద్వారా ఒకే పనికి రెండు విధాల లాభాలు పొందవచ్చు. ఈ కుచ్ఛితం బ్రిటిష్‌వారి కాలం నుంచి కాంగ్రెస్ వారి పాలన వరకూ కంట్రాక్టర్ల ఆచారంగా సాగుతోంది.

బారిస్టర్ శాస్త్రితో భార్య శాంతం ఆదిలో సర్వాంగీకారంతో మసిలేది. దాంపత్యం సముత్రుతిగా సాగేది. కాలక్రమేణా శాస్త్రి ఆలోచనా ధోరణి ధనాశకు అంకితమైంది శాంతం నిర్లిప్తత వహించేది కుమార్తె శుభ నిజానికి వారి తనూజకాదు. ఒక అనాథ బాలికను సంపాదించి పెంచుకున్నారు. స్వయానా కుమార్తెలాగే పెంచారు సర్వ స్వతంత్రాలూ కలిగించారు విద్యా సంస్కారాలు చేకూర్చారు. ఆమె కొక లాభసాటి సంబంధం చేయడంద్వారా తన హోదా పెంచుకోవాలని శాస్త్రి ఆలోచన

ఆమె చుట్టూ తిరిగే మనుషుల్లో సీతారాన్ు యెంత దౌష్ట్యనికైనా వెనుదీయని ఇంజనీరింగు కంట్రాక్టరు.

జనార్దనం రాసుకొనే దినచర్యలో విధి నిర్వహణపట్ల అతడెంత జాగరూకుడో వ్యక్తమవుతుంది అతని సంస్కారం ఎంత లోతైందో సర్వ విషయాలపట్లా వెల్లడవుతుంది. నిజాయితీ, నిస్స్వార్థబుద్ధి, శాంతియుత జీవనమూ, అనవరత గ్రంథపఠనమూ అతని జీవలక్షణాలు

వంతెనలు వగైరా కట్టడాలను సులభంగా విధ్వంసం చేయడానికి పద్ధతులేమిటో ఒకనాడు శుభ జనార్దనాన్ని యథాలాపంగా అడుగుతుంది అతను కార్డైయిట్ ఉపయోగం గురించి చెబుతాడు. అది తనకు కావాలంటుంది శుభ. అప్పుడామె ఉద్దేశమేదో గ్రహించి ఆలోచనలో పడతాడు జనార్దనం మొదట్లో ఆ కార్డైయిట్‌కోసమే జనార్దనం దగ్గరకు శుభ రాకపోకలు సాగిస్తుంది. అతనివ్వకుండా దాటవేస్తుంటాడు

'అతడు—ఆమె'లో సమకాలీన జీవితంలో ప్రముఖపాత్ర వహించినవ్యక్తులూ కుటుంబాలూ ఎన్నో తారసపడతాయి నవలకు మరింత వాస్తవికతా పుష్టిని చేకూరుస్తాయి మాడభూషివారు, మంగువారు, దురిసేటి అప్పారావుగారు, వంటి వారెందరో దర్శనమిస్తారు నవలలో ప్రవేశించి పరిణతి పొందిన ప్రతి పాత్రా స్వీయ వ్యక్తిత్వంతో పెంపెస లారుతుందేతప్ప రచయిత చెప్పచేతల్లో ఆడే తోలుబొమ్మలుగా రూపొందవు.

గత రెండు మూడు తరాలుగా ఈ దేశపుమేధావుల ఆలోచనా వైఖరులలో ద్విధావృత్తి సర్వత్రా అద్దుతగులుతూనే వుంది ఆంగ్ల భాషాధ్యయనంద్వారా మన సంప్రదాయపు పుట్టకొట్లు కదిలినా, జాతీయోద్యమ వరప్రసాదంగా మన పద్ధతులన్నీ మంచివే అనే విశ్వాసం పునః ప్రతిష్ఠితమవుతూనే వుంది మన మూఢ విశ్వాసాలను సైంటిఫిక్ కారణాలతో సమర్థించుకుంటూ బ్రతకడం కూడా జాతీయతాభావంగానే పరిగణింపబడింది. విద్యాధికుల్లో ఈ ఆచారాలు, సంప్రదాయాలూ అర్థరహితాలన్న భావం ఒక

ప్రక్కనూ, జాతీయభావ స్ఫురణ వేరొక ప్రక్కనూ ఆలోచనా పరుల మనస్సుల్ని గుడిసుళ్లు త్రిప్పడం నేటికీ కనిపిస్తూనే ఉంది. కనకనే పబ్లిక్ వ్యవహారం ఒక తీరూ, ప్రయివేటు బ్రతుకు వేరొక ఫక్కీగా నేటికీ అసంఖ్యాకులలో కనిపిస్తూనే వుంది

శాస్త్రి, బారెస్టరై తిరిగి వచ్చినవాడు సంప్రదాయమూఢ విశ్వాసాలను కాలదన్నినవాడు; ఆంగ్లేయులతో సహపంక్తి గుడిచిన వాడు ఐనా భారతీయ సంప్రదాయాలపై లోపాయికారీ భయంతో కూడిన మోజు అతనికి పోలేదు ఆ ద్వంద్వ నీతిని అతని పిల్లలు గమనించి చెంగుచాటున నవ్వుకుంటూంటారు.

ఈ నవల అంతటికీ అత్యంత మనోహరపాత్ర—సూరమ్మ పిన్నిది. ఆమె, జనార్దనం తల్లి అచ్చమ్మకు లభించిన అనాథ. బాల్యవితంతువై స్వకుటుంబీకులకు భారమై పోగా అచ్చమ్మ నూరు రూపాయలు చెల్లించి కొనుక్కుంది. ఆమెనెంతో ప్రేమగా చూసు కొనేది అచ్చమ్మ. ఇద్దరూ బ్రాహ్మణ ప్లీడర్ల ఇళ్లలో నీళ్లు మోసి వంటలూ వార్పులూ చేసీ, పప్పులు రుబ్బీ, అప్పడాలు ఒత్తీ డబ్బు సంపాదించుకుంటూ విశాఖపట్నంలో బ్రతుకు వెళ్లకూర్చుకున్నారు. జనార్దనానికి చదువు చెప్పించారు. విద్యాధికునిగా చేశారు. అచ్చమ్మ కాలధర్మం చెందాక, వృద్ధురాలైన సూరమ్మను తన దగ్గరకు లెచ్చేసుకొన్నాడు జనార్దనం నిజానికి వారు బంధువులు కారు. స్నేహమూ ప్రేమా వాళ్లనలా బంధించగా జనార్దనం తన తల్లిగానే ప్రేమిస్తాడు. సూరమ్మ తన మంచితనంతో పరితకు కన్నీళ్లు తెప్పిస్తుంది వర్తమాన లోకం పోకడను ఎంతో స్పష్టంగా అర్థం చేసుకుని, లోకంతో మనవూ సాగడమే ధర్మమనంటుంది. ఎరమరికలు దాపరికాలూ లేకుండా మాట్లాడుతుంది. "ఆ విశాఖపట్నంలో వుండే రోజుకో ఐదు బిందెల నీళ్ళు ఎవరింట్లో పోసినా కాలం వెళ్లిపోయేది!" అంటూ స్వీయచరిత్ర చెప్పుకుంటుంది ఇలాంటి ఉత్తమపాత్ర ఇంకా లోకంలో మనసుకు తగులుతూనే ఉంటాయి

మంచితనంతో చిరస్మరణీయమైన పాత్ర సూరమ్మ పిన్ని దైతే గూడుకట్టుకొన్న చెడ్డతనంతో, అసహ్యమైన నైచ్యంతో, ధనాశతో మనసుల్లో ముద్రవేసే పాత్ర అవధానిది.

ఈ నవలలో జీవిత వాస్తవికతకు అతీతమైన ఊహామాత్ర కల్పన లెక్కడా కానరావు. పాత్రలన్నీ మన సమాజంనుంచి పుట్టి వైదుష్యం, యోచన, సంస్కారం అలవర్చుకుంటాయి. ప్రతి అంశాన్నీ మేధోపజ్ఞకంగా ఆలోచిస్తాయి అలా అన్నంతలో ఈ నవల లోని ప్రధానపాత్ర జనార్దనం-ధర్మారావులాగో, నారాయణరావులాగో సర్వజ్ఞ శిఖామణికాదు. ప్రతి విషయంపైనా ధర్మోపన్యాసాలు చేయరు. పోతే మన ఫార్ములా నవలల్లోమల్లే ఈ నవల హీరో నలభై అంగుళాల ఛాతీగల అందగాడూ, ఆజానుబాహుడూ కాదు. ఎప్పుడూ ఇంపాలా కారుపైనే తిరగడు. ఇందలి ప్రతిపాత్రా రక్త మాంసాలు, కండపుష్టిగల సజీవమూర్తులు.

ఐతే ఈ నవలా సంవిధానంలో ఒక తిరుగుడు లేకపోలేదు. ఇరువురి డెయిరీలు రచయిత కలంనుంచి వచ్చినవే కావడాన పాత్ర వైవిధ్యం గోచరంకాదు. రచనలో వీరు ఒక పదాన్ని ఎలా ఉచ్చరిస్తారో అలాగే స్పెల్లింగులు యిష్టం వచ్చినట్లుమార్చిరాస్తారు. ఉదాహరణకు వారి స్పెల్లింగుల్లోనే కొన్ని పదాలు : సహృదయకు సహ్రుదయగా, కృతజ్ఞతకు క్రుతగ్యతగా, ఆజ్ఞకుఆగ్యగా,జిజ్ఞాసకు జిగ్యాసగా, విజ్ఞతకు విగ్యతగా, నృత్యానికి న్రుత్యంవుగా చివరికి శుభకు సుభగా వక్రీకరించి రాయడంవల్ల తికమక ఏర్పడు తుంది. వుచ్చారణకు దగ్గరగా రాస్తున్నామని ఎంత నచ్చచెప్ప కున్నా పదస్వరూపమే తెలియకుండాపోయే ప్రమాదముంది. ఈ క్రొత్త స్పెల్లింగులతో కొత్త నిఘంటువులు రాసుకోవాలి పోనీ ఈ అక్షర స్వరూపంతో ఈ పదాలను సర్వప్రాంతీయులూ, రచయిత లందరూ ఇలాగే ఉచ్చరిస్తారన్న హామీలేదు. సామాన్య పాఠకులకు ఇబ్బంది కలగదేమో గాని, సాహిత్య పరులకు మాత్రం అడుగడు గునా కంటకప్రాయమవుతుంది.

శ్రీ ఉప్పల లక్ష్మణరావుగారి ఈ 'అతడు—ఆమె' నవలను సమగ్రంగా చదివిన ఈ సమీక్షకుడు ఎంతో హృదయరక్తినీ, మానసిక దీప్తినీ అనుభవించాడనడం యథార్థం! గడచిన చరిత్రకు సాక్షీభూతులేగాక, పాత్రధారులు కూడా అయినవారి హావభావ విశేష లన్నీ సజీవంగా ఈ నవలద్వారా దర్శన మివ్వాయనడం అసత్యంకాదు. ప్రాక్ పశ్చిమ సంస్కృతులలో పారంపర్యంగా ఎదిగివచ్చి మన తరానికి వారసత్వంగా లభించిన సకల మౌలిక విషయాలపట్లనూ పరిత్య లోకానికి పరిచయం కలుగుతుంది. అనేక వర్తమానభావాలు పాఠక హృదయంలో చర్చకు నిలుస్తాయి. శ్రీనాథుని కాశీఖండం నుంచి—గురజాడవారి కన్యాశుల్కం వరకూ మేధావులు నిత్య జీవితంలో స్పర్శించే సకల విషయాలూ ప్రస్తావించబడతాయి.

ఇలాంటి పరిపూర్ణమైన నవల రచించడానికి విషయ పరి జ్ఞానంతోపాటు కళాభిజ్ఞత ఉండాలి. ప్రతిభతోపాటు వయసు సమ కూర్చిన అపార అనుభవ సంపద ఉండాలి. ఇన్నిటినీ సమకూర్చు కొన్న జ్ఞానవృద్ధులు శ్రీ లక్ష్మణరావుగారు. కనుకనే వారికొక సలహా యివ్వాలనిపిస్తోంది. విస్తృత యాత్రాజీవనమూ వైజ్ఞానిక శాస్త్ర ప్రయోగశీలమూగల డాక్టర్‌గారు తమ స్వీయచరిత్ర రచన కుపక్ర మించడం ఎంతో అవసరం! నవలా సాహిత్యాభి మానులంతా ఈ 'అతడు—ఆమె' నవలను శ్రద్ధగా అధ్యయనంచేసి త్తమ అనుభవ పరిపాకాన్ని విశాలమొనర్చుకోవాలని ఆశిస్తాను.

శ్రీ సోమసుందర్

కోలాచలం శ్రీనివాసరావు - నాటక సాహిత్య సమాలోచనము

ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడని ప్రఖ్యాతి వహించి, ఆ ధ్రనాటక చరిత్రయందొక విశిష్టస్థానము చేకొన్న కోలాచలము శ్రీనివాసరావుగారి నాటక సాహిత్యసమాలోచన మీగ్రంథము !

గ్రంధకర్త: డాక్టరు యస్. గంగప్ప ఇందు 1. సంగ్రహ జీవిత చరిత్ర 2 ఆంధ్ర నాటక వికాసము 3. వివిధ రచనలు వర్గీకరణము 4. నాటక మూలములు 5. నాటకముల ఇతివృత్త నిర్మాణ దక్షత 6. పాత్ర పోషణ చాతుర్యము 7. రచనా శిల్పము 8. రచనా ప్రయోజనము 9. మరికొన్ని విశిష్ట లక్షణములు 10. నాటకేతర రచనలు 11. వ్యక్తిత్వము – అను పదకొండు ప్రకరణములుగలవు. 404 పుటలుగల ప్రధానగ్రంధము తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము వారి పి. హెచ్. డి పట్టము పొందిన సిద్ధాంత గ్రంధము.

గ్రంధకర్త కోలాచలము వారి కృతులను గూర్చి కూలంకషముగ పరిశ్రమ చేసినాడు. ఈ సిద్ధాంత గ్రంధ రచన కాతడు సంస్కృతాంధ్రాంగ్ల కన్నడ గ్రంధములు నూట యెనుబదింటిని పరిశీలించినట్లు తెలియుచున్నది. విషయసేకరణము విశేషముగా జరిగినది.

వంశ ప్రశస్తి

ఈ శీర్షికలో గ్రంధకర్త క్రీ. శ. 1901 లో శ్రీనివాస రావుగారు తాము మహా ప్రసిద్ధుడైన కోలాచలము మల్లినాథసూరి వంశీయులమని తెలుపు వంశమును పురస్కరించుకొని, వారు పంచ కావ్య వ్యాఖ్యాతయగు మల్లినాథ సూరి వంశీయులేయని నిర్ధారించి యున్నాడు కోలాచలము ''పందిపాడు'' నకు సంస్కృతీకరణము అని తెలుపబడినది. వేటూరి ప్రభాకర శాస్త్రిగారి ''కొలచెలము'' వాదము స్వీకరింప బడలేదు. ''కోలాచల,కొలచెల, కోలచర్ల, కొలచర్ల కొలచెలమ అని అనేకవిధములుగా నుండుటచే ఇదమిద్ధముగా చెప్పట కష్టము. కోలాచల శబ్దమే ఇన్ని వికారములు పొందియుండ వచ్చును'' అని మల్లినాథసూరి నుండి రావుగారి వరకుగల వంశ వృక్ష మీయబడినది.

కాని రెండేండ్ల క్రిందట క్రీ. శ 1975లో రచితమైన ''మల్లినాథ సూరి జీవితమూ, రచనలు'' అను గ్రంధమున శ్రీనివాసరావుగారి వాద ముదాహరింపబడి ''మల్లినాథుని నివాసము ఇంటి పేరు'' అను ప్రకరణమున ఆతని ఇంటిపేరు ''కొలచెలమ'' వారని, అది గ్రామ నామమని మెదక్ జిల్లాలోని పట్టం చెఱువు ప్రాంతమునకున్న 'కొలచెలమ'అని అది హైదరాబాదునకు 40 కిలోమీటర్ల దూరమున నున్నదని – మల్లినాథ సూరి వంశీయులు నేటికిని నచ్చటగలరని, వారియొద్ద మల్లినాథసూరి ఉపయోగించిన గంటము కూడ కలదని ప్రామాణికముగా వివరింపబడినది. [2]

శ్రీనివాసరావుగారు మల్లినాథ సూరి వంశీయులు కారని మఱియొక ప్రబల ప్రమాణ మిందేచూపబడినది. మల్లినాథసూరికి 9వ తరము వాడైన నారాయణపండితుడు తన చంపూరామాయణ వ్యాఖ్యానమైన పదయోజనమున, తన వంశ వృక్షము నిట్లిచ్చినాడు:

మల్లినాథసూరి కుమారస్వామి మహాదేవుడు శంభువు భాస్కరుడు నాగేశ్వరయజ్వ కొండుభట్టు నాగేశ్వరయజ్వ నారాయణ పండితుడు.

పై వంశవృక్షము శ్రీ కాసూధానుల సుబ్బాశాస్త్రిగారిచ్చిన వంశవృక్షముతో పూర్తిగా భేదించుచున్నది. (చూడుడు: ఈగ్రంధమున పుట 7).

మల్లినాథసూరి
- పెద్దిభట్టు
- కుమారస్వామి సోమయాజి
  - మల్లిస్వామి సోమయాజులు
  - సర్వదేవ సోమయాజులు
  - మల్లి శేషాద్రి దీక్షితులు
  - మల్లి సూర్యనారాయణ
  - భాస్కరభట్టు
  - వేంకటరామ దీక్షితులు
  - గంగాధరశాస్త్రి – సేతుపతిశాస్త్రి – శ్రీనివాసరావు –

నారాయణ పండితుడిచ్చిన వంశవృక్షమునకు, శ్రీనివాసరావుగారిచ్చిన వంశవృక్షమునకు నేమాత్రము సామ్యము లేదని పై వివరములు తెలుపుచున్నవి. మల్లినాథసూరి ఇంటిపేరు ''కొలచెలమ''వారు.

''కొలచెల్మాన్వయ బ్ధీందో మల్లినాథో మహాయశాః'' అని పద ప్రయోజన వ్యాఖ్య. శ్రీనివాసరావుగారి పూర్వులు ''కోలాచలము''వారు కావున నిరువురికి నేమాత్రము సంబంధములేదు. కోలాచలమను కేవల వ్యవహారములోనున్న నామమునుబట్టి ఈ వంశ వృక్షమునిర్మించినట్లుగా కుమారస్వామి సోమయాజినుండి వారిచ్చిన తరములే తెలుపుచున్నది శ్రీనివాసరావుగారు మల్లినాథ సూరి వంశీయులు కారని పై నారాయణ పండితుని వంశవృక్షము విశదము చేయుచున్నది అంతమాత్రముచేత శ్రీనివాసరావుగారి కోలాచల వంశము విద్వద్వంశము కాకపోదు. వారి పూర్వులు, కృష్ణదేవ రాయాది నృపతులచేత, హండే హనుమప్పనాయనిచేత విద్వత్తువలన సత్కారములు బడసినవారు కాబట్టి మల్లినాథసూరితో సంబంధము లేకపోయినను వారి వంశము విద్వద్వంశమనునది నిర్వివాదము.

ఆంధ్ర చారిత్రక నాటక రచన

ఆధునిక యుగమున ఆంధ్ర నాటక శాఖలో ప్రప్రథమముగా చారిత్రకనాటకము రచించినది శ్రీనివాసరావుగారే. తరువాతవచ్చిన

చారిత్రక నాటకములకు మార్గదర్శకు డాయనయే· ఆంధ్ర నాటక చరిత్రలో శ్రీనివాసరావుగారి పేరు చెప్పగానే, మనకు జ్ఞప్తికివచ్చునవి ఆయన చారిత్రక నాటకములే. నాటక కర్తగా ఆయన కీర్తి కేవలము చారిత్రక నాటకముల పైననే ఆధారపడి యున్నదనుటలో అతిశయోక్తి ఏమాత్రము లేదు. కావున, శ్రీనివాసరావుగారి నాటక సాహిత్య సమాలోచనమున — "చారిత్రక నాటకములు" ప్రత్యేక ప్రాధాన్యత వహించి ప్రకృష్ట స్థానము నాక్రమింపదగియున్నది.

వాస్తవిక స్థితి యిట్లున్నను ప్రస్తుతము శ్రీనివాసరావుగారి నాటక సాహిత్యమును గూర్చిన ఈ సిద్ధాంత గ్రంథమున ఆయన చారిత్రక నాటకముల కివ్వవలసిన ప్రాధాన్యము ఇచ్చినట్లు లేదు.

"తెలుగున చారిత్రక నాటకములు — శ్రీనివాసరావు గారి ప్రభావము" అను విషయము, ఆయన "ఆంధ్ర చారిత్రక నాటక పితామహత్వము" ను సార్థకముచేయు మరియొక ప్రకరణము ఇందుండుట సముచితము

సంఖ్యా విపర్యాసము

గ్రంథకర్త శ్రీనివాసరావుగారి చారిత్రక నాటకముల సంఖ్య నిర్ణయించుటలో కొంత తడబాటుపడినట్లు తోచుచున్నది. 95వ పుటలో వారు పరిశీలనానంతరము చారిత్రక నాటకములు 8 యని స్పష్టపరచిరి. అయినను చారిత్రక నాటకముల జాబితాలో చేరిన కాళిదాసు నాటకమును చరిత్ర నాటక మనుటకు వారికి మనసొప్పకున్నది. 103 వ పుటలో "కాళిదాసు నాటకము పూర్తిగా చారిత్రకమని విశ్వసించుట కవకాశము తక్కువ" అని వ్రాయుటే దాని కాధారము.

ఆంధ్ర చారిత్రక నాటక పితామహ బిరుదాంకు శ్రీనివాసరావు గారి తరువాత వెలసిన చారిత్రక నాటకములను గూర్చి సమీచనమైన విమర్శ ఇందులేదు వాని రచనా వైవిధ్యము, రసపోషణ, పాత్ర పోషణ మొదలగు నంశములను చర్చించి, శ్రీనివాసరావుగారి నాటకములతో వానిని పోల్చి శ్రీ రావుగారికిగల ఆంధ్ర చారిత్రక నాటక పితామహుండన బిరుదున కెట్లా తడర్తుడో విపులముగా చర్చించవలసియున్నది. అదీ గ్రంథమున కానరాదు.

ఇచ్ఛాపురపు యజ్ఞ నారాయణ — కోలాచలమువారి తరువాత చారిత్రక నాటకములు రచించి యావదాంధ్ర దేశమున ప్రఖ్యాతి వహించిన నాటక కర్త ఈయన రచించిన నాటకములు రెండు. 1. రసపుత్ర విజయము 2 రాజపుత్ర తేజఃపుంజము (రాణా ప్రతాప సింగు) — రెండును చారిత్రకములే. మొదటిది కడపటి మొగలాయిచక్రవర్తి, ఔరంగజేబు కాలమునాటిది. రెండవది అక్బరు కాలము నాటిది

రసపుత్ర విజయము

పై రెండింటిలో రసపుత్ర విజయము, ఆంధ్ర చారిత్రక నాటకములలో మకుటాయమానమైనది. దేశభక్తి ప్రబోధకమగు నీ నాటకము నాలుగు ముద్రణలంది — ఆంధ్రదేశముననేగాక, బర్మాదేశమున రంగూను నందు పలుమారు ప్రదర్శింపబడినది. ఇది చిత్ర నళీయము, పాండవ విజయము మున్నగు వానివలె, పోటీ నాటకము (Competion Drama) గా ఎన్నికైనది. ఇందలి పద్యములు —

> "అ· హిమాద్రియు వింధ్య మారావళియు జుట్టు
> పెట్టని గోడలై పెంపు మీఱ
> ....
> దుర్గమమగు హిందూస్థాన దుర్గముగన
> కన్నతల్లిని గాంచిన కరణి దోచు."

అనునదియు —

> "కొండల యండ నుద్దండులై చెండాడు
> దండి మరాటీల దండు ఉండ
> ....
> బందె లంబున ఛత్రసాల్ బ్రదికియుండ
> రాజసింహుని కంఠాన ప్రాణముండ
> శ్రీ శివాజీకి బొందెలో జీవుడుండ
> భరత వర్షమ ! నీకెంత పాటు గలిగె"

అనునదియు ప్రజలకు కంఠస్థములు

ఆంధ్ర చారిత్రక నాటకములలో రసపుత్ర విజయమున కున్నంత ప్రచుర ప్రచారము, ప్రజామోదము, మఱియే యితర చారిత్రక నాటకమునకు లేదు. ఇది ప్రదర్శించునపుడు ప్రేక్షకులు దేశభక్తితో నుద్రేక పూరితు లగుచుండెడివారు.

డాక్టరు పి యస్. ఆర్. అప్పారావుగారు తమ "తెలుగు నాటక వికాసము" న ఇచ్ఛాపురపు వారికెట్టి యున్నత స్థానము నిచ్చిరో చూడుడు.

ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ

"దేశభక్తి ప్రబోధమే వీరి ధ్యేయము కావుననే తదనుగుణముగ చారిత్రక కథలనే వీరు స్వీకరించిరి. రసపుత్ర విజయము రాజపుత్రతేజః పుంజము " "రసపుత్ర విజయము(1910)నాడు దీనిని ప్రదర్శింపని నాటక సమాజమే లేదు."

కోలాచలమువారి కృతులు నా పరిచయము

కోలాచలమువారి కృతులతో నాకు నలువది యాఱేండ్లనుండి పరిచయము గలదు దీనికి హేతువు నా జనకులే. నాతండ్రియైన సుందరము పంతులుగారును, కీర్తిశేషులైన గురజాడ శ్రీరామమూర్తిగారును. బళ్లారిలో 1899లో ఆంధ్ర కవి పండిత సంఘ మేర్పడినప్పు డందులో ఉత్తర సర్కారుల నుండి సభ్యులు — వీరిరు

పురిలో నా జనకులైన సుందరము పంతులు గారికిని శ్రీనివాసరావు గారికిని హెచ్చుగా మైత్రి గలదు శ్రీనివాసరావుగారు తమ నాటకములను సునందనీ పరిణయము, సుఖమంజరీ పరిణయము, తమ ఆంధ్రీకృతాగస్త్య బాలభారతము మా తండ్రిగారి కభిప్రాయార్థమై పంపినారు. అందు సుఖమంజరీ పరిణయ నాటకముపై ఆయన యిచ్చిన యభిప్రాయమందు ముద్రితమైనది. వారి వేదార్థచంద్రిక పత్రికబును పంపినారు.

శ్రీనివాసరాయ వర్ధంతి 1944

1944 జూను నెలలో జరిగిన శ్రీనివాసరాయ వర్ధంతికి నేను ఆహ్వానితుడనై బళ్ళారి వెళ్లితిని. ఆ వర్ధంతిసభకు బళ్లారి లోని పుర ప్రముఖులు పెక్కుమంది వచ్చిరి సభకు మధ్య శ్రీ కాశీ కృష్ణాచార్యుల వారధ్యక్షత వహించిరి. ప్రసిద్ధ నట చక్రవర్తి బళ్లారి రాఘవ వేదిక నలంకరించెను. నేను నా ఉపన్యాసమున, శ్రీనివాసరావుగారి నాటకములను గూర్చి, వారి బహుముఖ వైదుష్యమును గూర్చి యుపన్యసించి, ధర్మవరము రామకృష్ణ మాచార్యుల వారితో పోలికలు చూసించుచు, కవితావిషయమున మాత్రము పోలిక లేదనియు, సాహిత్య విమర్శనమున ప్రాంతీయాభి మానాదులుండ కూడదనియు దెలిపి యిట్లు ప్రస్తావించితిని:

''ధర్మవరమువారు సహజ కవులు. కోలాచలమువారు విద్వత్కవులు. ధర్మవరమువారి కవితలోని మాధుర్యము కోలాచలము వారి కవితలో నెంతమాత్రము లేదు అని ధర్మవరమువారి చిత్రనళీయము నుండి, విషాద సారంగధరనుండి పద్యములు పఠించితిని పఠన రీతి మనోహరముగా నుండుటచే నొక్కొక్క పద్యము రెండేసి సారులు సభ్యులు చదివించిరి. అదేమి విశేషమోగాని, ధర్మవరము వారి పద్యములు ప్రబంధ శైలిని నున్నను చదువరులను నిట్టె యాకర్షించును. చిత్రనళీయములోని తొలి పద్యము ''శ్రీ సంధిల్లగి మేడి కుంట నగరీ శృంగార పూతస్థలిన్'' అనునది సభలలో ప్రార్థనా పద్యముగ చదువుట నేను బాగుగా నెఱుగుదును.

శ్రీనివాసరావుగారి విశాలహృదయము

నేనుపన్యసించిన తరువాత, బళ్లారి రాఘవగారు లేచి ధర్మవరము వారి, కోలాచలము వారి కవిత్వములను గూర్చి నిష్పక్షపాతముగ చెప్పినందులకు నన్నభినందించుచు నిట్లు శ్రీనివాసరావుగారితో తమకు గల యనుభవము దెలుపుచు, వారి హృదయ వైశాల్యము, ఉదాత్తతను కొనియాడినారు.

''నేను ధర్మవరము వారి మేనల్లుడను. అయితేనేమి నా మేనమామ రామకృష్ణమాచార్యులవారు వారి శిక్షణకు నేనర్హుడను గానని నన్ను తరిమివేసిరి. అంత నేను శ్రీనివాసరావుగారిని దర్శించితిని. వారు నన్నత్యంత ప్రేమ పూర్వకముగా స్వీకరించి, నాయందెంతయో ఆదరాభిమానములనుచూపి, నిష్కళంక హృదయముతో, నన్ను నాటక రంగమున ''నింతవానిని అంత వానిని'' గా - తీర్చి దిద్దినారు. నాటక రంగమున నా కీర్తికంతకూ శ్రీనివాసరావుగారే ఏకైకముగా కారణభూతులు. వారికి నే నా జన్మాంతము కృతజ్ఞుడను.''

---

1 కోలాచలం శ్రీనివాసరావు—నాటక సాహిత్య సమాలోచనము. డాక్టరు. యస్. గంగప్ప. శశీ ప్రచురణలు, కర్నూలు. తెలుగు శాఖాధ్యక్షులు, సిల్వర్ జూబిలీ కళాశాల, కర్నూలు పుటలు 404 + XXX + 3, సాదాప్రతివెల 30–00, మేలుప్రతి 35–00.

2 మల్లినాథ సూరి జీవితము -- రచనలు — గ్రంధకర్తలు కీ. శే. బృందావనము రామానుజాచార్యులు—గుమ్మా శంకర రావు. ఇది ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి పొందినది. ముద్రితము — పుటలు 27–34.

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

గ్రంథస్వీకారాలు

* హనుమ ద్వివాహము. (నాటకం) రచన: కీ శే ఇమ్మడి భస్వప్ప. పేజీలు: 47, వెల: రెండురూపాయలు ప్రతులకు. ఇమ్మడి లింగయ్య, ఉపాధ్యాయుడు, ఊకొండిగ్రామం, నల్లగొండ (తాలూకా, జిల్లా).

* త్రివేణి. (పద్యకావ్యం) రచన: శ్రీ చేబోలు చిన్మయ బ్రహ్మకవి; పేజీలు: 48, వెల: రు. 5. ప్రతులకు: యిత; కుసుమహర శ్రీ నికేతనం, వీరభద్రపురం రాజమండ్రి—4.

* లోకనాయక్ జయప్రకాశ్ బుర్రకథ కథ, కథాకథనం శ్రీ లక్ష్మీకాంతమోహన్, పేజీలు: 33. మూల్యం అమూల్యం. ప్రతులకు: రచయిత; 91 స్టేటు బ్యాంక ఆఫ్ ఇండియా కాలనీ; హైదరాబాదు—500 48.

* మహేశ శతకము: రచన; శ్రీ బాగం అయ్యపురెడ్డి; పేజీలు: 21, వెల అమూల్యము, ప్రతులకు: రచయిత, మాచర్ల, గుంటూరు జిల్లా.

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada Phones: 75667 & 75226.